
ాహిత్య
ాస పత్రిక
ూలై 1984

భా
ర
తి









స్థాపకులు

శోద్ధారక
గేశ్వరరావు
ంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

జులై 1984

సంపుటము : 61 సంచిక : 7

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

జులై 1984

ముఖ చిత్రం : చైనాలో బౌద్ధకట్టడాలు

ఫోటోలు పంపినవారు : శ్రీ ఐ. కార్తికేయ శర్మ (వ్యాసం 41 పేజీ)

అసామాన్యుడు

ఈరోడ్డంతా చెడిపోయింది

నల్లటి కంకరరాళ్లు పైకిలేచి

వికృతంగా, పదునుగా చూస్తున్నాయి

సామాన్యుడు కాళ్లకి చెప్పుల్లేకుండా

రాళ్ళు కాళ్ళకి గుచ్చుకుంటున్నా

ఓపికగా ఓరిమితో నడుస్తున్నాడు.

ఆ ఓపికే కృశించి

ఆ ఓరిమే నశిస్తే

ఆ రాళ్లనే చేతుల్లోకి తీసుకుంటాడు.

అపుడు....

నీ మొహాన్ని నీ చేతుల్తో దాచుకోలేవు

నీవంటిని నువ్ కాచుకోలేవు !!

ఘూర్ఖా

నీ ఇంటికి కాపలా పెట్టావు

నీ ఫ్యాక్టరీకి కాపలా పెట్టావు

నీ కారుకి కాపలా పెట్టావు

ఆస్తికి అంతస్తుకి మనిషికాపలా

కాని మనిషికి హృదయం కాపలా

నీకా హృదయం లేదుకాబట్టి

అందరిమీదా నీకా అనుమానం

నీలో ఎప్పుడూ అణుబాంబు లాంటి భయం !!

శ్రీ వీరభద్రరావు పమ్మి

ఏమి గుండె!?

శ్రీ వాసాల నరసయ్య

కొన్ని బండలు
కూడబలుక్కొని
కొండకు
ఆకారాన్నిచ్చాయో!
లేక
కొండనే
దయదలంచి
ఆ బండలకు
ఆశ్రయమిచ్చిందో!
ఏమో!!
మరేమో!!!
చలికి వణకదు
ఎండకు బెదరదు
వానకు చలించదు
వసంతానికి పొంగదు
శిశిరానికి కృంగదు
సమైక్యతనే
సంతరించుకున్న
ఈ కొండది
ఏమి గుండె!?!

(చెట్లులేని 'ఆర్మూరు కొండ'ను చూచాక —)

—(०)—

హిరాక్లయిటియన్ అగ్ని

"నిరవస్వరం - మొదట, పదం ఉండినది తుదకు, నిశ్శబ్దం ఉంటుంది. ప్రశ్నించడం వాయిదా వేయబడింది."

" ఈమధ్యకాలంలో నాలుగేండ్ల యుద్ధంలో (మొదటి ప్రపంచ యుద్ధం, 1914-18) లో లక్షలాది ప్రాణాలు పోయినాయి. ప్రాచీన యురోపియన్ సామ్రాజ్యాలు కూలినాయి. శాస్త్రం విజృంభించింది. ఇటలీ, స్పెయిన్, జర్మనీలలో ఫాసిజం ఆవరించింది. హిట్లరు జర్మనీ పారుపత్యాన్ని ప్రపంచంమీద రుద్ద యత్నించి పేలిపోయినాడు అసంఖ్యాక యూదులు, జిప్సీలు, కమ్యూనిష్టులు, విప్లవకారులు అమాయకులు నాజీలచే హతులయిరి. తర్వాత ఆరేండ్ల యుద్ధంలో (రెండవ ప్రపంచ యుద్ధం, 1939-45) లో లక్షలు మడిసినారు. పరమాణువు ఛేదించబడింది. హిరోషిమా, నాగసాకిపై పరమాణు బాంబులు పడినాయి. "జీను" స్వరూపస్వభావాలు జీవరాశి అనువంశికతను మార్చేందుకు దోహదము చేసినవి. చైనా, రిపబ్లిక్ అయింది. ఇస్రాయేల్ అనే దేశం పుట్టింది. ఆగ్నేయాసియాను అమెరికా ధ్వంసం చేసింది, చంద్రమండలంపై కాలూనింది. దారిద్ర్యం, నిరుద్యోగం తాండవిస్తున్నాయి.

భూసంపద వ్యర్థం చేయబడుతూ వుంది. ప్రపంచం కాలుష్య పూరితమైంది. హత్యలు నేరాలు పేట్రేగినవి. సౌష్ఠవమతం అంతరించింది. మాదకద్రవ్యసేవనయే ఆత్మానందమార్గమైంది. ఇదంతా అవుతుండగా, నేను పెరిగితిని, ముసలివాడినైతిని, ఈ పుస్తకం వ్రాసితిని."

ఎవరీ "నేను"?

ఏమా "పుస్తకం"?

ఈ "నేను" ఎర్విన్ చార్గాఫ్

ఆ "పుస్తకం" పేరు "హిరాక్లయిటియన్ అగ్ని"

ఈ వ్యాస శీర్షికయూ ఇదే.

పైని పేరా, పుస్తకం తుదిపుటలో ఉన్నట్టిది. ఈ వ్యాసాదిలోని "నిరవస్వరం" చార్గాఫ్ యొక్క అంతరంగం చార్గాఫ్ తన అంతరంగంతో సంభాషించినట్లునూ, ఆ అంతరంగం ("నిరవస్వరం") చార్గాఫ్ జీవిత తత్వం మీదనూ, సాధించిన విజయాలనూ, అనుభవించిన అపజయాలనూ గురించి బోనులో నిలబడ్డ సాక్షిని ప్రశ్నించినట్లున్న ఒక ప్రకరణాన్ని పైని పేరాకు ముందు వ్రాసినాడు. ఈ వ్యాసం ప్రథమ వాక్యం ఆ "అంతరంగం" ఇచ్చిన వాయిదా తీర్పు.

ఎవరీ ఎర్విన్ చార్గాఫ్

పుస్తక విషయమేమి ?

పుస్తక శీర్షికాంతరార్థమేమి ?

ఎర్విన్ చార్గాఫ్ విశ్వవిఖ్యాత జీవరసాయన శాస్త్రజ్ఞుడు పుస్తక విషయం, ఆయన శాస్త్రీయ స్వీయచరిత్ర. పుస్తకశీర్షికాంతర్యం నాకు అంతుపట్టలేదు. కానీ హిరాక్లయిటియన్ అగ్ని అంటే ఏమో విశదీకరిస్తాను.

మన వేదర్షులు ప్రకృతి, సృష్టి మున్నగువాని గురించి యోచించినారు. సూర్యుడు, నక్షత్రాలు, ఉషస్సు, సంధ్య, దివారాత్రాలు, పర్జన్యుడు, వర్షాలు మున్నగువాని మూలమేమి అని ప్రశ్న వేసుకొని సృష్టితత్వం మీద వ్రాసినారు. "నాసదీయసూక్తం" "అస్యవామీయసూక్తం" మున్నగువానిని ఋగ్వేదంలో చదువవచ్చును.

యవన (గ్రీకు) తాత్వికులు కూడ 2500 ఏండ్ల క్రితం సృష్టిమూలం మీద సిద్ధాంతాలు చేసినారు. వారు థేల్స్, అనక్సిమాండర్, అనెక్సిమెనెస్, అనక్సగోరస్, హిరాక్లయిటస్ అనువారు.

ఒక్కొక్కరు ఒక్కొక్క పదార్థాన్ని ఆధారం చేసికొని సృష్టిని ఆవిష్కరించడానికి ప్రయత్నించినారు. ఆపదార్థాలేవంటే మన దర్శనాలలో చెప్పబడిన పృథివి, అప్, తేజ, వాయు, ఆకాశములు అనే పంచభూతాలు థేల్స్, భౌతిక ప్రపంచమంతా జలాధారమే అంటాడు ఇదిసరేఅనిపిస్తుంది. జలంలేనిస్థలంలేదు నీరేప్రాణాధారం. మనదేహంలో 90శాతం నీళ్లే అనక్సిమాండర్, ఆకాశమే సృష్టికిమూలాధారం అంటాడు.

అనెక్సిమెనెస్, వాయువే విశ్వానికి ప్రాతిపదిక అంటాడు. అనక్సగోరస్, భౌతికపదార్థం వేరు, మేధస్సు వేరుఅంటాడు. ఇది సాంఖ్యంలో ప్రకృతి-పురుష, వేదాంతంలో శరీర-శరీరి సంబంధం వంటిదనవచ్చును.

హిరాక్లియిటస్, సర్వపదార్థాలకూ అగ్నియే మూలంఅంటాడు. ఋగ్వేదంలో మొట్టమొదటి పదం "అగ్ని" జీవోత్పత్తికి మూలమైన ప్రక్రియా వలయాన్ని "పంచాగ్నివిద్య" అన్నారు మనవారు యవన తాత్వికుల ప్రతిపాదనలు అర్గురుగ్రుడ్డివారు ఏనుగును పరిశోధించి దాని స్వరూపాన్ని వర్ణించినట్లున్నాయి.

మనవారేమంటారో చూస్తాము.

సృష్టిమూలం దేవునికి కూడా తెలియదేమో అని శంకిస్తూ ఋగ్వేదంలోని "నాసదీయసూక్తం" ముగుస్తుంది. బ్రహ్మసూత్రముల ప్రకారం పరమాత్మనుండి ఆకాశం పుట్టింది. ఆకాశం నుండి వాయువు పుట్టింది. వాయువు నుండి అగ్నిపుట్టింది. అగ్నినుండి జలంపుట్టింది జలంనుండి పృథివి పుట్టింది. జీవసృష్టి ఎట్లు జరిగిందనడానికి విష్ణు పురాణం ఇట్లంటుంది. నానా విధశక్తికలవే అయినా, కలియకుండా వేర్వేరుగా ఉండే ఈ పంచభూతాలు ప్రజాసృష్టిచేసేందుకు అసమర్థాలు యవనుల ఆలోచనా ధోరణికంటే మనవారిదే సమగ్రంగానూ, శాస్త్రీయంగానూ కనపడుతున్నది.

ఎర్విన్ చార్గాఫ్ హిరాక్లియిటస్ అగ్నితత్వాన్ని అంగీకరించినట్లుంది. గ్రంథశీర్షిక ఉండేపుటలో ఇంగ్లీషు మర్మవేదాంతకవి జి. ఎం హాప్కిన్సు వాక్యం "ప్రకృతి హిరాక్లియిటియన్అగ్ని" ను ఉటంకించినాడు. గ్రంథంతుదిలో తాను పదవీ విరమణ చేసినప్పుడు, తన సామానులను పనివారు ఇంటికి చేరవేయుచుండగా, ఇంటిలోకూర్చొని, హిరాక్లియిటస్ అసంపూర్ణ గ్రంథ భాగంలో ఒక సూత్రంపై దృష్టి సారిస్తాడు. ఆసూత్రం: "ఊర్ధ్వమార్గం, అధోమార్గం రెండూ ఒకటే" దీనిని తేరపారచూచి "హిరాక్లియిటస్ తప్పు అనే నిర్ణయానికి వచ్చినాను" అని గ్రంథాన్ని ముగిస్తాడు చార్గాఫ్.

చార్గాఫ్ మీద వ్రాయవలసిన అగత్యం ఏమివచ్చిందంటే చెప్పతాను. సాధారణంగా స్వీయ చరిత్రలూ, ఆత్మకథలు, కవులు, వేదాంతులు రాజకీయ నాయకులు వ్రాసుకొంటారు. చరిత్రకారుడు గిబ్బన్, యోజకుడు జాన్‌స్టూవర్ట్‌మిల్, గణితశాస్త్రం కంటే వేదాంతంలో గొప్ప రచనలు చేసిన రస్సెల్, స్వీయచరిత్రలు వ్రాసుకొన్నారు. అగస్టీను, రూసోలు "పాప నివేదనలు" అనే శీర్షికతో ఆత్మకథలు రచించినారు. అబిలార్డ్ "నా దుఃఖగాథ" వ్రాసినాడు. న్యూమన్ "సమర్థన" అనే శీర్షికతో తన చరిత్ర చెప్పికొన్నాడు. కార్లయిల్ "సార్టర్ రిసార్టస్" అనే సంకేత శీర్షికతో తన జీవితం గురించి వ్రాసినాడు.

వర్డ్సువర్తు కావ్యం "ప్రెల్యూడ్", బైరన్‌కావ్యం "చైల్డ్ హరాల్డ్" వారి జీవితగాథలే. బెంజమిన్ ఫ్రాంక్లిన్ స్వీయచరిత్ర గాంధి "సత్యప్రయోగ కథ", హిట్లరు "నా పోరాటం" సుప్రసిద్ధాలు. కన్నడ రచయిత "బీచి" తన స్వీయ చరిత్రకు "నా బయాగ్రఫీ" అని పేరుపెట్టినాడు. కానీ శాస్త్రజ్ఞులు స్వీయచరిత్రలు వ్రాయరు. కవులు, వేదాంతులు తమరచనలలో మిర్చిమసాలా కలిపి వ్రాస్తారు. శాస్త్రజ్ఞులు శుష్కప్రయోగాలు వర్ణించే పరిశోధన పత్రాలు వ్రాస్తారు. శాస్త్రజ్ఞులకు సాహిత్యశైలి సకృత్తుగా ఉంటుంది. డార్విన్, ఎడ్డింగ్టన్, రసెల్, ఆలివర్‌లాడ్జ్, విలియం‌లారెన్స్ బ్రాగ్, బ్రిడ్జ్‌మన్, బ్రౌనోస్కీవంటి ఏకొద్ది శాస్త్రజ్ఞులకో సాహిత్యశైలీ సంపద ఉంటుంది అట్టివారి కోవకు చెందినవాడు చార్గాఫ్. ఇంకొక విషయం కూడా గుర్తుంచుకోవలెను. నేడు ప్రబలిపోయిన విశిష్టప్రవీణతవలన కళలకూ శాస్త్రాలకూ, శాస్త్రాలలో ఒక శాస్త్రానికి ఇంకొక శాస్త్రానికి, ఒకే శాస్త్రంలో ఒక విషయానికి ఇంకొక విషయానికి, (కుడికంటి స్పెషలిష్టు, ఎడమకంటి స్పెషలిష్టు) అగాథాలేర్పడినాయి. తక్కువ తక్కువ గురించి ఎక్కువెక్కువ తెలిసికోవడమే నేడు శాస్త్రరంగాలలోని రివాజు. ప్రాచీనకాలం నుండీ, 19 వ శతాబ్దం వరకు కల మేధావులు కళాశాస్త్రాలలో నిష్ణాతులు. అరిస్టాటిల్, అవిసెన్నా, రోజర్‌బేకన్, ఫ్రాన్సిస్ బేకన్, లియోనార్డో డావిన్సీ, వాంబోల్ట్ మున్నగువారు. ఇరువదవ శతాబ్దంలో బక్‌మిన్‌స్టర్ ఫుల్లరు ఒకడు ఇట్టివాడు కన్పట్టుచున్నాడు. మొత్తానికి సి. పి. స్నో 1959లో వ్రాసినట్లు "రెండు సంస్కృతులు" తలెత్తినాయి. మనదేశంలో ప్రాచీనకాలంలో "అగ్ని పురాణ" కర్త, "బృహత్సంహిత" కర్త (వరాహమిహిరుడు), "పండితారాధ్యచరిత్ర" కర్త (పాల్కురికిసోమన) బహుముఖ ప్రజ్ఞ కలిగిన మేధావులు.

ఎర్విన్ చార్గాఫ్ రెండు సంస్కృతులనే వారిధులకు వారధి కట్టిన శాస్త్రజ్ఞుడు, భావుకుడు.

రసాయనశాస్త్రం, అణువిక జీవశాస్త్రంలో ప్రామాణిక పరిశోధనలు చేసినాడు. ఈయనకు తత్వశాస్త్రం, కవిత్వం, సంగీతం, చిత్రలేఖనంలలో గొప్ప అవగాహన ఉంది. పదునేను భాషలలో పాండిత్యం ఉంది. మాతృభాష జర్మన్. అతిశయోక్తిప్రవీణుడు-"అల్పాక్షరముల ననల్పార్థరచన అంటారే ఆరీతి వ్రాత. గొడ్డలినుపయోగించవలసిన చోట గోటితోనే సరిచేస్తాడు. ఈయన గ్రంథాన్ని జనవరి 1984 లో చదివితిని. ఈయన శాస్త్రపరిశోధనారీతుల పైనా, మానవభవితవ్యం పైనా వ్రాసిన భాగాలు గంభీరములు. పుస్తకం చదువుతూ వుంటే అనిర్వచనీయమైన ఆవేదన, ఆనందదాయకమైన ఆప్యాయం కలుగుతాయి. చార్గాఫ్‌కూనాకు కొన్నిపోలికలు కూడా వున్నాయి. ఏబదేండ్లు శాస్త్రపరిశోధన చేసి విరమించిన చార్గాఫ్ అనుభవాల వర్ణనలు ముప్పదేండ్లు శాస్త్రపరిశోధన చేసి విరమించిన నా అనుభవాల వలెనే వున్నాయి. తనను "మేవరిక్" (కట్టు తెంపుకొని విచ్చలవిడిగా ఎగురలాడే దూడ అంటే స్వేచ్ఛగా అందరినీ విమర్శించేవాడు) "గాడ్‌ఫ్లయి" (పిడుదు అంటే అదేపనిగ విమర్శిస్తూ చీకాకుపరుస్తూ వుండేవాడు) అంటారని

చార్గాఫ్ వ్రాసుకొన్నాడు. ఇవే ఇంగ్లీషు పదాలను నాకు నేనే అన్వయించుకొంటూ ఒకటి రెండు సంవత్సరాల క్రింద సన్నిహితస్నేహితులకు జాబులలో వ్రాసియున్నాను. చార్గాఫ్‌కు ఇంగ్లీషుపదం "లేబిరింత్" (చక్రవ్యూహం చిక్కుతోవ, గహనస్థానం) అంటే అభిమానం "లేబిరింత్ ఆఫ్ వాయ్‌సెస్" అనే గ్రంథం వ్రాసినాడు. ఒకచోట లేబిరింత్ ఆఫ్ సయన్స్" అనే ప్రయోగం వాడుతాడు. నమ్మండి, చార్గాఫ్ పుస్తకాన్ని చదువకమునుపు కొన్ని నెలల క్రితమే నేను "లేబిరింత్ ఆఫ్ సయన్స్" అనే చిన్న గ్రంథాన్ని వ్రాసి, ఎంపిక చేసిన కొందరు మిత్రులకూ, శాస్త్రజ్ఞులకూ పంపించి యుంటిని. ఈ కారణాల చేత చార్గాఫ్‌కునాకూ అనుబంధం ఏర్పడింది. అన్నిటికన్నా ముఖ్య సంగతి చార్గాఫ్ శాస్త్రీయ జీవితంలో జరిగిన - కాదు జరుగవలసింది జరుగకపోయిన మహత్తర సంఘటన నన్ను కలచివేసింది. అదేమో ఈ వ్యాసాంతాన మనవి చేస్తాను. పై కారణాల నన్నిటినీ పురస్కరించుకొని చార్గాఫ్ గ్రంథవిషయాలను తెలుపుతాను.

జీవితం : ఎర్విన్ చార్గాఫ్ ఆస్ట్రియా దేశీయుడు. జన్మం ఆగస్టు 11, 1905. పుట్టినది జెర్నోవిట్జ్ అనే పట్టణంలో అయినా, వియన్నా నగరమే తన స్వస్థానం అంటాడు. ఎందుకంటే తన తల్లి అచ్చటనుండే అపహరింపబడి అదృశ్యమయిందనీ, తండ్రి సమాధి అచటనే వుందని. విద్యాభ్యాసం వియన్నాలోనే. మొదటి ప్రపంచ యుద్ధానికి చిన్నవాడిననీ రెండవప్రపంచ యుద్ధానికి పెద్దవాడననీ అంటాడు. ఇతని తల్లి 1943లో (ఆస్ట్రియా నాజీల ఆక్రమణలో ఉండిన తరుణం) వియన్నానుండి బహిష్కరించబడుతుంది. ఎచ్చటి గతించిందో, ఎట్లు గతించిందో దేవుడికే తెలుసునని వాపోతాడు తల్లి స్వరూపాన్ని ఎప్పుడూ వర్ణిస్తూ వుంటాడు. తల్లి కంఠం వినబడుతూ వుంది అని వ్రాస్తూవుంటాడు. తండ్రికి చిన్న బ్యాంకు ఉండేది. మోసగాళ్ళయిన ఖాతాదారులవల్ల అది దివాలా తీస్తుంది. దీని తాలూకు నిధి అంతా అప్పుడు (1910లు) రూపుదాలుస్తున్న హాలీవుడ్ (సినిమా) నిర్మాణానికి పోయబడిందని చెప్పుతూ, ఇంతకంటే కొంత మంచిపనికైనా అయివుంటే బావుండు నంటాడు (చార్గాఫ్ అనతిశయోక్తి). తండ్రినుండి వచ్చిన ఆస్తి ఒక చిన్న పుస్తక భాండాగారం - గెటే, షిల్లర్, లెస్సింగ్, షేక్సుపియరు గ్రంథాలు, ఒక రిస్టువాచ్. జాపాల్ సార్త్ర కూడా తన తాతగారి గ్రంథాలయం గురించి చెప్పుతూనే వుంటాడు. విద్యాభ్యాసం అంతా వియన్నాలోనే. 1928 లో రసాయన శాస్త్రంలో డాక్టరేటు పట్టం పుచ్చుకొనేవరకు వియన్నాలో చార్గాఫ్ అనుభవాలు చెప్పవగినవి. వియన్నా! ఆస్ట్రియా రాజధాని. యూరపులో మేధావుల రాజధాని అని ప్రసిద్ధి. యూరపులో సామ్రాజ్యాలేలిన మూడు, నాల్గు రాజకుటుంబాలలో ఒకటైన హాబ్స్‌బర్గ్ రాజవంశ* ఆస్ట్రియా - హంగేరియన్ సామ్రాజ్యం స్థాపించింది.

సంగీత, చిత్రకళ, అర్థశాస్త్రం, మానసికశాస్త్రం తత్వశా వైద్యశాస్త్రం, గణితశాస్త్రం, భాషాశాస్త్రం, సాహిత్యం, ఒక్కటేమి అన్నిరంగాలకూ కాణాచి వియన్నానగరం. కళా, శాస్త్రరంగాల ప్రతి యొకటికీ "వియన్నాస్కూల్" అనే ముద్రవుంటుంది. బీతో హెయ్‌డిన్, షూబర్ట్, బ్రాహమ్స్, మొజార్ట్, బెర్గ్ లాంటి సంగీతస్రష్ట వియన్నావాసులు. కర్నాటక సంగీతానికి తిరువారూరు (తంజావూ పాశ్చాత్య సంగీతానికి వియాన్నా అట్లు. వియన్నాఫిల్‌హార్మొని ఆర్కెస్ట్రా జగత్ప్రసిద్ధమైంది. ఇందులో పాల్గొనడానికి అవకాశ రావడం సంగీతజ్ఞులకు జీవిత ధ్యేయంగా పరిగణింపబడుతుందంటే ది ప్రశస్తివేరే చెప్పనక్కరలేదనుకుంటాను. పాశ్చిమాత్య ఆధు సంగీతానికీ ద్వాదశస్వర సంగీతానికీ వియన్నాయే పుట్టినిల్లు . [మ దేశంలో ఉస్తాద్‌బడేగులాం అలీఖాను పండ్రెండుస్వరాల సంగీతంపా తాడని విజ్ఞులంటారు] అలాగే వియన్నా చిత్రకళా దకాడెమీ. షికె గ్రూబర్ అనే సిగ్గరియువకుడు కొన్నిచిత్రాలు తెచ్చి అకాడెమీ గుర్తి పునర్తిస్తే, ఆచిత్రాలు పరీక్షించి అకాడెమీ ప్రవీణులు "నాయనా, నీ మెకానికల్ డ్రాఫ్ట్సమాన్‌గా పనికివస్తావుపో" అని అనకుండావుంటే మార్చి 12, 1938లో హిట్లరు నాజీసైన్యంతో వియన్నాను ఖుద్దు ఆక్రమించడానికి వచ్చివుండడు. ఎందుకంటారా అష్లీకెన్‌గ్రూబ ఈహిట్లరు. వియన్నాలోనే అంతర్జాతీయ సైకో అనలిటికల్ అసో యేషన్‌వుండింది. తాను స్కూలుకుపోయే వీధిలో ఒక ఇంటి "డా. యస్. ఫ్రాయిడ్" అని ఒకబోర్డు వుండేదనీ, అప్పటికి అదేమె తనకు తెలిసేదికానీ చార్గాఫ్ అంటాడు. మానసిక విశ్లేషణ శాస్త్రాని త్రిమూర్తులనదగిన ఫ్రాయిడ్ జుంగ్, అడ్లరులు ఇచ్చట సమావే ముయ్యేవారు. సుప్రసిద్ధనాటక ప్రయోక్తమాక్స్‌రీన్‌హార్డ్‌వియన్నానివా రచయిత ఫ్రాంజ్‌కాఫ్కా ఇచటనే వుండేవాడు అర్థికశాస్త్ర రచయి జోసెఫ్ షంపిటర్ వియన్నాలో ఉండేవాడు తత్వశాస్త్రంలో "వియన్నా స్కూలు"కు చెందిన విట్‌జెన్‌స్టీను, పోపరులు (పాసిటివిస్టులు వియన్నీయులు ప్రెగల్ (రసాయనశాస్త్రంలో నోబెల్ అవార్డు) ష్రోడింగర్ (భౌతికశాస్త్రంలో నోబెల్అవార్డు) ఆస్ట్రియనులే ఇట్టి కళా విజ్ఞాన మందిరమైన వియాన్నాలో పెరిగి, చార్గాఫ్ సమ్యక్ వ్యక్తిత్వం పెంపొందించుకొన్నాడు. అందుకే ఆయన రచనావాక్యాలు కళాశాస్త్రాల మధ్య స్పందిస్తూవుంటాయి.

---

* ఇతర రాజవంశాలు : రష్యా - రొమనోవ్; జర్మని - హోహెన్ జోలెర్న్; ఇంగ్లండు - హానోవరియన్; ఫ్రాన్సు - బూర్బన్.

పి. హెచ్. డి. పట్టం అందుకొన్న తర్వాత వియన్నాలో సరైన ఉద్యోగం దొరకక, అమెరికాలోని ఏల్ విశ్వవిద్యాలయంలో మిల్టన్ కాంప్‌బెల్ రిసెర్చ్‌ఫెలోషిప్ అందుకొని అమెరికాకు పోతాడు. వియన్నాలోని మురుగుదొడ్లకంటే చాలా తర్వాత వచ్చిన అమెరికాకు పోవడమంటే జంకయిందంటాడు చార్గాఫ్. అచట రెండు సంవత్సరాలు (1928-30) క్షయవ్యాధి క్రిమి క్రొవ్వు ఆమ్లాలమీద పరిశోధన 1929లో వివాహం. ఫెలోషిప్ ముగిసిన తర్వాత మరలా యూరపుకు వచ్చుట. మునిగిపోతున్న ఓడలోకి మళ్ళీ ఎలుక దూరినట్లు అని చమత్కరిస్తాడు. 1930 నుండి 1933 వరకు బెర్లిన్ విశ్వవిద్యాలయంలో బి.సి.జి. మరియు డిఫ్తీరియా సూక్ష్మక్రిములలోని క్రొవ్వు పదార్థాలమీద పరిశోధన. జర్మన్ పార్లమెంటు భవనం రీక్‌స్టాగ్ దగ్గరనే ఇతని నివాసం. 1933లో అది దగ్ధమగుట, హిట్లరు అధికారంలోకివచ్చుట – అది చరిత్ర. ఆ తరుణంలో అచట పరిశోధనలు చేస్తుండే నెర్న్‌సిట్, బోడెన్‌స్టీన్, ఐన్‌స్టీన్, హేబరు, పోలానీ, ఫ్రీండ్‌లిక్, వార్‌బర్గ్, మాక్స్‌ప్లాంక్ మున్నగు మహా శాస్త్రజ్ఞుల (వీరంతా నోబెల్ బహుమతి విజేతలే)తో ముఖపరిచయం అవుతుంది. జర్మనీవారికి జయించే దానికివలసలు లేకుండినవి కాన జర్మనీశాస్త్రజ్ఞులు ప్రకృతిని జయించేందుకు సమకట్టినారు. కెయిజర్ విల్‌హెల్మ్ (జర్మన్ చక్రవర్తి) చేయజాలని పని కెయిజర్ విల్‌హెల్మ్ ఇన్స్టిట్యూటు (పైనిశాస్త్రజ్ఞులు పనిచేయు సంస్థ) చేయగలిగిందని చార్గాఫ్ అంటాడు.

జనవరి 1933. నాజీల కవాతు బూట్ల చప్పుడు వీధులలో విన్పించసాగింది. చరిత్రలో కాళరాత్రి ఆరంభం. 1933 ఏప్రెల్ చార్గాఫ్ రైలులో పారిస్ బయలుదేరుతాడు. లూయీ పాశ్చర్ సంస్థలో చేరుతాడు. పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్నట్లు ఆ సంస్థలో తగిన వసతులు లేకుండెనట. థర్మామీటరు కూడా దొరకుట కష్టంగా వుండెనట. 1934 లో మరలా అమెరికాకు ప్రయాణం. ఇంటర్వ్యూలో అతడు సల్ఫ్యూరికామ్లం తయారీ విధానంపై సరిగా ఉత్తరం ఇస్తాడు. దీని బలంచేత కొలంబియా విశ్వవిద్యాలయంలో వైద్యశాస్త్ర విభాగంలో రిసెర్చ్ అసిస్టెంటు ఉద్యోగం వస్తుంది. ముప్పయి మూడేళ్లకి అసిస్టెంటు ప్రొఫెసరు, నలుబదొక్క సంవత్సరంలో అసోసియేట్ ప్రొఫెసరు నలుబదేడవయేట ప్రొఫెసరు – ఇదీ మిరుమిట్లుగొల్పు తారాజువ్వలాంటి ఊర్ధ్వగమనం అంటాడు చార్గాఫ్. దాదాపు నలువదేండ్లు కొలంబియాలోనే ఉద్యోగం. అందరివలెనే తానూ కొలంబియాలోనికి దొడ్డిదారిన ప్రవేశించానంటాడు. 1975 లో పదవీ విరమణ (70 వ యేట). 1978 లో ఈ గ్రంథ ప్రచురణ.

పదవీ విరమణమీద చార్గాఫ్ భావాలు శాస్త్రపరిశోధకులందరికి అన్వయిస్తాయి. ప్రాయోగిక శాస్త్రజ్ఞుల పదవీ విరమణకూ, ఇతరుల పదవీ విరమణకూ భేదం ఉంది. చరిత్రాచార్యుడు పదవీవిరమణ చేసి, ఇంటిలోనో, లైబ్రరీలోనో తన వ్యాసంగం చేయవచ్చు. ప్రాయోగిక శాస్త్రజ్ఞుడు (రసాయనశాస్త్రం భౌతికశాస్త్రం మొ.) ఆ విధంగా తన పరిశోధన సాగించలేడు. శాస్త్రీయసామగ్రి, పరిశోధన సహాయకులు, వర్కుషాపు కావలెను. పదవీకాలపు కడపటినాడే ఇవన్నీ ఆగిపోతాయి. ఇంతేకాదు వయస్సు వచ్చినకొద్దీ శాస్త్రజ్ఞుడు ఏకాకి అయిపోతాడు స్వజనంలోనే పరాయివాడవుతాడు. ఆయనకూ, యువ శాస్త్రజ్ఞులకూ మధ్య మంచుగోడవంటిది లేస్తుంది. వారి పరిభాష, విలువలు, వేరు. అవి ప్రాతి పదికగా వృద్ధశాస్త్రజ్ఞుడు పరిగణింపబడతాడు. ఆయన పరిశోధనా ప్రణాళికలను పరీక్షించేవారు. ఆయనక్రింద చదువుకొన్నవారి క్రింద చదువుకొనిన లేదా పనిచేసిన యువకులయి వుంటారు. ఆయన పరిశోధనా పత్రములను ప్రకటనార్థం నిర్ధారణ చేసేవారు, అయనచేత పరిశోధనాపత్రం ఏలా వ్రాయవలెనో నేర్చుకొన్న అర్భకులు. అభివృద్ధి ముసలి రసాయన శాస్త్రాచార్యుని వెనుకకు నెట్టి పోయింది. అయినా, ఈయన మేకపోతు గాంభీర్యంతో నెట్టుక వచ్చేటట్లు చేసేవేమంటే, యువకుల కంఠస్వరాలు, పాతగదులు, ప్రతిరోజూ పరిశోధనాగారం, ఆఫీసులను తనిఖీ చేసివచ్చుట అయనకు వచ్చేటపా. వాటికి బదులివ్వడం, శాస్త్రీయ పత్రికాపఠనం, ఆయన కూర్చున్న కుర్చీనుండి కిటికీద్వారా కన్పించే బయటి ప్రకృతిదృశ్యం ఆ కిటికీ అంచుల పేరుకొనిపోయిన దుమ్ము-ఇవన్నీ ఆయన దైనందిన జీవితంలో విడదీయరాని భాగాలయినాయి. ఏన్నో ఏండ్ల సుఖదుఃఖాలకి సంకేతాలయినాయి. హఠాత్తుగ-ఇదంతా కుప్పకూలిపోతుంది. ఒకానొక సాయంత్రం బయటికినడు, ఎగిరిపో, మాసిపో అంటారు. పోతాడాయన దుమ్ములో కలసి-ఇదే నా కథ అంటాడు చార్గాఫ్.


శాస్త్ర పరిశోధన కొళాయివలె కట్టివేసేదికాదు. ఎన్నియో ప్రణాళికలమలులో వుంటాయి. ఎన్నియో పరిశోధనా పత్రములు వ్రాయవలసి వుంటుంది. ఎన్నో పరిశోధనా పత్రములు చిత్తుస్థితిలో వుంటాయి అంటాడు చార్గాఫ్. పదవీ విరమణ పద్ధతిమీద విమర్శకాదిది అంటాడు చార్గాఫ్. పదవీ విరమణమీద చట్టంలేకున్నా, విరమణ అనేది ప్రకృతియే అమలు పరుస్తుంది. ఏదో కొద్ది ఏండ్లు దేడావుండవచ్చునంటాడుచార్గాఫ్.

డీ ఆక్సీరైబో న్యూక్లియిక్ ఆమ్లం (డి.ఎన్.ఏ) మీద చార్గాఫ్ పరిశోధనలు :

కొలంబియా విశ్వవిద్యాలయంలో చార్గాఫ్ దాదాపు 40 ఏండ్లు పరిశోధన చేసినాడు. జీవరసాయన శాస్త్రజ్ఞుడు ఇప్పుడు అణువిక జీవశాస్త్రంలో "ఇందుగలడందులేడని సందేహము వలదు" అన్నట్లు సర్వవ్యాపిగ విశ్వరూపం దాల్చిన డీ ఆక్సీరైబో న్యూక్లియిక్ ఆసిడ్

(డి. ఎన్. ఏ) అనే రసాయన పదార్థంమీద దాదాపు ముప్పదేండ్లు (1945-75) నిరంతర పరిశోధనచేసి, ఆ క్షేత్రంలో అగ్రగామి, పథచోదకుడూ అయినాడు. ఆయన కృషి వివరిస్తాను. శాస్త్రీయ పరిభాష వున్ననూ కొంత ఓపిక, ఓర్పు వహించండని విన్నవించు కొంటున్నాను.

"చిన్నది చక్కనిది" అనే నినాదం ఈనాడు తరచు వింటున్నాము. నేనంటాను "చిన్నది భీకరం" అని. భౌతికప్రకృతిలో రెండు చిన్నవి ఉన్నాయి. జడ ప్రకృతిలో పరమాణువు (ఆటం) జీవరాశిలో జీవకణం (సెల్). చిత్రం 1 చూడండి. అణు స్వరూపమూ, జీవకణ నిర్మాణమూ ఒకే విధంగా కన్పడుతాయి. రెంటికి కీలకం కేంద్రకం లేదా న్యూక్లియస్. పరమ అణువు మూలకాల అతిచిన్న భాగం. కణం జీవుల అతిచిన్న భాగం. వీటి తులనాత్మక పరిమాణం వివరిస్తాను. ప్రకృతిలో అతితేలిక పదార్థం (మూలకం) ఉదజని అనే వాయువు. ఉదజని పరమ అణువు బరువు ఒకటి అని అనుకొంటే, జీవకణం బరువు 5000 నుండి పదిలక్షల వరకూ ఉండవచ్చు, జీవకణాన్ని విశ్లేషిస్తూ పోతే మూలకాణువులు సిద్ధిస్తాయి రెంటికీనూ న్యూక్లియస్ కీలకం. పరమ అణుకేంద్రకంలో "ప్రోటాన్" మున్నగు "ప్రాథమిక కణ"ములుంటాయి. జీవకణ కేంద్రకంలో జీవప్రక్రియ నిర్ణాయక అంశాలుంటాయి. దేహం పెరగడం, తల్లిదండ్రుల స్వభావ స్వరూపాలు సంతతికి సంక్రమింపజేసే శక్తి న్యూక్లియస్ లోనే వున్నాయని చిరకాలం నుండీ శాస్త్రజ్ఞులు భావిస్తూవున్నారు. ఈశక్తి న్యూక్లియస్‌లో వుంటాయి అనుకొనే "జీన్" (గ్రీకుపదం "జెనోస్", సంస్కృత పదం "జన" అంటే జనం) లలో ఉంటాయని నమ్మకం. ఈ జీనులు అధి భౌతికశక్తులా? లేక రసాయన పదార్థాలా? అనేది ఆవిష్కార యోగ్య విషయం.



ఇరువదవ శతాబ్దంలో రెండు దౌర్భాగ్యపు శాస్త్రీయ విజయాలు సాధింపబడ్డాయని చార్గాఫ్ పశ్చాత్తాపం వెలిబుచ్చినాడు. ఈ రెండునూ న్యూక్లియసులతో చెలగాటం ఆడుటద్వారా ఫలించినవే. పరమాణు కేంద్రకచ్ఛేదక మూలంగా "అణుబాంబు" పుట్టింది. జీవకణాలలోవుండే "జీను" లను రసాయన కత్తెరలతో ఛేదించి, విజాతి జీవజీనుభాగాల నతికించి ("పునర్మిశ్రిత డి ఎన్ ఏ") ఆ జీనుల తేపల ద్వారా ("జెనెటిక్ ఇంజనీరింగు") ప్రకృతి సిద్ధంకాని, ప్రకృతి ఉద్దేశించని అపూర్వ జీవజాతి, పరిశోధనాశాలలలో సృష్టింపబడే (విశ్వామిత్ర సృష్టిలాంటిది) అవకాశం ఏర్పడింది. పరమాణువు నుండి పుట్టిన అణుబాంబు కంటే "జెనెటిక్ ఇంజనీరింగు" వల్ల పుట్టిన "పునర్మిశ్రిత డి ఎన్ ఏ" లు ఎక్కువ అపాయకారులు కావచ్చు అవి (బాంబులు) తయారుచేయడం ఆపవచ్చు. తయారుచేసినవి మూలకు పేర్చవచ్చును ఇవి (కొత్త డి ఎన్ ఏ లు) మన తర్వాత, మన సంతతి తర్వాత, వారి తర్వాత అనంతకాలం తమంత తామే వృద్ధిపొందుతూ పోతుంటాయి.

వాని వృద్ధి అపడం చేతకాకపోతుంది. వాని ఉనికి మూలంగా వచ్చే పరిణామాలు ఊహాతీతం అని చార్గాఫ్ హెచ్చరిస్తాడు.

డిసెంబరు 1983లో ఢిల్లీలో 15 వ అంతర్జాతీయ జెనెటిక్స్ కాంగ్రెస్ సమావేశమై జెనెటిక్ ఇంజనీరింగ్ పైని దీర్ఘచర్చలుచేసింది ఇంతటి సంచలనం కలుగజేస్తున్న ఈ "జీను" లేమిటి ఈ డి ఎన్ ఏ ఏమి ?

జీను — డి. ఎన్. ఏ.

పదునెనిమిది వందల అరవై తొమ్మిదవ (1869) సంవత్సరంలో స్విస్ శాస్త్రజ్ఞుడు ఫ్రెడరిక్ మీశ్చర్ చీము కణాల న్యూక్లియస్ నుండి "డీ ఆక్సీరైబో న్యూక్లియిక్ ఆసిడ్" పొట్టిపేరు "డి.ఎన్.ఏ." అనే రసాయన పదార్థాన్ని వేరుపరచెను. ఈ విషయాన్ని 75 ఏండ్లు ఎవరూ పట్టించుకోలేదు.

1944లో ఆస్వార్డ్ అవెరీ అనే శాస్త్రజ్ఞుడు ఒక పరిశోధనా ఫలితాన్ని ప్రకటిస్తాడు. అది "న్యూమోకోకస్" అనే సూక్ష్మక్రిముల స్వభావం పైన అంధు ముగింపు ఇట్లుండింది. "న్యూమోకోకస్ క్రిమి తన స్వభావాన్ని మార్చుకోవడానికి డీ ఆక్సిరైబోస్ లాంటి న్యూక్లియిక్ ఆమ్లం ప్రాతిపదిక యూనిట్టు కావచ్చుననే విశ్వాసానికి పరిశోధన బలంచేకూరుస్తున్నది." ఈ వాక్యం తనమీద పరపిన ప్రభావం వర్ణనాతీతం అంటాడు చార్గాఫ్. జీవుల అను వంశికతకు రసాయన మూలం దొరికిందనుకొంటాడు. అవరీ జీవశాస్త్ర వ్యాకరణాన్నిచ్చినాడు. అదే సమయంలో (1945) తోడి ఆస్ట్రియన్ భౌతికశాస్త్రజ్ఞుడు ఎర్విన్ ష్రోడింగర్ ప్రచురించిన "జీవం అంటే ఏమి"? అనే చిరు పొత్తాన్ని చదువుతాడు చార్గాఫ్. అందులో ష్రోడింగర్ "జీవకణంలో వుండే క్రోమోజోములలో జీవియొక్క ఆనువంశికతను నిర్ణయించే సంకేతలిపి ఉంది" అన్నాడు. క్రోమోజోములలో ఆనువంశిక అంశాలున్నాయి. ఇవి "జీనులు" వాడేవీడు అని డిటెక్టివ్ కథలో మాదిరి జీనే డి. ఎన్. ఏ.! అని తేలింది.

అప్పటినుండి చార్గాఫ్ తన ఇతర పరిశోధనలను కట్టిపెట్టి డి. యన్ ఏ. మీదనే కృషి చేస్తాడు – 30 ఏండ్లు. ప్రతిజీవజాతికి ఉండే డి. ఎన్. ఏ. ఆ జాతికి ప్రత్యేకమైనదని కనిపెడతాడు. వివిధ జాతి జీవుల కణాలనుండి స్వచ్ఛమైన డి. ఎన్. ఏ. ను తయారుచేసే రసాయన విధానలను కనిపెడతాడు. ఆ రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా డి. ఎన్. ఏ. పై పరిశోధనలు చేసే శాస్త్రజ్ఞులకు స్వచ్ఛమైన డి. ఎన్. ఏ సాంపిల్లను ఇచ్చినది చార్గాఫే

ఈయన సాంపిల్లు లేపంటే వారి పని బంద్. తర్వాత డి.ఎన్.ఏ రసాయన ధర్మాల కనుగొంటాడు. అప్పటివరకూ డి. ఎన్. ఏ. మీద ఉన్న భావాలివి డి. ఎన్. ఏ లో నాల్గు భాగాలు కలవు. ఒక్కొక్క భాగానికి "న్యూక్లియోటైడ్" అని పేరు. ఒక్కొక్క "న్యూక్లియోటైడ్" లో, తమతో తాము లంకించుకొన్న మూడు రసాయనాలుంటాయి. ఆ రసాయనాలేవంటే,

1. ఆంగారిక నత్రజనిక్షారములు :
   1. ప్యూరీనులు < అడెనైన్ (సీన్) / గ్వానైన్ (సీన్)
   2. పిరిమిడినులు < తైమిన్ / సైటోసైన్
2. ఒక చక్కెర దినుసు డీఆక్సీరైబోస్
3. ఆమ్లం ఫాస్ఫారికామ్లం

నాల్గు "న్యూక్లియోటైడు" ఖండాలు ఫాస్ఫేటువల్ల అనుసంధింపబడి గొలుసులుగ ఉంటాయి. ఈ స్వరూపాన్నే "చతుర్ న్యూక్లియోటైడ్" అనేవారు. ఇదే అయితే డి. ఎన్. ఎ. ఒక జిగురుముద్ద అవుతుందే ! ఎన్ని జీవిజాతులున్నాయో అన్ని అవతారాలు దాల్చగల ఈ డి ఎన్.ఏ. స్వరూపం ఒక ముద్దయా ? లేక అందులోని రసాయన బంధాలూ, స్థానాలూ విశిష్టంగా పంపిణీ అయివుంటాయా ? అనే ప్రశ్న వేసికొని చార్గాఫ్ పరిశోధన సాగిస్తాడు. డి. ఎన్. ఏ. లోని రసాయనాలను పరీక్షించడానికి, విశ్లేషించడానికి సూక్ష్మపద్ధతి "(క్రోమోటోగ్రఫీ) అనుసరిస్తాడు. దీనివల్ల గ్రాములో వేయివవంతు పదార్థాన్ని కనుగొనసాధ్యం. వివిధ జీవజాతి డి. ఎన్. ఏల రసాయన సంఘటన ఒకటే అయిననూ, వాటిపనిచేసే తీరులో వైవిధ్యానికిమూలం న్యూక్లియోటైడుల అమర్పు కావచ్చును. డీఆక్సిరైబోస్ చక్కెరా, ఫాస్ఫారిక్ ఆమ్లాం అన్నింటికీ సమానం కాబట్టి ఉండేరహస్యమంతా, 4 నత్రజనిక్షారాల అమరికలో ఉండవచ్చును. తాను సాధించిన విస్తార ఫలితాల బట్టి ఈ నత్రజనిక్షారాలు కూర్పు, వింగడింపులపై కొన్ని సూత్రాలను నిర్మిస్తాడు. వీటిని "చార్గాఫ్ సూత్రాలు" అంటారు. ప్యూరిన్ క్షారములు అడెనైన్ తైమిన్లు ఒకజత ("ఎటి-" రకం), పిడిమినులు గ్వానైన్, సైటోసైన్ (జి సి రకం) అని రెండవజత. దీనిని నత్రజనిక్షారాల "ద్వందీకరణం" అంటారు. "ఇది చార్గాఫ్ సూత్రాల" ఫలితం. దీనినిబట్టి డి. ఎన్. ఏ, ద్వైన్యూక్లియోటైడ్" యేకానీ "చతుర్ న్యూక్లియోటైడ్" కాదని తేలింది. ఈ ఫలితాలను 1947, 1950 - 52 లో వివిధ పరిశోధనా పత్రాలను ప్రకటిస్తాడు.


1952 మేలో చార్గాఫ్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి పోతాడు. అచట జాన్ కెండ్రూ (1962 రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత) అతిథిగా వుంటాడు. కెండ్రూ చార్గాఫ్ తో అంటాడు

"కావెండిష్ పరిశోధనాగారంలో ఇద్దరు న్యూక్లియిక్ ఆమ్లాలపై ఏమో చేస్తున్నారు. అదేమో నాకంతుపట్టలేదు. వారితో మాట్లాడరాదా".

చార్గాఫ్ వారిద్దరినీ కలుస్తాడు. ఒకడు 24 ఏండ్ల యువకుడు. సరిగ్గా మాట్లాడనూ లేడు. ఈయన వాట్సన్. రెండవవాడు 35 ఏండ్లవాడు. ఈయన క్రిక్. వీరిద్దరూ రసాయన శాస్త్రజ్ఞులు కారు. వీరికి న్యూక్లియిక్ ఆమ్లాల రసాయన ధర్మాలు కావలె. మారిస్ విల్‌కిన్స్, అనే ఎక్స్ కిరణ స్ఫటిక శాస్త్ర నిపుణుడు కొలంబియాకు పోయి 1951 లో చార్గాఫ్ నుండి డి. ఎన్. ఎ. సాంపిళ్లను తీసికొని, డి. ఎన్. ఏ. యొక్క ఎక్స్ కిరణ స్ఫటిక ఛాయాచిత్రాలను తీసివుంటాడు. ఈ ఛాయా చిత్రాలు ప్రాతిపదికగా డి. ఎన్. ఏ యొక్క నిర్మాణ నమూనాను తయారుచేయుట వీరి లక్ష్యం. వీరికి చార్గాఫ్ "ఎ-టి" మరియు "జి-సి" రకాల ద్వైన్యూక్లియోటైడ్ ల నిర్మాణం గురించి చెబుతాడు.

1953 లో పైనిద్దరు శాస్త్రజ్ఞులు "నేచర్" అనే సుప్రసిద్ధ పత్రికలో "న్యూక్లియిక్ ఆమ్లముల నిర్మాణం" అనే శీర్షికతో ఒక పరిశోధనా పత్రం ప్రచురిస్తారు. అందులో తాము చార్గాఫ్ నుండి పొందిన సలహాలకు కృతజ్ఞత ఈలేదు. 1952 లో చార్గాఫ్ ప్రచురించిన పత్రాన్ని మాత్రం ఉదాహరిస్తారు. ఆయనవే అయిన 1950-51 నాటి విశేష పరిశోధనా పత్రాల వూసెత్తరు. వాట్సను, క్రిక్‌లు డి.ఎన్.ఏ కు ప్రతిపాదించిన స్వరూపంను వాట్సన్-క్రిక్ నమూనా అని పేరు. దీనిని "డబుల్-హెలికల్" అంటారు. దీనికి నేను "ద్వైవలంబచక్రం" అని పేరు పెట్టినాను. చిత్రం. 2 చూడండి. మెలికలుతిరిగి, ఒకదానికొకటి నిలువున పురివేసికొనిపోయిన రెండు పోచలను (ఇవి డీ ఆక్సీరైబోస్ + ఫాస్ఫారికామ్ల నిర్మితాలు), "ఎ-టి", "జి-సి" రకం నత్రజని క్షారాల అణువులు నిచ్చెన మెట్లవలె అడ్డంగా అతికి, ఆ స్వరూపమంతా సోపానవలయం మాదిరి కనిపింపజేసే నమూనా ఇది. ఈ పరిశోధనకు వాట్సన్, క్రిక్, విల్‌కిన్సులకు 1962 లో వైద్య - జీవప్రక్రియ శాస్త్రాలకిచ్చే నోబెల్ బహుమానం ఇవ్వబడింది. చార్గాఫ్‌కు రావలసిన భాగస్వామ్యం రాలేదు. ఇదే ఈ వ్యాసాదిలో నేను సూచించిన "జరుగవలసియుండియూ జరుగని" మహత్తర సంఘటన ! ఈ విజయంలో చార్గాఫ్ పాత్ర ఏమి? ఎంత? అనే ప్రశ్నలకు ఆయనే ఒక ఐతిహ్యం చెబుతాడు. ప్రాచీనకాలంలోని అద్భుతాలలో ఒకటగు ఒక గ్రీకుదేవత మందిరం క్రీ.పూ. 356 లో కాలిపోతుంది. ఒకానొకడు తానే దాన్ని కాల్చినానని ఒప్పుకొంటాడు. ఎందుకాపని చేసినావని న్యాయమూర్తు లడిగితే, తన పేరు శాశ్వతంగా నిలచిపోవలెనని ఆ విధంగా చేసినానని చెబుతాడు. వానిపేరెంత అణగద్రొక్కవలెనని ప్రయత్నించినా, చరిత్రలో బయటకి పొక్కుతుంది.

చిత్రం 0-2



డి ఆక్సీరైబోన్యూక్లియిక్ ఆమ్లం "త్రి"
(వాట్సన్-క్రిక్ నమూనా)

వాని పేరు హీరోస్ట్రాటస్. ఈ హీరోస్ట్రాటస్ గనుక దేవాలయ కాల్చినందుకు శాశ్వతత్వం సంపాదించివుంటే, వానికి అగ్గిపెట్టె ఇచ్చిన మనిషినీ మరువరాదు. ఆ మనిషిని నేను అంటాడు చార్గాఫ్

ఇచట ఒక ఆసక్తికర విషయం. బ్రిటానికా విజ్ఞాన సర్వస్వ చార్గాఫ్ పేరైనా ఎత్తదు. వాట్సనుకు "హఠాత్తుగా" భావం తట్టిం అని వ్రాసింది. అమెరికానా విజ్ఞానసర్వస్వం మాత్రం చార్గాఫ్ ప్రపాదించిన నత్రజనిక్షారాల "ద్వంద్వీకరణం" మూలకంగానే వాట్సన్ క్రిక్ నమూనాకు దారితీసిందని స్పష్టంగా వ్రాసింది.

కొందరు శ్రేయోభిలాషులు చార్గాఫ్‌ను అడిగిరట - ఇది అయ వ్రాసినాడు- నీవే డబుల్ హెలిక్స్ నమూనాను ఎందుకు ప్రతిపాదిం లేదూ అని. నేనూ ఇంకొక ఎక్స్‌రే స్ఫటికశాస్త్ర నిపుణుడూ కలి

ఒకటి-రెండేళ్ల పరిశోధించి యున్నట్లయితే, ఆపని నేనూ చేయగలిగి వుండేవాడను అంటాడు చార్గాఫ్. ఒకవేళకు కనిపెట్టి యుండినా, ఆ నమూనాను జీవశాస్త్రీయ నిరక్షరాస్యుల సంతకానికి రెండు ఛేదకరేఖల (X గుర్తు) సంకేతస్థాయికి కొంపోయివుండేవారంకాము అంటాడు. డబుల్ హెలిక్సును చార్గాఫ్ నమ్మడు. డి.ఎస్.ఏ. అంత సరళస్వరూపం కాదని ఈయనమతం. తనది జటిలీకరణ తత్వమని చార్గాఫ్ వేరొకచోట చెప్పికొన్నాడు. ఏమైనా చార్గాఫ్ ఇప్పటికి ఓడిపోయినాడు. ముఖ్య సంగ్రామాలలో ఓడిపోవడమనేదిలేదు. విజేతలెవరో భావితరం ప్రకటి స్తుందంటాడు చార్గాఫ్. గ్రిం సోదరుల జానపద కథల్లోని పోరడు, అడవిలో కన్పడిన మొదటి మృగాన్నే అనుసరించినట్లు, డాక్టరేటుపట్టం అందుకొన్నతర్వాత, మొట్టమొదట తారసపడ్డ "పరిశోధన"ను అనుసరి స్తాడు మన చార్గాఫ్. చార్గాఫ్ కంటే గొప్ప మేధావులు, ఆయనకంటే ఎక్కువ అపజయాలు పొందివుండవచ్చు. చార్గాఫ్ వ్రాసింది కేవలం ఆత్మకథ కాదు. వాసిలిస్ విట్రొవాక్సిస్ (ఇతః పూర్వం మనదేశంలో గ్రీసు రాయబారి, (గ్రీకుమహాకవి) అన్నట్లు, రచయిత "నేను" అన్నప్పుడు "నీవు", "మనం", "విశ్వం"ను కూడా నిర్దేశించివుంటాడు. పాల్ ఎలార్డ్ అన్నట్లు ఆత్మహరిజం, విశ్వహరిజంలో కలిసిపోతుంది చార్గాఫ్ తనను గురించేకాక, తనవలె ఇప్పుడోడిపోయి భవిష్యత్తులో విజేతలుగా ప్రకటింపబడే శాస్త్రజ్ఞుల గురించి వ్రాస్తున్నాడు. అందుకే చార్గాఫ్ ఒకవ్యక్తికాదు. ఒకప్రతినిధి, ఒక ప్రతీక ఇంతగా నేను వ్రాసిందందుకే.

చార్గాఫ్ కేవలం జీవరసాయన శాస్త్రజ్ఞుడుకాదు. వివిధకళల్లో ఇతిహాసాల్లో ఆయన చేసే చర్చా చంక్రమణం అద్భుతం. ఆయన గ్రంథం చదువుతుంటే వాల్టర్‌పేటరు "పునరుజ్జీవనం" అనే గ్రంథాన్ని రస్కిన్ "వెనిస్‌రాళ్ళు" అనే గ్రంథాన్ని చదివినట్లుంటుంది. ఆయన శైలి, పద్యవచనం వలెఉంటుంది. వాక్యాలు నర్మగర్భంగా, అర్థవంతగా వ్యంగ్యవైభవంగా ఉంటాయి. ఇప్పుడు చార్గాఫ్ గ్రంథంలోని కొన్ని వాక్యాల తెలుగనువాదం ఇస్తున్నాను.

చార్గాఫ్ చతురోక్తులు

బేకన్ వ్రాసిన "నోవం ఆర్గానం"• లో కంటే, నీషే వ్రాసిన జరథుష్ట్ర ఇత్యువాచ"* లో కంటే టాల్స్టాయ్ వ్రాసిన ఒకపిట్ట కతలో ఎక్కువ వివేకం ఉంటుంది.

• (శాస్త్రపరిశోధనకు) "నూతన సాధనం" అనే గ్రంథం.

* క్లిష్టార్థక తాత్విక గ్రంథం.

బ్రిటిష్‌వారి డి. ఎన్. ఏల నుండి కొన్ని పూర్వీనులు (అంగారక నత్రజనిక్షారములు) నష్టమైనందువల్ల ఇంగ్లీషుభాషలోని గౌరవప్రద మైన సర్వనామం "దౌ" అంతరించింది. **

అన్నిభాషలూ మూల్యం కలవే, మారకపు విలువలలో భేద ముంటుంది.

భాష వరం వంటిది. డార్విన్ పరిణామ సిద్ధాంతప్రకారం విశ దీకరింపలేము. తోకలు మరలా పెరుగక మునుపే ఈ వరాన్ని సద్విని యోగ పర్చుకోవలెను. ••

మనిషి చెట్టువంటివాడు. మనగడ్డమీదనుండి పెకలించివేస్తే ఎండిపోతాము.

స్వర్గం ఒకటే కాని నరకాలు చాలా.

భయం కలిగించే అమెరికాలో ఎచ్చటయినా నవ్వువినిపించే వైపు చూస్తే, అవి నల్లముఖాలై వుంటాయి. •••

మనం భాషకు యజమానులంగాము ; సేవకులం.

అదృష్టం తర్వాత, మొదట గోతిలో పడవలెకదా !

జ్ఞానజ్యోతి, అజ్ఞానాంధకారంల మధ్య నిరంతిరం ప్రతికంపించ డమే శాస్త్రజునికిచ్చిన వరం.

ఇటీవల, ప్రకృతిలోని చాలా వింతలు కనుగొనబడినాయి. మందమతులు కనుగొనడానికే ప్రకృతి వీనిని ఉద్దేశించింది.

జన్మ ఒకేతీరు, మరణం పెక్కుతీరులు.

ఈ మహానగరాలలో ఏ భాగం మిగిలిపోతుందంటే వాని గుండా దూసకపోయిన భాగం - గాలి !

ఇదే శాస్త్రజ్ఞుని సంకట పరిస్థితి, అతడు భవిష్యత్తుకు ఇచ్చేది ప్రయోగం - అనుభవం కాదు.

శాస్త్రీయ పరిశోధనాఫలితం చచ్చిపుట్టుతుంది.

శాస్త్రంలో మహోన్నత విషయాలకు (అగ్నిని కనిపెట్టుట, చక్రాన్ని నిర్మించుట, కాలం, శక్తి అంటే ఏమి అని చెప్పుట) మూల పురుషుల పేర్లు మనకు తెలియవు.

** భాషాశైథిల్యంపైని విసురు

•• భాషను సదపగాహన కొరకుపయోగించుకోకపోతే మనిషి మర్కటమవుతాడని అర్థం.

••• నీ గ్రోల ఉల్లాసవైఖరీ, తెల్లవాళ్ల ఉడుకుబోతు తనం, ఏడ్పుగొట్టుతనంకు తార్కాణ.

విద్యార్థులిప్పుడు ప్రకృతిని అధ్యయనం చేయరు, నమూనాలను కట్టుతారు. *

శాస్త్రంలో అలెగ్జాండరుల కంటే, గార్డియన్ గ్రంధులే ఎక్కువ ఒక గార్డియన్ గ్రంధిని విప్పితే, రెండు తలెత్తుతాయి.

మనకు మనగురించి కంటే ఎశ్చెరీషియాకోలై □ గురించే ఎక్కువ తెలుసు.

ఇతర మంచి విషయాలలో వలెనే, పరిసరముల విషయంలో కూడా, అవిక్షీణించేందుకు మొదలు పెట్టినప్పుడు, వానినిగుర్తించినాము.

శాస్త్రంలో విజయం అంటే ఏమి? బహుమతులు బిరుదులు, సత్కారాలూ, ధనమా? కొందరు, కీర్తి, పేరు శాశ్వతంగా ఉండద మంటారు? శాశ్వతత్వానికి హద్దెచట? తాను కన్నుమూయకముందే ప్రొఫెసరు ఓజిమాండియాస్ హాస్యాస్పదుడుగ మారే ప్రమాదముంది సుమీ. ‡

నేను చూచినవేలాది శాస్త్రజ్ఞనామధారులలో ఇరవై లేక ముప్పయి మందికి మాత్రమే ఆ పేరును అనుమతిస్తాను. ఆ ఇరవై ముప్పయిమందిలో నన్ను చేర్చుకొంటానోలేదో చెప్పలేను.

శాస్త్రంలో అభివృద్ధి అంటే ఏమి? మూడు థర్మోడైనమిక్ సూత్రాలకంటే, ఆరుంటే అభివృద్ధియా ?

కీలుబొమ్మ ఎట్లు పనిచేస్తుందో పసిపిల్లవాడు తెలుసుకొన్నప్పుడు ఆ కీలుబొమ్మ మరి వుండదు.

మంచిదానిని మితిమీరింది అని అనవచ్చునో లేదో తెలియదు కాని, శాస్త్రప్రగతిలోని "అతిని కొంత తగ్గిస్తే మేలని నాకనిపిస్తుంది.

షేక్సుపియరు లేకుంటే "టైమన్ ఆఫ్ ఆథెన్స్" • ఉండదు. శాస్త్రరంగంలో ఎన్ని పరిశోధనలకీ షరతును చెప్పగలం? ఈనాడు 'ఎ' చేసింది, రేపు 'బి', 'సి' లు చేయగలరు.

మనిషి శాస్త్రాన్నిగాక, శాస్త్రం మనిషిని తీర్చిదిద్దుతుంది.

అమెరికా విశ్వవిద్యాలయాలు యూరపు దేశాల వలసలు.

లైసెన్సు లేకుండా జీవరసాయన శాస్త్రాన్ని ప్రాక్టీసు చేయడాన్నే అణువిక జీవశాస్త్రం అంటారు ••

ఈ భూమి మనకు చేబదులుగా మాత్రమే ఇవ్వబడింది.

ఒకానొకప్పుడు హృదయం, హృదయంతో మాట్లాడేది ఇప్పుడు కంప్యూటరు, కంప్యూటరుతో మాట్లాడుతుంది.

నేటి గొప్ప వైద్యులంతా తిత్తికట్టు దినుసు అమ్మకంగాళ్ళుగా నా అద్దంలో కనపడతారు.

శాస్త్రం అంటే ప్రకృతిలో తెలుసుకొన గలిగిన సత్యాలను తెలిసికొన ప్రయత్నించుట, దేవుని ఉనికీ, ఆత్మబరువూ నిర్ధారించడం దాని పనికాదు.

శాస్త్రప్రగతి పంచవర్ష ప్రణాళికా లక్ష్యాలబట్టిసాగదు.

దేశం బాతువులచే రక్షింపబడదు- అ బాతులకు పి ఎచ్. డి. పట్టంవుండినా.

మైకేల్ ఏంజిలో చిత్రం "మానవసృష్టి" లో, సృష్టికర్త వ్రేలికీ, ఆదిమానవుడు ఆదాము వ్రేలికీ గుర్తించగలిగినంత చిన్న ఎడముంది. ఈ ఎడమునే "అనంతం" అని నేనంటాను.

గొప్ప శాస్త్రీయ ఆలోచనా ధోరణిలో, హేతుబద్ధంకానట్టి, స్వాప్నికమయినట్టి గుణం వుంటుంది.

కళాతములోని అంతస్సత్యాలను తెలుపుతాయి. శాస్త్రాలు ప్రకృతిలోని యథార్థాలను తెలుపుతాయి.

గెలుపోటములు, బాగోగులు ఒక్కటే కానక్కరలేదు.

---

* డబుల్ హెలిక్స్ పిచ్చి యిప్పటి పరిశోధనా ధోరణిపై విసురు.

□ ఎశ్చెరీషియాకోలై అనేది మనిషి పెద్దప్రేగులలో వుండే ఏకాణు జీవి (బాక్టీరియా) నేడు అణువిక జీవశాస్త్రంలో ప్రయోగాలన్నీ దీని మీదనే జరుగుతున్నాయి.

‡ "ఓజిమాండియాస్" అనేది షెల్లీ వ్రాసిన చిన్నపద్యం. ఇందులో ఏకచ్ఛత్రాధిపతిగా, సర్వాధికారిగా వెలసిన ఒక ప్రాచీన ప్రభు శిలావిగ్రహం ఒకానొక నిర్మానుష్య ఎడారిలో క్రిందపడి వుంటుంది. తల, మొండెము విడిపోయి వేర్వేరుగా పడివుంటాయి. అచటనే ఒక శిలాశాసనం "ఓరీ హీననరులారా ! ఈ చండ ప్రచండ ప్రతాపుని... " ఇత్యాదిగ చెక్కబడి వుంటుంది. ప్రాచీన ఈజిప్టు చక్రవర్తి రామెసెస్‌కు ప్రతీక అంటారు (తి).

• నాటకం.

•• నేడు అణువిక జీవశాస్త్రం (మాలిక్యులర్ బయాలజీ) అధ్యయనం పెరిగిపోవడంమీద విసురు.

మన పూర్వులు చిత్రించిన రాక్షసుల్లా, గోడలమీదినుండి దిగి మనమధ్య తిరుగుతున్నారు.

అమెరికాలో పేదరికాన్ని, సిగ్గుచేటుగా, నేరంగా భావిస్తారు. ఇదేమికసుమాలపు తత్వం అని నేననుకుంటూ వుంటాను. దోస్త విస్కీ టాల్‌స్టాయి, నట్‌హంసన్ రచనలు నాకు వేరేవిలువలు బోధించినాయి.

ఒకదేశ నాగరికతాస్థాయిని, ఆ దేశస్థులు, బాలలు వృద్ధులు, ఉపాధ్యాయులపట్ల ఎట్లు నడచుకుంటారనే దానిపై నిర్ణయించవచ్చు. ఈ మూడు సందర్భాల్లోనూ అమెరికా విఫలమయింది. ఆ మాటకువస్తే ఒకటర్కి దేశస్థుడు • మేఘ - వానికి నీటిగొట్టముల బిగించుట.

మోటారు మరమ్మతు చేయుట అంతా బాగారాకున్నాకూడా చార్గాఫ్ పుస్తకప్రకరణాలకిచ్చే శీర్షికలు చాలా తమాషాగా ఉంటాయి. కొన్ని ఉదాహరణాలు : తెల్లనెత్తురు-ఎర్రమంచు, సంతోష కుటుంబం, సంతాప సభ్యులు, అసౌకర్యంలో వుండే లాభం, కాంతి తమస్సులో, ఆదరే తక్కెడ, నాటెం మూడవ ప్రక్క, హేతుజ్వరం.


• తెల్లవారికి టర్కీ దేశస్థులు అనాగరికతకూ, క్రౌర్యానికి ప్రతీక (తి.)

ఎంత మార్పు!!

శ్రీ సూర్యదేవర రవికుమార్

నిన్న మొన్నటివరకు
మలయ మారుత స్పర్శకే
జలజల వర్షించేది మేఘం
ఇప్పుడు
పెనుగాలి పిడుగుల ఫెళఫెళలు లేనిదే
పిల్లమబ్బైనా కురియటంలేదు
ఎంతమార్పు! ఎంతమార్పు!!
ప్రకృతిలోనే కాదు మానవ
ప్రకృతిలో కూడా
కొట్టి చంపకుండా
కొల్లగొట్టటం లేదు
రోగి రక్తతర్పణం లేనిదే
రోగం తగ్గటం లేదు
కరుణ, ప్రేమ, అనురాగాలనుకాక
కనక వర్షాన్నే
కాంక్షిస్తోంది మనసు
ఎంతమార్పు! ఎంతమార్పు!!

నిధి



గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

ఖణ్...ఖణ్

రెండోసారి కూడా 'ఖణ్' శబ్దం వచ్చేసరికి పలుగు ఇహ దింపటం మానేసి దాన్ని చటుక్కున పక్కకి పడేసాడు రామేశం. చక చకా, అంతవరకూ తను తవ్విన మట్టిని, గోతిలోంచి పైకి తట్టతో ఎత్తి పోసేసాడు. నాలుగైదు నిముషాలకి బయట పడింది — కిలుము పట్టిన ఇత్తడిపెట్టె - సుమారు అడుగు వెడల్పూ, మూడడుగుల పొడుగూ అంతే వెడల్పాగల ఇత్తడిపెట్టె దానిమూత బిగిసిపోయింది. ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ పొంగిపోయాడు రామేశం. అతి కష్టంమీ(ద) ఆ బరువు పెట్టెని గోతిలోంచి పైకెక్కించాడు.

అతని భార్య ఊళ్ళో లేదు. పిల్లలు పక్కగదిలో నిద్రపోతున్నారు. డెబ్బయేళ్ల విధవతల్లి వాకిట్లో వసారాలో నిద్రపోతోంది. అర్ధ రాత్రి సుమారు రెండుగంటల సమయం.

రామేశం హడావిడిగా వెళ్ళి తల్లిని లేపాడు. "అమ్మా అమ్మా నిక్షేపమే, నిక్షేపం! ... నిద్రపట్టక వంటింటి గొయ్యి వెడల్పు చేద్దామని పలుగు పుచ్చుకొనేసరికి ఇత్తడి పెట్టె బయట పడింది. లేవ్వే,లే!"

తల్లి లచ్చమ్మ కంగారు పడుతూ మెలకువలోకొచ్చింది. అంది
యటి పడిందా నాయనా ! ఇన్నాళ్టికి మన దరిద్రం తీరింది. మీ
యనగారు చెబుతూండేవారు, ఈ ఆవరణలో ఎక్కడో నిధి ఉందని
రి తండ్రితాతలు అనుకునేవారని ! ... పద"

రామేశం వీధి తలుపు గడియల్నీ దొడ్డి తలుపు గడియల్ని ఓ
సారి చూసొచ్చాడు. వంటింట్లో పాతగోడల్ని పడగొట్టి కొత్తగోడల
పునాదుల కోసం ఆ ముందు రోజంతా ఉప్పరవాళ్ళు అక్కడ తవ్వి
పోసారు. అంచేత తాత్కాలికంగా వంటగదిలోని కరెంటు తీగెల్ని
తీసేసాడు రామేశం. ఇప్పుడే పెట్టెని పరిశోధించటానికి లాంతరు
కాంతి చాలదు. కనక రామేశం, తన పడగ్గదిలో ప్లగ్ తగిలించి,
కేబిల్ లైటు తీసికెళ్ళి గోతి పక్కన పెట్టుకున్నాడు.

లచ్చమ్మ పెట్టెపక్కకొచ్చి కూర్చుంది. అంది, ఇత్తడి పెట్టా!
ఇంకేవయినా మిగిలిపోయాయేమో చూశావురా !"

రామేశం మెరుపు వేగంతో గోతిలోకి దూకాడు. గునపంతో
ఆ చుట్టుపక్కల వీలైనంతమేర గబగబా లోతుగా పోట్లేసిచూశాడు.
'ఇంకేవీలేవ్" అంటూ పైకొచ్చేశాడు.

గున్రాయితో ఆ పెట్టె మూతని అన్ని పక్కలా నెమ్మది
నెమ్మదిగా కొట్టాడు. కాస్సేపటికి మూత తెరుచుకుంది. దాన్ని పైకెత్త
గానే గుప్పుమని విచిత్రమైన వాసన కొట్టింది. ఏవో మూలికల కట్ట
కనబడింది. దానికింద పాతకాలపు రాగి ముద్రఉన్న కాగితం మీద
తెలుగులో రాసిన ఉత్తరం ఉంది. రామేశం "అమ్మా ! ఏదో ఉత్త
రమే !...గ్రాంధికంలో ఉన్నట్టుంది

మామూలు తెలుగులో చదువుతానూ..." అని చదవసాగాడు.

• • •

"శ్రీరామ — క్రీస్తుశకం 1890 వ సంవత్సరం విజయదశమి
దినాన నేనీ ఉత్తరం రాస్తున్నాను. గోదావరికివచ్చిన వరద కారణంగా
నా తండ్రి తాతలనాటి స్వస్థలమైన ద్రాక్షారామం నీటిలో మునిగి
పోయింది. నాకున్న కొద్ది ఆస్తీ ఆ నీళ్లలో కొట్టుకుపోయింది. జీవిక
కోసం నేను ఇక్కడికి రాక తప్పలేదు. సబ్ కలెక్టరు గారైన బేలరు
దొరవారు స్థాపించిన స్కూల్లో పండితుడిగా నాకు ఉద్యోగం దొరికింది.
వశిష్ఠ గోదావరీ తీరాన ఉన్న ఈ నరసాపురమే నాకిక స్వస్థలం.

అయితే నా మనస్సులోని ఆవేదన వర్ణనాతీతం ! నేను
పుట్టింది వేదపండిత వంశంలో. చదివింది వేదవిద్య. ప్రజల్లో
ధర్మానుష్ఠానాగ్ని ప్రజ్వరిల్లుతూండేట్లు చూడటం నా విధి. కానీ ఆంగ్లేయ
విద్యాసక్తులైన శిష్యుల్ని ఇప్పుడు నేను తయారుచేస్తున్నాను. ఈ
స్కూల్లో మెట్రిక్యులేషన్ విద్య చదివితేనే సర్కారువారి ఉద్యోగం
వస్తుందిట. ఈ చదువుకే లోకంలో గౌరవం అంతకంతకూ హెచ్చు
తోంది. చదివినట్టు రాయని, రాసినట్టు చదవని ఈ ఆంగ్లభాషలోనే
ఇక్కడ విద్యాబోధన జరుగుతోంది. ఎట్లాగైనా తంటాలుపడి దాన్ని
నేర్చుకోవటమే పరమావధిగా విద్యార్థులూ తల్లితండ్రులూ భావిస్తున్నారు.

భాష మాత్రానికే నేను బాధపడేవాణ్ణికాదు — రెండు మూడు
వందల ఏళ్ల కిందట అరబ్బీ, పారశీ పదాలు ఎన్ని వచ్చి తెలుగులో
కలవలేదు కనక ! కానీ ఈ ఆంగ్లభాష ద్వారా నేర్చుకొన్న విద్య
మన దేశీయ సాంప్రదాయాలపట్ల ఏహ్యభావాన్ని ప్రబలింపచేస్తోంది.
ఆంగ్లేయ నాగరికతపట్ల గౌరవాన్ని వృద్ధిచేస్తోంది. ఈ వాతావరణాన్ని
ఉపయోగించుకుని క్రైస్తవం వ్యాపిస్తోంది. అసలు క్రైస్తవం వ్యాప్తి
కోసమే ఈ విద్యను ఆంగ్లేయులు రుద్దుతున్నారేమో ననిపిస్తోంది.
ఇదేపరిస్థితి కొనసాగితే కొన్నాళ్లకి రామాయణ భారత భాగవతాదులూ,
వేదశాస్త్రాలూ మనకిహ మిగలవేమోనన్న భయం నన్ను పీడిస్తోంది.

ఎవరో వివేకానందుడట. గాంగాతీరపు సన్యాసి అట. సనాతన
ధర్మాన్ని ఆధునిక పద్ధతిలో బోధిస్తున్నాడట. కానీ కొందరు ఛాందసులు
ఆయన హెచ్చరికను అపహేళన చేస్తున్నారట. బ్రాహ్మణ, క్షత్రియ
కులాల ఆధిక్యతను అంగీకరించని ఏ సిద్ధాంతాన్నీ వాళ్లు ఆమోదించరట.
ఢిల్లీశ్వరుడంటే జగదీశ్వరుడనే వాళ్ల వాదనట! ఆహా, ఎట్టి దుర్దినాలు!
మహారాష్ట్ర విజయనగర సామ్రాజ్యాలు తుడిచిపెట్టుకునిపోయింది ఈ
పాశ్చాత్యమూకలవల్ల కాదా ! వర్ణ వ్యవస్థలో ద్వేషాన్ని చిలికి, దాన్ని
కులవ్యవస్థగా మార్చి విషవృక్షంగా పెంచి పోషించింది ఈ ఢిల్లీశ్వరులు
— కాదు, రాక్షసేశ్వరులు — కాదా ? నాకా వివేకానంద
పరివ్రాజకుడి దర్శనమయితే ఎంత బాగుండును ?

అసలెప్పటికైనా నా దేశం పరాయిపాలన నించి విముక్తమవు
తుందా ? ఈ దోపిడీరాజ్యం నశించి ఎప్పటికైనా రామరాజ్యం
ఇక్కడ విలసిల్లుతుందా? — విలసిల్లుతుందనీ, ప్రపంచానికంతకీ
మార్గదర్శమవుతుందనీ ఏదో శక్తి నాలో నినదిస్తోంది.

ఇంత తెలిసినా నా కొడుకును నేనిప్పుడు ఈ హూణవిద్య
లోనే ప్రవేశపెట్టక తప్పలేదు. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'
కదా ! కానీ, నా వంశంలోంచి ఎవరో ఒకరు తిరిగి సనాతన ధర్మ
రక్షణ కోసం కంకణం కట్టుకుంటారని నాకు తెలుసు ! ఎందుకంటే,
మహాతపస్సంపన్నులైన ఋషుల రక్తం నాలో ప్రవహిస్తోంది కనక!
ఏవేవో క్షుద్రమహత్తులు చూపటం కోసం కాక, విశ్వకల్యాణంకోసం
ఆ ఋషులు తమ తపస్సును ధారపోసారు కనక!

ఈ ఆశతోనే, ద్రాక్షారామంలో వరదల్లో నా పెరట్లో బయట పడిన ఈ నిధిని భద్రంగా మోసుకొచ్చాను. నా పూర్వీకులెవ్వరో రాగిరేకుల మీద ఈ నిధినిగుర్చి శాసనాలు రాసి నిధితోపాటు ఈ పెట్టెలోనే పెట్టుంచారు. ప్రాకృతమూ, ఇటీవలి తెలుగూ సంస్కృతం లిపులూ తెలిసిన పండితులచేత నేను ఆ శాసనాలని ఈనాటి తెలుగు లోకి అనువాదం చేయించాను. ఈ కాగితాలను కూడా నేను ఈ పెట్టె! లోనే పెడుతున్నాను.

ఈ నిథిని నేను వాడుకోలేను. నా కుమారుడికి అప్పచెప్పలేను ఎందుకంటే, దొరలకు తెలిస్తే దీన్ని సర్కారు లెక్కల్లో దఖలు చేస్తారు. ఆతర్వాత తమ దేశానికి తరలించుకు పోతారు. అట్లా కోన సీమలో ఎన్నో జరిగాయి. కనక ఈ పెట్టెను నేను కూడా భూస్థాపితం చేస్తున్నాను. నా పూర్వీకుల ఆకాంక్ష మేరకు ఈ నిధిని నేను ఉపయో గించుకోలేక పోతున్నందుకు నాకెంతో క్షోభగా ఉంది.

ఈ నిధి సన్మార్గుల చేతిలో మాత్రమే పడేటట్టూ, నా జాతి సంపదాభివృద్ధికి తోడ్పడేట్టూ, భగవంతుడు అనుగ్రహించుగాక ! —తథాస్తు—ఓంతత్సత్.

ఇట్లు
భారద్వాజ గోత్రీకుడు - శివప్రసాదశాస్త్రి

◆ ◆ ◆

రామేశం మొహంలో రంగులు మారాయి "ఏమిటే అమ్మా ఇదంతా ! ఎవరీయన ? ... ఉత్తరాలు తప్ప ఇక్కడేమీ కన్పించటం లేదే.,. ఇదుగోనేవ్, ఈకింద ఇంకో అర ఉంది. తియ్యనా... అబ్బ రావట్లేదు... మళ్లీ గుండ్రాయితో చావగొట్టాలి కాబోలు..."

కొంగుతో కళ్లు ఒత్తుకుంటున్న లచ్చమ్మ చటుక్కున అంది: "ఆగాగరా నాయనా, తొందరపడకు. శివప్రసాదశాస్త్రిగారు నీ ముత్తాత, ఆయన గొప్పదనాన్ని గురించి చాలా కథలున్నాయి... సర్లే పెట్టె తర్వాత బద్దలు కొడుదువుగాని, ఆ శాసనాలేవో చదువు ముందర!" హడావిడిగా రామేశం, పొడుగు మడతతో ఉన్న ఇంకోకాగితం తీసాడు చదివాడు.

◆ ◆ ◆

'భారద్వాజ గోత్రుడను, చాముండ ఉపాసకుడను, భృంగీశ్వర ఘనాపాఠిని అయిన నేను ఈశాసనం రాస్తున్నాను. -ఇటీవల ఈ ప్రాంతంలో మ్లేచ్ఛుల సంచలనం ఎక్కువయింది. శాంతి నశించటమే కాక, అశాంతి అనంతమయింది. సుమారు డెబ్బయ్యేళ్లక్రితం శ్రీకృష్ణ దేవరాయలు ప్రతాపరుద్ర గజపతినించి ఈప్రాంతాన్ని గెలిచాడట. ఆ యుద్ధం సైన్యానికి సైన్యానికి మధ్య జరిగిందేకాని, ప్రజల ఆచార వ్యవహారాలనూ, ధర్మాలనూ చికాకుపరచలేదు. ప్రజలు బానిసలుగా అమ్ముడుపోలేదు. కారణం, ఆరాజులు సనాతనధర్మానుయాయులు కావటం. కాగా, శ్రీకృష్ణదేవరాయల పాలనలో ప్రజలు సుఖపడ్డారట. అదృష్టవంతులు !

ఆ తర్వాత గజపతిని ఓడించి కులీకుతుబ్‌షా, అతన్ని చంపి అతని కొడుకూ, తర్వాత అతని కొడుకూ, ఇట్లా ఎందరో ఈ రాజ మహేంద్రవరాన్ని పాలించారు. నేను పుట్టాక అబ్దుల్లా కుతుబ్ షా, అబుల్ హాసన్ తానీషాలు పాలించారు. వీళ్ల పూర్వీకులు వాళ్ళల్లో వాళ్లే దేవరపల్లి వద్దా, ధవళేశ్వరం వద్దా భయంకర యుద్ధాలు చేసు కొన్నారట. వీళ్ళవన్నీ యుద్ధకండూతిగల రాక్షస వంశాలు!

ఈ వంశాలకే చెందిన ఢిల్లీచక్రవర్తి ఔరంగజేబు పాలనలోకి ఇటీవల గోల్కొండ, రాజమహేంద్రవరాలు వెళ్ళాయని తెలుస్తోంది. ఈ ఔరంగజేబుకు అసలు పూర్వీకులు ఎక్కడివారో ఎవ్వరికి తెలీదు. సనాతన ధర్ములు కారు. కనీసం బౌద్ధులూ జైనులూ అయినా కారు. విగ్రహారాధన వీళ్ళకి గిట్టదు. ఈ చక్రవర్తిసైన్యాలు వచ్చి దేవాలయా లను ధ్వంసం చేస్తున్నాయి. విగ్రహాల అవయవాలను విరగ్గొట్టి వికృతం చేస్తున్నాయి. గురుకులాల్లోకి చొచ్చుకొచ్చి గ్రంథాలను తగల బెడుతున్నాయి. ఆ సైనికులు స్త్రీలను అవమానపరుస్తున్నారు. ఈ అరాచకానికి భయపడి ఉయ్యాలలో పసిపాపలకు ఉయ్యాలలోనే తాళి కట్టిస్తున్నారు ప్రజలు. వాళ్ళమతంలోకి మారకపోతే యజ్ఞోపవీతాలను తెంచి శిఖలకు తెగ్గోస్తున్నారు. బలవంతంగా గోమాంసం తినిపిస్తున్నారు. ఇట్లా భ్రష్టం చేయబడ్డవాళ్ళని ఇతరులు వెలివేస్తున్నారు. వాళ్లు గ్రామా లకు దూరంగా ఒంటరి బ్రతుకు వెళ్లదీయవలసి వస్తోంది. పంచమకుల మనే పేరుతో అప్పడే ఇంకో కులం పుట్టింది కూడా.

అయ్యయ్యో ! ఇంకెక్కడి సనాతన ధర్మం ! వీళ్ళు నరులు కారు, నరరూపరాక్షసులు! నా తండ్రితాతల దగ్గర నేను విన్నదాన్ని బట్టి ప్రజలను బానిసలుగా చెయ్యటమనేది ఈ మ్లేచ్ఛులు ప్రవేశ పెట్టిందేనట!

ఎనభయ్యేళ్ళ పండు ముదుసలి నా తండ్రి వేద వేదాంగాల్లోనూ అనేక శాస్త్రాల్లోనూ అఖండ పాండిత్యప్రకర్ష గల మహా తపస్వి. నేటికి నెల దినాలనాడు అర్ధరాత్రివేళ హఠాత్తుగా నన్ను లేపి ఇట్లా అన్నాడు: "నాయనా భృంగీ శ్రద్ధగా విను: నాకు కాలం సమీపించింది. మహానుభావులు మన వంశీకులెవ్వరో తమ జీవితకాలం అంతా శ్రమించి కూడబెట్టి దాచిన నిధి అదృష్టవశాత్తూ నాకు దక్కింది. ఆ మేరు సముద్ర పర్యంతమూ సమస్త మానవాళినీ సుఖపెట్టగలగేటంతగా

తరగని నిధి అది. ఇటీవల నేను యాగకుండం కోసం నేల తవ్వుతూండగా బయటపడింది. సాంఖ్యాయన సోమయాజి అట — నా ముందు ఎన్నోతరంవాడో — ఆ నిధిని ఒక ఇత్తడి పెట్టెలో పెట్టి నిక్షిప్తంచేసి వెళ్లాడు. ఆ నిధి విలువ మొత్తాన్ని నేను అంచనా కట్టే లోపలే నేను గతిస్తున్నాను. ఇంక దాన్ని నీకు అప్పగిస్తున్నాను. నువు వేదవేత్తవు అవ్వగా చూడగలిగాను గానీ ఈ నిధిభోక్తవు అవ్వగా చూడలేకపోతున్నాను.

బాబూ, ఇంకొక్కమాట. సనాతన ధర్మాన్ని ద్వేషించే వాళ్లెవ్వరికీ ఈ నిధిలో భాగం పంచకు. అసలు వాళ్లెవ్వరికీ దీన్ని ఏమాత్రమూ అందనివ్వకు. ఏకారణంచేతనైనా నువ్వు దరిద్రుడివే అయితేకూడా లోభానికి పాల్పడి ఈ నిధిని అమ్మకు. అసలు ఎన్ని నిధులున్నప్పటికీ బ్రాహ్మణుడు నిత్యదరిద్రుడు నాయనా! బ్రాహ్మణుడికున్న ఒకే ఒక్క మహాసంపద వాడి యజ్ఞోపవీతమే! వాడి ధ్యేయం సనాతనధర్మ రక్షణం. భూమిమీదున్న మహానుభావుల్నీ గోవుల్నీ కాపాడుతూండమని నిత్యమూ భగవంతుని ప్రార్థిస్తూండటమే అతని విధి. కనక ఆ విధిని నిర్వర్తించుకుంటూ ఈ నిధిని రక్షించుకో. నీ తర్వాత ఈ మహాసంపదను నీ కింది తరాలవాళ్లకు కూడా అందివ్వు." అన్నాడు. అప్పటికప్పుడు యాగశాల నేలను తవ్వి ఈ ఇత్తడి పేటికను తీసి నాచేతికిచ్చాడు. వెంటనే కన్ను మూశాడు.

ఎవరో ఫౌజుదారట, సీమలను కొల్లగొట్టుకుంటూ సైన్యంతో వస్తున్నాడని తెలిసింది. వెంటనే రాజమహేంద్రవరం నించి ఈ ద్రాక్షారామానికి నా నివాసాన్ని మార్చాను. కానీ ఇక్కడా నాకు మనశ్శాంతి లేదు. నా ఇద్దరు కొడుకులూ వేద పరీక్ష నిమిత్తం మహారాష్ట్రంలోని తెలుంగువాడకు వెళ్లారు. అక్కడ శివాజీ అనే హిందూరాజు సనాతనధర్మ రక్షణకు కంకణం కట్టుకొన్నాడట. నేను అకాలమరణం పొందే నిమిత్తాలు ఎన్నో రాత్రివేళల్లో నాకు గోచరిస్తున్నాయి. నా తండ్రికి రెండో మాసికం పెట్టకుండానే నేను గతిస్తానేమో!

కనక ఈ నిధిని నేను ఈ ద్రాక్షారామంలో నాఇంట్లో పూజామందిరం నేలలో నిక్షిప్తంచేస్తున్నాను. ఈ నిధికి చాముండాదేవిని రక్షకురాలిగా నియమిస్తున్నాను. రెండువందల ఏండ్లవరకూ ఈమె ఇక్కడ ఉండేందుకు అవసరమైన జపహోమార్చనావిధిని సక్రమంగా నిన్నటితో పూర్తిచేయించాను.

ఇద మహో మమ శాసనమ్: ఈ రెండువందల ఏండ్లకాలంలోనూ సనాతన ధర్మవ్యతిరేకి ఎవడైనా ఈనిధిని స్పృశించినట్లైతే వాడు వారం రోజుల్లో మరణిస్తాడు. అతడి వంశం నిర్మూలన మవుతుంది. తథాస్తు! తథాస్తు, తథాస్తు!

ఏహి, ఏహి, చాముండే! ఆవహ! ఆవహ!
అత్ర స్థిరాసనం కురు!
విశ్వస్య కళ్యాణార్థం ఏతన్నిధి పరిరక్షణం కురు!
కురు, కురు స్వాహా! ఇదం న మమ!

లచ్చమ్మ మళ్లీ కళ్లజోడు తీసి కళ్లు తుడుచుకుంది. ఏనాడో తడారిపోయిన డెబ్భయ్యేళ్ల ఆమెకళ్లు ఇన్నాళ్లకి మళ్లీబాష్పాలు- ఉద్వేగంతో కూడిన ఆనందబాష్పాలు -రాలుస్తున్నాయి!

రామేశం అవాక్కయిపోయాడు. భయమూ, ఉద్వేగమూ సమ్మిళితమైన గొంతుతో "ఈ చాముండేశ్వరి నన్ను పట్టుకోదుగదా!" అన్నాడు,

లచ్చమ్మ నవ్వింది "ఎట్లాపుట్టావురా పిరికిసన్నాసీ ఈ వంశంలో!.... అదేదయినా జరిగుంటే నీ ముత్తాతగారు శివప్రసాదశాస్త్రి గారికే జరిగుండేది గదా! మరి... అక్కణ్ణించీ నేనెరుగుదును, నీ వంశం మలినంకాలేదు- నమ్మునాయనా!"

ఆ వృద్ధమాత నోటివెంట అవాచ్యం వచ్చినందుకు రామేశం కంగారు పడ్డాడు. "అహఁహ, అదికాదే నేనన్నది" అన్నాడు.

"సర్లె, నీ కుస్సందేహాలాపి, ఇంకాఏమున్నాయో తీసి చదువు." అంది లచ్చమ్మ.

రామేశం ఇంకో కాగితం తీసి చదవటం మొదలుపెట్టాడు.

'బృహస్పతి వంశజేన, భారద్వాజ గోత్రేణ, సాంఖ్యాయన సోమయాజినా శాలివాహనశకే, సప్తశతతమే, కాళయుక్తినామ్ని సంవత్సరే కార్తీకపౌర్ణమ్యాం విరచితమ్ శాసనమ్-మమ తు గర్వకారణమ్, మత్కృతం మద్వంశ పూర్వజైః సంఘసేవనమ్ నిస్వార్థమ్ ఆజీవిత పరిశ్రమయాత్తైః సంపాదితానిధిఃమే ప్రాప్తా పూర్వపుణ్యేన....'

లచ్చమ్మ చటుక్కున అంది "ఆ సంస్కృతం నాకే మర్థమవుతుందిరా! కావ్యాలు చదువుకొన్నవాడివి, తెలుగులోకి అనువాదం చేసి చదవరా నాయనా!"

"సర్లె" అన్నాడు రామేశం. తెలుగులో చెప్పటం మొదలుపెట్టాడు.

* * *

'శాలివాహనశకంలో ఏడువందల సంవత్సరమైన కాళయుక్తిలో కార్తీకపౌర్ణమినాడు బృహస్పతి వంశజుడు, భారద్వాజ గోత్రుడు అయిన సాంఖ్యాయన సోమయాజిచేత రాయబడిన శాసనము. నా వంశంలో పూర్వీకులు నిస్వార్థంగా చేసిన సంఘసేవ నాకు గర్వం

కలిగిస్తోంది. జీవితాంతం శ్రమపడి వాళ్ళు సంపాదించిన నిధి నాకు లభించటం నా పూర్వపుణ్యం. కానీ ఆ నిధిని వాడుకునే విషయంలో కాలం అనుకూలంగా లేదు. క్షీణిస్తున్న బౌద్ధం ఆరిపోతున్న దీపం లాగా భగ్గుమంటున్నది. వేదవేదాంగ వేత్తా వైదిక బ్రాహ్మణుడూ, వేంగిక్షేత్రంలోని బౌద్ధారామ ప్రధానాచార్యుడూ అయిన దిఙ్నాగుడు ఏనాడో గతించాడు అయినా అతని ప్రభావం ఇప్పటికీ చాలాబలంగా ఉంది. వైదికమతానికి చేటుకాలం ఇంకాపోలేదు. ఉత్సవసమయాల్లో తీర్థాల్లోకి దేవాలయాల్లోకీ ప్రవేశించి బౌద్ధభిక్షువులు చేసే నాస్తిక వాదనలూ హడావుడులూ ఇంకా తగ్గలేదు. ఈ వేదసీమలోని గురుకులాల పక్కనే బౌద్ధరామాలు ఇంకా క్షీణించలేదు. వాటిల్లో బౌద్ధ త్రిపిటకాలూ, జాతక కథలూ, వాటి వ్యాఖ్యానాలూ ఇంకా బోధింపబడుతూనే ఉన్నాయి. వైదిక కుటుంబాల్లోనివారు కొందరు అట్లాగే మిగిలిపోగా మిగిలినవారు బౌద్ధాన్ని స్వీకరించటం ఈ ప్రాంతాల్లో ఇంకా జరుగుతూనే ఉన్నది. పరమ వైదిక నిష్ఠాపరుడూ, కాళికను ప్రసన్నం చేసుకున్నవాడూ మహాకవీ అయిన కాళిదాసు రచనలనే ఆ దిఙ్నాగుడు పరిహసించాడు. గురువు తర్వాత అతని శిష్యుడు ధర్మకీర్తి ఇప్పుడు గురువు పనిని కొనసాగిస్తున్నాడు. ఆ దిఙ్నాగుడు రాసిన తర్కశాస్త్ర సముచ్చయానికీ బౌద్ధగ్రంథాలకీ తప్ప మరి ఏ ఇతర శాస్త్రానికీ రోజులు అనుకూలంగా కనిపించటంలేదు.

ఈ స్థితిలో నా పూర్వీకులు నాకందించిన మహోదధివంటి ఈ మహానిధిని నేను ఎట్లా బయటపెట్టను? — ఇది మామూలు ద్రవ్యనిధి కాదే! — ఆయుర్వేద, ఖగోళ, అణుశాస్త్రాల నిధి!

నా పూర్వీకులెవ్వరో కొన్నివందల ఏండ్లనాడు అపర ధన్వంతరి అయిన శుశ్రుతుని సేవచేసారు. అథర్వ, ఋగ్వేదాల్లోని ఔషధ ప్రక్రియలపైనా, పుఱ్ఱెలను కోసే శల్యతంత్రం పైనా తాము చేసిన పరిశోధనలను వారు గ్రంథస్థంచేసారు. అదే ఈ ఆయుర్వేద గ్రంథం. ఇంక, సూర్యునిలోని మచ్చలను గూర్చీ, నక్షత్రమండలాల్లో చెలరేగే అలజడులను గూర్చీ జరిగిన పరిశోధనలను తెలియపరిచేది ఈ ఖగోళ శాస్త్రగ్రంథం. స్థావర జంగమాలైన వివిధ వస్తు సంచయాల్లోని అణువుల కూర్పులపైనా, అణు విచ్ఛేదంవల్ల విడుదలయ్యే శక్తిరూపాల పైనా జరిగిన పరిశోధనల ఫలితమే ఈ అణుశాస్త్ర గ్రంథం. కణాదుని వైశేషిక శాస్త్రానికి నా వంశజులెవ్వరో చేసిన వ్యాఖ్యానం ఇది.— ఈ విధంగా మూడు శాస్త్రగ్రంథాలూ అద్భుతమైనవి. అపురూపమైనవు. అయితే వీటిని గురుకులాల్లో అధ్యయనం చేయించటానికి ఇది తగిన సమయంకాదు. నా రేండేళ్ళ కొడుకు పెరిగిపెద్దవాడయ్యేదాకా బతికుంటాననే నమ్మకం నాకులేదు. తాను ఈ నిధినికాపాడతానని మాటివ్వటానికి కాలపరిస్థితిని బట్టి ప్రతి పండితుడూ వెనుకంజ వేస్తున్నాడు.

కనక, నా ముందుతరం వాళ్ళకి దీన్ని అందించే ప్రయత్న చేస్తున్నాను. రాగిరేకులమీద రాసున్న ఈ మూడు శాస్త్రాలనీ నే ఇత్తడిపెట్టెలోపెట్టి భూమిలో నిక్షిప్తం చేస్తున్నాను. అనుకూలకా వచ్చినప్పుడు ఈ గ్రంథాలు ప్రచారంలో కొస్తాయి. ఈ ఆర్షభూమి వీటివల్లవిజ్ఞానం వెల్లివిరుస్తుంది. సమస్తమానవకోటి ఆరోగ్యవిజ్ఞానా తులతూగుతుంది. అంతవరకూ ఆ సర్వేశ్వరుడు ఈ గ్రంథాలను—, నిధిని కాపాడుగాక?— ఓం తత్సత్!'

* * *

గద్గదస్వరంతో లచ్చమ్మ "తియ్యినాయనా! పై ఆ జాగ్రత్తగా తియ్యి" అంది.

రామేశం మళ్ళీ పెట్టెకు నాలుగు వైపులా గుండ్రాయితో కొట్టాడు. పైన అడ్డంగా పెట్టున్న రేకు ఊడొచ్చింది. దాన్నెత్తగా ఇందాకటి వాసన మళ్ళీ గుప్పుమంది. మూలికల కింద రాగిరేకులక్క లున్నాయి. కొన్ని రేకులు ఒకదానికొకటి అంటుకుని శిథి మవ్వబోయే స్థితిలో ఉన్నాయి.

రామేశం అన్నాడు "బంగారమో వెండో ఉంటుందని ఆ పడ్డానమ్మా! దొరికిన నిధి రాగిరేకులా!"

లచ్చమ్మ నొచ్చుకుంది బాధ వ్యక్తపరిచింది. అంది. ఇంత చదువుకున్నవాడివి, లెక్చరరు ఉద్యోగం చేస్తున్నవాడివి, వెండీ బంగారాలే ప్రధానమన్నట్టు మాట్లాడుతున్నావా నాయనా! సమస్త సంపదల్నీ పుట్టించేది విజ్ఞానం కాదా? ఆ విజ్ఞానాన్ని నీ పూర్వీకులు స్వంతం చేసుకున్నారు. దాన్ని నీ కందించారు. ఇంతకన్నా ఏం కావాలి నాయనా? దాన్ని నీకందించటానికి వాళ్ళుపడ్డ యాతన చూశావా? ఎన్ని కాలాల్లో ఎన్ని విపత్తుల్నించి దాన్ని కాపాడారో గమనించావా? .... ఇంతాచేసి నీ వంశంకోసం మాత్రమే అనకుండా సమస్తమానవాళి సుఖశాంతులకోసమూ ఈ శ్రమ పడ్డామని చెప్పారే దీన్నిబట్టి తెలీటం లేదా వాళ్లెంత త్యాగధనులో, అది ఎంత మహోత్కృష్టమైననిధో! ఈనాడు విజ్ఞానంలో మనకంటే ఎన్నోరెట్లు ముందుకుపోయారు ఇతరదేశాలవాళ్ళు. ఎంతో వెనకబడిపోయాం మనం. మనం ఆ విజ్ఞానం కోసం దేవురిస్తూ వాళ్ళ కాళ్ళదగ్గిర పడిగాపులు కాయటమా, మన స్వంతమైన దాన్ని అభివృద్ధిచేసుకుని వాళ్ల కన్నా గొప్పగా తిరిగి ఇంకోసారి ఇంకో వెలుగు వెలగటమా ఏది ఉత్తమ మంటావు? ... ఈ నిధిని నీకు నీ పూర్వీకులు ఎందుకు అందించారో తెలిసిందా నాయనా?"

రామేశం అవాక్కయ్యాడు. తన ముదుసలి తల్లికి ఇంత ఆలోచనందడంలో ఆశ్చర్యం లేదనిపించిందతనికి. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న తన తండ్రి ప్రభావం తన తల్లిమీద ఉందనే విషయం అతనికి తెలిసిందే.

*   *   *

తెల్లవారింది.

స్నానమూ ధ్యానమూ ముగించుకొని ప్రయాణమై బయల్దేరాడు రామేశం. చెప్పుల్లో కాళ్లు పెడుతుండగా, చదువుధ్యాస ఉన్న అతని నాలుగో కొడుకు- అయిదో తరగతి చదువుతున్నవాడు : గొంతెత్తి శబ్ద మంజరి కంఠస్థం చేస్తున్నాడు: ఋకారాన్తః పుంలిగో కర్తృశబ్దః చేయువాడు. కర్తా-కర్తారౌ-కర్తారః ప్రథమా విభక్తి''

రామేశం వెనక్కి తిరిగి కొడుకుతో " నాన్నా గొప్ప గొప్ప గ్రంథాలున్నాయి మనింట్లో. చదువుకుంటావా? గొప్పవాడివవుతావు మరి. నువ్వు చదువకపోతే ఇంకోళ్లెవరో చదివి గొప్పవాళ్లవుతారు" అన్నాడు.

వాడు తలెత్తి నాలుగుక్షణాలు చూసి చూసి " మరయితే మా హెడ్‌మాష్టారికన్నా గొప్ప వాణ్ణవుతానా ? " అన్నాడు.

" ఆఁ ,తప్పకుండా ! ఇంకా చాలా చాలా గొప్పవాడివవుతావు"

వాడికళ్లమెరిసాయి. " అయితే చదువుకుంటాను. "

రెట్టింపుగా మెరిసాయి రామేశం కళ్లు.

చటుక్కున వెనక్కొచ్చి కొడుకుని హత్తుకున్నాడు.

రిక్షావాడు ఇంకోడి సహాయంతో ఆ బరువు ఇత్తడిపెట్టెను రిక్షాలో పెడుతూండగా "అమ్మా తిరుపతి వెడుతున్నానే. ప్రాచ్య లిఖిత భాండాగారం పండితులచేత వీటని పరిశీలన చేయిస్తాను. వారం పదిరోజులు పట్టొచ్చు. ఉత్తరం రాస్తాను ... తలుపేసుకో ... విజయవాడ పాసింజరు వెళ్లిందిరా అబ్బాయి ? అంటూ హడావుడిగా వెళ్లి రిక్షా ఎక్కాడు.

వలపుగంధం!

నల్లని ముంగురుల్లో ముడివేసినా
విశాల నేత్రాల్లో కట్టివేసినా
పొడుగగు ముకు జెలమల్లో బిగపట్టినా
నున్నని పెదవుల్లో నొక్కిపట్టినా
లోతయిన గుండెల్లో దాచిపెట్టినా
నీ వలపు
" కస్తూరే "
నేస్తురాలా !
అది " గమగమా " చెన్నొందుతూనే ఉంటుంది !
నాకు
ప్రసన్న మవుతూనే ఉంటుంది !!

జీవితం!

వెలుగు చీకటుల
సమ్మేళనం
తెలుపు నలుపుల
మిశ్రమం
గంగా యమునల
సంగమం
దీపావళిలా
ఉత్తమీయం
ప్రయాగలా పరమ
పవిత్రం
దాన్ని వ్యర్థపరచటం
నేరం !
పాపం !

శ్రీ కె. కిశోర్‌బాబు
శ్రీ కె. అశోక్‌బాబు

శ్రీ సోమసుందర్

తిరుగుబాటు ఊపిరిగా బ్రతికిన
కాజీ నజ్రుల్ ఇస్లామ్: కవితాజీవనకథనం

ప్రథమ భారతీయ విప్లవకవిగా కాజీ నజ్రుల్ ఇస్లామ్, బెంగాలీ ప్రజానీకం పూజలు నిరంతరాయంగా అందుకుంటూనే వున్నాడు. యౌవనావేశపూరిత హృదయంతో అతని కవితలు వంగదేశంలో ఇంటింటా జీవిస్తూనే వున్నాయి. నజ్రుల్ కవితా ఝంఝు అజరానురంగా దశదిశలా ప్రసరిస్తూనే వుంది. జాతిని ఉద్రేకోత్తుంగ మొనరిస్తూనే వుంది.

ఆయన ఆలపించిన 'అగ్నివీణ' సంగీతం జాతి హృదయంలో ఉష్ణరశ్మి నెగసన త్రోసింది అక్షరాక్షరంలోనూ మాతృదేశంపట్ల నజ్రుల్ ప్రచలితం చేసిన భక్తి ఆరాధనలు ఆబాలగోపాలాన్నీ ఉర్రూతలూపాయి. జన హృదయంలో ప్రవేశించి, చిరావాసం కల్పించుకొన్న ఆయన కవిత - స్వేచ్ఛాభారతి స్వరూప స్వభావాలను స్వప్నసాక్షాత్కారము కావించింది.

నజ్రుల్ విప్లవగీతాలలో వంగ యువజనత నవోత్తేజమందుకొంది. జీవనోత్సాహంతో క్రాంతిసైన్యంగా మారింది. 1920లోనే యువకులు విద్యార్థులూ వందలాదిగా ఉద్రేకోత్సాహాలు ప్రదర్శించారు. మాతృదేశ బంధవిముక్తి కోసం అవలీలగా అసువులు అర్పించగల ధీర కిశోరాలుగా పరిణతమయ్యారు.

ఆయన ప్రచురించిన మొదటి కవితాసంపుటి అగ్నివీణ - బానిస సంకెళ్ళు త్రెంచమని జాతిని ఉద్బోధిస్తే, రెండో కవితాసంపుటి విద్రోహ (విప్లకారుడు) సామ్రాజ్యవాద నిరంకుశత్వాన్ని పటాపంచలు చేయడంతో పాటు - మనిషిని మనిషే దోపిడీ చేయని నవసమాజాన్ని ఆవిష్కరించాలని సందేశించింది.

నజ్రుల్ కవితాకంఠం వంగ సాహిత్య సంగీత లోకానికి విప్లవ ప్రభంజనంలా ప్రవేశించింది. ఆ నవీన కంఠ మాధుర్యానికి వివశుడైన సహృదయ చక్రవర్తి రవీంద్రుడు హృదయపూర్వకంగా స్వాగతమందించాడు. "నజ్రుల్ ప్రవేశంతో వంగ సరస్వతి కట్లు పూర్తిగా తెగిపోయాయి. సాంప్రదాయక కారాగారాల తలుపులు భళ్ళున బద్దలయ్యాయి! ఇక నేను ఏమీ రాయకపోయినా ఇబ్బందిలేదు!" అంటూ ఆహ్వానం పలికాడు విశ్వకవి.

ఆయన గళం నుంచీ కలంనుంచీ వెలువడిన విప్లవగీతాలందుకొని, దేశభక్తులైన యువకులు వందలాదిగా జెయిళ్ళ నలంకరించారు. దరహాసకాంతుల సుమమాలలు ధరించి ద్వీపాంతరవాస శిక్షలకు ధైర్యంగా నడిచిపోయారు. చివరికి ఉరికంబాల కెక్కవలసి వచ్చినా, నజ్రుల్ గీతాలాలపిస్తూనే ఆనందంతో మృత్యువు నాహ్వానించారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో కార్మిక కర్షక వర్గాలు ఉత్సాహంగా పాల్గొనాలని నజ్రుల్ సంకల్పించాడు. ఆ ప్రబోధంతో ఎన్నో కవితలు రచించాడు. అవి శ్రామికవర్గాన్ని కదిలించి ఉత్తేజమందించాయి. మూడో కవితాసంపుటి 'సామ్యవాది' నజ్రుల్‌ను తొలి కమ్యూనిష్టు కవితా పీడితుల పక్షాన నిలిపింది. ఈ చైతన్యం ఏదో యాదృచ్ఛికంగా కలిగిందికాదు. రష్యన్ కార్మికవర్గం మ్రోయించిన నవంబరు విప్లవ విజయభేరిని 1920 లోనే కంఠోక్తిగా అభినందించాడు. పురోగామి కవిగా విప్లవతరంగాలకు స్వాగతాంజలి ఘటించాడు. భారత భూతలాన్ని అతలాకుతలం చేస్తూ, సింధునది సరిహద్దులుదాటి ఆఫ్ఘనిస్తాన్ వరకూ నిరాటంకంగా ప్రసరిస్తున్నాయా విప్లవ తరంగాలు! 1922 లో నజ్రుల్ ప్రచురించిన 'ప్రళయోల్లాస' అనే కవితాసంపుటి - జన హృదయ బృందగానాన్ని మహత్తరంగా ప్రతిధ్వనించింది.

ఆయన హృదయాన్ని ఆవేశించిన దేశభక్తి తీక్ష్ణతగాని, విప్లవ తేజస్సుగాని క్షణికోద్రేకాలు కావు. నవంబరు విప్లవ మూల సూత్రాలను కూలంకషంగా అవగాహన చేసుకున్నవి. భారతజాతి కూడా ఆ పథంలో సాగాలని ప్రబోధించిన మార్గదర్శక సూత్రాలే అవి. నజ్రుల్ దృష్టిలో స్వాతంత్ర్యమంటే తెల్లవారి చేతులనుంచి అధికారం నల్లవారి చేతులకు బదలాయించడం కాదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల స్థానంలో జాతీయ బూర్జువావర్గం దేశం నెత్తెక్కి కూర్చోడం అసలే కాదు. గుత్తపెట్టుబడిదారీ వర్గాన్ని పెంచి పోషించడమూ కాదు. దొంగ వ్యాపారులకు కోట్లకొలది లాభాల సంచులు

చేకూర్చడం కానేకాదు. మాజీ జమీందార్లూ వారి తాబేదార్లూ కొత్త దోపిడీ అవకాశాలకు ఎగబడ్డమూ కాదు. స్వాతంత్ర్యమంటే - కొద్ది మంది మధ్యతరగతి వ్యక్తులకు నూత్న జీవనమార్గాలేవో లభించడం మాత్రమేనని నజ్రుల్ ఎన్నడూ తలపోయలేదు. స్వాతంత్ర్యం సర్వ జన సుఖసంతోషప్రదం కావాలన్నదే ఆయన వజ్రసంకల్పం !

1922 లోనే నజ్రుల్ - 'ధూమకేతు' అనే వారపత్రిక ప్రారంభించి నడిపాడు. భారతదేశం సంపూర్ణ స్వాతంత్ర్యం సముపార్జించుకోవాలనే తీవ్రకాంక్ష వ్యక్తంచేస్తూ సంపాదకీయ వ్యాఖ్యలు ప్రచురించాడు. పైన తెల్పిన సంకల్పాలనూ అభివ్యక్తం చేశాడు అప్పటికి భారత జాతీయ కాంగ్రెస్ - సంపూర్ణ స్వాతంత్ర్యభావం ఆమడదూరంలోనైనా దృగ్గోచరము చేసుకోలేదు. హోమురూలుకీ, డొమీనియన్ స్టేటస్‌కీ నడుమ కాంగ్రెస్ ఊగిసలాడుతూన్న రోజులవి.

నజ్రుల్ కన్న ముందుగా భారత కమ్యూనిస్టుపార్టీ ఒక్కటే 1921లో అహమదాబాద్‌లో జరుపుకున్న మహాసభలు సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం చేసింది. హజ్రత్ మొహినీ అనే జాతీయ ముస్లిమ్ నాయకుని ఉద్ఘాటననీ తీర్మానం అనుసరించింది. సంపూర్ణ స్వాతంత్ర్యానికి యావత్తు కార్మిక వర్గాన్నీ సంఘటిత పరచాలని నజ్రుల్ పదేపదే ఉద్ఘాటించాడు.

ఆయన కవితలూ, సంగీతఫణితులూ, పత్రికాసంపాదకీయాలూ 1920 నుండి '29 వరకూ ఆమూలాగ్రం విప్లవభావాలను ప్రతిబింబించాయి. జాతీయ విముక్తి సంఘర్షణలో విద్యార్థులూ యువజనులూ నిర్వహించవలసిన ప్రధానపాత్రను నిర్ద్వంద్వంగా ప్రకటించాయి. "వలస దేశాల విద్యార్థులు నిర్వహించవలసిన విప్లవాత్మక బాధ్యత అనన్య సామాన్యమైనది! వారే అగ్రశ్రేణి పోరాటవీరులు. యౌవనంలో ఉండే సునిశిత మేధతో వారు వాస్తవ స్థితిగతులను అవగాహన చేసుకోగలుగుతారు. సాహసంతో ముందడుగు వేయగలుగుతారు. వెన్ను ముదిరిన వారికి లక్ష సందేహాలు. కనకనే విద్యార్థులూ యువజనులూ స్వాతంత్ర్య పోరాట రంగానికి సంఘటితం కావాలని ఆహ్వానిస్తున్నాం!" అంటూ నజ్రుల్ ఒక సంపాదకీయంలో పిలుపు యిచ్చాడు.

యువకుల నావేశపరస్తూ ఒకగీతంలో— "మనశక్తి—మనబలం మనమే విద్యార్థులం!" అంటూ ఆవేశమందించాడు. స్వాతంత్ర్యసిద్ధికి ముందటి దశాబ్దాలలో ఈ గీతం నిర్వహించిన చరిత్రను మరచిపోలేని మొద్దటితరం వారి స్మృతి వీధులలో ఆ వెల్లువలింకా ఆనందం కలిగిస్తూంటాయి. విద్యార్థులు గొప్ప ఊరేగింపులుగా సాగుతూ ఈ గీతాన్ని బృందగానంగా ఆలపించేవారు. దిక్కులు మార్మ్రోగించేవారు.

"కరార్ ఓయ్ కాహ్‌రాపాత్" అనే గీతంలో నజ్రుల్ సింహగర్జన చేశాడు. ఆ గీతభావమిది.

"కారాగారపు ఇనుప తలుపులను
కూల్చండీ కూల్చండీ త్వరగా ...
బానిస బంధాల్, బందిఖానలూ
కాల్చండీ కాల్చండీ వడిగా...

అలాగే మరో గీతంలో కూడ పౌరుషాన్నీ పురుషకారాన్నీ ప్రేరేపిస్తూ ఇలా అంటాడు.

"మన ముంజేతుల ఇనుపసంకెలలు
మోదముతో ధరియించినదువగా
దేశమాత బంధించిన శృంఖల
ఫటాఫటామని తెగును, ప్రేల్చిపడు !"

భారతజాతికి వీరపురోగమన గీతాలను (మార్చింగ్ సాంగ్స్) అందించిన తొలికవి నజ్రుల్! అంతకుపూర్వం భారతజాతి అలాంటి గీతాలనే ఎరుగదు. ఈ క్రింది గీత పాదాలెంత ఉద్రేకోత్సాహాలను జాతికి చేకూర్చాయో, మననం చేసుకుంటే తెలుస్తుంది.

"నడు నడు నడు మును ముందులకే !
ఊర్ధ్వగగన మది మొరసెనగారా...
నిమ్న తలమ్మున ధరణీ హృదయము
క్లేశశోక సంకులరవ భారము !
ప్రభాత కాంతుల యువకిశోరమా—
పద పద పద పద ముందు కురకరా !"...

నజ్రుల్ గీతాలు వంగభూమిలో విప్లవపార్టీల అవతరణకెంతో ప్రేరణ కలిగించాయి. విస్ఫులింగాల వంటి గీతాలనూ, ప్రేళ్ళరిక్త పారేజలపాతం వంటి గాత్రాన్నీ విప్లవశ్రేణులకే అంకితమొనరించాడాయన. తన హృదయంలో పొంగులు వారిన ప్రగాఢ దేశాభిమానం—వీరసైనికోత్సాహంగా ఆధునిక బెంగాలీ సంగీతానికి కొత్తకెరటాలు కలిగించింది. యువవీరుల బృందాలను ఉత్తేకించింది.

నజ్రుల్ మతం :

నిజానికి నజ్రుల్ మతం మానవత్వమే ! ఆయన ముస్లిమూ కాదు, హిందువూకాదు. 1926లో కలకత్తా నగరం హిందూముస్లిమ్ మతదురహంకార దుశ్శక్తుల కాళవాలమైంది. మానవ మారణహోమం చెలరేగింది. మనిషి మతదౌష్ట్యానికి బలిపశువుగా మారిపోయాడు.

నజ్రుల్ హృదయం తీవ్ర అవమానంతో కుంచుకుపోయింది. ఆ దినాలలో ఆయన విశాలనేత్రాలు విషాదాశ్రుపూరాలయ్యాయి. స్వేచ్ఛా శిఖరంవంటి ఆ సమున్నత శిరస్సు శోకావనీతమైపోయింది. మానవ హత్యాకాండతో నిండిన ఆ వాతావరణ కాలుష్యాన్ని ఆయన భరించలేకపోయాడు. దుస్సహ వేదనతో నిండిన ఆయన కవితా హృదయం ఇలా ఆక్రోశించింది.

"దుర్గమగిరి కాంతారము లెడార్లు
దుస్తరపారావారములన్నీ
దుర్భరధ్వాంత నిశీధులలోనే
లంఘించాలిక, తప్పదు యాత్రిక !
సాహసమతికై – సారసహృదికై
లంఘించాలిక, తప్పదు యాత్రిక !

—ఆ సమయంలో రచించిన ఇలాంటి వెన్నో గీతాలలో జాతిని క్రమ్ముకొన్న పీడనీడలపై కోపారుణ కాంతులనే ప్రసరించాడు. పై గీతంలో ఒక ప్రశ్నకూడా సంధిస్తాడు.

ఉరికంబంపై ఉరిమేగొంతుల
జయ గీతములను ఆలాపించిన
భరత వీరులరుదెంచి విలువగా
త్యాగపునీత ప్రసవ మాలికల

నెటులర్పింతువు– లజ్జాహృదితో ? !" అంటూజాతిని ప్రశ్నిస్తాడు. ఈబృందగీతంలో ప్రచలితమైన సంగీత సాహితీ మాధుర్యాలకు సాటివచ్చే వేరొక గీతమేదీ ఇంతవరకూ వెలువడ లేదని వంగసాహిత్య విమర్శకులంటారు. 1926లో క్రిష్ణాగర్‌లో జరిగిన బెంగాల్ రాష్ట్రీయ కాంగ్రెస్ మహాసభలో స్వయంగా నజ్రుల్ ఈగీతాన్ని ఉచ్చైస్స్వరంలో గానం చేశాడు.

బిద్రోహి కవితా సంపుటి 1921 లోనే వెలువడింది. ఆనాటి వరకూ గల సకల వంగ కవిత్వంలోనూ విద్రోహి అనవద్యమనోహరంగా కీర్తినార్జించింది. ఆసంపుటి వెలువడిన తెల్లారేసరికే నజ్రుల్ మహాకవిగా కీర్తిమంతుడయ్యాడు. ఆ కవితా సంపుటిలోని వస్తువూ సంవిధానమూ అపూర్వంగా మేళవించాయి. శైలీరీతి అనవద్యంగా కుదిరాయి. కవితల ఛందస్సులన్నీ కొత్తవి. ప్రతికవితా మహాశక్తి సంపన్నంగా పాఠకులను వశమొనర్చుకుంది నూతనావేశంతో యువశ్రోతల నుర్రూతలూగించింది. పాతసామాజిక వ్యవస్థను సాంతంగా మనిశ్చయశక్తిని కంఠోక్తిగా సందేశించింది. దుష్టసంప్రదాయాల మూఢవిశ్వాసాలనూ గోతపెట్టాల్సిందిగా ఉద్బోధించింది. ఆ విప్లవానికి ఆహ్వానగీతంగా విస్పష్ట తేజస్సు లందించింది.

విద్రోహికావ్యం ఇలా ప్రారంభమవుతుంది.

" బలవీరా, బలవీరా !
నా శిరమిదె ఉన్నతమై
నిలచిందని అనవోయీ !
ఉన్నతమై నిలచిన నామ స్తిమును కాంచీ
ఆ హిమాద్రి శిఖరమదే
నతశిరమై గౌరవించె ననవోయీ !.."

– విద్రోహి కావ్యం ముగిస్తు నజ్రుల్ ఇలా అంటాడు;

దళిత నరుల ఆక్రందన
లవనీ హృది నిండనపుడు–
పీడిత తాడిత జీవుల
ఆర్తరవము సమసినపుడు
గగన మారు తమ్ముల ప్రతి
ధ్వానము చెలరేగనపుడు
అత్యాచారుల ఖడ్గకృపాణాల్
వీగికుల్లి నేలను పడినప్పుడు
భీషణ సమరాంగణ మీపుడమికి
ఘోషణ శోషణ ముగిసిన యప్పుడు–
ఆ దినమే నా శుభోదయమురా
మోదోత్సమై శాంతి నొసగురా !...."

ఈ కవితలో ఆద్యంతమూ అభివ్యక్తి పరంగా వర్గరహిత సమాజస్వర్గం నిర్మించాలనే గాఢవాంఛ ద్యోతకమవుతుంది.

నజ్రుల్ రచించిన మొదటినవల 'వ్యథాదాన', 1922లో ప్రచురితమైంది. అది సాధారణ ప్రేమకథే. అయితేనేం – నాయకపాత్ర ఆధునిక చైతన్యవిలసితంగా ప్రవర్తిస్తుంది. సోషలిస్టు విప్లవాన్ని కీర్తిస్తుంది. ఎర్రసైన్యం సాధించిన పురోగతిని వివరిస్తుంది. ఎర్రసైన్యమప్పటికి సోవియట్ రష్యా మధ్యప్రాచ్యంలో పోరాటాలు సాగిస్తోంది. ఆ నవల పాఠకునిలో అకుంఠిత దేశభక్తి నీ, అంతర్జాతీయ చైతన్యాన్నీ పాదుకొల్పుతుంది.

• ఈ వ్యాసంలో ఉదాహృత గీతశకలాలలో నజ్రుల్ బెంగాలీ మూలంతో ప్రయోగించిన సంస్కృత పదాలనే ఉపయుక్తం చేశాను.

1920 దశకంలో నజ్రుల్ రచించిన సర్వసాహిత్యంలోనూ కమ్యూనిస్టు భావాలు ప్రభోధితమయ్యాయి. సామ్యవాదిలో, ప్రళయోల్లాసలో సవ్యసాచిలో కృషీకారగానంలో ఫరియాద్‌లో విజ్ఞప్తి, సకల రచనలలోనూ విప్లవభావమే ప్రచలితమైంది. ఆ దశలో రచించిన ఎన్నో గీతాలకాయనే స్వయంగా సంగీతఫణితులేర్పరచి స్వరపరచారు, కార్మికగీతంలోనూ, అరుణపతాకగీతంలోనూ ఆయన గాఢవిశ్వాసం విస్పష్టంగా అభివ్యక్తమైంది.

"లేవండి మేల్కొండి, బలరాములై రండి
చావు తప్పని యపుడు వీరులై చద్దాము
లేవండి, రారండి - హలపాణులై నేడు !"

- అంటూ మహోద్వేగంగా గానం చేస్తాడు. ఆలాగే కార్మిక గీతంలోనూ -

"ఓహో ఓ కార్మికులారా
నాశనపథయాత్రికులారా
మీ సమ్మెట లెత్తండీ !
ఓహో వోనావికులారా !
వజ్ర భుజస్కంధములందున
మీ పారల నెత్తండీ" ! ....

-అంటూ పిలుస్తాడు. వంగదేశ శ్రామికులకోసం అరుణపతాక గీతం రచించి, సంగీతం సమకూర్చాడాయన.

"ఎగరవే ఎగరవే ఎర్రనిజెండా.
అకాశవీధిలో అరుణోదయమ్మై..." అంటాడు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం గురించి విస్పష్టమైన అవగాహన నజ్రుల్‌కుండేది. ముజఫర్ అహ్మద్‌నుంచీ అంతర్జాతీయ గీతం తీసుకొని, మననం చేసుకున్నాడు. ముజఫర్ భారత కమ్యూనిస్టుపార్టీ నిర్మాతల్లో ప్రధానులన్న సంగతి కొత్తగా చెప్పుకొనక్కరలేదు. అంతర్జాతీయ గీతం - కమ్యూనిస్టు సౌహార్దానికి ప్రతీకప్రాయమైనది. ప్రపంచమంతటా కార్మికులందరూ అదే అంతర్జాతీయ గీతాన్ని గానం చేస్తారు. ఏ దేశంలో ఏ భాషలో గానం చేయబడినా దాని గానఫణితిలో మార్పురాదు. స్థూలంగా వింటే ఒకే భాషలో, ఒకేకంఠనాదంతో పాడబడుతున్నట్లే వినిపిస్తుంది. అలాంటి అంతర్జాతీయ గీతానికి ప్రప్రథమ భారతీయానువాదం చేసిన గౌరవం కాజీనజ్రుల్ ఇస్లామ్‌కే దక్కింది.

తాను సొంతంగా 'ధూమకేతు వారపత్రిక నిర్వహించడమే గాక - కామ్రేడ్ ముజఫర్‌తో కలసి - 'నవయుగ' - 'లాంగాల్' (నాగలి) వంటి ప్రగతిశీల పత్రికల విషయంలోనూ బాధ్యత తీసుకున్నాడు నజ్రుల్. సామాజిక, రాజకీయ తీవ్రభావాలనెన్నో ఆయా పత్రికలద్వారా వెలువర్చాడు. అనాటి రచనలన్నిటికీ ఎంతో చారిత్రక ప్రాధాన్యత వుంది. తాత్కాలిక సమస్యల పరిష్కారమార్గాలను సూచించే వ్యాసాలయినా, నేటికీ పాఠకుల హృదయాల నా వ్యాసాలు కాలాతీతశక్తితో ఉత్తేజంలో ముంచెత్తుతాయి.

విద్యార్థిగానే విప్లవచైతన్యం :

ఇక్కడే ఒక మౌలికప్రశ్న ఉదయించకపోదు. పత్రికారచనలలోనూ కవితలలోనూ, కల్పించిన సంగీత కృతులలోనూ అనాటికే ఇంతటి విప్లవాత్మక చైతన్యధార నజ్రుల్‌లో ఏలా ఏర్పడింది ? నిజమే మరి, ఇది అబ్బుర విషయమే! ఆనాటి భారతదేశంలో మ రేయితర కవి ఇంత బాహాటంగా కమ్యూనిజం గురించి పారవశ్యం పొందలేదు. ఇంత తీవ్రభావాభి వ్యక్తిచేసిన సంగతీ వినపడదు.

నజ్రుల్ హైస్కూలు విద్యార్థిగా ఉన్నపుడే ఒక ఉపాధ్యాయుడు ఆయన భావావేశం గుర్తించాడు. దగ్గరగా తీసుకొని విప్లవ భావాలు నూరిపోశాడు. ఆ సన్నివేశం 'సియర్‌సాల్ రాజా' ఉన్నత పాఠశాలలో జరిగింది. స్వాతంత్ర్య పోరాటంలో సుశిక్షితుడైన సైనికుడుగా పోరాడాలన్న ఆశతోనే నజ్రుల్ ప్రథమ ప్రపంచ యుద్ధంలో సిపాయిగా చేరాడు. మిలటరీ చేరెక్సులో ఉండగానే ఎర్రసైన్యం సాధిస్తున్న విజయ పరంపరల గురించి తెలుసుకున్నాడు. ఉత్తేజితుడయ్యేవాడు. రష్యాలో జరిగిన సోషలిస్టు విప్లవం గురించి రహస్యంగా కరపత్రాలూ పుస్తకాలూ ఆయన కందుతూండేవి. సన్నిహిత మిత్రులతో కలసి వాటిని అధ్యయనం చేసేవాడు. ఆ విధంగా విప్లవాభినివేశాన్ని పెంపొందించుకున్నాడు.

1919లో సైన్యంనుంచి హవల్దార్‌గా విడుదలై వచ్చాడు. ముజఫర్‌తో కలిసి చాలాకాలం గడిపాడు. దేశస్వాతంత్ర్య పోరాటంగురించీ కార్మికోద్యమ నిర్మాణం గురించీ ఆయనతో చర్చించేవాడు. ఆ విధంగా నజ్రుల్ తన సిద్ధాంత జ్ఞానాన్ని సుదృఢమొనర్చుకున్నాడు. శాస్త్రీయ విప్లవచైతన్యంతో కవితా రంగంలో ప్రవేశించాడు. తన యావత్ కళాహృదయాన్ని ప్రజలకోసమే వినియోగించే స్థిరసంకల్పుడవడం సహజంగా కలిగిన పరిణామమే!. కేవలం రచయితగానేకాక, స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాలలో కార్యాచరణశీలిగా నిమగ్నమవుతూ వచ్చాడు.

ముజఫర్ అహ్మద్ రచించిన స్వీయచరిత్ర– 'నా జీవితమూ— కమ్యూనిస్టు ఉద్యమమూ' అనే గ్రంథంలో ఇలా రాశాడు. "1921 సం॥ ప్రాంతానికి బెంగాలులో కమ్యూనిస్టుపార్టీ నిర్మాణం గురించి ఒక

నిర్ణయానికి వచ్చాం. కాజీనజ్రుల్ కూడా మా నిర్ణయాలలో భాగస్వామిగా ఉన్నాడు. రష్యన్ విప్లవంపట్ల అప్పటికే ఆయనకెంతో గౌరవం ఏర్పడిన విషయం లోగడనే వివరించి ఉన్నాను. నజ్రుల్ రచించిన 'ప్రళయోల్లాస' అనేకావ్యం మా సమష్టి ఆలోచనల ఫలితార్థమే! నర్మగర్భంగా 'సింధునదీ సరిహద్దున అగలబంగ'— "అన్నది రష్యన్ విప్లవం గురించి ఉద్దేశించినదే!..." అంటూ ఆనాటి యథార్థాలను వివరించాడు ముజఫర్.

1981లో 'మీరట్ కుట్రకేసు'కు సంబంధించిన విచారణాపూర్వ ముద్దాయిగా జెయిల్లో వున్నపుడు 'నేను కమ్యూనిస్టుని' అనే గ్రంథం రచించాడు ముజఫర్. అందులో సైతం కాజీ నజ్రుల్ గురించీ, లేబర్ స్వరాజ్యపార్టీ నిర్మాణం గురించీ ఆ పార్టీ నిర్మాణంలో నజ్రుల్ ప్రదర్శించిన చొరవ గురించీ ఎన్నో సంగతులు ఉట్టంకించాడు. జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా లేబర్ స్వరాజ్యపార్టీ అప్పట్లో కృషి సల్ప సమకట్టింది. ఆ గ్రంథంలో ముజఫర్ ఆనాటి సామాజిక రాజకీయ పరిస్థితులన్నీ వివరించాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటగతి గురించి ఏన్నో గొప్ప విశ్లేషణలు చేశాడు.

ముజఫర్‌పట్ల నజ్రుల్ కెంత గౌరవభావం ఉండేదో 'ఆత్మశక్తి' పత్రికా సంపాదకుడికి వ్రాసిన లేఖ వ్యక్తంచేస్తుంది. తారానాథ్‌రాయ్ అనే వ్యక్తి 'తరారా' అనే కలం పేరుతో ముజఫర్ పట్ల అసూయాగ్రస్తుడై దుమ్ముచల్లుతూ ఒక సంపాదకి లేఖ ప్రచురించాడు. దానికి జవాబుగా వెనువెంటనే నజ్రుల్ తన సంపాదకలేఖ పంపాడు. అందులో ఆయన ఇలా అన్నాడు: "నేను స్వప్రామాణికంగా చెప్పగలను. ముజఫర్‌ను చూసిన ఎలాంటి వారికైనా పొడికళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు సుళ్ళు తిరగక మానవు. ఈ మహావ్యక్తి - ఇంత నిస్వార్థంగా, ఇంత ఆత్మత్యాగ నిరతితో, ఇంత నిరాడంబరంగా ఎలా పనిచేయగలుగుతున్నాడా అన్న ఆశ్చర్యం అందరినీ ముంచెత్తుతుంది. ఈ ప్రశ్నలకు నాకైతే ఎన్నటికీ జవాబు దొరకదు. ఎంతో సుందర జీవితాన్ని ఆయన దేశానికి సమర్పించుకున్నాడు. తపోనిరతితో ఆయన భవిష్యద్దర్శనం కావిస్తున్నాడు. ముజఫర్ మహా ప్రతిభాశాలి అనేది నిస్సంశయంగా చెప్పగల సత్యం ! అన్నింటికీ మించి ఆయన హృదయమెంత విశాలమో ?! మొల్లా, మౌలవీల వంటి సనాతన మతాధిపతుల జన్మస్థలమైన నౌఖాలీ జిల్లాలో జన్మించినప్పటికీ ముజఫర్ హృదయం మతాతీతంగా ఎలా పెంపొందిందో ఆశ్చర్యమే ! ఆయన విశ్వమానవతావాది. మరే ఇతర హిందూ నాయకుడిలోనైనా అంత ఉదాత్త దేశభక్తినీ ప్రజానుబంధాన్నీ నేనింతవరకూ చూడనేలేదు! ఇక ముస్లిమ్ నాయకుల మాట వేరే చెప్పవలసిన పనే లేదు ! ..." అంటూ వ్రాశాడు నజ్రుల్.

నజ్రుల్ కార్మికుల సభలకు హాజరవుతూ ఉండేవాడు. రైతుల, జాలర్ల సభలలో ఉపన్యసిస్తూ ఉండేవాడు. బెంగాల్ దేశమంతా సంచరించాడు. 'వర్కర్స్ అండ్ పెజెంట్సు పార్టీ ఆఫ్ బెంగాల్' నిర్మించడంలో తీవ్రంగా కృషిసల్పాడు. ఆ సంచారంలో ముజఫర్‌తో పాటు, అబ్దుల్ హలీమ్ తోనూ, బ్రిటిష్ కమ్యూనిస్టు ఫిలిప్ స్ప్రేట్ తోనూ నజ్రుల్‌కు స్నేహమేర్పడింది. 1923 లో నజ్రుల్ - 'ఆనంద మోయీర్ ఆగమనే' అనే కవిత రచించాడు. ఆ రచన గురించే ఒక సంవత్సరంపాటు జెయిలు శిక్షకు గురయ్యాడు. దుర్భరంగా సాగుతున్న యీ దోపిడీవ్యవస్థను వర్ణించి, దుర్గామాతను ఆహ్వానించి, 'ఈ శత్రు సమూహాలను సంహరించ' మని విజ్ఞప్తి చేస్తాడా కవితలో నజ్రుల్ ! హింసా ప్రబోధం చేసినందులకు బ్రిటిష్ ప్రభుత్వం విచారణ జరిపి శిక్షించింది.

హుగ్లీ జెయిల్ అధికారులు నజ్రుల్‌పట్ల అమానుషవైఖరి ప్రదర్శించారు. దానికి నిరసనగా 39 రోజులు నిరశనవ్రతం చేశాడు నజ్రుల్. రాజకీయ ఖైదీలను మామూలు నేరస్థులనుంచి వేరుపరచాలనీ, సాధారణ సదుపాయాలన్నీ కలిగించాలనీ ఆయన కోరాడు. ఈ దీర్ఘ కాల నిరశనవ్రతానికి అటు ప్రభుత్వమూ ఇటు ప్రజలూ కదిలిపోయారు.

నజ్రుల్ ఇస్లామ్ ఉత్తమ దేశభక్తితో జీవించాడు. మానవ హక్కుల కోసం నిరంతరాయంగా పోరాటం సాగించాడు. ఈ శతాబ్ది కవులందరికీ ఆదర్శప్రాయుడై నిలిచాడు నజ్రుల్ !

వినూత్న సంగీత స్రష్ట :

మీరట్ కుట్రకేసు సందర్భంగా ముజఫర్ నిర్బంధించబడిన తర్వాత దేశంలో ఎన్నో ప్రముఖ సంఘటనలు జరిగాయి. అన్నిటికన్నా ముఖ్యమైనది నజ్రుల్ జీవితంలో సంభవించిన గొప్ప మార్పు. ఆయన తన పూర్తికాలాన్ని వాగ్గేయకారుడిగా సంగీత కృతుల సృజనకు వినియోగించ నారంభించాడు.

శ్రావణాంబరం వార్షుక జలధారలు కుమ్మరించినట్లు ఆయన హృదయం నుంచి నవీన సంగీత కృతులు జాలువార నారంభించాయి. ప్రేమగీతాలు, భక్తిగీతాలు, జానపదగీతాల వంటి సర్వ రసభావ సమన్వితంగా ఆతనిగళం స్పందించ నారంభించింది. సంగీత ప్రపంచంలో ఒక వినూత్న లోకాన్నే ఆవిష్కరించాడాయన. వైవిధ్యంగల అపూర్వ ఫణితులనెన్నో సృష్టించాడు. రవీంద్ర సంగీత లాగే - 'నజ్రుల్‌గీతి'

గా ఆయన సంగీత ఫణితులన్నీ శాశ్వతకీర్తి సంతరిస్తూనే ఉన్నాయి. గ్రామఫోను రికార్డులద్వారా, రేడియో లలితసంగీత కచేరీల ద్వారా, వెండితెర చిత్రాలద్వారా, రంగస్థల గీతాలద్వారా, నజ్రుల్ గీతాలు విపరీత ప్రజాదరణ నందుకున్నాయి. 1930 ల దశకమంతా ఈ మహాకవి హృదయం - వినూత్న సంగీత లోకాన్ని ఆవిష్కరిస్తూ సాగిపోయింది.

1942 జులై 9 వ తేదీని నజ్రుల్ ఆకస్మికంగా రోగగ్రస్తుడయ్యాడు. జలపాత సదృశమైన ఆ గళరవం హఠాత్తుగా మూగవోయింది. ముప్ఫయినాలుగేళ్ళ శేషజీవిత దీర్ఘ కాలమంతా, శాపగ్రస్త గంధర్వునివలె నజ్రుల్ మౌనిగా కాలాన్ని దొర్లించవలసి వచ్చింది. [తెలుగువారి మహాకవి - దేవులపల్లి కృష్ణశాస్త్రి, నజ్రుల్‌కన్న రెండేళ్ళు పెద్దవారు. ఆయన నజ్రుల్ వలెనే 1965లో మూగవోయారు. కాని ఆయన మౌనిగా గడిపినది పదిహేనేళ్ళ కాలమే !]

చివరికి 1976 లో ఆగస్టు 29 వ తేదీని బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో కాలధర్మం చెందాడు. నజ్రుల్ జీవితాంతిమకాలంలో భారత ప్రభుత్వం ఢాకా తీసుకు వెళ్ళడానికి అనుమతించింది. అక్కడాయన కొద్ది వత్సరాలు మాత్రమే సజీవుడుగా ఉన్నాడు. ఈ నిష్క్రమణ గురించి ఎంతో విమర్శ చెలరేగింది. భారతీయులాయనను స్వదేశానికి తిరిగి రప్పించుకోవాలని తీవ్రంగా వాంఛించారు. కాని భారతప్రభుత్వం చెవినిపెట్టలేదు. ఆయన పుట్టిపెరిగిన పశ్చిమబెంగాల్ బర్ద్వాన్ జిల్లాకు తీసుకువచ్చేందుకు అంగీకరించలేదు.

మహాకవి కాజీ నజ్రుల్ ఢాకాలో సమాధి చేయబడ్డాడు. మరణానంతరం సైతం ఆ మహనీయుడు రెండు మతాలకీ రెండు దేశాలకీ నడుమ సుహృత్ సేతువుగా మిగిలిపోయాడు ....


[పశ్చిమబెంగాల్ ప్రభుత్వ సమాచారశాఖకీ, ముఖ్యంగా కల్పతరుసేన్ గుప్తా గారికి కృతజ్ఞతాంజలి — రచయిత]

ప రి గ

శ్రీ న ర్సా పే ట ఒ త్ప ల

చూడ చూడ జాడ
తిమ్మనగారి సత్యభామ
మునిమాణిక్యం లేమ
ఒకేయింటి ఆడపడుచులని
అనుమానం నాకు
ప్రోషిత భర్తృక ఎంకి
ముమ్మాటికీ అకలంకి.
ప్రవరుడివంటి శీలము
ప్రబంధాలందెవటూ కనజాలము
ఇమ్మేదిని
పెద్దన వరూధిని
శృంగార స్వబోధిని
ప్రవరుడు కోరునది నిత్యకర్మకు అంగారం
వరూధిని వాంఛ మదన కదన కుతూహల శృంగారం
వరూధిని కోసము
గంధర్వుడి మోసము
శృంగారా భాసము
పోకమను బోదియ
వరూదిని చేరినది లలితము
అందువల్ల ఆయన్ను మిన్న
పొందిన దేమి ఫలితము ?

సీరియల్



మృత్యువు

ఇచ్ఛాపురపు రామచంద్రం

(గతసంచిక తరువాయి)

3

చయనులుగారికి మరొక తీవ్రమయిన బాధకూడా ఉంది. దానిని ఆయన పైకి చెప్పుకునే సాహసం చేయరు చాలా సన్నిహితుల ముందు తప్ప. కాని అది వారిని తక్కువ బాధించేదికాదు. అదేమిటంటే—

జాతినొక త్రాటిమీద నిలిపి— అహింస అనే ఆయుధం అత్యంత శక్తివంతమూ, అమోఘమూ అని రుజువుచేసి భారతదేశానికి స్వతంత్రం తెచ్చిన మహాత్ముడెంత గొప్పవాడో, వర్ణసంకరాన్ని తెచ్చి పెడుతున్న గాంధీ అంత దుర్మార్గుడు. హరిజనుల కాలయ ప్రవేశం అన్నమాట–ఆయనకి వొంటికి కారంరాసు కున్నట్లుండేది. సహపంక్తి భోజనాల ఉదంతాలు–ఆయనని కోపంతో మండిపడేటట్లుచేసేవి. కాని ఆయన తన ఆ భావాలనూ అసహ్యాలనూ ఎలా వ్యక్తంచేయగలడు? అలా చేస్తే–ఊరందరిదీ ఒకదారీ ఉలిపికట్టెదొకదారీ అది నలుగురిలోనూ హేళనకాదూ? బ్రాహ్మణ్యం అంటే పరమ పవిత్రంగా ఎంచే చయనులుగారి గుండెల్లో గాంధీ బల్లెపుపోటు పొడిచాడు. ఆయన సిద్ధాంతాలు ఆ గాయాలను చీటికీ మాటికీ రేపేవి. పాడైపోతున్న యీ ప్రపంచంలో పతంజలి ఎలా బ్రతుకుతాడా, అని మనసులో దిగులు పడేవాడు. ఏకాంతలో కన్నీరు నింపుకునేవాడు. పతంజలి చయనులుగారి ఏకైక సంతానం. అతను పుట్టబోయేముందు చయనులుగారు అందరూ కాబోయే తండ్రులలాగే చాలా కలలు కన్నారు. పుత్రుడే జన్మిస్తాడని ఆయనకి జ్యోతిషం చెప్పింది. మరి–అదే జ్యోతిషం–ఆ కొడుకేమౌతాడో ఎందుకు చేప్పలేక పోయిందో?

పతంజలిని ఆయుర్వేదంలో మరో చరకుణ్ని చేద్దామనుకుదున్నా. జ్యోతిషంలో అపర వరాహ మిహిరుణ్ని చేయాలనుకున్నాడు

సంస్కృత పాండిత్యం లేనిదే యివి సాధ్యంకావు కనుక సంస్కృతంలో దిట్టను కావిద్దామనుకున్నాడు. అందుకే—

పతంజలికి ఐదేళ్ళకంటె ముందు అమరం వొచ్చింది. శబ్దాలు వొచ్చేశాయి. ధాతువులు వల్లెవేసేవాడు. అప్పటికి. భారతదేశం లోనవుతున్న అనేక మార్పులలో— దేశంలో తమ మతాన్ని ప్రాచుర్యం గావించడానికి క్రిష్టియన్‌లు కాన్వెంటులూ ఆసుపత్రులూ విరివిగా నెలకొల్పుతూండడం ఒకటి.

పతంజలి అమరం వొప్పజెబుతూంటే; అతని యీడు పిల్లలు కొందరు నర్సరీ రైమ్స్ పాడుతూండేవారు. అతను చిన్న అంగవస్త్రమూ, పిలకా పెట్టుకుని ఉంటే వాళ్ల యూనిఫారమ్‌లు వేసుకుని క్రాఫింగులు దువ్వుకుని బూట్లువేసుకునేవారు. వాళ్ళకి బడిఉంది పతంజలిని సంస్కృతం చెప్పేబడేలేదు! తండ్రే అతనికి విద్యాలయమయినా విశ్వవిద్యాలయమయినా. ఇల్లే అతనికి సర్వస్వమూ. ఐదేళ్ళకే అతను దేవనాగరి లిపిని చక్కగా వ్రాయగలిగేవాడు. ఏ సంవత్సరపు పంచాంగమయినా తెచ్చి తండ్రికి అందించగలిగేవాడు. కుప్పెలు, కలికములు, చూర్ణములు, భస్మాలు. ఆసవాలు వీటిని దేనికది గుర్తుపట్టగలిగేవాడు. పతంజలి— ఆ కుదురులో పిలకే కదా! ఏగూటి చిలక ఆ గూటి పలుకులు పలకడంలో అబ్బుర మేముంది.

మారుతున్న కాలగతి — చయనులిని - పతంజలి భవిష్యత్తు గురించి తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకోవలసిన సమయాన్ని ఆసన్నం చేసింది. పతంజలికి పఠనిర్దేశం గావించవలసిన పరిక్షా సమయం వొచ్చేసింది. తీవ్రంగా ఆలోచించారు చయనులు.... తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ననుసరించి.

వేదాలు వినిపించడంలేదు. సంస్కృతం సంగతి సరేసరి. వేష భాషలలో కూడా బ్రాహ్మణ్యం మరుగున పడిపోతూంది. అంతా ఐహికమే కాని ఆముష్మికానికి చోటు మిగలడం లేదు. సామాన్యుడి జీవితంలోనూ, మాన్యుడి జీవితంలోనూ కూడా. జాతకచక్రం - "చేతికి" తలవంచేసింది. ఆయుర్వేదపు గుళికలు - "సూదిపోట్ల" కి హరించిపోతున్నాయి. ఆయుర్వేదం అనాగరికమూ - ఇంగ్లీషు మందులు ఫ్యాషనూ ఔతున్నాయి. వేదాలనూ శాస్త్రిలనూ నమ్ముకుంటే దినం తీరేటట్లులేదు. భక్తి, గౌరవం - వీటికోసమే తప్ప భుక్తికోసం సంస్కృతాన్నీ ప్రాచీనశాస్త్రిలనీ నమ్ముకుంటే రోజు గడవదు. తన జీవితం ఎలాగయినా వెళ్లమారిపోతుంది. పతంజలి సంగతేమిటి ? అతను రేపు పెద్దయ్యాక తన కాళ్లమీద తాను నిలబడి - తన పెళ్లాన్నీ పిల్లలనీ పోషించుకోవాలికద ? సంధ్యావందనం - గంజినీళ్ళు పోయదే. గంజికూడా తాగలేనివాడు సంధ్యావందనం ఏం చేస్తాడు ? ముప్పూటలా తిండి వుండేనే కళలయినా శాస్త్రిలయినా.

ఇలాగ ఆలోచించి - పతంజలిని - ప్రాపంచిక విద్యనేర్పే బడిలో వేశారు చయనులు విధిలేక.

పతంజలి విద్యాభ్యాసం - రెండుగుర్రాల స్వారీయే ఐంది. బడిలో ఆంగ్ల విద్యాభ్యాసం. ఇంటివద్ద - ఆశాచావక - చయనులుగారు చెప్పే సంస్కృతం. ఆపైన - పూర్వకాలపు మనుషులు వొస్తే ఆయుర్వేదపు మందులివ్వడం ... తండ్రికి - కుప్పెలూ కలకాలూ అవీ తయారు చేయడంలో సహాయపడడం. అలాగ గడుస్తూంది పతంజలి విద్యాభ్యాసం. తండ్రి వృద్ధుడౌతున్నకొద్దీ అతనికి బడి చదువుమీద కంటె యింటి పనులమీదే ఎక్కువ సమయమూ, శ్రద్ధా వినియోగించవలిసి వస్తూంది. పెరటిలోని ఓషధి మొక్కలకు సంరక్షణ ... పుటాలు పెట్టడం ... ఆసవాలు తయారు చేయడం ... చాలా కాలం యిదే ఖర్చవుతోంది. అతనికి సంస్కృతం పట్టుబడినంతగా ఆంగ్లం పట్టుబడడంలేదు. అతని రక్తంలోనే పాశ్చాత్యభాష పైనా, ఆ నాగరికతపైనా హేయభావం ఉందేమో.

అప్పటికి - ఇంకా కొన్ని పూర్వకాలపు కుటుంబాలుండేవి. చెదురు ముదురుగా. ఆ బ్రాహ్మణ కుటుంబాలలో ... శారదా చట్టం వొచ్చినా - "అష్టవర్షాత్ భవేత్ కన్యా." మాత్రమే. ఎనిమిదేళ్ల పార్వతిని - పన్నెండేళ్ల పతంజలి కిచ్చి ఘనంగా వివాహం చేసేసిన చయనులుగారు - కన్యాదానఫలం దక్కలేదే అన్న విచారంలో ఒక పేరాశకు పోయారు. కనీసం - మనవరాలి పెళ్లి అయినా చూడాలనీ చేయాలనీ. పార్వతి - పతంజలి మేనమామ కూతురే. మేనరిక ముండగా మరో సంబంధం చేయడం మహాపాపం. అదీగాక, పార్వతి తండ్రి కూడా చయనులులాగే సంస్కృత పండితుడూ ఆయుర్వేద వైద్యుడూ. అందుచేత ఆయనలాగే బీదవాడూ. కనుక నెయ్యానికీ వియ్యానికీ సమవుజ్జీ. కనుక పతంజలీ పార్వతుల వివాహం నిరాక్షేపంగా జరిగిపోయింది. చిత్రంగా - పార్వతి మెడలో మాంగల్యం ధరింపచేసిన క్షణంనుంచే ఆమె పతంజలికి ఆరోప్రాణం ఐపోయింది. ఆ లేత వయసులోనే ఆమె అంటే అతనికి అవ్యాజమయిన అనురాగం ఏర్పడసాగింది. బయటకు చెప్పుకుందు కవకాశం లేక - అతను తన అనురాగాన్నంతటినీ అంతరంగంలో దాచుకోసాగాడు. దానితో ఆ ప్రేమ దినదినాభివృద్ధీ, క్షణ క్షణాభివృద్ధీ కాసాదింది. స్నేహితులతో చెప్పుకుందుకు కూడా వీలులేని ప్రేమ అది. నిజానికతనికి స్నేహితులు కూడా లేరు స్కూలులో. సంస్కృతం చదువుతున్నాడు కదా అని చిన్న జుత్తు, పిలక ఉంచేరు చయనులు పతంజలికి. అతని భాషకూడా మిగిలిన పిల్లలకంటె భిన్నంగా ఉండేది. అతనెప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుండేవాడు. దీనితో అతన్ని మిగిలిన పిల్లలు తమలోని వాడిగా కాక పైవాడిలా భావించేవారు. దూరంగానూ ప్రత్యేకంగానూ ఉంచేవారు. అతనూ అలా ఉండడానికే అలవాటుపడిపోతూ వచ్చాడు.

ఒంటరితనం పతంజలితో గాఢమయిన స్నేహం చేసింది. అతనెప్పుడూ ఏదో కోల్పోయిన వాడిలా ఉండేవాడు. ఏ శ్లోకమో మననం చేసుకునేవాడు మనసులో. వివాహమయ్యే సమయానికతను కుమార సంభవం చదువుతున్నాడు ఇంటి దగ్గర తండ్రిముందు. చయనులు విద్య నేర్పే విధానం విలక్షణమైనది. సమయానుకూలంగా సందర్భాను సారంగా ఎన్నెన్నో విషయాలు ప్రస్తావనలోకి తీసుకు వొస్తారు. ముఖ్యంగా ఆయుర్వేదం, జ్యోతిషం వీటికి సంబంధించిన అంశాలను వేదాలనుంచి ఉదహరించి వివరించేవారు. ఆయన వేదపండు. వారు చెప్పేవన్నీ పతంజలి కర్థమవాలని కాదు. చెవిన పడ్డమాట వృథాగా పోదనీ, ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగానికొస్తుందనీ ఆయన అచంచల విశ్వాసం. తనకి తెలిసినదంతా పతంజలి మెదడులోకి ఎక్కించెయ్యాలని తండ్రి తాపత్రయం. బడిలో యిచ్చిన హోమ్‌వర్క్ కంటె తను చెప్పే చదువుకే ప్రాముఖ్యం యిమ్మనేవారు పతంజలిని. వృద్ధాప్యం దగ్గర పడుతూ ఆయనలో ఛాదస్తం ముదురుతోంది. దృష్టి మందగిస్తూంది. అందుచేత ఆయనకు పుస్తకపఠనావకాశం తగ్గి కాలక్షేపం కరువౌతూంది. పతంజలిని దగ్గర కూర్చోబెట్టుకుని గంటలకి గంటలు గడిపేవారాయన.

పతంజలి మెట్రిక్ పాసయ్యాడు.

యౌవనం అప్పుడే పొటమరిస్తూంది. చయనులు అతన్ని ఉపాధ్యాయుణ్ణి చేద్దామనుకున్నారు. పతంజలికదే తగిన ఉద్యోగమనిపించింది. గుమాస్తా పనులకంటె బడిపంతులు ఉద్యోగాలు కొంచెం మెరుగైనవి. మడికీ తడికీ సంస్కృతానికీ ఆయుర్వేద వైద్యానికీ, ఆముష్మికానికీ కొంత అవకాశం ఉండనిచ్చేది మాస్టరు గిరీయే. సంప్రదాయం సాగించుకుందుకు యీ వృత్తిలోనే వీలు. మాస్టరుపని గౌరవప్రదమైనది. నలుగురికీ పనికొచ్చేటట్లు నాలుగు మంచి ముక్కలు చెప్పొచ్చు. విద్యను అభివృద్ధి చేసుకోవచ్చు. పెద్ద ప్రయత్నం అక్కరలేకుండా దొరుకుతుంది ఉద్యోగం.

మనసులోని మాట కొడుక్కు చెప్పారు. "ఉన్న ఊళ్లో ఉన్న ఇంట్లో ఉండవచ్చు దేశాలు పట్టిపోకుండా. ఏదో ఉద్యోగంలో చేరితే. ఆ ఆటంకం తీర్చేసి .... పార్వతిని తెచ్చేసుకుంటే....ఇల్లు కలకలలాడుతుంది. ఏ.మంటావ్ ?" పతంజలి మనసు ఎగిరి గంతేసింది. పార్వతిని అతనప్పుడప్పుడు చూస్తున్నాడు. ఎంతెంతట ఆమెను కౌగిలిలోకి తీసుకుందామా అని తహతహలాడుతున్న పతంజలి —— "అలాగే" అనేశాడు వెంటనే. శుభస్య శీఘ్రం అంటూ చయనులు వెంటనే ముహూర్తాలు చూశాడు-పతంజలి ఉద్యోగంలో చేరేందుకూ, అతనికి శోభనం జరిపించేందుకూ, ఘనాపాఠీ...జ్యోతిష విద్వాంసుడూ ఐన చయనులుకి తను పెట్టిన ముహూర్తం ఎలా పరిణమించబోతూందో, ఎన్ని దారుణాలుజరుగబోతున్నాయో ఏమీ తెలియదు.

4

ఎదురుచూసిన శుభదినం రానేవచ్చింది. పతంజలి హృదయం ఆనందంతోనూ, ఆత్రతతోనూ అతన్ని ఒక్క క్షణం శాంతంగా నిలవనివ్వడంలేదు. అపరిమితమయిన సంతోషంతో అతని అంతరంగం నాట్యం చేస్తూంది. తనయింటనే శోభనమహోత్సవం జరగాలనిపట్టుబట్టి మరీ జరిపిస్తున్నారు చయనులు. "నాకున్నది పతంజలి వొక్కడే. వివాహ మహోత్సవమెటూ మీగృహానే జరిగింది. కనీసం పునస్సంధాన వేడుకయినా యీ యింటజరగనీ. మాయిల్లు కలకలలాడనీ—" అని ఆయన అనేసరికి వియ్యంకుడు కాదనలేకపోయాడు. పతంజలి తల్లికి ఆరోగ్యం తక్కువ. ఎప్పుడూ ముక్కుతూ మూలుగుతూ ఉంటుంది మంచం ఎక్కక పోయినా. ఆవిడ కూడా తెగహడావిడి పడిపోతూంది. ఆ పనితోనూ యీ పనితోనూ కిందామీదా ఐపోతూంది. తెల్లవారినప్పటి నుంచీ. చయనులు సంగతి సరేసరి. తెల్లవారినప్పటినుంచీ అదితేవాలిది తేవాలంటూ ఊరిమీదే ఉన్నారు. సిగ్గుతోనూ— మధుర మయిన ఊహలు మనసుని మైకం కమ్మిస్తూంటేనూ మౌనంగా— సాధ్యమయినంత వరకూ వొంటరిగా ఉంటున్నాడు పతంజలి. ఎంతెంతటి రాత్రౌతుందా, ముహూర్తం సమీపిస్తుందా, పార్వతిని కౌగిలిలోకి తీసుకుంటానా అని ఉవ్విళ్ళూరుతున్నాడు. పగలే తీయనికలలు కంటున్నాడు. సాయంత్రం ఔతూంది.

ముత్తయిదులు శోభనపు పెళ్ళికూతురిని అలంకరిస్తున్నారు. ఎవరో— మూలగదిని మనోహరంగా తీర్చిదిద్దుతున్నారు — రవివర్మ శృంగార చిత్రాలను గోడలకు వేలాడదీస్తున్నారు, పాన్పుకి పూలమిర్చుతున్నారు. గదికి కొత్తరూపుని తెస్తున్నారు. మదన మందిరంగా మలిచేందుకు తమ రాసిక్యాన్ని తెలివితేటలనీ మిళాయిస్తున్నారు. పంధొమ్మిది నిండిన పతంజలి— లేతయౌవనంలో... తలంటి పోసుకుని.... ధోవతి, ఉత్తరీయమూ కొత్తవి ధరించి — అపర మన్మధుడిలాగే ఉన్నాడు. అతనొకసారి పార్వతిని చూడడం సంభవించింది. మూర్తీభవించిన సౌందర్యంలో ఉన్న పార్వతి సందర్శన భాగ్యం అప్రయత్నంగా లభించిందతనికి. ఆ రూపం అతనిలో కలల అలలను రేపింది. అతనా కలల అలలలో తేలియాడుతూండగా—

గొల్లున గోల వినిపించింది.

పతంజలి త్రుళ్లిపడి – పరిగెత్తుకొచ్చాడు వీధిలోకి. నలుగురు మనుషులు ... చయనులిని మోసుకొచ్చారు. రక్తసిక్తమయిన అతని శరీరం – భయంకరంగా ఉంది. ఒక్కక్షణం పతంజలి కళ్ల

బైర్లు క్రమ్మాయి. ప్రమాదం జరిగిపోయింది. నిష్టానీమంవూ కల బాబు ... శవాన్ని కోస్తే పాపం ... ఎలాగో పోలీసుల కళ్లుకప్పి కట్టి నట్టుకొచ్చేశాం ..."

అర్థమైంది. దృష్టి సరిగాలేని చయనులు ఏ వాహనంకిందో పడ్డారు. మరణించారు. ఆయన బ్రాహ్మణ్యం తెలిసిన వీళ్లూ ... ఆయనంటే అభిమానమూ గౌరవమూ కలవారూ - ఆయన శవానికి పోస్ట్‌మార్టమ్ జరగకుండా .... పోలీసుల కళ్లుకప్పి - శవాన్ని మైల పడకుండా యిల్లు చేర్చారన్నమాట. తన కిటువంటి అసహజ మరణం రాసిపెట్టబడి ఉందని ఆయనకి తెలియదా? తెలిస్తే ఆయన జాగ్రత్త పడలేదా ? జాగ్రత్తపడదామనుకున్నా ఆ సమయానికి మాయ కమ్మేసిందా? విధి నెదురించలేక పోవడమంటే యిదేనా?

నిశ్చేష్టుడై నిలబడిన పతంజలి –

ధ్యానంలాటి దుఃఖలో మునిగిన పతంజలి –

ఆ కేకకు త్రుళ్లిపడ్డాడొక్కసారి. దిక్కులు పిక్కటిల్లే ... దిగంతాలు ప్రతిధ్వనించే ... భీతావహమయిన ... గావుకేక ... చావుకేక ...

ఆ ఆర్తనాదం - పార్వతిది.

సర్వాలంకార శోభిత... శోభనపు పెళ్లికూతురు... పార్వతి చయనులుగారి రక్తసిక్త మృతదేహాన్ని చూస్తూనే ఉన్నపాటున విరుచుకు పడిపోయింది. అందరూ ఆశ్చర్యపోయారు జరిగినదేమిటో తెలియక.

అక్కడున్న వైద్యుడు పతంజలే. ఎవరో చెప్పగా - అతనే ఆమె నాడి పరీక్షించి - మరీ మరీ పరీక్షించి - పెదవి విరిచాడు. నలుగురూ నమ్మలేకపోయారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో- మతి సరిగా లేక... మెదడు సరిగా పనిచేయక .... నాడీ నిదానంలో అతను పొరపాటుపడ్డాడేమో అనుకొని –

ఇంగ్లీషువైద్యుణ్ణి తీసుకొచ్చారు.

మెడలో స్టెతస్కోపు ... ఆ డాక్టరుగారు మరణాన్ని ధ్రువపరిచారు సాధికారంగా. తను వొచ్చినపని ఐపోయిందన్నట్లు ఆయన వెనుదిరిగేంతలో -

"అమ్మా !" అన్న ఆర్తనాదం,

గతుక్కుమని అటు చూశారు స్టెతస్కోపు డాక్టరు. పతంజలి తల్లి - అసలే రోగిష్టి అయిన ఆమె - దుర్భర దృశ్యాలకు తాళలేనట్లు ... కూలిపోయింది నిలువునా.

మళ్లీ స్టెతస్కోపు పరీక్ష.

"షాక్." అన్నారు డాక్టరు.

"ఐతే?" ఏమిటన్నట్లు చూశాడు పక్కనున్న ఇంగ్లీషురాని తెలుగు పెద్దమనిషి. ఆయన - "షాక్" అనేది ఓ జబ్బనీ - దానికేదో యింజక్షనిచ్చి డాక్టరు ఆమెని బ్రతికిస్తాడనీ అమాయకంగా అనుకున్నాడు. "షాక్‌వల్ల యీావిడ గుండె ఆగి చనిపోయింది." అచ్చతెలుగులో చెప్పేసి వెళ్లిపోయాడు ఇంగ్లీషుడాక్టరు. ఆమె పతివ్రత. భర్తతోడిదే ప్రపంచంగా బ్రతుకుతూ వొచ్చిన యిల్లాలు. అక్షరాలా అర్ధాంగి అనిపించుకుందుకా అన్నట్లు- మృతుడయిన భర్తను చూస్తూనే తానూ మృత్యువును చేరింది. ఆదర్శవంతమయిన సహగమనమేమో యిది. ! ఒకవిధంగా యీావిడ మరణానికేదో ఒక అర్థమంటూ తోచి - అంత ఆశ్చర్యమనిపించలేదు. కాని - జీవితం అంతా ముందే ఉన్న ... చయనులుకి కేవలం మేనకోడలు మాత్రమే అయిన ... పతంజలికి ప్రణయాధి దేవతయిన పార్వతి ఎందుకు చనిపోయింది? ఇది ఎవరికీ తెగని ప్రశ్నగా మిగిలిపోయింది. చిన్నపిల్ల కనుక మరీ సన్నిహితంగా ఎదురుపడిన మృత్యువుని చూసి భయపడిందా ? భయంవల్లనే ఆమె మరణించిందా ?

కొంచెంసేపట్లో కలకలలాడవలసిన యింటి ముంగిట మూడు శవాలు! జ్యోతిషప్రకాండుడు స్వయంగా తన పుత్రుడి శోభన మహోత్సవార్థం పెట్టిన ఘనమయిన ముహూర్తానికి - మూడు మృత్యువులు! కళ్యాణపందిర ముందర మూడు కట్టెలు !

ఊరు విరగబడి చూసింది ఆ మూడు శవాలనీ. అదొక ఆశ్చర్యకరమైపోయింది అందరికీ. తెలిసినవారూ తెలియనివారూ కూడా రావటం, శవాలను చూసి వెళ్లడం. ఒకే యింట ఒకే సమయంలో మూడుశవాలు. వింతకాక మరేమిటి? దుఃఖానికీ వియోగానికీ యింతకంటె పరాకాష్ట యింకేముంటుంది ఒక సామాన్య గృహస్తుడి యింట?

మిగిలినవాడు పతంజలి. అతని వాలకం చూస్తూంటే అతనిహ లోకంలో ఉన్నట్లులేదు. అతని కళ్లు తెరుచుకొని ఉన్నాయి. కాని అవి దేనినీ చూడడంలేదు. అతనిలో జీవమూ ప్రాణమూ ఉన్నాయి. కాని అతనిలో చైతన్యం విలుప్తమయింది. అతను శిలలాగ మిగిలి ఉన్నాడు. అతని కన్నులు కనీసం ఆర్ద్రత కూడా చెందలేదు. పొడిగా ఉన్నాయి. అతను గొంతువిప్పి దుఃఖించడంలేదు. మూగగా... మునిలా ఉన్నాడు.

మూడు శవాలనూ చూస్తూ – మౌనంగా – కూలబడి ఉన్నాడతను. అతన్ని పలకరించేందు కెవరికీ సాహసం చాలడంలేదు.

ఒక మరణపు దుఃఖానికి ఓదార్పు నివ్వడమే కష్టం. తల్లి... తండ్రి... భార్య ... ఒకేసారి ముగ్గురు ఆప్తులనీ పోగొట్టుకుని ... మూడు మరణాల దుఃఖాన్ని భరించవలసివొస్తున్న యితన్నేమని ఓదార్చడం? ఎలా ఓదార్చడం ? ఇటువంటి ... యింతటి... విషాదాన్ని ఒక్కసారి ఎదుర్కోవలసివచ్చిన సామాన్యమానవుడు యెవరెవరయినా ఉంటారా? ఇంత దుఃఖసాగరాన్నీ చిన్నవాడెలా యీదగలడు?

ఏమిటా మౌనం ? ఏమా గంభీరత ? వీటి భావమేమిటి ? వీటి సూచన దేనికి ? తుఫాను ముందరి ప్రశాంతంలాగ జరగబోయే మరో ఘోరానికయినా యీతని నిశ్శబ్దం హెచ్చరిక కాదుకద ?

చెమర్చనయినా చెమర్చని కన్నులు ...

అమ్మా అని అయినా విలపించని నోరు ...

చలనంలేని శరీరం ...

పతంజలికేం కాబోతూంది ?

ఎవరికోసమూ ఆగని కాలం – తనమానాన తాను ముందుకు పరుగెడుతూనే ఉంది.

" పతంజలీ! " భుజంమీద చెయ్యి వేశాడు మామగారు ఓదార్పుగా. " లే నాయనా ... ఏదిమాత్రం తప్పుతుంది ? మనం నిమిత్తమాత్రులం. భగవంతుడు ఎలా ఆడిస్తే అలా ఆడవలసిన ఆటబొమ్మలం. వీధంతా భోజనాలు మానుకుని కూర్చుంది. దహన సంస్కారాలు కావిస్తే .. "

అప్పటివరకూ పెద్దలు - ఒకేసారి ఒకే మనిషి - మూడు శవాల కంత్యక్రియలు జరపడం గురించి ధర్మశాస్త్రాలు తిరగేశారు. లజుగుజులు బడ్డారు. తికమకలై పోయారు. చివరకు ఎలాగో ఓ నిర్ణయానికి రాగలిగారు.

పతంజలి – మారుమాట లేకుండా – లేచాడు. అయినవాళ్లు అందరూ తలో కొమ్ము కాశారు. మూడు శవాలూ లేచాయి. గుండె పగిలేలా ... మనసారా ఏడ్వడాని కెవరున్నారని ? ఉన్న పతంజలి మూగవోయాడు అవధిమీరిన దుఃఖంతో పార్వతి తల్లితండ్రులు గొల్లుమన్నారు. శవాలు కదిలాయి.

ఆవేళ - కాటికాపరికీ ఉక్కిరిబిక్కిరే అయింది. ఆ చిన్న వూరిలో ఒకేసారి మూడు కట్టెలను తగలేసేందుకు తీసుకువొచ్చిన ఏకైక సందర్భం అదే.

తండ్రి... తల్లి... భార్య...

మూడు చితులకీ అగ్ని సంస్కారం గావించాడు పతం వెర్రివాడిలా ఉన్నాడతను. పురోహితుడేమయినా చెబితే చేస్తున్నా లేకపోతే నిశ్చలంగా ఉండిపోతున్నాడు. అందరికీ అతన్ని చ జాలితో ఏడుపొస్తూంది.

అత్యల్ప వ్యవధిలో మూడు మరణాలు. అవీ

శుభమా అని శోభనానికెదురుచూస్తున్న ఆనంద గడియలం ఎలా భరిస్తున్నాడీ కుర్రవాడు ?

అందరి హృదయాలలోనూ అమితమయిన సానుభూతి అ పట్ల. ఐతే పతంజలి దృష్టి మాత్రం వీరివేపులేదు. ఎక్కడో ఉ మనస్సు శిలాయి ఐపోయినట్లు ... హృదయం ఆర్ద్రతని కోల్పో నట్లు గాజుబిళ్ళలాటి కళ్ళతో...

మింటివేపు ఎగసిపడుతున్న చితిమంటలని చూస్తున్నాడత అగ్నిశిఖలు ఎర్రనిపాముల్లా నాల్కలు సాచుతున్నాయి. అతని దృ తదేకంగా ఆమంటలమీదే లగ్నమై ఉండిపోయింది. కళేబరాల దహిస్తూ ఎంత అనందంగా నృత్యం చేస్తూంది అగ్ని! మానవ శ మంటే అంత తృప్తికాబోలు అగ్నిదేముడికి !

ఠాప్ మన్న శబ్దం.

త్రుళ్ళిపడ్డాడు పతంజలి.

"కపాలమోక్షం జరిగింది——" అన్నా రెవరో.

ఆమాటలు పతంజలికి వినపడలేదు. చితిమీద-లేస్తూన్న శవాని -కాటికాపరి కర్రతో నొక్కిపెడుతూంటే .... మంటలలోకి అదిమిపె తూంటే ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

కాలం గడుస్తోంది. శవాలు దహనం ఔతున్నాయి. "పతంజలీ ఇకపద——పోదాం." ఎవరో అతని చెయ్యిఅందుకుని లేవదీశారు అతను మరబొమ్మలాగ లేచాడు నిమిత్తమాత్రుడైనట్లు. అతనిల్లు చేర కున్నాడు. ముఖ్యమయిన బంధువులు మినహా మిగిలినవాళ్ళు ఎవరిళ్ళ వారు వెళ్ళిపోయారు.

మామగారు- అంతదుఃఖంలోనూ- పెద్దరికం కొద్దీ- "కొంచె ఎంగిలిపడు నాయనా !" అంటూ బ్రతిమాలారు. పతంజలికి ఆక వెయ్యడం లేదు. దాహం కలగడంలేదు. అతనికి నోరుతెరచి మాట్లాడా లని ఎంతమాత్రము లేదు. అతనికి ఒంటరిగా ఉండాలని ఉంది. చుట్టూమనుషులుంటే మహ చికాకుగా ఉంది. అతను నాలుగు మెతు

ులు కోరికి భోజనం చేసినట్లు నటించి - గదిలోకివెళ్ళి తలుపులు రాసేసుకున్నాడు.

అతనికి నిద్రపట్టడంలేదు - ఎంత ప్రయత్నించినా. గట్టిగా న్నులు మూసుకున్నాడు బలవంతగా. ఆ వొత్తిడికేమో కన్నులలోకి ువొచ్చింది.

ఒక్కసారిగా- గుండెలలోకి దుఃఖం వొచ్చింది.

హృదయంలోకి వాస్తవం వొచ్చింది.

అతను నిలువునా వొణికిపోసాగాడు. అంతవరకూ శిలలాఉండి ోయిన అతను - మనిషి కాసాగాడు. కన్నీరు దుఃఖం—బాధ— న్నీ వొచ్చేస్తున్నాయతనిలోకి.

ఎంత దయలేనిదానవు నీవు మృత్యువూ ! ఎంత విచక్షణా ాహిత్యం నీలో! నే నెదురు చూస్తున్నదేమిటి నా కెదురయిన ిమిటి !

ఒక్క నిముషంలో నన్ను ఎవరూలేని ఏకాకిని చేస్తావా! న్నగారంటే నాకెంతో అభిమానం! అమ్మంటే నాకెంత ఆప్యాయత! ార్వతంటే నాకెంత అనురాగం! ఒక్కసారి ముగ్గురినీ పొట్టబెట్టుకుని- ాకీ లోకాన్ని శూన్యసదృశం చేస్తావా!— ఎంత క్రూరమయినదానివి! ంత కఠినాత్మురాలివి! వయసు చూడక—ఆరోగ్యం చూడక—ఎవరి ెదపడితే వారిమీద నీరెక్కలనీడ పరచడానికి ఎవరిచ్చారు నీకధికారం? ్యాయాన్యాయాలను పాటించకుండా ఎవరిని పడితే వారిని బలితీసు ునే హక్కు నీకెక్కడిది?

చెప్పు— చెప్పవేం ?

వైద్యశిఖామణి అయిన నాన్నగారిని— అమృత హృదయిని ుయిన అమ్మని— అనురాగదేవత అయిన అర్ధాంగిని— ముగ్గురినీ ఒక్కసారే మింగేసిన నీ రాక్షసి ఆకలికి హద్దక్కడ? యుక్తాయుక్త విచక్షణా జ్ఞానంలేని ప్రవర్తనకి - నీకు సిగ్గువెయ్యడంలేదూ ?

పిడికిళ్లు బిగించి ప్రశ్నిస్తున్నాడు పతంజలి.

పిచ్చివాడిలా గాలిలోకి చూస్తూ అరుస్తున్నాడు.

అతని గుండెలు మండిపోతున్నయ్.

అతనికి - శూన్యంలో - మృత్యువు రూపందాల్చి కనిపిస్తున్నట్టే ఉంది. అతను మృత్యువుని సవాలుచేస్తున్నట్లే చేతులు విసురుతున్నాడు; మాటలు రువ్వుతున్నాడు.

పతంజలిలో—

సంఘర్షణ.

అతనిలో - ఆరనిపగ. తీరనికసి. ద్వేషపు జ్వాలలు వాసుకి వేయి నాల్కల్లా విరుచుకుపడుతున్నాయి. బిగుసుకున్న పిడికిళ్ళు అతని పంతానికి ప్రతీక లౌతున్నాయి.

నేను మిగిలి ఉన్నాను; ఆప్తులూ ఆత్మీయులూ అందర్నీ నువ్వు నిర్దాక్షిణ్యంగా కబళించినా, నువ్వు చేసిన పొరపాటు యిదే. నన్ను మిగిల్చి ఉంచడం. పార్వతి— నా ప్రణయదేవతను కూడా కోల్పోయిన నేను జీవించడం వ్యర్థం కానీ- జీవిస్తాను. ఎందుకో తెలుసా ? నీ మీద పగతీర్చుకోడానికి. నిన్ను జయించడానికి. నా జీవితానికి— భవిష్యత్తుకి— యిదే అర్థం— పరమార్థం.

ప్రతిజ్ఞ పూనినట్లే అన్నాడతను. ఆ క్షణంలో అతనికి ఆయుర్వేదం ఆశీర్వదించినట్లూ, జ్యోతిష్యం తథాస్తు అన్నట్లూ, సంస్కృతం సెహభాష్ అన్నట్లూ అనిపించింది. వినిపించింది.

పతంజలి గాఢంగా ఊపిరి తీసుకున్నాడు.

(ఇంకా వుంది)

శ్రీ పొట్లపల్లి సీతారామారావు

మహాప్రస్థానము - ప్రతిభా వైభవము

(గతసంచిక తరువాయి)

శ్రీశ్రీ విషయంలో కూడ పొగగొట్టపు భూంకార ధ్వనులు - రాబందుల రెక్కల చప్పుళ్ళు - వీర రస స్ఫోరకంగా ఉత్సాహ ద్రవ్యాన్ని నిష్యందిస్తున్నవి. ఇలా శ్రీశ్రీ కవిత్వంలోని శబ్దజాలం నెఱపే ఇంద్రజాలం వెనుక వ్యంగ్యం యొక్క హస్తం వున్నది. ప్రతి శబ్దం - ప్రతివాక్యం హృదయములోనికి చొచ్చుకుపోయేటట్లు చేసే అనితరలభ్యమైన ఒక ప్రత్యేకశక్తి శ్రీశ్రీకి ఉన్నది. ఈ శక్తి అభిధగా ప్రత్యక్షమై వ్యంజనగా మనసును పరవశింప జేస్తుంది. ఇదీ శ్రీశ్రీ విశిష్ట రచనా మార్గం.

మహాప్రస్థానములో ప్రధానమైన ఖండికలు మరోప్రపంచం - జగన్నాథరథచక్రాలన్నవి. ఒకటి రజోగుణమునకు రెండవది సత్త్వ గుణమునకు ప్రతీకాప్రాయములు. మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం - అంటే లోకాంతరయాత్ర, ధర్మరాజాదులు లోకాంతర యాత్రలు చేయటం వంటిది. ఈకవి అతిలోకమైన అతిమానుషమైన స్వర్గతుల్యమైన ఆనందాభ్యుదయలోకం అని భావించి వ్రాసి యుండ వచ్చు. మహాప్రస్థానం అంటే ఝుడితి స్ఫురణ మాత్రం మరణ సూచకమైన దీర్ఘప్రయాణం అనేదానిమీదే ఉంటుంది. అది కవి అభిప్రాయం కాదు. కవి ఆశయానికి మరోప్రపంచం ఖండిక అర్థవాదప్రాయంగ ఉన్నది.

"మరోప్రపంచం మరోప్రపంచం
మరోప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి తోసుకు
పదండి పోదాం పైపైకి

* *

హరోం హరోం హర
హరహర హరహర
హరోం హరా అని కదలండి

* *

వార్షుకాభ్రముల ప్రళయఘోష వలె
ఫెళ ఫెళ ఫెళ ఫెళ విఱుచుకుపడండి
పదండి పదండి పదండి ముందుకు"

త్రివర్గాలలో మానవునకు ప్రధానంగా ధ్యేయమైనది ధర్మం. అర్థకామాల ఆచ్ఛాదనలో కుమిలి కుమిలి సతమతమౌతూన్న ధర్మాన్ని తూచ పాటించే కళ్యాణదాయకమైన స్వప్నలోకాలను వాటి సందేశాలను కనుమని వినుమని శబ్ద శిల్పంతో లయదప్పని పాద విన్యాసంతో జీవ లోకాన్ని ఉద్వేగపరుస్తూ చేసిన రచన యిది.

"కనబడలేదా మరోప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలు
హోమజ్వాలల భుగభుగలు
ఎఱ్ఱబావుటా నిగనిగలు."

ఎఱ్ఱబావుటా నిగనిగలకు ఒకరు తమ భావాలకు అనువుగా వ్యాఖ్యా నించుకుంటే హోమజ్వాలల భుగభుగలకు కొందరు తమ భావాలకు అనువుగా మలచుకొంటారు. ఇదీ లోకంతీరు. అంతేగాని పరమార్థం చూడరు. ఇందులో బాణీ జానపదగీతాలలోనిదేనైనా - శబ్దవిన్యాసంలో అర్థం స్ఫురించకపోయినా - వచ్చే అనుభూతి హృదయాన్ని రగిలించి-నరాలు కదిలించి - రక్తం చిందించి - పరవళ్ళు త్రొక్కించి ఎగిరి ఎగిరి పడే మేరువులతో జలప్రళయ నాట్యాలలో చేయి చేయి కలిపిస్తుంది. కవి సంతరించుకోవలసిన ప్రధాన ద్రవ్యాలు రెండు. ఒకటి అర్థం. రెండు అనుభూతి. ఈ అనుభూతి అనేది అర్థం చర్వణం పొందినా జరుగుతుంది. లేదా తావన్మాత్రంగా అర్థం స్ఫురించినా గ్రథన కౌశలం వలననూ కలుగుతుంది. ఈకవి ఈరెండవ మార్గంలో సిద్ధహస్తుడు. ఒక విలక్షణమైన అనుభూతిని పాఠక లోకానికి ప్రత్యేకంగా అందిస్తున్నాడు.

ఈయన కవితావేశం కడముట్ట వెళ్ళేవరకు వెనుక చూపు లేనిది. ఆవేశం ఊపులో- ఒళ్ళుతెలియని పదబంధాల కూర్పులో- పొంగి పరవశమై ఉరవడిగా పొంగే రచనలో- అర్థం అనుసరిస్తుందో లేదో అని వెనుకకు తిరిగి చూచుకొనే ఓపికగానీ, ఆగి ఆలోచించుకొనే ఓర్పుగానీ, ఈ కవికి లేదు. అంతా ఆ ప్రతిభకే వదలిపెట్టి నీ మహిమ అని వూరుకుంటాడు. అదీ చాలావరకు ఈయనని రక్షిస్తుందికూడ.

"ఇరవై కోఱల అరవై కొమ్ముల
ఘోరక్రూర కర్కోటకులో
కర్కాటక కర్కోటకులో"

ఈ కర్కాటక శబ్దం వాడటం 'కర్కోటక' శబ్దములోని క్రూరత్వాన్ని ధ్వనింపజేయటానికే గాని దానికి వున్న అర్థబలాన్ని బయలు పరచటానికి కాదు శబ్దశక్తిని మాత్రమే ఆశ్రయించి ధ్వని కల్పించడమే- చమత్కారం సాధించటమే- యిక్కడ ప్రయోజనం ఇక్కడ అర్థానికి స్థానంలేదు.

హింసనచణ ధ్వంసరచన
ధ్వంసనచణ హింసరచన
విపవాయువు మరఫిరంగి
టార్పిడో టోర్నాడో
....
అరె ఝా ! ఝా !
ఝుటక్ ! ఫటక్ !

ఆవేశం నడిపించినట్లు శబ్దాలను ప్రయోగించడమేనా ? అర్థం ఆలోచించుకొన వద్దా ? ఎంత ప్రతిభ వుంటే మాత్రం అది అవ్యక్త ప్రేలాపనలకు అర్థావగతి కలిగిస్తుందా ?

"లోకాలు
భవభూతి శ్లోకాలు
పరమేష్టి జూకాలు
నా మనోద్రేకాలు"

అను ప్రాస కొఱకు పాపం పరమేష్టికి కూడ ఇక్కడ జూకాలు తగిలించుకోటం తప్పలేదు.

"నావూళ కేదారగౌళ"

నక్కలు వూళలు వేస్తాయి. కేదారగౌళలోని గౌళ కొఱకు యిక్కడ కవికిగూడ వూళవేయవలసిన కర్మవచ్చింది. ఇలాంటి చోట్ల అర్థంగాని అనుభూతిగాని పైకి పొంగటంలేదు. మనస్సును ఆకట్టుకోటం లేదు. ఇవన్నీ అల్పమైన విషయాలు. వీటిని పొక్కనీయని అంతటి కార యిత్రీగుణం - శబ్దాల బిగువూ-సంయోజనములో ఒడుపూ - ఈయన కవిత్వానికి శ్రీరామ రక్షగా నిలిచాయి.

"ఉఱుములు మెఱుములు
ఉటారు తీగెలు
... ..."

కాళ్లాగజ్జా కంకాళమ్మ"

ఇవన్నీ భావుకత్వానికి భ్రమపడే పసిపిల్లల హృదయాలను అలరించే ప్రాథమిక కవిత్వాలే. అర్థం పరచుకొని ప్రసరించకపోయినా శబ్దాలలో బిగువుంది. ప్రాథమిక దశలో కవి యిలానే వ్రాస్తాడు. శ్రీశ్రీ కవిత్వంలో కొంత ఈ లక్షణం కన్పిస్తుంది. వాటికి ఎలా అర్థాన్ని నిర్ణయించలేమో శ్రీశ్రీ కవిత్వంలో గూడ కొంత వరకు అంతే. ఇదంతా కవితా నిర్మాణములోని ప్రాథమిక దశను సూచిస్తుంది. పాపం ఒక కవి తన ప్రాథమిక కవితా దశలో ఒక అందగత్తెను వర్ణించటానికి ప్రయత్నించాడు.

"స్తనే సుపీనే కఠినే ఠినే ఠినే
కటిర్విశాలా రభసా భసా భసా"

ఠినే ఠినే – భసా భసా అనేవి అర్థం లేనివి. భావనాశక్తికి చాలినంత శబ్దశక్తి చాలనికవి స్వతంత్రించి ఈ శబ్దాలు వాడినాడు. ఠినే ఠినే అంటే స్తనకాఠిన్యాతిశయాన్ని భసాభసా అంటే కటిపరిణాహత్వాన్ని వూహించుకోవాలి. కవిత్వంలోని ప్రాథమిక స్థితియిది. కవి కంఠాభరణంలో క్షేమేంద్రుడు దీన్ని నిర్గుణత్వానికి ఉదాహరణంగా యిచ్చినాడు. ఇది వ్రాసిన కవికి భావనాశక్తి ఉంది. అర్థగౌరవానికి తగినట్లు శబ్దశక్తి. అందక పాపం సతమత మవుతున్నాడు. శ్రీశ్రీ పద్ధతి దీనికి ప్రతీపం. శబ్దశక్తివుంది. అర్థభావాలు ఏర్పడటం ప్రతిభ దయమీదే అధారపడి వుంది.

"ప్రాయశోయమకే చిచ్చిత్రేరసపుష్టిర్న దృశ్యంతే"

అని ఆలంకారికులు ఎంత నెత్తిని నోరుపెట్టుకొని ప్రవచించుకున్న వారిత్రోవ వారిదే కవులత్రోవ కవులదే అయినది. శ్రీశ్రీ కూడ దానికి అపవాదం కాదు. ఈయన కవిత్వంలో యమక కవిత్వపు ధోరణులు - చిత్రకవిత్వపు పద్ధతులు - ఉక్తి వైచిత్ర్యపు కసరత్తులు - కుప్పలు తిప్పలుగా కనిపిస్తాయి.

"కన్నుల నిండిన కావిరిలో
కావిరి నిండిన కన్నులలో
కన్నులలో కావిరిలో
ఘోషల భాషల ఘంటల మంటల
కంటక కంఠపు గణగణలో
చిటికెల మెటికెల చిటపటలో "

ఇలా మాట విరుపులతో- వదలిన చరణాలనే మళ్ళీ మరొక విధంగా ఆ వృత్తి చేయటంలో - చమత్కార సాధకాలుగా - మాటలు దొర్లించడంలో-యమకగు చిత్రకవిత్వపు ధోరణులకు సన్నిహితంగా పోతున్నాడు. వీటిలో అర్థం అందినా అందక పోయినా అనుభూతి హృదయాన్ని ద్రవీకరిస్తుంది. ఇలా మాటలను వెనుకముందులకు మార్చి కూర్చటంలో అర్థావగతిలోని సూక్ష్మసూక్ష్మములైన భావచ్ఛాయలు బుద్ధికి తళుక్కుమని అందుతాయి.

జీవితం గాడాంధకారమయం. దేశములో ధర్మానికి చ్యుతి కలిగింది. పరిదీనమైన పేదవాని జీవితం- "ధనవంతుల కరాళ హస్తాలలో నలిగి పోయిన దరిద్రుల జాలిగాథలు-" "శిశువును ఒడిలో నిడుకొన్న జవరాలి మనః ప్రపంచపుటావర్తాలు-" "కడుపు దహించుకుపోయే పడుపు కత్తెరాక్షస రతిలోని బాధల పల్లవులు-" మేఘాలావర్జించిన నడి సముద్రం ఘోషించిన శంఖారావ ఢంకా రావాలు-" శ్రీశ్రీ కవిత్వములో వాచ్యార్థ రమణీయత్వాన్ని సాధిస్తూ అంతకు మించిన పారమార్థిక జీవన లక్ష్యాన్ని కూడ వ్యంగ్యంగా సాధిస్తున్నాయి. వాచ్యార్థం కంటే వ్యంగ్యార్థమే ఉదాత్తంగా సాధితమైనది.

వ్యాకరణాలూ, ఛందస్సులూ. పాటించని వట్టిరసపారవశ్యంతో మాత్రమే పెగిలి వచ్చిన రచనా విశేషం తనది అది పాఠకులకు పరోక్షంగా విన్నవించుకొన్నారు. తానుపొందినరసానందస్థితి ఎలాంటిది? అది అదిమరేమీ కాదు. ఆలంకారికులు నిర్వచించిన విగళిత వేద్యాంతర స్థితియే అది సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతము" - "అమోఘం' - 'అగాధం - 'అచింత్యం' - 'అమేయం' - 'ఏకాంతం' - 'ఏకైక క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం' - 'బ్రహ్మానుభవం కలిగించిన నను కరిగించిన కవన ఘృణీ! రమణీ! కవితా! ఓ కవితా!"- ఇదంతా అలంకార శాస్త్రంలో వున్న విషయమే. భంగ్యంతరేణ చెప్పబడింది.

"నానుడి నీ గుడిగా
నా గీతం నైవేద్యంగా
హృద్యంగా అర్పిస్తానో"

అని తాను భక్తుడ నని ధ్వనింపజేస్తున్నాడు.

"అగ్ని సరస్సున వికసించిన వజ్రం
ఎగిరే లోహశ్యేనం
ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం"

మళ్ళీ ఈరచన కొంత ఆంగ్లములో పరిచయముండి ఆ సంప్రదాయము తెలిసినవారికి గాని తెలియని రచనావిశేషములివి. మనకు తెలియని సంకేతాలివి. కొంత ఆయన నిర్ణయించుకొన్న స్వయం సంకేతములు కూడ యిందున్నవి, "కవితా! ఓ కవితా!" అనే శీర్షికలోని పంక్తులివి. ఆయన కవితా స్వరూపం చాల వరకు దీనిలో బహిర్గతమౌతుంది.

సుప్రసిద్ధ సంకేతితములైన శబ్దార్థాలనే వాడవలెనని పూర్వుల సంప్రదాయజ్ఞుల నియామకం. అట్లు వాడిన రచన యావత్తూ ఈయనను తారాపథానికి ఎత్తివేసింది. అట్లు వాడని మిగిలిన కావ్యములో సంకేతము అగోచరమై భావాన్ని వూహించుకోలేము. ఉక్తి చమత్కారం మాత్రం తానున్నానన్నట్లు తళుక్కుమంటుంది. తరువాత ఈయన అనుయాయులందరకూ ఈయన కవిత్వములో ఉన్నతమైన విలక్షణమైన రచనాశక్తుల కంటె స్వయం సంకేతములైన భావాలను మాత్రమే వెదజల్లే నేర్పు అలవడి రచనలకు అయోమయ ముద్ర కొట్టింది. పాఠకుణ్ణి అలజడిపాలు చేసింది.

దిక్కులేని జీవుల దీనగాథలపట్ల నిర్వేదం ప్రధానంగా ధ్వనించేస్తూ యువకుల రక్త ప్రవాహాన్ని ఉద్రేకిస్తూ సర్వం జగన్నాథ అన్న నానుడికి కారకుడైన జగన్నాథుని రథచక్రాలను భూమార్గాల సంచరించటానికి ఆహ్వానిస్తూ సర్వ జగత్కల్యాణాన్ని కాంక్షిస్తూ కావ్యమును పరిసమాప్తి చేశాడు శ్రీశ్రీ.

కవికి శక్తి వుండాలేగాని దేనినైన కవితామయం చేయవచ్చు అన్న అలంకారిక సంప్రదాయాన్నే భంగ్యంతరేణ

"కుక్కపిల్లా
సబ్బుబిళ్ళా
హీనంగా చూడకు దేన్నీ
అంతా కవితామయమేనోయ్"

అని తన ధోరణిలో వివరించిన ఈ కవిని సంప్రదాయవాది కాదనట ఎలా? స్వయం సంకేతితములైన శబ్దాలను వాడటం ఒకటే ఈయన లోని నూతన ప్రక్రియ. అది క్రొత్తదనంగా కనిపించినా ఉరుకుల పరుగులుపెట్టే ఈయన కవిత్వాన్ని అర్థం చేసుకొనే పాఠకుడికి కొం ఆత్తుకప్రాయంగా నిలిచింది. భావాలు నురుగులు క్రక్కుకుంటు పొగలుజిమ్మే ఆవిరిపొంగుగా ఉన్న - శబ్ద రచనాపాటవంతో కూడిన ఈయన కవిత్వం లోకప్రసిద్ధి పొందటానికి పుష్పాతిక మూడుపాళ సంప్రదాయ మార్గమే కారణం. ఈయన వాడిన శబ్దాలు ఆధుని లోకములో రాజకీయావేశాల ఉపన్యాసాలలో వాడే లాఘవమైన ధోరణిలో ఉన్నవి. శబ్దాలు అర్థాలను, అనుభూతులను అందించినట్లే కొన్ని ఛాయలు వెదజల్లుతాయి. ఈ కావ్యంలోని శబ్దాల ఛాయల ధ్వనించే పరమార్థాన్ని గమకం కానీయనంత చిక్కగా ఆధుని రాజకీయ సాంఘిక ఛాయలను వెదజల్లుతాయి. దీనివలననే పలువుర నేటి సమాజానికి, కొందరు తమ రాజకీయ సిద్ధాంతాలకూ అనువుగా వ్యాఖ్యానించుకోటానికి వీలిచ్చింది.

శ్రీశ్రీ కవిత్వంలో మరో ప్రాణప్రదమైన లక్షణం ఉక్తి వైచిత్రితో గుబాళించిన వాక్యం పాటు.

"ఏ జాతి చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం

పరపీడన పరాయణత్వం
చెంగిస్ఖాన్ తామరలేనూ
నాదిర్షా, గజనీ, ఘోరీ,
సికిందరో – ఎవడైతేం, లే
ఒక్కొక్కడు మహా హంతకుడు
చరిత్రమున ప్రసిద్ధికెక్కెరి ''

కవి చెప్పటంలోని ఒడుపులో ఈ కావ్యం ఎంతో ఆకర్షకంగా నిలిచింది.

"రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు
జగమంతా తడిసె రక్తమున
కాకుంటే కన్నీ ళులతో"–

ఈవిధంగా ఉన్న రచనలో ఆర్ద్రతను, పోషిస్తూ వచ్చిన వాక్యం పాటులోని అందం – ఎవడైతే ఏంలే, ఒక్కొక్కడు మహా హంతకుడు – అనటంలోని ఉక్తి చమత్కారం ఈదేశ చరిత్రలు అన్న రచనకు వున్నత స్థాయిత్వాన్ని కలిగించాయి.

"సలసల కాగే చమురా! కాదిది
ఉష్ణరక్త కాసారం''

ఇక్కడ ఉపమేయం ద్రవ్యం ఉష్ణరక్తం, దీనిని సలసల కాగే చమురు యొక్క ఔపమ్యంతో ఒక క్రొత్త దీప్తి – మళ్ళీ దానికి కాసారత్వ సంభావనచేత అది మాత్రమైన దీప్తి రావటానికి ఈయనలోని ఉక్తి వైచిత్రియే కారణం. ఉష్ణరక్తం సలసలమని క్రాగుతూ ఉంది, కాసారంలా వ్యాప్తిపొందింది, అంటే యింత వైలక్షణ్యం వుండదు. ఇలా అనడం ఆయన కవిత్వంలోని ఒక ప్రత్యేక విచ్ఛిత్తి విశేషం.

"అలజడి మా జీవితం
ఆందోళన మా వూపిరి
తిరుగుబాటు మా వేదాంతం

....

అదృష్టవంతులు మీరు
వెలుగును ప్రేమిస్తున్నారు
ఇతరులను ద్వేషిస్తారు –
మంచికి చెడ్డకు నడుమ
కంచుగోడలున్నాయ్ మీకు
అందుకే వడ్డించిన విస్తరి మీ జీవితం

... ...

మాకు గోడలు లేవు
గోడలను పగుల గొట్టడమే మా పని''

దీనిలో సొగసులన్నీ ఉక్తి వైచిత్రికి ఉదాహరణాలే. మమత్వం పోగొట్టుకున్న అహంకార ప్రశమనత్వం పొందిన సన్యాసి మనస్సునకు సంకేత ప్రాయంగా రాయబడినదేమో యీ రచన. అలజడి – ఆందోళన – గోడలు పగులగొట్టడం ఈ బాపతు పైపై శబ్దజాలాన్ని తీసుకొని తమ సిద్ధాంతాలకు రాజకీయ రంగులు పులిమి తమకు ఆత్మీయులుగా శ్రీశ్రీని భావించి అనేక సిద్ధాంత రాద్ధాంతాలతో ఈయనను పైకెత్తటం నిజంగా చూస్తే ఆయన కవితాశక్తికి – లక్ష్యశుద్ధికి – న్యాయం చేకూర్చటం కాదు. ఆయన కవిత్వంలో అంతర్లీనంగా ప్రసరించేది నిరీహత్వం – దానికి అంగంగా ఉన్నది ఉత్సాహం – అడ్డుగోడలు లేని విశాల దృక్పథం – పేద ప్రజల బాధలపట్ల తనలో గలిగిన అలజడి – ఆందోళన – అసహిష్ణుత్వం. పేద ప్రజలను ధనిక సమూహం పైకి పురి కొల్పుతూ కాని – సంఘవ్యతిరేక శక్తులపై ధ్వజ మెత్తించటం కానీ ప్రయోజనంగా ఈ రచన వ్రాయబడితే అది ప్రచార కవితా ధోరణిలో మొదటి శ్రేణిలో చేరి వుండేది. ఇంత విలక్షణమైన భావుకత వుండేది కాదు. ఇందులో కొంతవరకు మర్మ కవిత్వభావాలు కన్పిస్తున్నాయి. ఆయన పెట్టుకొన్న సంకేతాల వలన ఆయన భావం స్పష్టంగా గోచరించడం లేదు. పైకి కనిపించే ధోరణికి మనస్సులో వున్న భావాలకు సమన్వయం కుదుర్చుకోవటం కష్టంగా వుంది.

ఈయన వ్రాసిన గంటలు అన్న శీర్షిక యడ్గార్‌పో వ్రాసిన 'ది బెల్స్' అనే దానికి అనువాదం కాదు అని ఆయనే వ్రాసుకున్నాడు. ఆ రచన చేత ఈయన ప్రభావితుడై వుండవచ్చు. అందులో బ్రాంజ్ బెన్‌ల్ సెల్వర్ బెల్స్ గోల్డెన్ బెల్స్, అనేవి అను పల్లవులుగా వాటి ధ్వని ప్రవాహ ప్రత్యేక లక్షణాలను సూచిస్తూ యడ్గార్‌పో వ్రాశాడు. ఇతరమైనా సంకేతాలు ఏమైనా వున్నవేమో మనకు తెలియరావటం లేదు. ఈయన 'గంటలు' లో మాత్రం సర్వ ప్రసిద్ధంగా వున్న శబ్దబ్రహ్మ సిద్ధాంతం కొట్ట వచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ప్రపంచమంతా శబ్ద బ్రహ్మమయం అని సూచిస్తుంది.

"దేవుని గుడిలో బడిలో మడిలో
ప్రాణం ప్రమోగే ప్రతిస్థలంలో
నీ హృదయములో నా హృదయములో
గంటలు గంటలు గంటలు గంటలు
ఒక మారిచటా ఒక మారచటా

... ...

ఇపుడూ అపుడూ ఎపుడూ మ్రోగెడు

గంటలు గంటలు గంటలు గంటలు

గణ గణ గణ గణ గంటలు గంటలు

ఎడ్గార్ పోను అనుసరించటం ఏమైనదో - స్వయం సంకేతిత శబ్ద ప్రయోగ సరళి ఏమైనదో గాని - చిన్ననాడు నేర్చుకొన్న సంప్రదాయ సంస్కారం శబ్దబ్రహ్మ సిద్ధాంతరూపంగా పెల్లుబికి లోకమంతా శబ్దబ్రహ్మమయం అన్న పూర్వ సంస్కారానికి అనువుగా రచన తీర్చిదిద్దబడింది.

దీన్ని ఆధునిక సిద్ధాంతాలకు అనువుగా మార్చుకోవచ్చును గదా అని అంటే మార్చుకోవచ్చును అని చెప్పటానికి నేను సంశయించను. కవిత్వాన్ని గురించి విమర్శింప వలసి వచ్చినపుడు దాని ప్రాణ ప్రాణమైన లక్షణాన్ని యత్నించి పట్టుకొని వివరించవలెననేదే నా అభిప్రాయం.

"ఆత్మవత్ సర్వభూతాని" అనే ఆర్ష సంప్రదాయాన్ని సామ్యవాద సిద్ధాంతానికి తలమానికంగా భావించవచ్చు. వాల్మీకి కాళిదాసాదులను గూడ సామ్యవాదులలో చేర్చుకొనవచ్చు. అంతేగాని కవితా వైభవములోని పరమ లక్షణాన్ని పట్టుకొని చెప్పడానికి మాత్రమే నేను ప్రాధాన్యం యిస్తాను. ఇచ్చితీరాలంటాను.

'ఆకసమున హరివిల్లు విరిస్తే

అది మాకేనని ఆనందించే కూనల్లారా!

ఎవ బెచ్చటికో ఎగురుతుపోయే

పిట్టల్లారా పిల్లల్లారా!

విశ్వరూపమున విహరిస్తుండే

పరమాత్ములు చిరుతల్లార!

ఇలా ఆవేశం పరుగులు పెట్టిస్తే పరుగులు వారుతుంది రచన. తెలుగు కవులలో పోతన తరువాత యింత రచనావేశం వెల్లివిరిసిన కవి లేడు. తన శైశవ స్మృతులు వినిపిస్తూ - శిశువులలో అనుభూతి వెదజల్లుతూ వ్రాసికొన్న రచన యిది.

"ఉడుతల్లారా! బుడుతల్లారా!

ఇది నా గీతం వింటారా?"

శైశవదశలోని ఋతువులు కలిగించే అనుభూతిని శిశువులు ఆస్వాదించునప్పుడు లౌకిక లాంపట్యాలు అంటని అతి నిర్మలభావానికి వ్యంగ్యంగా ఈ సంబోధనలు. శిశువులు పరమాత్ములుగా భావించటంలో ఈయనలో గూడుగట్టిన ఆధ్యాత్మిక తత్త్వం వ్యంగ్యస్ఫోరకంగా ప్రసారితమైంది.

ఇంత అచ్చమైన రచనలో - మనసును కరగించి ఒళ్ళు మరపించే కవితా ప్రవాహంలో - "మంత్ర కవాటం" - "కంచు వృషభముః అగ్నిశ్వాసం" - మనస్సును బాధిస్తున్నాయి. 'ఏమి ఎరుగని పూవుల్లారా!' 'ఐదారేడుల పాపల్లారా! అన్న' రచనలలో పానకములో పుడకలవలె యివి అడ్డుపడుతున్నాయి.

కవి శక్తి రెండు విధాలుగా వుంటుంది. పద్య రచనాశక్తి-కావ్య నిర్మాణ కౌశలం. రచనను నిర్వహించటంలో ఈ కవి మహా కౌశలం చూపించినాడు. 'మరోప్రపంచం' లో పరుగులు వారిన రజోగుణం జగన్నాథ రథ చక్రాలలోని సత్త్వగుణంతో మంగళాంతం చేయటం సంప్రదాయ పద్ధతిని పరోక్షంగా పాటించడమే అవుతుంది పేదజనుల దుఃఖ గాథలతో పెల్లుబికిన శోకభావం - మనస్సును ఆవేశపరచిన ఉత్సాహభావం కవితాశక్తిగా ఈయనలో సుడులు తిరిగి నిర్వేదభావంగా నిలకడ వారి ఉత్తమ రచనగా రూపుకట్టుకొన్న ఒక మంచి కావ్యం మహాప్రస్థానం. ఈయన కవిత్వంలో ప్రధాన లక్షణంగా భాసించే నిరాశ వైరాగ్యాలు కావ్యంలో ఎక్కడ చూచినా తగులుతున్నాయి, ఈ జీవుల దుఃఖాన్ని తొలగించటం ఎట్లా? ఇదే ఆయన మనసులోని ఉత్కంఠ. ఉపనిషద్ భావాలను, మార్క్స్, ఏంజిల్స్ భావాలను చదివి ఆకళింపు జేసుకున్న ఈయనలో ఆర్షభావాల ప్రభావముద్ర పడింది. మార్క్స్, ఏంజిల్స్ భావాల ముద్రలు తావన్మాత్రంగానే మిగిలిపోయాయి.

ఈయన అభిమాన కవి 'స్విన్ బర్న్'. ఆయన కవిత్వంలో రీతి ప్రధానంగా వుంటుంది. శ్రీశ్రీకి మొదటినుండి స్విన్ బర్న్‌కు వలెనే శబ్దంపై మోజెక్కువ. పద సంయోజనంలో స్విన్ బర్న్ ఒక మెలుపు సాధించటానికి ప్రయత్నం చేస్తుంటాడు. కవికి కావలసిన హంగులలో అది వొకటి. ఏ పదం ఏ పదంతో మ్యాచ్ అవుతుందో తెలిసిన కవి స్విన్ బర్న్. ఆయన వ్రాసిన ఒక గీతాన్ని శ్రీశ్రీ స్వకీయ ముద్ర విలసితంగా తృప్తిదీర అనువదించుకున్నాడు. ప్రతిభగల కవి అనువదించిన ప్రతి ఖండికలోను తన ఆత్మీయ ముద్ర వేసుకోటానికి ప్రయత్నం చేస్తాడు. అలాంటి ప్రయత్నం సఫలీకృతమై మూలం కంటె సౌందర్యం ఆపాదించుకొన్న రచన ఈయన అద్వైతం-

ప్రేయసీ ప్రేయుల మనోభావాలను అద్వైతంగా అభేద భావంగా సమన్వయింప జేయటానికి ఈయన వాడిన శబ్ద శిల్పం అమోఘం. అంత్యప్రాసల - అనుప్రాసల - సమ్మోహన శక్తిలో ఛందస్సులో భాషానాశక్తిని గమగమ లాడించే ఒక మహేంద్రజాల విద్య ఈయనకు సహజంగా అలవడింది. రసాపేక్ష యా కవిత్వం వ్రాసే ప్రతివానికి - ముఖ్యంగా శృంగార రసంలో, అనుప్రాసలు పరికరనీయాలు. అనేది ఆలంకారికుల ప్రవచనం. రసదృష్టి లేనప్పుడు

యథేచ్ఛముగా వ్రాయవచ్చును. "యదాకవిరపగతరస భావోవక్తాతదా రచనాయాః కామచారః" అని వారి ప్రవచనం. అపగతరస భావుడు కాదు శ్రీ శ్రీ. అ సూక్తికి విరుద్ధంగా కుసుమ పేశల శృంగార భావాన్ని అను ప్రాసాదుల వాడకంతో మ్లానం గాకుండ రమణీయత్వాన్ని సాధించిన విలక్షణ ప్రతిభా బలం కలిగిన కవి — శ్రీ శ్రీ.

"నీ కంకణ నిక్వాణంలో
నా జీవన నిర్యాణంలో
నీ మదిలో డోలలుతూగే
నా మదిలో జ్వాలలు రేగే
నీ తలపున రేకులు పూస్తే
నా వలపున బాకులు దూస్తే
మరణానికి ప్రాణం పోస్తాం
స్వర్గానికి నిచ్చెన వేస్తాం!
హసనానికి రాణివి నీవై
వ్యసనానికి బానిసనేనై
కుసుమించిన త్వదీయ మోదం
విషమించిన మదీయ ఖేదం
విషవాయువులై ప్రసరిస్తే
విరితేనియలై ప్రవహిస్తే
ప్రపంచమును పరిహసిస్తాం
భవిష్యమును పరిపాలిస్తాం!"

ఇందులో కవి ఒక క్రమాలం కారాన్ని పాటిస్తూ వచ్చాడు. నిజప్రేయసీ భావనాగత మనోపారవశ్యంలో సిరీష కుసుమ సదృశం ఉన్నత పథవిహార సుందరం జ్వాలా తోరణ సదృశం-ఈ రెండింటిని ముడివేయటంలో విలక్షణ ప్రతిభా దర్శనం గోచరిస్తుంది. ఇది చదివిన కొద్దీ 'అద్వైతం సుఖదుఃఖయోః'అన్న భవభూతి శ్లోకం గుర్తుకు వస్తుంది.

"వాసంత సమీరం నీవై
హేమంత తుషారం నేనై
నీ ఎగిరిన జీవవిహంగం
నా పగిలిన మరణ మృదంగం
... ...
కాలానికి కళ్ళెం వేస్తాం
ప్రేమానికి గొళ్ళెం తీస్తాం

ప్రేయసీ ప్రియుల మనో బంధాలకు నాశనత్వం లేదు. వివాహ బంధంగాని ప్రేమ బంధంగాని అర్ద్రితాస్థితి పొంది నిత్యం కదిలే కాలాన్నైనా బంధించగలుగు తుందన్న భావం యిందుకో ధ్వనిస్తుంది. అద్వైతం అన్న శీర్షికలో ఆ భావానికే ఝుడితిస్ఫూర్తి వుంది. శృంగారభావ ముద్ర వున్న రచన యిది. పాఠకుని మనస్సును ప్రధానంగా ఆకర్షించే భావం యిదే. దీనిలో ఏవో ఏవో సంకేతాలు, సిద్ధాంతాలూ, సామ్యవాద భావాలు, ప్రసరిస్తున్నాయి. అంటే అవి శ్రీ శ్రీ రచనలకు ఔన్నత్యాన్ని ఆపాదించవు సరికదా కించపరుస్తాయికూడ. అన్ని బంధాలకంటె ప్రేయసీ బంధం అతి గాఢం, అనివారణీయం అని ఈయన అభిప్రాయం.

శిల్పంయొక్క పరమావధి స్ఫూర్తి పరిణాహత్వం అనుకున్నాము. ఆ స్ఫూర్తి, గాలిలో పుట్టదు. వ్యంజన సామగ్రివల్లనే పుడుతుంది. ఇక్కడ శబ్ద శక్తిలో వ్యంజన మున్నది. ఆ వ్యంజనా శక్తి వలననే ప్రేమానుబంధ్యపరాకాష్ఠలక్షణం ధ్వనిస్తుంది. ఇక్కడ ప్రతిపదార్థంతో పొత్తు కుదరని - తాత్పర్య శక్తితో మనసు కందని ఒక భావానుభూతి విశేషం శబ్దశక్తి మూలధ్వనిగా ప్రవేశిస్తుంది. అదే ఈ గేయంలో ప్రాణం.

ఈ శీర్షికలో సంకేతాలున్నాయనీ-సామ్యవాద లక్షణం యిమిడి వుందనీ - థీసిస్ ఆంటిథీసిస్ సింథసిస్‌లలో కూడు గట్టిన గతి భౌతిక తార్కిక లక్షణం వుందనీ - అద్వైత వేదాంత సిద్ధాంత ముందనీ - ఇంకా ఏవో ఏవేవో వున్నాయనీ చెప్పేవారున్నారు. అవి వారికి శ్రీ శ్రీ తో గల సన్నిహిత సంబంధ సాహచర్య పురస్కారావగాహకాలుగా సమన్వయ పరచుకోవలసిన లక్షణాలే. కాని అచ్చమైన సాహిత్య భావుకునికి స్ఫురించే ప్రధాన భావం శృంగార రస సంబంధమైనవి మాత్రమే శ్రీ శ్రీ కవిత్వంలో ప్రతిపదార్థసమన్వయ దృష్ట్యాభావం గమ్యం కాదు. తాత్పర్యలేశ చర్వణాధీనమైన అనుభూతి విశేషం మాత్రం మనో ఆకర్షకంగా ఉంటుంది. ఆయన కవిత్వానికున్న ప్రత్యేక లక్షణమే అది.

సంకేతాలవల్ల అర్థం నిర్ణయించటంలో ఒక చిక్కు వుంది. ఆ సంకేతం క్షోదక్షమంగా వుండాలి. ప్రసిద్ధ ప్రస్థానానుగమకంగా వుండాలి. లేకపోతే సామాన్య పాఠకునకు పాషాణపాకంగా తయారవుతుంది. కవి వెంబడి తిరిగే సన్నిహితులకే కొంతవరకు తెలుస్తుంది. ఒక్కొక్కసారి కాలం గడిచిన పిదప ఆ కవికే - ఆ సహృదయానికే తెలియని ప్రమాదం ఏర్పడుతుంది. పూర్వులు, ప్రసిద్ధ సంకేతితములైన సుప్రతీకము లైన శబ్దార్థములనే వాడేవారు. అనూచానంగా వచ్చే కవి సమయాలనే పాటించేవారు. సంప్రదాయమార్గ పరిచితము

లైన కొన్ని శబ్దార్థ శక్తుల సంయోజనతోనే భావావగాహనమునకు అవకాశం కల్పించేవారు. అందువలన తరువాత కాలం వారికి కూడ దాన్ని ఆకళించుకొనే వీలుండేది.

ఇక మహాప్రస్థానంలోని 'భిక్షువర్షీయసీ' – 'బాటసారి' ఖండాలు పరిశీలిద్దాము. ఈ రెండింటిలోను కథా భాగస్పర్శ కొంత వరకు వున్నది.

జీవితం కోసం ఒక పేదవాడు పట్నానికి వెళ్ళి అక్కడే మరణించిన సన్నివేశం బాటసారి. ఇందులో కథా నిర్మాణ కౌశలానికి గాని దానిలో కలిగే సమస్యలను విప్పి తేల్చివేయటానికి గాని కవి ప్రయత్నించలేదు. రసానికి సన్నిహితంగా సన్నివేశాన్ని మలచటానికే ప్రయత్నం జరిగింది. రచనను యావత్తూ వుద్దీపన విభావ సామాగ్రి తోను అనుభావ సంపదతోనూ గలగలలాడించినాడు.

"చండ చండం తీవ్ర తీవ్రం
జ్వరం వస్తే భయం వేస్తే
మబ్బుపట్టీ, గాలికొట్టీ
వాన వస్తే వరద వస్తే
చిమ్మచీకటి క్రమ్ముకొస్తే
దారితప్పిన బాటసారికి
ఎంత కష్టం."

కరుణ భావానికి ఈ ఉద్దీపన విభావ సామాగ్రి దోహదమైనది.

"చింత నిప్పులు లాగు కన్నులు
చెరిగిపోసే మంట లెత్తగ
శిరోవేదన అతిశయింపగ"

ఇదంతా అనుభావ సామగ్రి.

"బాటసారి కళేబరంతో
శీతవాయువు ఆడుకొంటుంది
పల్లెటూళ్ళో తల్లి కేదో
పాడు కలలో పేగు కదిలింది"

ఇదంతా మళ్ళీ ఉక్తి చమత్కారం. తెలుగు పలుకుబడి ముద్ర. వేగుచుక్క వెక్కిరించటం – గ్రుడ్డి చీకటిలోన గూబలు ఘూకరించటం మరణ సూచకాలుగా చివరకు ఉక్తి చమత్కార ధ్వని మార్గాలను పాటించిన ఈ కవి 'అతని బ్రతుకున కదే ఆఖరు' అని వాక్యం చేయవలసిన అవసరం లేదు. ఆ స్ఫురణ ఈ పంక్తి లేకపోయి వస్తుంది.

రాత్రి నల్లని రాతిపోలిక
గుండె మీదనె కూరుచుండగ –

నల్లని రాయివలె రాత్రి వున్నది అన్న ఉపమాలంకారములో ను ఆ రాత్రియొక్క నిరవధిక కార్కశ్యం మిటారిస్తుంది. ఇది ఉపవ ధ్వని. ఒక చిన్న సన్నివేశాన్ని యిలా రసానుగుణంగా దిద్ది చమత్క రించటం ఈ కవి ప్రతిభా వైశిష్ట్యం. అలాంటిదే 'భిక్షువర్షీయసీ' అన్న శీర్షిక. విభావానుభావ సామగ్రిని పొదగటం – ఒక చమత్కారంతో చివరి ఫలితాన్ని సూచించటం. ఇందులోనూ ఆదే పద్ధతి.

ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరిదని
వెఱ్ఱిగాలి ప్రశ్నిస్తూ
వెళ్ళిపోయిందీ."

గాలిని వెఱ్ఱిదానిగానూ – పాప పుణ్యాలను గూర్చి ప్రశ్నించే దాని గానూ – సంభావించటంలోని ఉత్ప్రేక్ష సన్నివేశాన్ని అంత ఒకే ఒక ముద్రగా గమ్యమానం చేస్తూంది. 'వెఱ్ఱిగాలి' అనేదానికి చేతన వృత్తాంత యోజన జరిగి లోకంలో యిలా జాలి పడేవాళ్ళే వెఱ్ఱి వాళ్ళుగా వ్యవహరింప బడుతున్నారు.

"ముగ్గుబుట్ట వంటి తలా
ముడతలు వారిన దేహం
కాంతి లేని గాజు కళ్ళు
తనకంటే శవం నయం
ములుగుతూ ముసురుతున్న
ఈగలతో వేగలేక
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసిల్దొకతె
అడుక్కునే శక్తి లేదు
రానున్నది చలికాలము
దిక్కులేని దీనురాలు."

ఇలా పలుకుబడిలో – వాక్యం పాటులో – ఉపమాన కల్పనలో జా పోసీయని తెలుగుతనం శ్రీశ్రీ కథా ఖండాలకు ప్రాణప్రాయంగా నిలి ఉత్తమ కవిగా నిల్ఛొక్కుకొనేటట్టు చేసినవి.

శ్రీశ్రీ కవిత్వాన్ని, అనుశీలిస్తే, తెలుగువాళ్ళు మాట్లాడుకొనే తీరు కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. వాక్య విన్యాసం నుండి ఉపమాన కల్పనల నుండి పలుకుబడి పాటించటం వరకు ఆంగ్లభాషా వాక్య నిర్మాణవైఖరి అంటని అచ్చమైన తెలుగుపద్ధతి కనిపిస్తుంది. కొన్ని మాటల గారడీలు మినహాయిస్తే పల్లెలలో తెలుగువాళ్లు మాట్లాడుకొన్నట్లే వుంటుంది.

"ఊరవతల నీరింకిన
చెఱువు గట్టు చెట్టునీడ
గోనెలతో కుండీలతో
ఎటుజూస్తే అటు చీకటి!"

ఇలాంటి భావనా కల్పన చేయగల కవిని – ఇలాంటి పలుకుబడి తీరు తెలిసిన కవిని - ఇలాంటి రచనా నిర్మాణంలో మర్మాలు తెలిసిన కవిని సామాన్యుడని ఎలా చెప్పగలుగుతాం. 'ఎటు చూస్తే అటు చీకటి' అనడంలో ఎంత తత్త్వార్థ మిమిడివుంది. "లింపతీవ తమోజాని వర్షతీవాంజనం నభః' అన్న మృచ్ఛకటికములోని శ్లోకానికి వరవడి దిద్దుకున్నట్లున్నది ఈ రచన. ఊహకు అందని పోకడ పొందని అద్భుత కల్పనలు చేసే కవికాడు శ్రీశ్రీ. సహజమైన సన్నివేశాల నుండే ఉత్ప్రేక్షలను సృష్టిస్తాడు.

కావ్యములోని ప్రధానసామాగ్రి అంతా వస్తు రచనల సమన్వయ సౌష్టవమే. ప్రతిభా గుణం వస్తువును సంయోజించటంలో కొంత ప్రసరించినా ఎక్కువ రచనా విన్యాస వైఖరిలోనే పరిణద్ధం అవుతుంది. కావ్య సందేశం ధ్వనించటానికి కావలసినంత శక్తి పరిణాహత్వం కలిగిన వస్తువునే స్వీకరిస్తే ఏ అల్పప్రతిభ వున్నా ప్రయోజనం సాధించుకోగలుగుతాడు కవి. వాల్మీకి వ్యాసాదులు స్వీకరించిన వస్తువులలో (భారతరామాయణాదులలో) ఆ పరిణాహత్వం వున్నది. దానికి తోడు అధిక ప్రతిభకూడ "నీవా నేనా" అని నిలిచి పంతగిస్తుంది. కాళిదాసాదుల వస్తువులు చిన్నవి యైనప్పటికి అందులో సందేశ ప్రసార యోగ్యమైన శక్తి యిమిడి వున్నది. ఇక రచనా విషయకంగా వారు చూపిన ప్రతిభాశక్తికి అవధులు లేవు.

శ్రీశ్రీ వస్తువు తన కాలంనాటి సమాజములోనిది. సందేశం వినిపించటానికి కావలసినంత పరిణతి తరతరాలుగా పండి పుంజుకున్నది కాదు. అలాంటప్పుడు దాన్ని ధ్వనింపచేయటానికి ఎంతో ప్రతిభాశక్తి ఆకాంక్షిత మవుతుంది. దైవికమైన ఆ ప్రతిభ శ్రీశ్రీకి సహజ లక్షణంగా అలవడింది. ఈయనది విలక్షణ వ్యుత్పత్త్య భ్యాసములచేత వచ్చిన ప్రతిభ కాదు. కేవలం దైవాంశ వలన సంభవించినది. సహజమైనది. అందువల్లనే ఎలాంటి వస్తువునైనా సూటిగా మనస్సునకు హత్తిస్తుంది. పాఠకుణ్ణి ఆగి ఆలోచించు కొనేటట్లు చేస్తుంది.

ఈయన రచనాధోరణి ప్రతిభా ప్రభావితమై వస్తువును అన్వేషించుటకు ప్రయత్నం చేయనీయనంత చిక్కగా అల్లుకుంటుంది. రచన యావత్తు మనశ్శాఖముపై ప్రతిభాదేవత నూరి యుంచిన పచ్చిగంధపు ముద్దలా గుభాళిస్తుంది.

ఈ ప్రతిభ తరతమ భేదాలుగా వుంటుందను కున్నాము. అల్ప ప్రతిభులూ – వుంటారు. అధిక ప్రతిభులూ వుంటారు. పరిమితములైన కొన్ని వస్తువులను మాత్రమే కావ్యంగా మార్చగలుగుతాడు అల్పప్రతిభుడు. అధిక ప్రతిభుడు ఏ వస్తువునైనా – చివరకు నీరసమైన గడ్డిపరకనైనా ప్రతిభతో చూడగలుగుతాడు. రసమయం చేయగలుగుతాడు. శ్రీ శ్రీ ప్రతిభ ఏ చిన్న వస్తువునైనా తనలో యిముడ్చుకొంటుంది. ఎంత నీరస వస్తువుకైనా కవితాముద్ర కొడుతుంది. ఆ వస్తువులలోని సహజ స్వభావ వర్ణన మాత్రముననే మనస్సు ఆనంద నిష్యందతుందిలత్వం వహిస్తుంది. ఉడిపి హోటళ్ళలోని తినుబండారముల నుండి సినీ జీవితములోని నటీనటుల వరకు సంసారుల నుండి అప్పులతో సతమతమయ్యే పేదవాళ్ళ వరకూ ఈయన ప్రతిభ ప్రసరిస్తుంది – పట్టపగ్గాలు లేనంతగా విహరిస్తుంది- పాఠక లోకాన్ని తన వైపునకు ఆకర్షించుకొని ఆ కట్టుకొంటుంది.

"ఆరోగ్యమే మహాభాగ్యము" అన్న వాక్యంలో కవితా ముద్ర లేదు. అధిక ప్రతిభుడు దానిని కవితా ముద్రతో మలచి ఒక కావ్య ఖండంగా తీర్చే నేర్పు, ప్రదర్శిస్తాడు. అల్ప ప్రతిభుడు కనీసం దానికి కవితా స్పర్శ కలిగించ గలుగుతాడేమోగాని అప్రతిభుడు మాత్రము ఉన్నదున్నట్లు వ్రాసి దాన్ని లోక వ్యవహార లక్షణానికి దింపుతాడు. అతడు అకవి. కవి గావటానికి ప్రయత్నిస్తాడు. కవి కంఠాభరణంలో క్షేమేంద్రుడు అకవి గావటానికి అనేక మార్గాలు సూచించాడు. ఆ కపులందరూ దాన్ని కొంత వరకు పరిశీలన చేస్తే మంచిది. ఆ కవి అయితే మనకు వచ్చే నష్టమేమీ లేదు. 'నా కవిత్వమధర్మాయ మృతయే దండనాయన' అపమార్గాలలో కవిత్వం వ్రాయకుండా వుంటే అదే చాలు.

(ఇంకా వుంది)

డా॥ ఇంగువ కార్తికేయశర్మ

ఆంధ్ర-తమిళతీరముల బౌద్ధము. సింహళ-చైనా దేశములతోటి సంబంధము:

దక్షిణ దేశమున, ముఖ్యముగ ఆంధ్రమున బౌద్ధము మౌర్య కాలమున, అశోకునికి కొంచెము ముందుగనే, వ్యాప్తి చెందినటుల ఇటీవల పరిశోధనల ద్వారా విదితమగుచున్నది. అమరావతి మహాచైత్యమున అశోకచక్రవర్తి (క్రీ. పూ. 273 - 236), ధర్మస్తంభమును ప్రతిష్ఠించుటయేగాక స్థూపముఖ్య ద్వారముల, తూర్పుపడమర, రాతి కంభములతోటి (గ్రానైటు) వేదిక, మహాద్వారమున తోరణములు గావించెను. భట్టిప్రోలు స్తూపము కూడ నీ కాలము నాటిదే. (భారతి, ఆగష్టు 1975 పుటలు 16-27, భారతి నవంబరు, 1976, పుటలు 5-10 మరియు సారసి జనవరి-మార్చి 1983, పుటలు 9-22) ఇటీవల వడ్డమాను యనుచోట (అమరావతికి 10 కి. మీ. తూర్పుగా), యిదేకాలము నాటి స్తూపారామములు కొండపై బయల్పడినవి. ధనకటకమును కేంద్రముగా చేసుకొని హీనయాన బౌద్ధము దక్షిణదేశమున పలుచోట్ల ప్రచారములోనికి వచ్చెను. అశోకునికాలమున బౌద్ధము కృష్ణా - తుంగభద్ర అంతకు క్రిందుగా పెన్నానది ఉత్తర సరిహద్దు వరకు వ్యాప్తి చెందినట్లు నిర్దుష్టమైన శిలాశాసనముల వలన (కర్నూలు జిల్లా జొన్నగిరి, రాజుల మందగిరి, బళ్ళారిజిల్లా సిరిగుప్పతాలూకా ఉదగొలను, నిట్టూరు, కర్నాటకలోని ప్రసిద్ధమైన సిద్ధపుర జటింగ రామేశ్వర, బ్రహ్మగిరి, మాస్కి) విదితమగుచున్నది. ఈ చోట్లకు దక్షిణముగా ధర్మప్రచారమునకై భిక్షువులు పోయి వుండవచ్చును. కాని ఆ కాలపు - వాస్తు శిల్ప శిలాశాసనము లేవియు కానరాలేదు. తమిళనాడులోని తొండమండలమున యశోకుని కాలపు బౌద్ధమున్నటుల గ్రంథస్థముగా (మహావంశముగా, మణిమేఖల), మాత్రమే తెలియుచున్నది.

అశోకచక్రవర్తి తన 18 వ రాజ్య సంవత్సరమున సింహళమునకు థేరమహేంద్రుని మొదటిసారిగా పంపి, సింహళరాజగు దేవప్రియతిస్సను, మిహింతలై యనుచోట మరికొందరిని బౌద్ధమతావలంబినులుగా జేసెను. బుద్ధగయనుండి బోధివృక్షశాఖ నొకదానిని సింహళమున నాటింపజేసెను.

కాంచీపురమున అశోకుడు కట్టించిన స్తూపమున్నటుల, నాగపట్టణమున ధర్మాశోక మహారాజ లేక ఇంద్రవిహారమున్నటుల గాథలున్నవి. కాని తమిళప్రాంతమున బౌద్ధము క్రీస్తుశకము 2-3 శతాబ్దులకు ముందున్నటుల యెట్టి అధారములు లభ్యము కాలేదు.[1] తీరపట్టణములైన మహాబలిపురము, కావేరీపట్టణము, ఉరయ్యూరు, నాగపట్టణము మున్నగుచోట్ల కొనసాగిన పురావస్తు శోధనల ద్వారా క్రీస్తుశకము 2-3 శతాబ్ది కాలమునకు చెందన విహారములు, స్తూపము కానవచ్చుచున్నవి.[2] కావేరీపట్టణమున లభించిన బుద్ధపాదము, నాగార్జునకొండ ప్రాంతమునుండి వచ్చినట్టిదే ! నే నిటీవల మహాబలిపురమున కూడా సీదాచేపల్లియు కంభముల, కొన్ని యిటుక కట్టడపు అవశేషముల శిథిలావస్థలోనున్న వాటిని చూడగల్గితిని. సముద్రపు ఒడ్డున వున్న రాజసింహేశ్వరాలయపు పశ్చిమ ప్రాంగణములో నున్న ఈ సున్నపురాతి స్తంభములు రెండును నేలపలుపురాళ్ళ (చిత్రము-1) క్రింద



చిత్రము - 1

మృగ్యమైనవి. మహాబలిపురమున పలుచోట్ల నీదాచేపల్లి రాతితునకలు కానుపించుచున్నవి. ఈ అవశేషములబట్టి, సముద్రతీరమున రాజసింహుని దేవాలయములు రాకపూర్వము - ఇచ్చట నొక మండపము - నాగార్జున కొండలోని బౌద్ధ ఆరామములు నెట్లుండెను. అదేవిధముగా యిచ్చట యుండినట్లు తోచుచున్నది. ఒక్క తమిళదేశమునకే గాక, క్రీస్తబ్దము 2-4 వ శతాబ్దిల ఆంధ్రతీరము నుండి కర్ణాటక[3] మునకు గూడ ఈ నాగార్జునకొండ - అమరావతిల శిల్పవాస్తు శైలివ్యాప్తిచెందినది. ఇటీవల గుల్బర్గాజిల్లాలోని సన్నతి, అంబి, గురుసంగి యను గ్రామముల, తొగరసి, (షిమోగాజిల్లా) హైగొండ కొండపల (కనరా జిల్లా), బళ్లారిజిల్లాలోని విజయనగర పట్టణములోని మహర్నవమిదిబ్బ యనుచోట్ల త్రవ్వకములందు నాగార్జునకొండ పల్నాటి సున్నపురాతి శిల్పములు, బ్రహ్మశాసనములతోసహా, లభ్యమయినవి.

ఈ కాలమున ఆంధ్రమునుండి బౌద్ధము దేశ విదేశముల చేరుటకు బలమైన కారణమేదైన వుండవలెను? వైశాలి ప్రాంతమునుండి మహా సాంఘికులు, దక్షిణ దేశములోని ధనకటకమునకుచేరి, క్రీ.పూ. 3-2 వ శతాబ్ది నాటికే సుస్థావరముల నేర్పరచుకొనిరి. ఇచ్చట పెక్కు శాఖలుద్భవించి మహాయానమును వృద్ధిజేసెను. ఈ పరిణామముల ధనకటకము చాల ప్రముఖ పాత్రవహించినది. మహాసాంఘిక, శూన్యవాద కర్త ఆచార్య నాగర్జునుడు అమరావతి నాగార్జునకొండల వశించి ఆంధ్రమును చరితార్ధము చేసెను. ఈతని శిష్యులు భాష్యకారులైన ఆర్యదేవుడు నిచ్చటనే వశించెను. ఒక మహాయానమే గాక ఆ తర్వాత వజ్రయానమునకు గూడ అమరావతి కేంద్రమయినది. మాధ్యమికవాద శాఖలైన చైత్యవాద, శైల, బహుస్మృతీయ, మహావిహార వాసినులు పెక్కు ఆరామముల వారి శాఖల కనువగునట్లు చైత్యముల నెలకొల్పుకొని బౌద్ధయుగమును తీర్చిదిద్దిరి. నాగార్జున కొండలోని శిరిపర్వతము ప్రపంచఖ్యాతి జెందినది. దేశము నలుమూలల నుండియేగాక తూర్పుదేశముల నుండి ప్రవక్తలు వచ్చుచు పోవుచుండిరి.

నాగార్జున కొండలో నొక బ్రాహ్మశాసనమున "నానాదేశ సమనాగతానం, సవసాధూనాం మహా బిక్కు సంఘస" యని పేర్కొనబడి యున్నది. ఈ నానాదేశీ సంఘములకై ప్రత్యేక వాసములను సమకూర్చినటుల విదితమగుచున్నది. సింహళము నుండి వచ్చిన బౌద్ధులకై వేరుగా అన్ని వసతులతోటి విహారము, చేరువనే వసతిగృహము, పాకశాల, పూజాగృహములు చేకూర్చబడెను. చూల ధర్మగిరి యందలి చైత్య గృహమున లభించిన శాసనము చాల ముఖ్య

మైనది. ఇది ఇక్ష్వాకు రాజైన శ్రీ వీరపురుషదత్తుని 14వ రాజ్య సంవత్సరమున బోధిశ్రీ యను ఉపాసిక గావించినది.

శాసన పాఠము అవసరమగు నంతవరకే పేర్కొందును.

పంక్తి-1 : భదత రాజాచరీయానం కస్మీర గంధార వంగ-వనవాసి, యవన, దమిళ - పలుర తంబపన్ని దీప పసాదకానం - థేరియానం తంబపన్నకానం సుపరిగహె

పంక్తి-2 : సిరిపవతె విజయపురీయ పువ-దిసా-భాగె చపాల విహారె చులధమ్మగిరీయం చెతియఘరం సపట సంథరం సచెతీయం సవనియుతం కారితం ఉవాసికాయ బోధి సిరియ ......

ఈ శాసనమునందే మూడవ పంక్తిని బోధిశ్రీ తానొనర్చిన పలు దానముల వరుసగా వివరించి నాగార్జునకొండ యందలి సింహళ విహారమున ప్రత్యేకముగా నొక బోధిరుక్క- పాసాదమును గావించి నటుల తెలుపుచున్నది. ఈ సింహళ విహారము విజయపురి కోటకు చేరువగ తూర్పున యున్నది. ఇచ్చట (సైట్-38) మహా విహారవాశి శాఖకు చెందిన థేరవాదులు వశించుచుండిరి. చైత్యగృహమున శాసనములో నొక బుద్ధపాద లభించినది. ఈ పాద ద్వయమున (పాద సంపుటి) గమనించవలసినది బోధివృక్ష ప్రాసాద చిత్రము. బుద్ధుని మానవాకృతిని గాక చిహ్నముల ద్వార కొలుచుచుండుట థేరవాదుల యాచారము. వీరికై బోధిశ్రీ యిట్టి పాదద్వయమును నిచ్చట ప్రతిష్ఠించెను. (ఛాయాచిత్రము-2) ఇట్టి పాదసంపుటి, దాచేపల్లి సున్నపురాయి కృతము కావేరి పట్టణమున విహారావశేషముల నుండి లభ్యమైనది. (ఛాయాచిత్రము-3). కంచిలో కూడ బుద్ధపాదములున్న చైత్య గృహమున్నటుల "మణిమేఖల" యందొక ప్రస్తావన కలదు ఇటీవల కడపజిల్లా అడపూరు (నందలూరికి సమీపము) నందు చైత్యారామమున యిట్టి బుద్ధపాదము బయల్పడినది. ఈ సింహ విహారము నందలి శాసనమును నిశిత దృష్టితో పరిశీలించి ఆంధ్రమ నుండి బౌద్ధము విదేశముల కెట్లు వ్యాప్తిజెందెనో తెల్పుటకు ప్రయత్నింతును.


శాసనపాఠము :[7]

పంక్తి-1 : సిద్ధం! ఆచరియానం థేరియానం విభజ-వాదనం కస్మీర-గాంధార యవన-వనవాస తంబపన్నదీప పసాదకానం.

పంక్తి-2 : మహా విహార వాసినం నవంగ-సతుససన ఆధ-వ్యాజన-వినిచ్ఛయ విసరదనం అరియ వంస పవేణి ధరనం.

పంక్తి-3 : విహారే భగవతొ పాద సంఘాడాని పతితపితో సవ-సతానం హితసుఖ అథనాయతి.—

సింహళ సంఘమున కనుయాయులైన బౌద్ధాచార్యులు వివిధ సూత్రములను అనర్గళముగావల్లించగల శక్తి సంపన్నులై "శాస్త్రి" బిరుదాంకితులైనటుల పేర్కొనుచున్నది. ఈ చోటున సర్వజ్ఞులైన విదుషీమణులుండిరి. వీరు నవప్రకరణముల అనగా-సూత్ర, గెయ్య, వైయ్యాకరణ, గాథ, ఉదాన, యితివృత్తక, అభ్భుత, ధమ్మ మరియు వేదల, శాఖలందు నిష్ణాతులై ఆర్యవంశ ప్రవేణీధరులుగా ఖ్యాతిబడసిరి.



చిత్రము - 2

ఉద్యోతన సూరి[8] విరచితంబైన (క్రీ.శ. 778), కువలయమాల యను ప్రాకృత కావ్యమున విజయపురిని గూర్చి చక్కటి వివరణగలదు. ఇచ్చట నొక మహంత మఠముండినట్లు (బహుశ నిదియే మహా విహార వాశినుల ఆరామము), పలుచోట్ల నుండి. అనగా కర్ణాటక, మహారాష్ట్ర, లాట, సురాష్ట్ర, మాళవ, శ్రీకంఠ (స్థానేశ్వర) సింధవములనుండి విద్యోపాసనకుగా వచ్చుచుండిరనియు, యీ విశ్వవిద్యాలయమున వ్యాకరణము, బౌద్ధము, సాంఖ్య, న్యాయ అనేకాంత (జైన), లోకాయత, చారవాక తత్వముల బోధించుచుండిరట. విజయపురి పట్టణ వీధుల వ్యాపారులు నానాదేశీయులకెట్టి యిబ్బంది కలుగకుండున 18 భాషలు నేర్చియుండిరని కూడ తెలుపుచున్నది. మిళిందపణ్హమున వ్యాపారులు చీన-చిలాత దేశములకు పలు మార్గు పోవుచుండినటుల ప్రస్తావన కలదు. పైన వివరించిన నాగార్జునకొండ శాసనములో నెట్లు క్రమముగ దేశముల పేర్లు వివరించబడెనో, బౌద్ధ గ్రంథములలో, మహా వంశ-దీపవంశ, ములందునగూడ కానవచ్చుట గమనార్హము.



చి త్ర ము - 3

ఆంధ్రమున మచిలీపట్టణము (మైసోరియా), ఘంటసాల (కంటకొస్సుల), కృష్ణాపట్టణముల నుండి తమిళనాడులోని కడ్డలూరు, కావేరి పట్టణముల, నాగపట్టణము కన్యాకుమారిల మీదుగా సింహళము తదితర తూర్పు దేశములకు విరివిగా వ్యాపార సంబంధములుండినటుల శాసనములవలన, మరియు విదేశ రచనలు-టాలెమీ, పెరిప్లసు- ద్వార తెలియుచున్నది. ఈ వ్యాపారగోష్ఠులు మహాయాన బౌద్ధవ్యాప్తికి మూలాధారములయ్యెను. ఇటీవల గుంటుపల్లి గుహాలయమున-మహానాగ పర్వతముపై లభ్యమయిన శాసనములందు మహా నావికులుండినటుల విదితమయినది. అదీ కాలమునకు మరొక మహానావికుడు ఘంటసాలలో మండినట్లు తెలియుచున్నది. (నా వ్యాసములు భారతి, జులై, ఆగస్టు: 1978) : బుద్ధగుప్తయను మరొక మహానావికుడు రక్తమృత్తిక (మూర్షిదాబాదు జిల్లా, పశ్చిమ బెంగాల్), విహారము నుండి ఆంధ్ర-తమిళ తీరముల మీదుగా మలయా ద్వీపమునకు చేరినట్లు క్రీ.శ. 4-5వ శతాబ్ది శాసనము తెలుపుచున్నది.

పాన్ కొ (క్రీ.శ. 1వ శతాబ్ది), రచించిన ఛియియన్ హన్షు యను చైనీసు గ్రంథమున కంచి నగరముగూర్చి ప్రస్తావన కలదు. చైనాభాషలో కంచిపేరు హల్ అంగ్ చె చైనారాజు కంచీపురాధీశ్వరునికి కానుకలుపంపినట్లు తెలుపుచున్నది. క్రీస్తబ్దము రెండవశతాబ్దిని చైనానుండి బర్మామీదుగా పట్టువస్త్రములు తామ్రలిప్తిని చేరిదమరికలో విక్రయింప బడుచున్నట్లు పెరిప్లసు రచనవలన తెలియుచున్నది. కంచి పట్టుపరిశ్రమ బహుశ చైనాదేశము నుండియే సంక్రమించి యుండవచ్చును.

ఇటీవల సింహళములోని కాండీజిల్లాలోని "లహినిమల" యను చోట రెండు బ్రహ్మి శాసనములు లభ్యమయినవి. ఆదేశపు పురావస్తు శాఖాధికారి శ్రీ సిద్ధమంగళ కరుణరత్న వీటినిగూర్చినొక పరిశోధిత వ్యాసమును ప్రకటించిరి.[9] ఈ శాసనములు చాల ముఖ్యమైనవి.

మొదటి శాసన పాఠము :

పంక్తి-1 : సిదం మలటిస మహరాజినక ములయహ

పంక్తి-2 : హువహాక బుజనకలహి రతియ హున

పంక్తి-3 : యదెవయ కరవి కదర-మరయ అరడవవి గనవయ

పంక్తి-4 : మవ గమకొటు దకపతియ కరకడయ సిప

పంక్తి-5 : వత వెహెరహి బొతగెరదిని మహాపకపట

పంక్తి-6 : హిచ దిని నియదయ

సింహళరాజు కనిష్ఠ తిస్స క్రీ. శ. 226-244 క్రొత్తగా నొక గ్రామమును, కడరమరయ అనుతటాకమును గావించి ఆ చోట్ల వసూలగు సుంకమునంతను సిరిపవత బోధిగృహమునకు, అచ్చటి పాక శాఖలకు శాశ్వతముగా దానమొసగెను.

రెండవ శాసనము :

పంక్తి-1 : సిమళ టసమహరజి మెఘొహొతగర కరయ


పంక్తి-2 : గిరిగమనవిచ మలకేతచ చొరవియచమెతిణిత

పంక్తి-3 : నహి దొపతియ కర దదయదిని సిపవత విహరహి


పంక్తి-4 : బికుసగహట మహపాతి వటహి దిని

సింహళరాజు కనిష్ఠ తిస్స సిరిపవత భిక్షుసంఘమునకై ఉపోసత గృహము దానిచెంతనే పెద్దభోజనాలయమును నిర్మించి వీటి పోషణార్థము గిరిగ్రామ తటాకమున, మలఖేటక యనుచోట్లభూముల మరియు చొరవియ తటాకములనుండి వసూలగు సుంకాదాయమంతను దానముగా నొసగెను.

ఈ రెండు శాసనముల వివరించిన కట్టడములు నాగార్జునకొండలోని సిరిపర్వతముపైని, అనగా నళ్ళరాళ్ళచోడు. అని పిలువబడుచు ధర్మగిరి విహార సముదాయమునకలవు (సైట్-48). ఇచ్చట బోధిశ్రీ చైత్యగృహమును గూడ నిర్మించినట్లు పైనచెప్పి యుంటిని ఈ సింహళరాజు కనిష్ఠ తిస్స-ఇక్ష్వాకు రాజు శ్రీ వీరపురుషదత్త బహుశ సమకాళికుడు. లేదా 10-15 సంవత్సరముల తర్వాత రాజుగ భావింపవచ్చును. ఈ బోధివృక్ష ఆరాధన - చైతన్యగృహములు ఆంధ్రమున చాలప్రాచీనముగా ప్రసిద్ధిచెందినట్లు అమరావతి మహాస్తూపమున లభించిన క్రీ. పూ. 3-2 శతాబ్ది శిల్పములు చూపుచున్నవి.ఈ (చిత్రము-4) బోధివృక్ష ప్రాసాదములు బుద్ధగయలో నెట్లుపవిత్రములో నదేరీతిని అమరావతిని నాగార్జున కొండలోని శ్రీపర్వతమున, సింహళదేశమున నిర్మింపబడినవి. శ్రీపర్వతమున ఉపాసిక. భిక్షువులు బోధిశ్రీ బోధిగుప్తయని పేర్లు పెట్టుకొని తమ భక్తిని చాటుకొన్నారు. భిక్షుసంఘములతోపాటు భిక్షుణి సంఘములుకూడ వ్యాపారులతోచేరి విదే



A



B

చిత్రము - 4

ములకు పోయెను. నాగార్జునకొండలో నీ భిక్షుణి సంఘములు ప్రబల ముగా నుండెను నూటికి తొంభైవంతు శాసనములలో ఉపాసిక దాన ములగూర్చి చెప్పుచున్నవి. వీరిలో చాలామంది రాజవంశీయులున్నారు. మహాసాంఘికవాదము ప్రబలి సింహళమునుండి భిక్షువులు ఉపతిస్యరాజు కాలమున (క్రీ.శ. 365 - 406). చైనాదేశమునకు పోయి అచ్చట పూర్వచిన్‌రాజగు హిసియోవుతి నికలుసుకొనిరట. తరువాత కొద్దికాలమునకే (క్రీ శ. 429) భిక్షుణిలు కూడ చైనాదేశమునకుపోయి ధర్మబోధన గావించిరి చైనాదేశమున అంతగా భిక్షుణిలున్నట్లు శిల్ప ములందుగాని, గ్రంథస్తముగా కానికానరాదు.

నేనిటీవల భారత ప్రభుత్వపు పనుపున చైనాదేశములోని ప్రాచీన బౌద్ధ స్థలముల కొన్నింటిని దర్శించు భాగ్యము కల్గినది. (చిత్రము-5) (అక్టోబరు 1983) సిరిపర్వత - సింహళముల నెట్లు బోధి వృక్షము షవిత్ర మయ్యెనో, అదే రీతిని చైనాదేశమున కూడ ప్రాచీన వృక్షముల భద్రపరచియున్నారు. హీనన్ రాష్ట్రమున సోంగ్‌యాంగ్ అను భౌద్ధగ్రంథాలయ మున్నది. దీని ప్రాంగణమున రెండు ప్రాచీన వృక్షములున్నవి. ఇవి సైప్రసు చెట్లు. క్రీ.పూ. 1వ శతాబ్ది హన్‌రాజు వుడిన్ ఈ చోటును దర్శించి మొక్కెనని గ్రంథస్తముగా తెలియు చున్నది. ఇప్పటికి యీవృక్షములు భద్రపరచియున్నారు.(చిత్రము-6) ఇదే రాష్ట్రములోని షోలిన్ యనుచోట పెక్కు బౌద్ధారామములు పగోడాలు కలవు. (చిత్రము-7) ఇటుక లేక రాతితో నిర్మింపబడిన ఈ పగోడాలు నలందా - బుద్ధగయ - సింహళములోని బౌద్ధాలయముల బోలియున్నవి. షోలిన్ ఆరామమున షోషియను గృహ మున్నది, హన్ రాజుల కాలమున (క్రీ శ. 118-123). యిచ్చట ముష్టియుద్ధములు, కర్రసాములు, మల్లయుద్ధము జంతువులపోరు, కోడి పందెములు మున్నగు యుద్ధ విద్యలందు భిక్షువులకు తరిఫీదునిచ్చు చుండిరట. ఈ నాటికి షోలిన్ విహారమున కుంగ్‌పూ పోరాటము, కరాటే విద్యలందు శిక్షణ నిచ్చుచున్నారు. ఇచ్చట బౌద్ధాచార్యుడు శ్రీహైతుంగ్, 81 యేండ్లు పైబడినను మహాయోగి. ఇట్టి విద్యల నిష్ణాతుడు ప్రాచీనమైన ఈ ఆరామమున యిట్టి విద్యలందు బౌద్ధులకు కూడ తరిఫీదునిచ్చి పాలకులైన ప్రభువులకు చేయూతగా నుండిరట.

నాగార్జునకొండలో నొక విహారమున రెండు శిల్ప స్తంభము లున్నవి ఈ స్తంభములు ఆరు పలకలుగా నున్న ముఖములపై నర్ధ శిల్పమున పద్మవలయములలో మల్లవిద్య, జంతువులపోరులు, కోడి పందెములు, కర్రసాములు శిల్పింపబడియున్నవి. బౌద్ధ విహారమునకు యీ చిత్రిత స్తంభములపైని కథనములకు యెట్టి సంబధమాయని తీరని సంశయముగా నుండెను. (చూడుడు నా సచిత్రితవ్యాసము భారతి, జులై 1976, పుటలు 5-13). చైనాలోని షోలిన్ విహారమును చూచిన తర్వాత మన నాగార్జున కొండలో కూడ నిట్టి విద్యల శిక్షణయే గాక ప్రదర్శనము లుండెడివని చెప్పగల్గుచున్నాము. దీని కనువగు పెద్ద ప్రదర్శనశాలలు విజయపురిలో, రోము నగరములోని స్టేడియ ముల మాదిరి, బయల్పడినవి. పాలించురాజులు బౌద్ధమునకు చేయూత నిచ్చిరి. వీరికి ఈ ఆరామవాసులు కూడ అవసరమగునంతనే రక్షణ కార్యములందు కూడ తోడ్పడి రాజ్యమును సుస్థిరముగా నుండుటలో చేయూత నిచ్చుచుండిరి కాబోలు. మరొకవిశేషమేమన ఆంధ్రమున ముఖ్యముగా పల్నాడు ప్రాంతమున, మధ్య చారిత్రక యుగమున కోడి పందెములను పాలకులుగూడ నిర్వహించుచుండిరి. ఈ అచారము క్రీస్తబ్దము 3-4 శతాబ్ది నాగార్జున కొండనుండి లభించినది. మల్ల విద్య, కర్రసాములు మరియు కోడిపందెములు బహుశ చైనాదేశము నుండి నాగార్జునకొండకు చేరియుండనగును. నాగార్జునకొండ శిల్ప మున అరుదుగా 'చీన,చోళక,'యను వస్త్రధారణ కలిగిన ద్వారపాలకు లున్నారు. ఈ వస్త్రదారణ శైలికూడ చైనాదేశమునుండి సంక్రమించి యుండవచ్చును.

హీనన్ రాష్ట్రము నందలి లోయాంగ్ యనుచోట ధవళాశ్వ ఆరామమున్నది. (వైట్ హౌస్ మానెష్టరీ). ముంగిట ముఖ్య ద్వార మున కిరువైపుల రెండు రాతి గుర్రము లున్నవి. ఈ రెండు అశ్వ ములపైని వాళీగ్రంథముల నిడుకొని క్రీస్తబ్దము 65-67 సంవత్సర ముల యిరువురు బౌద్ధాచార్యులు - కాశ్యపమాతంగ, ధర్మ (ర) లక్షణ యను నామధేయులు, మొదటిసారిగా చైనాదేశమునకు పోయిరట. వీరు మింగ్‌ది యను హన్‌రాజు కోరికప్రకారము వారి ఆస్థానము నలంకరించి బౌద్ధగ్రంథముల పాళీబాషలోనుండి చైనాభాషలోనికి తర్జుమా చేసి అచ్చట ధర్మబోధనకు నాందిపల్కిరి.


ఈ లోయాంగ్ ఆరామమున జీవితశేషము గడిపిరి. వీరిరువురి స్మృతి చిహ్నములుగా రెండు వుద్దేశిక స్తూపములు, మొదటి ప్రాకారములు, వుత్తర దక్షిణముల, గావింపబడెను. ఈ రాతి కట్టడ ములు (చిత్రము-8) ఘంటుపల్లి లోని రాతి స్తూపముల బోలియున్నవి.

ఆంధ్ర స్తూపముల నలంకృతములైన పూర్ణకుంభ, కల్పలత, పద్మదళ, తోరణ స్తంభములు వేదికలపై చిత్రితములైనట్లు చైనా దేశమున యున్‌కాంగ్ గుహలు (షంసి రాష్ట్రము), లాంగ్‌మెన్ (హీనన్ రాష్ట్రము), మరియు దున్‌హు వాంగ్ (గంసు రాష్ట్రము) న క్రీస్తబ్దము 4వ శతాబ్దినుంచి కానవచ్చుచున్నవి. ఈ చోట్ల ముఖ్యముగా యుంకాంగ్ మరియు లాంగ్‌మన్ లలో శిల్పింపబడిన బుద్ధ-బోధిసత్వ ప్రతిమలు నాగార్జునకొండ - అమరావతి లోని బుద్ధ ప్రతిమల బోలి - విశాల కనుదోయి, ముఖవర్చస్సు, వస్త్రయుగ్మము, ఆభరణములు గమనింప దగును. అట్లే బౌద్ధగాధలు, బుద్ధుని జీవిత విశేషములు నాగార్జునకొండ శిల్పములలోవలె కధానుక్రమముగా అర్ధశిల్ప ఫలకము

లుగా గావింపబడెను. గుహాంతర్భాగముల - గోడలపైని, పైకప్పున, తోరణాలంకృతములైన ద్వార-గవాక్షముల, బౌద్ధగాథలు శిల్పించిరి.

టిబెట్టు-చైనా దేశములకు, అనాదిగా వుత్తరదేశము మీదుగా, అనగా కాశ్మీర-గాంధార-హిమాలయముల కావలి, భూ మార్గముద్వారా పట్టు తదితర వస్తువులు చేరవేయుచుండిరి. క్రీ.పూర్వమునుండి కూడ నీ మార్గము "సిల్క్-రూట్"గా ఖ్యాతికి వచ్చినది. మరొక ముఖ్యమైనస ముద్రమార్గము కూడ తూర్పు ఆసియా దేశముల కలుపుచుండెడిది. ఈ సముద్రమార్గము క్రీస్తుపూర్వము (అనగా అశోకుని కాలమున), ఆంధ్రతీరము నుండి సింహళము వరకుండినట్లు తెలియుచున్నది. క్రీస్తబ్దము నుండి మహాయాన-తంత్రయానములు పైకివచ్చి తీరాంధ్ర తమిళనాడుల మీదుగా సింహళ తదితర తూర్పు దేశముల గుండా చైనాదేశము వరకు విస్తరించెను.

ఆంధ్రము క్రీస్తబ్దము 2-4 శతాబ్దిల మహాసాంఘిక బౌద్ధమున కెట్లు మూలస్థానమయ్యెనో - తొండమండలమున కంచి థేర



చిత్రము - 5

[గమనిక : చిత్రాలు 6, 7, 8, 9 అట్టమీది బొమ్మలు

వాద-పాళీ బౌద్ధమునకు కేంద్రమై క్రీ.శ. 5-7వ శతాబ్దల మరల వెలుగు వచ్చెను. దీనికి ముఖ్యకారణము కంచినగరమున ఘటికాస్థాన ముండుటయే. చాలమతములకు కూడలియై మహా పండితుల స్థావరమై వెలసినది.

చైనీసు యాత్రికుడై ఫాహియాన్ (383-413) కృష్ణా, గుంటూరు-నెల్లూరు ప్రాంతముల ఆరామముల చూచినటుల పేర్కొని యుండెను. కాని అంతకు దక్షిణమును గూర్చి చెప్పలేదు. చైనాలోని లోయాంగ్ ఆరామమునకు చెందిన హ్యూయన్‌త్సాంగ్ ధనకటక విహారము చేరి అచ్చట సంవత్సరకాలము (క్రీ.శ. 639) అభిధమ్మమును పఠించెనని, ఆ తర్వాత తలోపితు (ద్రవిడదేశము) నకు ముఖ్యపట్టణమైన కంచిస్‌పులో నగరము చేరినట్లు తెలియచున్నది. హ్యూయన్ త్సాంగ్ రాకకు పూర్వమే కంచిమహానగరము పండితులకు స్థానమై "నగరేషు కంచి" యను బిరుదు సంపాదించినది. చైనా దేశములోని షోలిన్ ఆరామమునకు తరలిపోయి ధ్యానమార్గమును బోధించిన బోధిధర్మ (క్రీ.శ. 470_520), కంచివాసుడు. పల్లవరాజవంశీయుడు. ఈ ఆచార్యుడు నాన్‌జింగ్ నగరము చేరినంతనే దక్షిణచైనా దేశప్రభువైన లియంగ్ వైతి స్వయముగావచ్చి గౌరవ మర్యాదలతో స్వాగతము పలికెనట. ఆచార్య దిఙ్నాగుడు, (క్రీ.శ. 6వ శతాబ్ది), కంచికి చేరువైన సింహవక్త్రమున జన్మించెను. ఈతడు తర్క, న్యాయశాస్త్రము లందు దిట్ట. అట్లే వినీత రుచికూన (క్రీ.శ. 582), కంచివాసుడు. పల్లవరాజు మహేంద్రుని (క్రీ.శ. 580_630) కృతమైన మత్తవిలాస ప్రహసనమున కంచిలోని బౌద్ధము గూర్చి వివరణ యున్నది. ఇచ్చట రాజవిహారము యితని కృతముగా ప్రసిద్ధిగాంచినది. ఇక పురయూరు వాశి బుద్ధదత్తుడు (క్రీ.శ. 5వ శతాబ్ది) కాళభ్ర వంశపురాజు అచ్యుత విక్రాంతుని సంస్థానము నలంకరించి వినయ వినిచ్చయ, మను పాళీ గ్రంథమును రచించెను.

ఈతడు సింహళముచేరి మహావిహారమున వశించి కీర్తిగడించిన బౌద్ధాచార్యుడు. బుద్ధఘోషుడు (క్రీ.శ. 5వ శతాబ్ది), విశుద్ధమగ్గ యను గ్రంథమున మోరండ ఖేటక మునకు చెందినవాడని తెలిపియున్నటుల యిదివరలో యభిప్రాయ పడిరి. ఈ మోరండఖేటకము పల్నాడు తాలూకాలోని కోటనెమలిపుర మరియు గుండ్లపల్లి గ్రామములుగా కీర్తిశేషులు రావిప్రోలు సుబ్రహ్మణ్యంగారు సూచించిరి. బుద్ధఘోషుడు ఆంధ్రుడని కూడ వీరివాదన.[11] కాని శ్రీ శ్రీనివాసన్‌గారు[12] కంచికి చేరువైన మోరణగ్రామ వాసియని పేర్కొనిరి. పరిశీలించి చూడగా నీతడు మగధ దేశమునుండి దక్షిణ దేశమునకు పయనించుచు మార్గమధ్యమున చాలచోట్ల బౌద్ధారామము గడిపినాడు. ధనకటకము తర్వాత దక్షిణ దేశమున క్రమముగా కంచి, మయూరసూత్రపట్టణము లేక మోరండ ఖేటక, నాగపట్టణముల మీదుగా సింహళము చేరినటుల విశుద్ధమగ్గమున వివరించెను. ఈ మయూరసూత్రపట్టణము క్రీస్తుశకము రెండవ శతాబ్ది టాలెమీయి పేరొన్న "మైలార్‌ఫణ్" అనగా మద్రాసు నగరములోని మైలాపూరు. రేవుపట్టణముగా[13] తోచుచున్నది. కంచిలో వశించితర్వాత మైలాపూర్‌చేరి నాగపట్టణము- కుమారిల మీదుగా సింహళము చేరెనన్న మాట. అంతేకాని బుద్ధఘోషుకు దక్షిణాత్యుడుగా గ్రహించుటకెట్టి యాధారములు కానరావు, కంచియందు పదివేల మంది స్థావిరులు, నూరు బౌద్ధారామములున్నట్లు హ్యూయన్‌త్సాంగ్ తెలుపుచున్నాడు. పల్లవరాజు నరసింహవర్మ (630-668) యీతని సమకాలికుడు. తంత్రయానకర్త కంచి వాస్తవ్యులైన వజ్రబోధి పల్లవ రాజసింహ చక్రవర్తికి గురువు. క్రీ. స్తుశకము 720 లో చైనా దేశమునకు తరలి పోయిన చివరిబౌద్ధాచార్యుడు.

క్రీస్తుశకము నాల్గవశతాబ్ది చివరిభాగమున ఆసంగుడు[14] యోగాచార- విజ్ఞాన వాదముల ప్రచారము గాంచెను. వైదిక - బ్రాహ్మణ మత తత్వములందునకూడ దిట్ట. మహాయాన-వజ్రయాన, తంత్రములు ప్రబలుచున్న ఈ కాలమున కొన్ని ఆసక్తిదాయకమైన శైవ ప్రతిమలు బౌద్ధశిల్పములకూడ కానవచ్చుచున్నవి. ఆసంగుడు శైవమును బౌద్ధము లోనికి మేళవింపుచేసెనని చెప్పుచుందురు. చైనీసు యాత్రికుడైన ఫాయియాన్ (క్రీ.శ.383_413) గణపతి ఆరాధనను చైనా-జపాన్‌దేశమున కొన్ని జుగుప్సా కరమైన శైవదేవతల అర్ధశిల్పములను బౌద్ధ గుహలలో చూచితిని[15]. వీటిని గూర్చి క్లుప్తముగా పేర్కొని ఈ వ్యాసమును పూరింతును

ఉత్తర చైనాలోని గంసు రాష్ట్రమున దున్‌హుం లాంగ్ యను చోట ప్రపంచఖ్యాతి బడసిన బౌద్ధగుహలు, అజంతాగుహలవలె, అంత కన్న మెండుగా నున్నవి. ఇచ్చటి గుహలు క్రీ. శ. 366 సంవత్సరము నుండి - 12 వ శతాబ్ది ప్రారంభము వరకు సజీవములై ఉండినవి. గుహాంతర్గమున గోడలపైని పై కప్పున ద్వారా గవాక్షముల కిరుచెంతల చక్కని రంగుల చిత్రములున్నవి. బౌద్ధజీవిత గాధలు, జాతక కథలే గాక నొక గుహలో (నం:285) క్రి. శ. 536 - 538 గోడపైని కుడ్య చిత్రముపై - నందపైని సుఖాసీనుడై మూడుతలలు - ఆరు చేతలు గల్గియున్న శివుని చూడగలము. కుడిప్రక్కగా మరొక ఆసనముపై నాల్గుచేతులు గల్గిన కార్తికేయుండు వామ భాగమున రెండు చేతులు గల్గి, తొండము పైకెత్తిన వినాయకుడు - చిత్రింపబడి యున్నారు. ఇదివరలో రల్‌స్టీన్ (1911) దండిన్ ఉలుక్ యను చోట లభ్యమైన కర్రపై కుడ్య చిత్రము నెం. డి 7 - 6), మూడు తలల నాల్గు చేతుల శివుని గూర్చి తెలిపియున్నారు. మరొకచోట (Panel D-X-8) శివుని ప్రక్కనే శక్తి (దేవి) కూడ యున్నది. ఇది గాక యున్‌కాంగ్ (షాన్సి రాష్ట్రము) లోని రాతి గుహలందు అష్టభుజి మహేశ్వరుండు, క్రిందశూలపాణియై రక్షకభటులు యున్నారు. ఇచ్చ

టనే నెమలిపై కూర్చునియున్న కుమారదేవుని (జియే మొలో తియాన్) అర్థ శిల్పము ద్వారము ప్రక్కనే గోడపై నున్నది. యజ్ఞోపవీతము లేని కుమారుడన్నమాట. ఈ శిల్పములు (క్రీ. స్తబ్దమున) 465–494 లలో కావింపబడెను. ఈ బౌద్ధ శైవ మత సంయోగము మహాయాన బౌద్ధమున మొలకెత్తి వజ్రయానమని ప్రబలెను. దీనికి ప్రాతిపధిక ఆంధ్రప్రాంతములోని ధనకటక - శిరిపర్వత ప్రాంతములందునే వేయబడినట్లు కొన్ని ఆధారములు యిప్పుడిప్పుడే తెలియవచ్చుచున్నవి. క్రీ.స్తబ్దమున రెండవ శతాబ్ది నాటికే ధన కటకమున భాగవతి పుష్పశార యను దేవికి చైత్య మండపము కట్టినట్లు ఇటీవలనే శాసనము వలన గుర్తించగల్గితిమి.

అమరావతితోని మహాచైత్యమునకు చెందిన నొక ఉష్ణీష శిల్పముపైని గణాధిపతి, గణేశాణి, కుబేరుడు, లక్ష్మి వరుసగా మాలా వాహకులుగా చూపబడియున్నారు. ఇది క్రీ. పూ మొదటి శతాబ్దిగా నిర్ణయింపబడినది. సింహళమున మహింతల యనుచోట కంటక చైత్యముపైని వాహలకడ (స్తూపశిల) పైని మరుగుజ్జు గణముల మధ్య వినాయకుడు చెక్కబడియున్నాడు. ఈ శిల్పము క్రీ.స్తబ్దము 1-2 శతాబ్ది నాటిది (చూడుడు నా వ్యాసము "గణపతి" భారతి సెప్టెంబరు 1976 P.P.9-13) ఒక్క బౌద్ధ తత్వములనే గాక వాస్తుశిల్పములతో బాటు బ్రాహ్మణ మతమును దేవతా స్వరూపములు గూడ దక్షిణ హిందూ దేశమునుండి సింహళ, కంబూజ, శ్రీ విజయ, చైనాదేశములకు ప్రాచీనముగా వ్యాపించెననుటకు పైశిల్ప రాజములు నిశిత దృష్టాంతరములు. తరువాతి కాలమున మత సాంస్కృతిక వ్యాప్తి కన్న వాణిజ్య వ్యాపారములపై మోజు పెరిగినట్లు తెలియుచున్నది.

అధోజ్ఞాపికలు

1. టి. వి. మహాలింగం, "మహిందాస్ రూట్ టు సిలోన్" దినేష్ చంద్రికా, (న్యూ ఢిల్లీ 1983) పుటలు 180-164.
2. కె. వి. రామన్, "ఆర్కెలాజికల్ ఇన్‌వెస్టిగేషన్‌స్ ఇన్ ది రీసెంట్ పాస్ట్" ఎ డికేడ్ ఆఫ్ ఆర్కెలాజికల్ స్టడీస్ ఇన్ సౌత్ ఇండియా (ధార్వార్, 1978) పుటలు 4-6, ఎ బుద్ధ పానెల్ మేడ్ ఆఫ్ పల్నాడ్ లయిమ్ స్టోన్ వాస్ ఫవుండ్ ఫ్రమ్ ఎ టెంపుల్ ఆఫ్ రాయపేట. ది హిందు, 7-12-1976.
3. ఎ డికేడ్ ఆఫ్ ఆర్కెలాజికల్ స్టడీస్ ఇన్ సౌత్ ఇండియా, (ధార్వార్, 1978) పుటలు 92-93, 99-101 (డి.ఎ.ఎస్.ఎస్.ఐ)
4. ఎపిగ్రాఫియా ఇండికా, XX, ఇన్‌స్క్రిప్షన్ ఇ, లయిన్-2 18th రెగ్నల్ యియర్ ఆఫ్ శ్రీ వీరపురిషదత్త, ది సెకండ్ ఇక్ష్వాకు రూలర్.
5. ఎపిగ్రాఫియా ఇండిక, XX, ఇన్‌స్క్రిప్షన్ ఎఫ్, ఆల్సో సీ డి. సి. సర్కార్, సెలెక్ట్ ఇన్‌స్క్రిప్షన్ (రివయిస్డ్ 2 ఎడిషన్, 1965) పుట 234.
6. హెచ్ సర్కార్ "సమ్ ఏస్పెక్ట్స్ ఆఫ్ బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ఎట్ నాగార్జునకొండ "ఏన్షంట్ ఇండియా", నెం. 16 (న్యూఢిల్లీ, 1960) పుటలు 66, 69, 71. ప్లేట్స్ XXXVII - ఎ, బి.
7. డి. సి. సర్కార్, ఎపిగ్రాఫియా ఇండిక, XXXIII, పుటలు 248-250
8. ఎ. ఎన్. ఉపాధ్యాయ, (ఎడ్) కువలయమాల, వాల్ I, II (భారతీయ విద్యా భవన్, 1967).
9. సద్దమంగళ కరుణరత్న "శ్రీలంకాస్ ఎపిగ్రాఫీ: ఇట్స్ బేరింగ్ ఆన్ ఆర్ట్ హిస్టరీ" సెమినార్ ఆన్ ఎపిగ్రాఫీ అండ్ ఆర్ట్, (వారణాసి, 1979)
10. యూనివర్సిటీ ఆఫ్ సిలోన్, రివ్యూ, (జులై 1954) పుట 177
11. ఆర్. సుబ్రహ్మణ్యం: "బుద్ధఘోష - హిస్ ప్లేస్ ఆఫ్ బర్త్", జర్నల్ ఆఫ్ ఓరియంటల్ రిసెర్చ్, XIV, (మదరాసు, 1952) పుటలు 278-284.
12. పి. ఆర్. శ్రీనివాసన్ (ఎడ్), "స్టోరీ ఆఫ్ బుద్ధిసమ్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు సౌత్ ఇండియా" (మదరాసు, 1960). పుట 158.
13. కె. వి. రామన్, ది ఎర్లీ హిస్టరీ ఆఫ్ మద్రాస్ రీజన్, (మదరాసు, 1959), పుటలు 188-190.
14. పి. వి. బాపట్ (ఎడ్) 2500 ఇయర్స్ ఆఫ్ బుద్ధిసమ్, (న్యూఢిల్లీ 1976) పుటలు 195-197.
15. ఐ. కె. శర్మ, "బుద్ధిస్ట్ చీనా అండ్ సౌత్ ఈస్ట్ ఏషియా" మెమ్యూర్ I, రావిప్రోలు సుబ్రహ్మణ్యం, రిసెర్చ్ సెంటర్ (గుంటూరు 1983) పుటలు 19-27.

చిత్రములు (9)

చిత్రము-1 : మహాబలిపురము: రాజసింహేశ్వరాలయము, నేలపరుపురాళ్ళ క్రింద మండప కంభములు:

చిత్రము-2 : నాగార్జునకొండ, బుద్ధపాదము.

చిత్రము-3 : కావేరి పట్టణము: బుద్ధపాదము.

చిత్రము-4 : అమరావతి శిల్పముల బోధివృక్ష ప్రాసాదములు.

చిత్రము-5 : ఇండియా, సింహళ-చైనాదేశముల బౌద్ధ స్థలములు.

చిత్రము-6 : సోంగ్ యాగ్: స్త్రైపసు వృక్షవేదిక.

చిత్రము-7 : షోలిన్: ఆరామ ప్రాంగణమున పగోడాలు.

చిత్రము-8 : లోయాంగ్: ధర్మలక్షణ స్తూపము.

చిత్రము-9 : లాంగ్ మెన్: వైరోచన బుద్ధుడు. 17.34 మీ. యెత్తు.

మినీ కవితలు

పిచ్చి జనం

నువ్ పుట్టి
ఏడుస్తుంటే -
చూసి నవ్వుతారు ?
నువ్ గిట్టి -
నవ్వుతుంటే -
చూసి ఏడుస్తారు??
ఏవిటో పిచ్చిజనం ???

మహాకావ్యం

మొన్నటి మహాకావ్యం
పద్దెనిమిది పర్వాలు
నిన్నటి మహాకావ్యం
పద్దెనిమిది పేజీలు !!
నేటి మహాకావ్యం
పద్దెనిమిది అక్షరాలే !!!
మరి రేపటి మహాకావ్యం ?
'.............................' ??

బ్రతుకు

చాలీచాలని
దుప్పటి !
తలను కప్పేసినా -
కాళ్ళు కనబడుతూనే వుంటాయ్ !!

అద్వైతం


పదవైనా
పెదవైనా
ఏదైనా వొకటే !
రుచి మరగిన బెల్లులిలా
అహరహమూ వేటే !!
ఏ వొక్కటి లేకున్నా
బ్రతుకంతా వెగటే !!!

శ్రీ శర్మాజీ

*

చేమంతులు పెరగని నేల

పణతుల రామచంద్రయ్య



ఉన్నదేమో చిలకా గోరింకల్లాగా ఇద్దరే ఇద్దరు; ఆ యిద్దరికీ, ఇప్పుడున్న యింటి కన్నా పెద్దయిల్లు ఎంతమాత్రం అవసరం లేదన్న ఇరుగుపొరుగుల అభిప్రాయంతో గోపాలానికి పేచీలేదు. పైగా ఆ వూళ్ళో వుద్యోగంలో చేరిన ఆరునెలలకే యిల్లు మారటం-అందులోనూ ముచ్చటైన ఆ చిన్నవాటా వదిలేసి, వూరికి దూరంగా అంత అద్దె యిచ్చి లంకంత యింట్లో చేరటం—అతడికే కాస్త ఎబ్బెట్టుగా తోచక పోలేదు.

అయినా ఫరవాలేదనుకున్నాడు. ఇరుగు పొరుగులకు సమాధానంగా, తన తల్లిదండ్రులు ఎప్పుడైనా ఆ వూరికి వస్తే అప్పుడు అందరికీ కలిసి ఆ చిన్నవాటా సరిపోదు కాబట్టి పెద్దయింటికి మారుతున్నామని చిన్న అబద్ధం చెప్పాడు. ఆ యిరుగుపొరుగుల పిల్ల చేసే కాకిగోల భరించలేకనే జానకి చిరాకుతో యిల్లు మారాలంటు దని అతడికి అనిపిస్తున్నా, "ఈ యింటిలో నాకిష్టమైన చేమంత పెంచుకోవటానికి వీల్లేకుండా వుందండీ," అంటూ ఆమె చేసే వి దును నమ్మినట్లే నటించాడు.

అలా అడపాదడపా నటించటం, దాంపత్య జీవితానికో అ మైన మేలిముసుగు వంటిదని గోపాలం అభిప్రాయం. పెళ్ళయిన (పదేళ్ళలోనూ తను జానకి చిరాకులు మాన్పటానికై పాటించే

ద్ధతి సబబుగానే కనిపిస్తోంది అతడికి. ముందు ముందు కొడుకో కూతురో పుడితే, అప్పుడామె యీ చిరాకులన్నీ విడిచిపెట్టి, దృష్టి అంతా ఆ బిడ్డమీదే లగ్నంచేసెయ్య గలదు. జానకిలాంటి వ్యక్తుల్లో అలాంటి ఆతీత పరివర్తన చాలా సహజం.........

మునిసిపాలిటీ లారీవచ్చి, సామానంతా ఒక్కరోజులో కొత్త యింటికి చేరేసింది. చేరాక అదంతా సర్దుకోవటానికి రెండ్రోజులకన్నా ఎక్కువ పట్టలేదు. ఇల్లు విశాలంగా వుండటం వల్ల. "ఇక్కడ నీ చేమంతులు పెంచటానికి ఓ ఫుల్ టైమ్ తోటమాలిని పెట్టేస్తాను. నువ్వు హైరానాపడకుండా, వంటపనికిపోను మిగిలిన టైంలో హాయిగా మేగజైన్లు ముందేసుకుని టీవీ ముందు కూచో," అన్నాడతడు.

"అలా కూచుంటే ఒళ్ళు పెరిగి నానా రోగాలూ వస్తాయి బాబూ... తోటపనంతా నాకే వదిలేద్దురూ—" అంది జానకి.

ఆమె వుత్సాహానికి తగ్గట్టుగానే, యింటికి ముందు వెనకా బోలెడు స్థలం. చుట్టూ ఎత్తైన కాంపౌండు. లోపల రెండు కొళాయిలు. ఒక కొళాయి దగ్గర్నుంచి చెట్లపాదుల్లోకి చిన్న సిమెంటు కాలవలు.

కాంపౌండు కవతల వున్నయిల్లు, ఎవరిదోగానీ, పొందికగా లేదు. ఆ యింటి కాంపౌండు కూడా చిన్నది. దాన్నిండా గడ్డీ, గాదం, రాలిపడిన గన్నేరు ఆకులూ, దుబ్బులూ, పెరిగి వున్నాయి. "ఇల్లు శుభ్రంగా వుంచుకో కూడదూ— ఒళ్ళు బరువు కాకపోతే", అంది జానకి ఆయింటి వాళ్ళనిగురించి, రెండ్రోజుల తర్వాత.

"మనకెందుకు పోనిద్దూ," అన్నాడు గోపాలం.

కాని అలాపోనివ్వలేదు జానకి. ఆ మర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన గోపాలంతో, "మీరేమో పాదులు తవ్వటానికి మనుమల్ని పెట్టివెళ్లారా.... వాళ్లు తవ్వుతున్నంత సేపూ పక్కింటి పిల్లలు వచ్చి ఒకటే గోల", అంది.

"ఏదో, చిన్నపిల్లలు".

"ఏం పిల్లలో బాబూ ! చాలీచాలని చొక్కాలు, చింపిరిజుత్తూ, వాళ్ళూనూ, పిల్లల్ని కనటం కాదుగొప్ప; సరిగా పెంచటం తెలియాలి."

నాలుగురోజులయ్యాక మంచి వానజల్లు పడటం వల్ల, కాంపౌండులో ఎరువు వెయ్యటం, చేమంతులు నాటటం తేలికైపోయింది. చేమంతుల మధ్యగా వెరైటీ కోసం ముద్దబంతులూ, అక్కడక్కడా కొన్ని మిరప మొక్కలూ, నాటారు. మిరపకాయలు కాసి చెట్లలోనె పండితే, ఆ ఎరుపుదనం చేమంతుల పచ్చదనాల మధ్య పెళపెళా మంటూ అందగిస్తుందని జానకి ఆశ.

కాని, రెండు వారాలయ్యాక చూస్తే, చేమంతులు ఎక్కువగా పెరగటం లేదు. జానకి మొహంలో అసంతృప్తిని గమనించి, కాస్త అనునయించే ధోరణిలో అన్నాడు గోపాలం : "నీ కృషిలో లోపం లేదు జానీ! కాని యీనేల మొక్కలకు మంచిది కాదేమో! అందుకే, పక్కింటి వాళ్లుకూడా కాంపౌండునంతా బీడు పెట్టేసినట్లున్నారు".

"అదేంకాదు", అంది జానకి, "పక్కింటి వాళ్ళది సోమరితనం. అందువల్ల మన తోటక్కూడా న్యూసెన్సుగావుంది.".

"మన తోటకా?" ఆశ్చర్యంగా చూశాడతడు.

"అవును-చూడండి, గాలివీచినప్పుడల్లా వాళ్ళ కాంపౌండు లోంచి ఎండిన ఆకులూ, చెత్తా లేచివచ్చి మనచెట్లమధ్య పడుతున్నాయి. ఈ రోజంతా వాటిని ఏరి పారెయ్యటంతో సరిపోయింది".

అతడు జవాబివ్వలేదు. పక్క కాంపౌండులో ఎండుటాకులు ఒకమూల కుప్పగా వేసివున్నా, ఆ కుప్ప జానకి ఆదుర్దాను సమర్థించేటంత పెద్దదిగాలేదు. అయినా అతడు భార్యమాటలకు కోపం తెచ్చుకోకుండా, "మరీ అలాచిరాకు పడిపోకు జానీ! ఎంతైనా పొరుగువాళ్ళు", అన్నాడు.

అయినా ఆ పొరుగు వాళ్ళతో ఎలాంటి ప్రమేయం పెట్టుకోకుండా, ఎదురింటి తులశమ్మతో పరిచయం పెంపొందించుకుంది జానకి. ఇందుకొక కారణం గమనించాడు గోపాలం. అదేమిటంటే, తమ పక్కింటి వాళ్ళ విషయంలో జానకి అభిప్రాయాలూ, తులశమ్మ అభిప్రాయాలూ ఒకటేనని... రోజూ కాఫీపొడి కనీ, కరివేపాకు కనీ, కొబ్బరిముక్క కనీ వచ్చే తులశమ్మ ఆ సందర్భాల్లో అందించే సమాచారాన్నంతా సాయంకాలాల్లో భర్తకు చేరవేస్తోంది జానకి ; పక్కింటి వాళ్ళు మొరటు వాళ్ళట. అతడెక్కడో తెలుగు టీచరుగా అఘోరిస్తున్నాడట. భార్యాభర్తలెప్పుడూ పోట్లాడు కుంటుంటారట. పిల్లలు స్నానం చేశారా, అన్నంతిన్నారా, చదువుకుంటున్నారా అనైనా గమనించు కోరట.

అదంతా నిజమనిపించేట్టుగా, ఒకరోజు రాత్రి గోపాలం, జానకి టీ.వీ.చూస్తున్నప్పుడు,పక్కింట్లోంచి అరుపులు,ఏడుపులు ఖంగుఖంగున గిన్నెల శబ్దాలూ వినిపించాయి. ఆమర్నాడు పొద్దునే పక్కింటిముందు రెండురిక్షాలు ఆగటం, ఆ టీచరు భార్యా పిల్లలూ వాటిల్లో ఎక్కి వెళ్ళిపోవటమూ గమనించాడు గోపాలం. ఈ కొత్తయింట్లో చేరి నెల కావస్తున్నా, అతడు పక్కింటి పిల్లల్ని చూడటం ఇదే మొదటిసారి: ఇద్దరివీ ముచ్చట కలిగించే ముద్దయిన మొహాలు. తల్లిదండ్రుల తగవుల్ని అర్థంచేకోలేని ఆపిల్లలు, అమ్మతోబాటు రిక్షాఎక్కేముందు "వెళ్ళొస్తాం నాన్నా" అనటం చూచిన గోపాలానికి జాలికలిగిన మాట వాస్తవం కాని ఆ జాలిని భార్యముందు వెల్లడించలేదతడు.

గోపాలం అతడి తల్లిదండ్రులకు నలుగురు కూతుళ్ళమధ్య ఒకే ఒక మగబిడ్డకావడంతో, అతడి భార్య జానకికి కూడా ఆ యింట్లో అడుగు పెట్టినప్పట్నుంచీ ఒక ప్రత్యేక స్థానం లభించింది. కాలు కింద పెట్టనివ్వకుండా చూచుకునే అత్తగారు; లక్షల ఆస్తికి ఏకైక వారసుడి నన్న ధీమాతో భార్య ఏం కోరినా తెచ్చియిద్దామనుకునే భర్త; గౌర వించే వదినెలూ, మరదళ్ళూ — వున్న ఆ యింట్లో, కొడుకునూ కోడల్నీ కొన్నాళ్ళపాటు తమ దగ్గరే వుంచుకుని ముచ్చట చూడాలను కున్న తల్లిదండ్రులు, గోపాలానికి వచ్చిన వుద్యోగాలన్నీ ఏదోవంకతో తోసేస్తూ వచ్చేరు. ఆఖర్న, యీ నెల్లూరులో మునిసిపల్ ఇంజనీరుగా వుద్యోగం దొరికి, భార్యాభర్తలు ప్రయాణమవుతోంటే, అపురూపమైన తన కోడలు ఒంటరిగా ఎలా చేసుకోగలదా అని ఆ అత్తగారు అదుర్దా పడిపోయినమాట వాస్తవం. అయితే ఆవిడ వెల్లడిచెయ్యని మరో ఆదుర్దా ఏమిటంటే, తాను దగ్గర లేకుంటే ఆ అబ్బనాకారపు కోడలి చేత సంతాన వ్రతాలన్నీ ఎవరు చేయిస్తారా అని.

తల్లికోరిక త్వరగా తీరితే బాగుండునని గోపాలం అనుకున్నా ఆ విషయంలో కొరత అతడికి లేదు. జానకిలో కూడా కనిపించలేదు.

"ఆ వెంకటనరసయ్య కున్న సంతానం మనకూ వుంటే, నాకు జీవితం మీద విరక్తి కలిగి వుండేది. ఎందుకొచ్చిన చీదరబాబూ!" అంది జానకి ఒకరోజు, డైనింగ్ టేబులు సర్దుతూ. అప్పుడు తెలి సొచ్చింది గోపాలానికి, ఆ పక్కింటాయన పేరు వెంకటనరసయ్య అని.

మరో నెల గడిచింది. కాంపౌండులో చేమంతులు ఏపుగా పెర గక పోయినా, మధ్య మధ్య బంతి చెట్లూ, మిరపచెట్లూ నవ నవలాడు తున్నాయి. ఆ మిరపచెట్లలో యిప్పుడిప్పుడే పొటమరిస్తున్న కాయలు చెట్లలోనే ఎర్రగా పండే సమయానికి చేమంతులు కూడా పూతకువస్తే బాగుంటుందని గోపాలంతో రోజూ అంటోంది. జానకి "డోంట్‌వర్రీ మైడియర్! ఈ నేల చేమంతులకు అనుకూలంకానప్పుడు నువ్వు మాత్ర మేంచేస్తావు?" అన్నాడతడు. అందుకు సమాధానంగా ఆమె పెదవులపై, కాలవమధ్యలో తలెత్తేఅలలాంటి నవ్వొకటి తేలింది-అంతే.

ఆ మర్నాడు గోపాలం ఆఫీసునుంచి మధ్యాహ్నానికే యింటి కొచ్చేసరికి, సన్నగా కురుస్తున్న వర్షపు తుంపరలో తడుస్తూ పూల మొక్కలమధ్య తిరుగుతోంది జానకి. గోపాలం యింట్లోకి వచ్చి కాఫీ తాగాక, కాంపౌండు గేటుతీసి, అక్కడే నిల్చుని వీధిలోకి చూడ సాగాడు. వీధి వెడల్పుగా వుండి, ఇళ్లన్నీ తీర్చిదిద్దినట్లున్నాయి. కొత్తగా మునిసిపాలిటీలో కలిపిన ప్రదేశం కాబట్టి, ఇటీవలే వీధిలైట్లు వేసినట్లున్నారు. ట్రాఫిక్ రద్దీలేదు. గోపాలం అక్కడ నిల్చుని చూస్తోంటే, సామాన్లతో నిండిన లారీ ఒకటి వచ్చి ఎదుటి వరసలో ఓ యింటిముందు ఆగింది.

"ఆ యింట్లో ఎవరో కొత్తగా చేరుతున్నట్లుంది," అన్నాడతడు, తన వెనకే నిల్చున్న జానకితో.

"అవును. ఎవరో అరవ్వాళ్లట. మొగుడూ, పెళ్లాం యిద్దరేనట. తులశమ్మ చెప్పింది" అంది జానకి.

ఆ లారీలోంచి మనుషులు సామాన్లన్నీ యింట్లోకి చేరవేస్తు న్నంతలో, ఆ వెనకగా ఓ రిక్షా వచ్చి ఆగటం, దాన్లోంచీ నీటుగా ముస్తాబై వున్న కుర్రదంపతులు దిగి ఇంట్లో ప్రవేశించటం, ఆ యువతి తాలూకు వజ్రాల ముక్కుపుడక సాయంత్రపు నీరెండలో తళుక్కు మనటం, జరిగాయి.

"అతడు కలక్టరాఫీసులో పనిచేస్తున్నాట్ట." అంది జానకి మళ్ళీ.

"ఈ నెల్లూరులో వుద్యోగానికి ఆంధ్రులెవరూ దొరకనట్లు, అంత దూరం నుంచీ అరవ్వాళ్లను తీసుకురావటం దేనికో—" అన్నాడతడు.

జానకి వెంటనే జవాబివ్వలేదు, కాని ఆమె దానినే మననం చేస్తున్న దనిపించేట్టుగా, వారంరోజులయ్యాక అంది.

"అరవ్వాళ్లని మీరు ఆ రోజున గింజుకున్నారే! వాళ్ళెంత నాగరికంగా వున్నారో చూడండి. వాళ్లకూ. మన పక్కింటి వెధవ సజ్జుకూ, ఎక్కడ పోలిక?"

"ఎలాంటి సజ్జయినా, తెలుగువాళ్లు."

"బాగుంది. తెలుగువాళ్ళయినంత మాత్రాన నెత్తిన పెట్టు కోవటం నాకు చాతకాదు బాబూ!", అని కాస్సేపాగి మళ్ళీ అందు కుంది జానకి, "పొట్లాడి వెళ్ళిన ఆ పెళ్ళామూ, అయిపూ గియిపూ లేదు. ఈ త్రాష్టుడేమో, తను అడపెత్తనం సహించే రకం కాదని అందరి దగ్గరా ఆర్భాటం చేస్తున్నాట్ట .... అతడు మీతో కూడా మాట్లాడతాడని నాకు భయంగా వుంది."

"భయమెందుకు?" నవ్వాడు గోపాలం.

"ఎందుకేమిటి?" అంటూ జానకి మొహం కందగడ్డల్లే చేసు కుంది, "ఎందుకంటే .... నాకు నచ్చదు.

"భయపడకు. ఒకవేళ, తనకు అడపెత్తనం నచ్చదని అతడు నాతో అంటే, నాకుమాత్రం ఆడపెత్తనం చాలా యిష్టమని చెబుతాను. సరేనా?"

ఆమె మాట్లాడలేదు.

"నీ కివన్నీ చెబుతున్నది మీ ఫ్రెండు తులశమ్మేనా?" అన్నాడతడు మళ్ళీ.

"ఊఁ".

గోపాలం ఇదివరకు రెండు మూడుసార్లు తులశమ్మను గమనించి వున్నాడు. మధ్యవయస్కురాలు. బిడ్డలు లేరట. మొహంలో, మాటల్లో, స్పష్టంగా లౌక్యం గోచరిస్తుంది. భర్తను అదుపాజ్ఞల్లో వుంచి సంసారాన్ని గుంభనగా నెట్టుకొచ్చే మనిషి, అనిపించింది గోపాలానికి. అయితే అతడామెపై ఎలాంటి వ్యాఖ్యానమూ చెయ్యలేదు.

అక్టోబరు నెల, కాసేపు కుండపోత వర్షాలతో, కాసేపు చుర్రుమనే ఎండలతో, తికమకలు పెడుతోంది. చేమంతులు ఇష్టం వుండీ లేనట్లు పెరుగుతూ, అక్కడొకటీ అక్కడొకటీ మొగ్గలు వేస్తున్నాయి. మిరపచెట్లలో కాయలు మాత్రం సమృద్ధిగా పచ్చదనం కుమ్మరిస్తూ, అప్పుడే గర్వంగా ఎరుపెక్కిపోతున్నాయి.

అలా చేమంతుల కోసం ఆగకుండా పెరిగిపోతున్న మిరపచెట్లు, రెండు మూడు రోజులుగా జానకి కోపాన్ని తప్పించుకుంటున్నాయి. కారణం - ఆమె యింట్లో లేదు; జొన్నవాడకు వెళ్ళింది. జొన్నవాడలో తులశమ్మ బంధువులెవరో వున్నారట. వాళ్ల యింట్లో గడిపి, అక్కడి కామాక్షీదేవి గుడిలో పదిరోజులు ప్రదక్షిణాలు చేసి రావాలని వెళ్ళింది. ఆ సమయంలో ఒక సాయంత్రంవేళ, గోపాలం ఆఫీసు నుంచీ నడిచివస్తోంటే, మధ్యలో వర్షం మొదలైంది. చేతిలో గొడుగు కూడా లేకపోవడం వల్ల, గబుక్కున ఓ బట్టలషాపులో దూరి నిల్చున్నాడు గోపాలం. వర్షం ఎడాపెడా దంచుతోంది. ఇహ గంటసేపైనా ఆ షాపుదగ్గర ద్వారపాలకత్వం తనకు తప్పదేమోనని గోపాలం అనుకుంటున్నంతలో — షాపులోంచీ బయటికి వస్తున్నాడు పక్కింటాయన. ఆయన చేతిలో ఒక పాకెట్టూ, మరోచేతిలో గొడుగూ వున్నయ్.

గోపాలాన్ని చూడగానే పలకరింపుగా నవ్వి, గొడుగు విప్పుతూ, "ఇంటికి వస్తున్నారా? .... రండి వెడదాం," అన్నాడు వెంకటనరసయ్య.

ఇద్దరూ గొడుగులో నిదానంగా నడుస్తూ, యిల్లు చేరేసరికి ఏడున్నరయింది. వీధిలో లైట్లు పోవటం వల్ల చీకటిగా వుంది. గోపాలం ఇంటితాళం తీసి లైటు వేస్తూ, "లోపలికిరండి" అన్నాడు.

వెంకటనరసయ్య గొడుగు వాకిట వుంచి, లోపలికొచ్చి కూచున్నాడు.

గోపాలం వంటిట్లోకి వెళ్లి, పది నిముషాల్లో గాస్‌స్టౌ మీద టీ తయారు చేసి, తనకూ వెంకటనరసయ్యకూ రెండు కప్పుల్లో తీసుకొచ్చాడు.

"అయ్యో - ఇప్పుడెందుకండీ యిది?" అంటూ, అంతకన్నా ఎక్కువ పెట్టు చెయ్యకుండా టీకప్పు అందుకున్నాడు వెంకటనరసయ్య.

"ఏమిటండీ ఆ పాకెట్టు?" అన్నాడు గోపాలం, తను సంభాషణ కొనసాగించకపోతే బాగుండదని.

"చీర నా వైఫ్‌కోసం ... చూడండి," అంటూ, పాకెట్టు విప్పి వెంకటగిరి సరిగ చీర ఒకటి బయటికి తీశాడు వెంకటనరసయ్య.

"చాలా బాగుంది ... ఎంత?"

"నూటయాభై ... మరి ఆ మాత్రం ఖర్చు చెయ్యకపోతే, భార్యామణిని శాంతింపజెయ్యటం కష్టం గదటండీ?" అన్నాడు వెంకటనరసయ్య. ఆ మాటల్లో, తెలుగుపండితుడి చాదస్తంతోబాటు నిష్కపటత కూడా కనిపించింది గోపాలానికి.

"కోపంతో వుంటే గద - శాంతింప జేసే అవసరం?" అన్నాడతడు.

"అదేమిటండోయ్ ... మా యావిడ కోపంతో వెళ్ళిపోయిన సంగతి మీకు తెలీదా?," అంటూ ధణధణ మని ప్రారంభించాడు వెంకటనరసయ్య - "చూడండి - మా యావిడేమో నాలుగో కాన్పుకు కూడా పుట్టింటికి వెడతానంటుంది. నాకేమో అది నచ్చదు. నేనంటానూ - ఆ పుట్టింటివాళ్ళేమీ లక్షాధికారులు కాదు గదా, వాళ్ళమీద వెళ్ళి పడడం దేనికి? మన అవస్థలేవో మనమే పడి గౌరవం నిలుపుకోవటం మంచిదికదా, అని. దాంతో తుఫాను లేచింది. ఈ ఆడవాళ్ళకు, పుట్టింటి మమకారం ముందు, వివేకం ఎగిరిపోతుంటుందండీ! కాని నేను మాత్రం నా ఆత్మగౌరవానికి సంబంధించిన విషయాల్లో ఆడపెత్తనం సహించేవాణ్ని కాదు .... కావలిస్తే కాన్పుకు ముందుగా కొన్ని రోజులు పుట్టింట్లో వుండి వచ్చెయ్యమని ఆవిణ్ని, పిల్లల్ని పంపించాను."

కాస్త భేషజం ధ్వనిస్తున్నా, ఆ మాటలు సబబుగానే తోచాయి గోపాలానికి.

"వెళ్ళేటప్పుడు కోపంగా వెళ్లింది కదా - ఆవిడ వచ్చాక శాంతింపచేద్దామని, ఈచీర కొన్నాను. పాపం, గర్భిణీ కదండీ మరి!" అన్నాడు, వెంకట నరసయ్య మళ్ళీ చాదస్తపు ధోరణిలో.

మరి కాసేపు సాగింది వాళ్ల సంభాషణ. దానివల్ల గోపాలానికి అర్థమయిందేమిటంటే, వెంకట నరసయ్యది సామాన్య సంసారం. ఆయన నెలసరి సామాన్లు తెచ్చి పడెయ్యటం తప్ప మిగతా గృహ నిర్వహణ అంతా భార్యకే వదిలి, తను తెలుగు వ్యాకరణాల్తో కాలం గడుపుతుంటాడు. ఆమెకు యింటి బాధ్యతల వల్ల, కాంపౌండులో చెట్టూ చేమా పెంచుకునే తీరికైనా దొరకదు.

అక్కణ్నుంచి లేచివెళ్ళేటప్పుడు మిరపచెట్లను మెచ్చుకున్నాడు వెంకటనరసయ్య. బయట యింకా చీకటిగా వుండటంవల్ల, టార్చిలైటుతో ఆయన్ని వాళ్ళ కాంపౌండు దాకా దిగబెట్టాడు గోపాలం.

మరోనాలుగు రోజులకు జానకి జొన్నవాడ నుంచీ తిరిగొచ్చింది. తమయింటికి పక్కింటాయన వచ్చిన విషయం ఆమెకు చెప్పలేదు గోపాలం. మరోవారం తిరిగే సరికల్లా పక్కింటాయన భార్య తిరిగి రావటం, అసలేమాత్రం గొడవ జరగలేదన్నట్లుగా ఆ భార్యాభర్తలు మామూలుగా వుండటం, గమనించాడతడు. జానకి మాత్రం వాళ్ళను అసహ్యించుకోవటం మానలేదు; ఆ అరవ దంపతుల్ని ఆకాశాని కెత్తటమూ మానలేదు.

"బట్టలు వేసుకోవటంలో కూడా ఏమి పొందికో చూడండి. ఆ అరవ్వాళ్ళు! ఆ పొందిక అందరికీ రాదు. అసలు కొందరున్నారే, వెకిలిగా ఎర్రచీరొకటి ఒంటికి చుట్టుకుని, 'ఇది మా ఆయన ప్రేమ చిహ్నంగా తెచ్చాడండోయ్', అని దండోరా వేస్తున్నట్లుగా కనబడతారు... అలాకాదు ఆ దంపతులు. ఎంత హుందా, ఎంత నాణ్యత–" అంది ఆమె. ఒక సాయంత్రం వీధిలో వెళ్తున్న ఆ అరవ దంపతుల్ని చూపుతూ. ఆ విమర్శ ఎవరిపై గురిచెయ్యబడ్డదో అర్థం కాకపోలేదు గోపాలానికి. ఆరోజు వెంకట నరసయ్య తనకు చూపించిన వెంకటగిరి చీర ఎరుపు రంగుదే.

మరో సాయంత్రం అతడు ఆఫీసు నుంచి వచ్చి వరండాలో అడుగుపెట్టి అక్కడే ఆగిపోయాడు.

లోపల గదిలో తులశమ్మ గొంతు వినబడుతోంది.

"బయటికి అలా కనిపిస్తారుగాని ఆ అరవ్వాళ్ళు యింట్లో తరచుగా పోట్లాడుకుంటూ వుంటారట", అంటోది తులశమ్మ.

"పోనివ్వండి పాపం", అంటోంది జానకి, "కాస్సేపు గిల్లికజ్జా వేసుకుంటూ వుండేనే కదా, కొత్త సంసారల్లో సరదా"...

"అదీ నిజమే... రేపో మాపో బిడ్డదంకలోకి వచ్చిదంటే, అప్పుడీ సరదాలకు టైమెక్కడుంటుంది మరి ?"

"అంటే...?"

"ఆ అమ్మాయి నెలతప్పిందట ... సరేగాని, అమ్మాయ్ మనం జొన్నవాడకు వెళ్ళొచ్చిన తర్వాత నువ్వు బయటున్నావా?"

"ఉన్నానండీ ... నాలుగు రోజులైంది," జానకి కంఠం నీరసంగా వుంది.

"నాకు తెలీదమ్మాయ్ .. నువ్వు బయట కూచోలేదు కాబట్టి, అలాంటిదేమీ లేదనుకున్నాను." అని అంతలోనే మాటమార్చింది తులశమ్మ, "అన్నట్టు మర్చిపోయాను. చక్కెర వుంటే ఓ గిన్నెడివ్వు ఈ నెల్లో యింకా కొనలేదు ..."

అంతవరకు విన్న గోపాలం, బూట్లచప్పుడు చేసుకుంటూ లోపలికి అడుగు పెట్టాడు. తులశమ్మ చక్కెర గిన్నెతో బయటికి వెడుతోంది. నలుగురికీ నాలుగు మృదువైన మాటలు చెప్పి చిన్న చిన్న వస్తువులు సంపాయించటం తప్ప ఆవిడకు వేరే దురుద్దేశాలేవీ వుండవని అనిపించింది అతడికి.

అతడు బట్టలు మార్చుకుని, ఏదో మేగజైన్ అందుకుని కాంపౌండులో కుర్చీవేసుకుని కూచున్నాడు. చల్లగా గాలి వీస్తోంది. ఆ గాలికి మిరపప్పండ్లు అహంకారంగా కదులుతోంటే, పక్కనే ఎదిగీ ఎదగని చేమంతులు వెలవెలా పోతున్నాయి.

"ఎంతసేపైంది మీరువచ్చి ?" అంది జానకి పక్కగావచ్చి నిల్చుంటూ.

"ఇప్పుడే..."

ఆమె లోపలికి వెళ్లి కాఫీ తెచ్చింది. అందుకుని తాగుతూ అతడు బయటికి చూసేసరికి, ఆ అరవదంపతులు ఒకర్నొకరు రాచుకుంటూ వీధిలో నడిచివెళ్లుతున్నారు.

"చూడు .." అన్నాడతడు.

"పోనిద్దురూ, అరవగుంపు," అంది జానకి. అతడాశ్చర్యంగా చూశాడు. ఆ ఆశ్చర్యంలోంచీ తేరుకోకముందే, ఆమె మళ్లీ అంది

"ఏంవిటో, యీ కొంప- నాలుగు చేమంతులుకూడా పెరగటంలేదిక్కడ... మరో మంచి యిల్లు చూద్దురూ - మీకు పుణ్యముంటుంది."

చైత్రగీతంకోసం

శ్రీ తిరునగరి

ఈకాకుల కాకారవాలమధ్య
ఒక్క కోకిల కుహూరుతం వినిపించదేం ?
ఈ భీషణ విద్వేషోరగాల బుసలమధ్య
ఒక్క అనురాగ వేణునాదం చెవిసోకదేం ?
ఈ రక్తంలో తడుస్తూ పంకిలమౌతున్న వ్యవస్థను
జాగృతంచేసే
ఒక్క అహింసాగీతం శ్రుతిపేయంగా ఆలాపింపబడదేం?
ఈ పతనమవుతున్న జాతిసంస్కృతిని పరిరక్షించే
ఒక్క దీక్షాయత్నం అవిరళంగా కొనసాగదేం ?
ఈనాడు
నాజాతి
ఎవరికి ఎవరోగా
సముద్రాల్లో ద్వీపాలుగా
ద్వీపకల్పాలుగా
మానసికంగా, సామాజికంగా
దూరంగా దూరదూరంగా జరిగిపోతున్నారు
గిరులు గీసుకుంటున్నారు
'వయం, అనే మాటను మరచి
'అహం, కు పట్టం కడుతున్నారు
ఏముంది ?
హృదయ దర్పణంలో
ఈ దేశాన్నిచూస్తే
ఆకాశాన్నంటే అందాల మేడలు
ఆ పక్కనే శిథిలమవుతున్న పూరిళ్ళు
మల్లెలూ గులాబులూ గుల్మొహర్లూవిరిసే నందనాల
ప్రణయ విహారాలు కొందరివైతే
ధూళీ దుర్గంధమూ ముసిరిన మురికికాల్వలప్రక్కన
సంసారాలెందరివో
జీవితమంతా స్వేదం ఒలుకుతున్నవాడు
చీకట్లలోనే బ్రతుకీడుస్తున్నాడు
చీకట్లో వ్యాపారాలు చేస్తున్నవాడు
నియాన్ వరదదీపాల వెలుతుర్లో మెరుస్తున్నాడు
ఎక్కడుంది చెప్పు శాంతి ?
మానవత్వం లోపించింది
అంతటా అలజళ్ళూ హత్యలూ
బీభత్సాలూ - విషాదభారతాలూ
ఈ నాదేశం
శాంత్యహింసల కోశాగారం అని
చరిత్ర చెబుతోంది
ఇది నిజమా !
ఐతే
ఈ కోశాన్ని ఎవరో దోపిడి చేశారు
ఫలితంగా
అశాంతి, హింసోన్మాదం
ఈ దానవతను తొలగించి
ఒక్క మానవతా దీపంవెలించే
జ్యోతిర్మూర్తికోసం
ఈ కాకా రవాల మధ్య
కుహూ రుతం విన్పించే
ఒక్క పుంస్కోకిలకోసం
ఈ భయదశైశిరాన్ని మరపించి
గుండెను చిగురింపజేసే
ఒక్క చైత్రగీతంకోసం
ఇక్కడ
నేను
చూస్తూ నిల్చొని
ఎన్నాళ్ళైందో !
ఇంకెన్నాళ్ళు పడుతుందో !!

సీరియల్



(గత సంచిక తరువాయి)

3

సత్యమూర్తి వసారాలోంచి నడిచి మెల్లగా మేడమెట్లు ఒకటీ ఒకటీ ఎక్కి ఆనందరావుగది పక్కనుంచి నడిచాడు. ఆ గది తలుపు వేసివుంది. ఆదివారంనాడు అతను సాధారణంగా ఇంటిదగ్గరఉంటాడు. పండుగ ఇంకా అయిదురోజులేవుంది. ఉన్న ఒక్క తమ్ముడిని అమ్మ పండుగకు పిలుచుకొని రమ్మంది. ఆ పనికి తనను పురమాయించింది. ఇటువంటి పనులు పెద్దవాళ్లు చేయవలసినవి. తనకు మామను ఏ విధంగా పిలవాలో కూడా తెలియదు. నాన్న ససేమిరా బావమరిదిని పిలువనన్నాడు. అతని దృష్టిలో ఆనందరావు చేతకానివాడు. లోకంలో అంతా అమాయకులకుమల్లే కనిపిస్తారు. శాంతమ్మత్త ఎంత ఉత్తమురాలు ! ఆమెను తలచుకుంటే ఎటువంటి మొగుడూ మరొక ఆడదానిని తాకడు. కాని ఆనందరావు వట్టి పిరికిపంద. మూడునెలలు దాటకుండానే మరొకతెకు తాళికట్టాడు. కాదు, కాదు ఉరిత్రాడు తన మెడకు బిగించుకున్నాడు. నాన్నయితే మగాడు. అతని అభిప్రాయాన్ని మార్చడం కష్టం. కాని అమ్మ మనసు మెత్తనిది. ఉన్న ఒక్క తమ్ముడు, మేనకోడలు, పండుగకు ఒంటరిగా ఉండటం ఆమెకు నచ్చలేదు. భర్తను బతిమాలుకుంది. చివరకతను మెత్తబడి వాళ్లను పండుగకు పిలిపించడానికి అంగీకరించాడు. పిలిచే పనిమాత్రం అమ్మ తనకు అప్పగించింది.

సత్యమూర్తి హాలువేపు నడిచాడు. హాలు తలుపులు తీసి ఉన్నాయి. పట్టిమంచం ద్వారానికి కొద్దిదూరంలో వేసి వుంది. దానిమీద సరస్వతి పండుకొంది గాఢమయిన నిద్రలో ఉంది.

"సరస్వతీ !" సత్యమూర్తి మెల్లిగా పిలిచాడు.

సరస్వతి లేవలేదు. తరువాత మరికొంచెం గట్టిగా పిలిచాడు. కాని ఆమె ఏ స్వప్నలోకాలలోఉందో, లేవలేదు. కొంచెంసేపు వేచియుంటే ఆమే లేస్తుంది. పక్కనున్న కుర్చీమీద కూర్చొని కిందను పడిన వారపత్రికను తీశాడు సత్యమూర్తి.

మధ్య పేజీలలో సినిమా వార్తలున్నాయి. అందులో ఒకతార రంగులచిత్రం ఉంది. సాధారణంగా తారలు చాల చక్కగా ఉంటారు. సత్యమూర్తి తిరిగి సరస్వతి ముఖంలోకి చూచాడు. ఈమే ఆ తారలందరికన్న అందంగా ఉంది.

పుస్తకం మూసి సత్యమూర్తి ఆలోచిస్తూ సరస్వతి ముఖంవేపే చూస్తూ ఉండిపోయాడు.

సరస్వతి వెల్లకిల పడుకొంది. తలంటి పోసుకున్న ముంగురులు ముఖంమీద చిరుగాలికి కదులుతున్నాయి. ఫాలం విశాలంగా ఉంది, నుదుటి మధ్యనో చిన్న తిలకం. పెదవులు చాల ముద్దుగా ఉన్నవి. చెంపలు అద్దాలవలె సాపుగా ఉన్నవి. ఆ కళ్ళు మూసుకున్నా, తామర పూవురేకుల వంపులు దిద్దుకున్నది. ఆమె మెడ, సన్నటి ఊపిరికి చలిస్తున్నది. వేసుకున్న వోణీ కొంచెం పక్కకు తొలగింది. వక్షస్సు నిండుగా ఉంది. తరువాత నడుము సన్నగా—పరికిణీ కట్టుకున్నదేమో ఆ జఘనం విశాలంగా—ఆమె శరీరావయవాలన్నీ పరిపుష్టిగా ఉన్నవి.

ఎంత చక్కటిది సరస్వతి !

దూరం నుంచి ఆమెను చాలా సార్లు చూచాడు. ఆమె కిన్నతనే ముందు సిగ్గుతో తలదించుకునేవాడు. పెద్దవాళ్ళెవరేనా చూస్తారేమోనని భయపడేవాడు. శాంతమ్మత్త తన కూతుర్ని రామచంద్రయ్య కొడుక్కి ఇస్తానని ఎప్పుడూ అనలేదు. ఆమె కొక్కటే కోర్క. కూతురు బాగా చదివి డాక్టరు కావాలని. డాక్టర్లకు ముందుగా పెళ్ళి నిశ్చయించినందువలన లాభంలేదు. చాలమంది డాక్టర్లు చాల విధాలుగా పెండ్లిండ్లు చేసుకుంటారు. కులం, మతం, అంతస్తు, చాల విషయాలు వారు ఒకప్పుడు పాటించరు. అందుచేత శాంతమ్మ ఎప్పుడూ సరస్వతి పెళ్ళి గురించి ఆలోచనే చేయలేదు. ఆమె చాల ముందాలోచనలకు పోయింది. అయిదు సంవత్సరాలు మెడిసన్ చదవాలంటే కనీసం పాతికవేలేనా అవుతుంది. సరస్వతికి స్కాలర్షిప్పు వచ్చే అవకాశాలెన్నో ఉన్నాయి. శాంతమ్మ తన వంటిమీదనున్న పాతిక తులాల బంగారం అమ్మి, డబ్బు బాంకులో ముందే జమచేసింది. ఈ విషయాలన్నీ సత్యమూర్తికి వాళ్ళమ్మే చెప్పింది. సరస్వతి కూడా తనతల్లి ఆశలకు అనుగుణంగా చాల బాగా చదివింది. ఇంటరులో డిస్టింక్షన్ వచ్చింది. మెడికల్ ఎంట్రెన్సు పరీక్షకు కూచుంటే, మొదటి పది మందిలో తప్పక వచ్చేది. కాని ఆ ఆశలన్నీ నిరాశలయాయి. ఎవరిని నిందించడం, విధినా ?

సత్యమూర్తి ఆలోచిస్తూ సరస్వతిని సాకాంక్షగా చూస్తూ కూర్చున్నాడు. ఒక అరగంట గడిచిపోయింది. నిద్రలోనున్న మనిషిని లేపడానికి అతనికి మనస్కరించలేదు. కొంచెం సేపుపోయిన తరువాత తిరిగి వద్దామనుకున్నాడు. డాబాతోట దగ్గర పీర్లిల్లు. తాను మువ్వల వాని పాలెం నుండి తిరిగి వచ్చాడు. బస్సులో ప్రయాణం చేయడానికి అరగంటకు పైగా అవుతుంది. బస్సులు దొరకటం కష్టం.

ఏం చేయడం ? మరొక్క అరగంట వేచియుంటే సరస్వతి నిద్రలేస్తుంది. ఆమెతో మాట్లాడితే వచ్చినపని ముగుస్తుంది. ఆలోచనలు చెదిరిపోతుంటే సత్యమూర్తి ఆమె వేపే చూస్తూ కూర్చున్నాడు. అప్పుడే వికసించిన పూవు. ఎంత సౌందర్యాన్ని సంతరించుకుందో ! ఏ అదృష్టవంతుకు ఇటువంటి కన్యను పెళ్ళాడడానికి తపస్సుచేస్తున్నాడో !

సత్యమూర్తి ఎప్పుడూ పగటి కలలు కనడం ఎరగడు. చేయవలసినపని చేయడం, చేసినపని సంతృప్తికరంగా చేయడం అతను చిన్నప్పటి నుంచీ నేర్చుకున్నాడు. అందుచేత వచ్చిగంటన్నర అయినా వెళ్ళలేకపోతున్నాడు.

సరస్వతి కదులుతున్నది. సత్యమూర్తి లేచినిలబడ్డాడు. భయంతో సరస్వతి అరుస్తున్నది. చేతులు కాళ్లు కొట్టుకుంటున్నది. మంచంమీద నుంచి పడిపోతుందేమోనని ఆమె చేతులు పట్టుకున్నాడు. సరస్వతి భీతితో కళ్లుతెరచింది. తన ముఖానికి సమీపంలో మరొకరి ముఖం— ఆ ముఖం నుంచి ఊర్పులు తన చెంపలకు తగులుతున్నాయి. ఎవరో తనను పట్టుకుంటున్నారు. చేతులు విడిపించుకోడానికి ప్రయత్నించింది. కెవ్వున కేకవేసింది. అప్పటికి ఆమెకు బాగా తెలివివచ్చింది.

సత్యమూర్తి ఆమె చేతులు విడిచిపెట్టి మంచానికి దగ్గరగా నిలబడ్డాడు. సరస్వతి లేచి మంచంమీద కూర్చుంది. తొలగిన పైట సరిదిద్దుకుంది. గాలికెగురుతున్న ముంగురులు వెనుకకు తోసుకుంది. కోపంతో సత్యమూర్తి ముఖంలోకి చూచింది.

సత్యమూర్తి ముఖం దించుకున్నాడు.

"ఏమ్ ! ఏం చేస్తున్నావు ?" అరిచింది సరస్వతి.

సత్యమూర్తి జవాబు చెప్పలేదు.

"మూర్ఖుడా ! ఏం చేస్తున్నావిక్కడ ? ఒంటరిగా నేను నిద్రపోతుంటే ఏం చేయదలచుకున్నావ్ ?"

సత్యమూర్తి జవాబు చెప్పలేదు.

"నేను నేను "

"ఓయిఫూల్ ! బలవంతం చేయడానికి నీకెన్ని గుండెలున్నాయ్"

"లేదు లేదు, నేనాపనిచేయలేదు."

"మరేంచేస్తున్నావిక్కడ ? ఆడపిల్ల వంటిమీద బట్టలు సరిగా లేక, ఒళ్లు తెలియకుండా నిద్రపోతూంటే, సిగ్గు లేకుండా చూస్తూ కూర్చున్నావా ?...పో ! అవతలికి పో !"

సత్యమూర్తి జవాబు చెప్పలేదు. ఆమె అనుమానం సమంజసంగా ఉన్నట్లే అతనికి తోచింది. అతను మరేమీ మాట్లాడకుండా, ముఖం దించుకుని, బయటికి వెళ్ళిపోయాడు.

అతని వాలకం చూస్తే బలవంతం చేయగలిగిన మనిషిలా కనిపించలేదు సరస్వతికి. మరి తన చేతులెందుకు పట్టుకున్నాడు. అతని

ఊర్పులు తన చెంపల కెందుకు తగిలాయి? తన వంటిమీద బట్టలు సరిగా లేవు. ఈ మగాళ్లను నమ్మమన్నవాళ్లెవరు?

సరస్వతి వరండాలోకి వచ్చి మేడమెట్లవేపు చూచింది. సత్యమూర్తి ఎందుకొచ్చాడో, ఎందుకు వెళ్ళిపోతున్నాడో ఆమెకు అంతుబట్టలేదు. ఎంతో పని ఉంటేనేగాని అతను ఈ యింటికి రాడు. ఏదైన తొందరపని ఉందేమో! లేకపోతే మువ్వలవానిపాలెం నుండి పనికట్టుకొని ఎందుకు వస్తాడు?

"ఏయ్ మూర్తీ!" సరస్వతి గట్టిగా పిలిచింది.

ఆఖరిమెట్టు దిగుతున్న మూర్తి అక్కడే ఆగిపోయాడు.

"ఇలారా!" సరస్వతికి కోపం ఇంకా పోలేదు.

ఒకటి ఒకటి మెట్లెక్కి సత్యమూర్తి మీదకు వచ్చాడు. ముఖం దించుకునే ఉన్నాడు.

"ఎందుకొచ్చావు?"

"సారీ! నువ్వు నన్ను మరోవిధంగా అనుకుంటున్నావు. నాకే తప్పు ఉద్దేశం లేదు.

"నేనడిగిన ప్రశ్న ... ఎందుకొచ్చావని?"

"మా అమ్మ కబురు పంపింది. ఈ సంక్రాంతి పండుగకు మామను, నిన్ను రేపటినుంచే మా యింటికి రమ్మని చెప్పింది."

"సరే! నాన్నతో చెప్తాను. నాన్న వస్తాడో, రాడో చెప్పలేను. కాని నేను మాత్రం రేపు వస్తాను. ఇక నువ్వు వెళ్లొచ్చు."

మంచి కుర్రాడిలా సత్యమూర్తి దించిన తల ఎత్తకుండా మెట్లుదిగి, వసారాలోంచి నడిచి, వీధిలోకి వెళ్ళిపోయాడు.

సరస్వతికి నవ్వు వచ్చింది. బుద్ధిమంతుడైన సత్యమూర్తి ఒంటరిగా చేయి జిక్కిన చిన్నదానిని ఎప్పుడూ అల్లరి పెట్టడు. పైకి ఒక విధంగా, లోపల మరో విధంగా ఆలోచనలు కలవాడుకాడు. ముఖ్యంగా స్త్రీలపట్ల అతనికి గౌరవముంది.

సత్యమూర్తి తనకన్న నాలుగేండ్లు పెద్ద. షిప్ యార్డులో పనిచేస్తున్నాడు. నైట్ కాలేజిలో బియ్యే చదువుతున్నాడు. కాని, సరదాగా, చలాకీగా కనిపించడు. ముచ్చటకయినా. ఇటువంటి మహానుభావులంటే తనకు అరకాలిమంట.

చదువుకునే రోజుల్లో అంటే ఉద్యోగం చేయకుండా, పోలిటెక్నిక్‌లో ఏల్సియీ చదువుతున్న రోజుల్లో ...నెలకొక సినిమావేళకు స్కూలుకి వెళ్లిరావడం, రాత్రి పదివరకు, తెల్లవారి నాలుగు నుంచి చదువుకోవడం తప్పించి అతని గురించి మరేపీ విశేషమైన వార్తలు తను వినలేదు. ఈ విధంగా చదువుతే ఎవరైనా మొదటి రాంకులో తప్పకుండా వస్తారు. అతను ఆంధ్రప్రదేశ్ అంతటికి మొదటివాడుగా వచ్చేడంటే ఆశ్చర్యమేముంది? మనిషికి తెలివితేటలున్నాయో లేవో దేవుడికెరుక-కాని గాడిదవలె కష్టపడే ఈ మూర్తిని చూస్తే తనకు కోపం.

ఆత్మవిశ్వాసం ఉండాలి. తెలివితేటలుండాలి. చురుకుదనముండాలి. లోకంలో చదువొక్కటేకాదు మనిషికి కావలసినది. అపజయానికి భయపడి అంత శ్రమపడి సాధించడంలో గొప్పతనమేముంది?

ఇటువంటివాడిని పెళ్లి చేసుకున్న ఆడది ఏం సుఖపడుతుంది? మగాడు తిండి, బట్టా పెట్టినంతమాత్రానే ప్రేమకు అర్హుడౌతాడా? మంటి బుక్కడంలా, తుంగదుబ్బులా, వంకాయముద్దలా ఉన్న యిటువంటి మొగుడితో, తనవంటిది సంసారంచేయలేదు.

4

మువ్వలవాని పాలెంలో చాల కొత్త యిళ్ళులేచాయి. రామచంద్రయ్య ఎంచి, ఎంచి, సముద్రం చక్కగా కనిపించే చోట ఒక ప్లాటు కొన్నాడు. అప్పటికే ఆ జాగాలకు ధర బాగా పెరిగిపోయింది. కొత్తగ్రహారంలో కొన్నాళ్లు, శివాలయం వీధిలో కొన్నాళ్లు, దొండపర్తిలో చాలాకాలం అద్దెకుండి, చివరకు తెగించి మువ్వలవాని పాలెంలో జాగా కొన్నాడు. భార్య వంటిమీద బంగారం అమ్మి, గవర్నమెంటు లోను తెచ్చి, చాలని కాడికి అప్పుచేసి వాసయోగ్యమయిన చక్కని యిల్లు కట్టించాడు.

రెండు సంవత్సరాల క్రింద గృహప్రవేశం జరిపించారు. అప్పటికి శాంతమ్మ బ్రతికే వుంది. సరస్వతిని, శాంతమ్మని, ఆనందరావుని పిలిచి అందరికీ బట్టలు కూడా పెట్టింది జానకమ్మ. అప్పటికి రెండు గదులు, వంటిల్లు మాత్రమే తయారయాయి. కొళాయి కూడా వేయించారు. కాని గోడలకు గిలాబాలు కూడా కాలేదు. గచ్చులు మాత్రం పూర్తిచేసి ఇంట్లో దిగిపోయారు. అప్పుడు సరస్వతి చూచిన ఇంటికి ఇవాళ చూసిన ఇంటికి చాలా భేదం కనిపించింది.

ఆ వీధిలో యిప్పుడు చాలా ఇళ్ల లేచాయి. ఇంటి నంబరు తెలుసు కాబట్టి ఇల్లు వెదుకుకోగలిగింది సరస్వతి. చక్కని లేత క్రీము కలరు పై గోడలు, గదులలో లేతనీలపు డిస్టెంపరు, తలుపులకు, ద్వారబంధాలకు గ్రేకలరు పెయింటు, చుట్టూ ప్రహారీగోడ- దూరంనుంచి చూస్తే ఆ యిల్లు చాల చక్కగ కనిపిస్తుంది.

ఇప్పుడు యిల్లు కూడా పెద్దదిగా కనిపించింది. వీధిలో చిన్న వరండా, పక్కను గది, లోపల రెండు పడకగదులు, విశాలమైనహాలు వంటిల్లు, సామానుగది, బాత్‌రూములు, డాబామీదికి ఇంటిలోపల నుండే మెట్లు, డాబామీద దక్షిణం వేపు సముద్రం బాగా కనిపించే పెద్ద కిటికీలున్నగది ఆమె చూచింది. పదిహేను అడుగుల వెడల్పులో ఇంటికి చుట్టూ ఖాళీ స్థలముంది. చుట్టూ కాంపౌండువాలు, రంగులు వేసిన ఇనుపగేటు ఉన్నాయి. గేటుకు రామచంద్రయ్య నేమ్‌బోర్డు కూడా ఉంది.

సరస్వతిని చూచి జానకమ్మ చాలా సంతోషించింది. అంతకన్న సంతోషించింది కాత్యాయని. ఆ పిల్లకు సరస్వతిని చూస్తే ఎంతో గౌరవం. ఫస్టుక్లాసులో, ఆడవాళ్లలో కాలేజీకి మొదటిదిగా ఇంటరు పాసయిన సరస్వతి ఆ చిన్నపిల్ల మనసులో ఎంతో ఉన్నతమయిన స్థానాన్ని ఆక్రమించుకుంది. కాత్యాయనికి ఎనిమిదేళ్ళు. శేఖర్ కాత్యాయని కంటే పెద్ద. ఇంగ్లీషు మీడియమ్ స్కూలులో ఆరవతరగతి చదువుతున్నాడు. కాత్యాయని మాత్రం దగ్గరనున్న ట్యుటోరియల్ స్కూలుకి వెళ్ళివస్తుంది. అందరికీపండుగ సెలవులు ఇచ్చారు.

ఇంటికి రంగులు వేయించి, గుమ్మాలకు పసుపురాసి, బొట్లు పెట్టి పండుగ ముస్తాబులు చేస్తున్నది జానకమ్మ.

సరస్వతి మువ్వలవానిపాలెం చేరుకునేసరికి పదకొండు గంటలయింది. తొమ్మిది గంటలకే భోజనంచేసి రామచంద్రయ్య వెళ్లిపోయాడు. అతను కలెక్టరాఫీసులో పనిచేస్తున్నాడు.

సత్యమూర్తి షిప్‌యార్డులో బిల్డింగు ఇనస్పెక్టరుగా పనిచేస్తున్నాడు. ప్రొద్దున ఏడు కాకుండా వెళ్ళిపోతాడు; మధ్యాహ్నం భోజనం ఎవరో కుర్రవాడు పట్టుకుని వెళ్తాడు. సాయంకాలం అయిదున్నరకు వచ్చి, వెంటనే యూనివర్సిటీకి వెళ్ళిపోతాడు. నైట్‌క్లాసు నుండి రాత్రి పదిగంటలకు వచ్చి భోజనం చేసి మేడమీదికి పోతాడు.

అత్తకు ఏవో పనులు సాయంచేసి, పిల్లలతో ఇటూ అటూ తిరిగే సరికి రోజు గడిచిపోయింది సరస్వతికి. సాయంకాలం రామచంద్రయ్య ఆఫీసునుంచి వచ్చి సరస్వతిని పలకరిస్తాడు. తరువాత ముఖం, కాళ్లు చేతులు కడుక్కొని, జానకమ్మ యిచ్చిన కాఫీ తీసుకొని వీధివరండాలో కుర్చీమీద కూర్చుంటాడు. వెలుతురున్నంతవరకు న్యూస్‌పేపరు చదువుతాడు. చీకటిపడిన తరువాత సముద్రంవేపు చూస్తూ కూర్చుంటాడు. నక్షత్రాలు వచ్చి, వాటి మినుకు మినుకు వెలుతురులో కెరటాల నురుగు చూస్తుంటాడు, వీధిలోని దీపం ఆర్పి ఇది అతని నిత్యకృత్యం.

రాత్రి ఏడు, ఎనిమిది గంటలకో జానకమ్మ భోజనాలకు ఏర్పాటు చేస్తుంది. పిల్లలు అంతవరకు చదువుకుంటారు. తండ్రీ, పిల్లలు కలిసి భోజనం చేస్తారు. తరువాత జానకమ్మ భోజనం చేస్తుంది. సత్యమూర్తి కని భోజనం మూతపెట్టి ఉంచుతుంది. అతను రాత్రి పదిగంటలకు వచ్చి, తానే వడ్డించుకుంటాడు. సరస్వతి జానకమ్మతో భోజనం చేస్తుంది. పిల్లలతోపాటు రెండవ పడక గదిలో పడుకొంటుంది.

సరస్వతి ఉదయం నిద్రలేచేసరికి సత్యమూర్తి స్నానపానాలు ముగించుకొని, స్కూటరు తీసుకొని ఉద్యోగానికి వెళ్ళడానికి తయారయాడు.

సరస్వతి ఆ యింట్లో ఒకవారం రోజులుంది. ఆ వారంరోజులలో సత్యమూర్తి మాత్రం పండుగ మూడు రోజులలోను యింట్లో ఉన్నాడు. రామచంద్రయ్యకూడా ఉన్నాడు. పిల్లలతో కాలం సరదాగా గడిచిపోయింది. పెరట్లోను, పక్కలను ఉన్న ఖాళీజాగాలో వేసిన గులాబీ, సన్నజాజి, మల్లె సంపెంగ మొక్కలకు సత్యమూర్తి గొప్పులు తవ్వి నీళ్ళు పెట్టాడు. శేఖర్ పెరట్లో కాసిన వంకాయలు, పచ్చిమిరపకాయలు, తోటకూర ఏదో ఒకటి, రోజూ ఉదయం కోసుకొని వచ్చేవాడు. కాత్యాయని అమ్మపూజకు కావలసిన పూవులు కోసుకొని వచ్చేది.

పండుగ మూడు రోజులు ఇద్దరు మగాళ్లు ఇంట్లో ఉన్నప్పుడు స్వేచ్ఛగా సంచరించడానికి ఇబ్బంది కలిగింది. సాధ్యమయినంతవరకు అత్త వెనుకనే తిరిగేది. రామచంద్రయ్యకు సరస్వతి గురించి కాత్యాయని ఎన్నో సంగతులు చెప్పింది. శేఖర్ సరస్వతి చేస్తున్న పనులన్నీ జాగ్రత్తగా పరిశీలించేవాడు. ఒక్క పొల్లుమాటేనా పలుకకుండా ఎప్పుడూ నవ్వుతూ, విసుగన్నది లేకుండా సరస్వతి పనిచేయడమేకాక, రాత్రి చాలా చాలా విషయాలు ఆటంబాంబు గురించి, ఆడిసన్ గురించి చెప్తుంటే శేఖర్ ఆమెను మెచ్చుకునేవాడు.

సత్యమూర్తి, ఒకసారి కాబోలు, సరస్వతిని ఆ వారం రోజులలోను పలుకరించాడు. అంతే – ఆ తరువాత అటువంటి పని చేయడానికి అతనికి వీలు చిక్కలేదు. తన చదువు, ఉద్యోగం, భోజనం, నిద్ర, అన్నీ వాచీముళ్ళు తిరిగినట్లు, వేళ సూచించినట్లు — గతి తప్పకుండా మరో యంత్రానికి మల్లే వ్యవహరించేవాడు.

సరస్వతికి మొదట అతనిమీద జాలికలిగింది. క్రమంగా అతని జడత్వాన్ని, యాంత్రికంగా నడిపే దినచర్యను చూచి ఆమె అసహ్యించుకుంది.

ఇంట్లో రామచంద్రయ్య విధిగా రేడియో వింటాడు. కేవలం వార్తలేకాకుండా, సినిమాపాటలు. సంగీతకచ్చేరిలు, అన్నీ ఓపికగా విని ఆనందించుతాడు. పిల్లలు బాలానందం, సినిమాపాటలు వింటారు. జానకమ్మ మధ్యాహ్నం వనితావాణి ఎప్పుడూ మరచిపోయేదికాదు. కాని వీటన్నిటికి అతీతుడైన ఒక్క మనిషి సత్యమూర్తి మాత్రమే ఆ ఇంట్లో కనిపించాడు. అతడంటే సరస్వతికి సదభిప్రాయం కలుగలేదు

(ఇంకా వుంది)

నాకు నచ్చిన కావ్యం - గొట్టుముక్కలవారి "కుంతి"

"కుంతి రచనమ్ము చే పదగుంఫనమున
భావమాధుర్యమున రసబంధురతను
రామకృష్ణ కవీంద్రు "నౌరసుడ" వంచు
కీర్తిగడియింతువో రామకృష్ణసుకవి!"

అని ఒక భావుకుడన్నమాటలు ఆయనపట్ల అక్షరాలా నిజం!

భారతంలోని విలక్షణమైన పాత్రలలో 'కుంతి' ఒకతె. ఈమెను ప్రధానపాత్రగాస్వీకరించి కావ్యసృష్టి గావించిన వారిలో గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రిగారు, జంధ్యాల పాపయశాస్త్రిగారు ముఖ్యులు. కానీ-భావనలో, శిల్పంలో రచనావిన్యాసంలో, పదబంధంలో ఎవరి త్రోవ వాళ్ళది.

ఏ కావ్యాన్ని పరిశీలించినా మనకు రెండు అంశాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఒకటి పద్యరచన రెండు విషయ విస్తరణ. సహజంగా ఈ రెండు శక్తులు మిక్కిలి విలక్షణమైనవి.

ఆంధ్రసాహిత్యంలో కవి తానుగా చెప్పక తన మనోభావాలను, ఆవేశాలనూ అన్నింటినీ ఒక పాత్రద్వారా చెప్పడం ఒకశిల్పవిశేషం! దీనివల్లముఖ్యంగా కావ్యానికి దీప్తి, కవిప్రతిభకు నికషం ఏర్పడతాయి. కవి కుంతిని పదునాఱు శీర్షికలలో, పదునాఱు కోణాలనుండి దర్శించి రూపకంగా మలచి మనకళ్ళముందుంచాడు. 'కర్ణుని తలపై భారతం' అన్నట్టు ఆకర్ణునకు మూలమైన 'కుంతి' లేనిదే భారతం ఒక్క అంగుళం కూడా ముందుకు నడవదనిపిస్తుంది. మాతృత్వమంటే ఏమిటో తెలియని పన్నెండేండ్ల బాలికనుండి, అనుకోని అనుభవాల దెబ్బలుతిని, కురుక్షేత్రహోమం తరువాత వృద్ధాప్యంలో సర్వసంగ పరిత్యాగంచేసి జీవితం నిష్క్రమించే వరకు ఆమె ఎన్నో అవతారాలనెత్తింది. సర్వకష్ట నిష్ఠూరాలను చేతులార ఆస్వాదించింది. భారతంలో విలక్షణమైన స్త్రీపాత్రగా నిలిచింది.

కన్యాత్వంలోనే మాతృత్వం పొందిన స్త్రీగా, అనుకోని ఘటనలో బిడ్డలను పెంచిన తల్లిగా, పరుల పంచన అభిమానం చంపుకొని, విధి వక్రించిన రాజపుత్రులను పెంచిన ధీరురాలుగా కడుపార కన్నకొడుకు కనబడితే చేతులు చాచి గుండెలకు అద్దుకో లేని విధివంచితురాలిగా ఆఖరుకు బైటపడి పెద్దకొడుకు చేత నిందపడిన దురదృష్టవంతురాలిగా, నిలిచిన స్త్రీ పాత్ర కుంతి.

దూర్వాసుడిచ్చినవరాన్ని పరీక్షించదలచి, సూర్యభగవానుణ్ణి ప్రార్థిస్తే, అతడు వచ్చి సద్యోగర్భాన ఒక కుమారుణ్ణి ప్రసాదించాడు. కుంతి ఊహించనిస్థితి ఇది. కాని తన కన్యత్వాన్ని నిల్పుకోడానికి శిశువును పరిత్యజించాలి తప్పదు. అప్పుడామె ఆవేదనను కవి చిత్రించిన తీరు ఈ విధంగా ఉంది —

"తనయులకోసమంచు సరదాపడి యే పెరవారి బిడ్డనో
గొని కడుముద్దుగాఁ బెనుచుకొంటి రపుత్రులు-కన్న బిడ్డ న
ర్కుని యవతారమున్ గవచకుండల మండితు నిట్లు గంగలో
మునిచిన తల్లి నేనొకతెఁ బుట్టితిఁ నేటికి భారతావనిన్"

బిడ్డలులేని దంపతులు తమ మనసులోని కోరికను నెరవేర్చ డానికి, బిడ్డలపట్ల గల కాంక్షతో, పొరుగువారి బిడ్డలను తెచ్చి పెంచు కొంటారు. కానీ సూర్యదేవుని పర ప్రసాదంవల్ల పుట్టి, అందచందాలలో సూర్యునే మించిన కవచ కుండల మండితుడైన తన కుమారుని లోక నిందకు వెఱచి 'గంగలో' వదలిన మాతృమూర్తి కన్య కుంతి. ఎంత దుర్ఘటన!

'కుంతి' పాత్రకు దీప్తిని కలిగించే మరొక అంశం. ఆమే తల్లీ, తండ్రి అయి పాండవులను అత్యుత్తమ వీరులుగా తీర్చి దిద్దిన తీరు. మాద్రీ పాండురాజుల మరణానంతరం తానే మొండిగా నిలబడి వాళ్ళను యుద్ధవిద్యా విశారదులను గావించి, తండ్రికి మించిన తనయులుగా రూపొందించింది. 'వీరమాత' అనిపించుకుంది. 'పతి వియోగము' అనే ఖండికలో ఒకచోట ఆమెచేత ఇలా పలికిస్తాడు కవి—

"కౌరవ్యావళికన్న వేయి మడుఁగుల్ కౌంతేయ మాద్రేయులే
ధీరాగ్రేసరులన్న కీర్తిఁ గొను రీతిన్ వీరి శిక్షించెదన్
గారాబమ్మునఁ బెంచుకొందు శిశురక్షా రూపమౌ చాతురీ
పారీణత్వము కుంతి సొమ్మనుచు విశ్వంబందు చాటించెదన్"

కౌరవ్యులు అంటే మగరాజుల పెంపకం జ్ఞాపకం వస్తుంది. ఇక్కడ కౌంతేయులు, మాద్రేయులు అంటే ఆడ పెంపకం చాతురీ పారీణత్వం ఫలితంగా తెలుస్తుంది. గొప్ప కవి పలుకులోని మెలకువ ఇక్కడ చూడదగ్గది. ఈ పద్యంలోని చమత్కారమేమంటే కౌరవులు

నూరుగురు. అందువల్ల ఐదు వందల రెట్లు అధికంగా పాండవులను పెంచాలి. ఆమె అంతటిదే అనిపించింది.

కుంతి పాండవుల యోగక్షేమాలను విచారించడంలో ఎంతటి శ్రద్ధాసక్తులను కనబరచిందో, తాను పరిత్యజించిన కర్ణుని కొఱకు కూడా అంతగానూ అలమటించింది. అతని కొఱకు బతుకంతా దుఃఖపడింది. అతని జాడకొఱకు శతవిధాలుగా ప్రయత్నించింది. కానీ ఫలితం శూన్యం. కుమారాస్త్ర విద్యాప్రదర్శనలో చివరకు అర్జునునితో ధీటుగా నిలబడిన రాధేయుని కర్ణునిగా భావించి చకిత అవుతుంది.

విలువిద్య క్షత్రియులకు, బ్రాహ్మణులకు తప్ప ఇతరులకు లేదనే నెపంతో అర్జునునితో పోటీపడిన కర్ణుణ్ణి అనర్హుణ్ణిగా భావించిన పెద్దలు, అనుమతిని నిరాకరిస్తారు పాపం! ఆతడు నిరుత్సాహపడి రంగం నుండి నిష్క్రమిస్తాడు. దూరంగా అతణ్ణి చూచిన కుంతి —

"వాఁడెవఁడద్దిరా! [illegible]దయ భాస్కరతేజుఁడు, వీరలక్ష్మికిన్
గోడెముకాఁడు, మేల్కవచకుండల యుగ్మమువాఁడు, నాయెడన్
నేఁడొకవత్సలత్వమును నింపినవాఁ డలనాటి పాపఁడే
కాఁడుగదా! యిదేమి కలగాదుగదా విపరీత దైవమా?!"

అంటుంది.

తుట్టతుదకు అతణ్ణి కర్ణునిగా పోల్చుకుంది, కానీ ఆ ఆనందాన్ని చెప్పుకుని బయటనలుగురితో ఆనందించలేదు. ఆ ఆనందాన్ని మనసులో అణుచుకొని నిర్వికారంగా అతణ్ణి పదే పదే చూస్తుంది. 'వీరలక్ష్మికిన్ గోడెము కాడు' అని కర్ణుణ్ణి గురించి ప్రశంసించడం అతని వీరత్వానికి ప్రతీక నాయెడన్, నేడొక వత్సలత్వమును నింపిన వాఁడలనాటి పాపఁడేకాడుగదా! అని కవి పలకడంలో కుంతి ఆవేదన ఏపాటిదో మనకు విదితమౌతుంది.

కుంతిలోని విశిష్టమైన గుణాలన్నీ ఒకఎత్తు; రాజనీతిజ్ఞత ఒక్కటే ఒకఎత్తు. కాలంతో పాటు అనుభవాలన్నింటినీ ఆకళించుకొని వాటి సారాన్ని తన విలువైన వ్యక్తిత్వంతో సమన్వయించుకొని అడుగడుగు వేసిన ఘనత ఒక్కకుంతికే దక్కుతుంది. కుంతి ఒక విధంగా అదృష్టవంతురాలు, మరొక విధంగా దురదృష్టవంతురాలును. కృష్ణరాయబారపు ఫలితం మీద ఆమె ప్రభావం ఎంతైనా ఉంది. కురు పాండవుల మధ్య సంధి జరుగదన్న విషయం ఆమెకు స్పష్టంగా తెలుసు. అనుకొన్నట్టుగానే సంధివిఫలమైంది. ఇకయుద్ధమే శరణ్యం అన్న సందర్భాన ప్రక్కనున్న కృష్ణునితో కుంతి పలికేఘట్టాన్ని కవి 'సమాలోచనము' అను శీర్షికలో వివరిస్తాడు.

"నడుపంజాలిన నేతవీవు భవదాజ్ఞా బద్ధులా పాండవుల్
నడుముం గట్టుము పార్థసారథిగఁ గృష్ణా! ప్రస్తుతోపద్రవం
బడఁగింపన్ మఱినీవుకాక యెవరయ్యా కార్య నిర్వాహకుల్
తడవేలా యిక ధర్మరాజ్యమును సంస్థాపింప బొమ్మచ్యుతా!"

ఈ పద్య మొక్కటిచాలు కుంతి రాజనీతి ధురంధరత్వం తెలపడానికి. 'నడు పంజాలిన నేత నీవు' అని పలకడంలో రాజనీతంతా నీ చేతుల్లో కరతలా మలకంగా ఉంది. యుద్ధం నడపడానికి నీవు తప్ప సమర్థులెవ్వరనే భావమూ ఉంది. 'నడుముం గట్టుము పార్థసారథిగఁ గృష్ణా!' అనడంలో అర్జునునకు నీవు తప్ప ఇంకెవ్వరు రథసారథి ఉన్నారన్న అర్థమేకాదు. ఈ కురుక్షేత్ర రణ రంగాన్ని ఆయుత్త పరచ గలిగిన సారథివి కూడా నీవే కదా! అన్న అర్థమూ ఉంది. 'ధర్మరాజ్యమును సంస్థాపింప బొమ్మచ్యుతా' అని కుంతి చేత పలికించడంలో ఒక చమత్కారముంది. దుష్టులను శిక్షించడానికీ, శిష్టులను రక్షించడానికీ, ప్రతి యుగంలోనూ నేనే అవతరిస్తాను' అని శ్రీకృష్ణుడు వివరించిన గీతా సారాన్ని ముందుగానే శ్రీకృష్ణుని పట్ల కుంతిద్వారా పలికించాడు కవి!

యుద్ధం ముగిసింది. కురు పాండవులలో పెక్కుమంది రణ నిహతులయ్యారు. చివరకు విజయలక్ష్మి పాండవులను వరించింది. ధర్మరాజు సహజంగా ఈ బీభత్సాన్ని చూచి వ్యాకుల చిత్తుడైనా శ్రీకృష్ణుని కోరిక మీద రాజ్యాభిషిక్తుడయ్యాడు, కుంతి చిరకాల వాంఛ నెరవేరింది. పాండవులు తిరిగి రాజ్యాధిపతులయ్యారు. ధర్మంవారి పక్షాన ఉంది. సర్వ జనులూ సంతోషించారు. ఇక కుంతి మనోరథం కూడా నెరవేరడంచేత, ఆమెకు వానప్రస్థ జీవితమే శరణ్యం. అదే ఆమె చిరకాల వాంఛ కూడా! వానప్రస్థ జీవితాన్ని ప్రారంభించబోయే ముందు ధర్మరాజుతో 'ఆమె ప్రస్థానము' అనే శీర్షికలో—

"అంతేవాసులు మీరు భీష్మునకు ధర్మాధర్మ విజ్ఞాన మం
దంతే వాసులు గండు కృష్ణునకు సర్థానర్థ విజ్ఞాన మం
దంతర్వాణులు మెచ్చనేలుఁడ వనిన్ యావత్ప్రజాకోటికిన్
జింతందీర్పుఁడు నేఁడు భారత పునర్నిర్మాణ భాగ్యమ్మునన్"

అంటుంది.

కురుకుల పితా మహుడైన భీష్ముడు మొదటి నుండీ పాండవ పక్షపాతి. అది అందరికీ తెలుసు. కారణం పాండవులు ధర్మపరులు కాబట్టి! అంతే గాకుండా శ్రీకృష్ణుని అండదండలు ప్రతి అడుగునా పాండవుల కున్నాయి. శ్రీకృష్ణుడు వాళ్ళకొక ఆరాధ్య దైవం. అందులకే "అంతర్వాణులు మెచ్చ నేలు డవనిన్" అని పలుకగలిగింది కుంతి. నిజానికి ఇది కవి అంతర్వాణి. కవి క్రాంత దర్శి కదా? ప్రజాభ్యుదయమే రాజాభ్యుదయం.

కుంతి జీవితంలో కర్ణుని మరణమంతగా ఆమె మనస్సును కలవర పెట్టిన సంఘటన వేరొకటిలేదు. అయితే ఆమె జీవితంలో

ఎప్పుడూ సుఖశాంతులకు నోచుకోలేదు. పన్నెండేండ్ల బాలికగా తండ్రి పెంపకంలో అనుభవించిన సుఖాలే ఆమె జీవితంలో సుఖస్మృతులుగా నిలిచాయి. కన్యగా మాతృత్వాన్ని పొందినప్పటి నుండి మరణించే వరకు ఆమె జీవితం సుడిగుండంలా నడిచింది. తన జీవితం ఇతరుల కొఱకే వెచ్చించింది. తన కోసం ఏదీ మిగుల్చుకోలేదు. తన కోసం ఏదీ ఆపేక్షించనూలేదు. స్త్రీత్వం మాతృత్వం తెలియని నాడు మాతృత్వాన్ని పొంది ఆనాటి నుండి విజయలక్ష్మి పాండవులను వరించేదాకా అహర్నిశలు నిద్రపోక తైలంలాగా తన జీవితాన్ని కాల్చుకుంటూనే గడిపింది.

కుంతి కన్య—
కుంతి ఆరుగురు కుమారులకు మాతృమూర్తి.
కుంతి పట్టమహిషి–
కుంతి రాజనీతి విశారద–
కుంతి క్షత్రిపట్టని వీరనారీమణి–
అన్నీ ఉండి సుఖమన్నది లేని అభాగ్యురాలు.

భారతంలోని విలక్షణమైన పాత్రలలో కుంతి ఒకతె. కుంతిది ఎప్పటికీ తెరవెనుక జీవితమే! కాని ఆమెనీడ మిగిలిన పాత్రల మీద ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉంటుంది. రామాయణంలో కౌసల్య, కైక, సుమిత్ర వంటి పాత్రలకోవకు చెందిందికాదు కుంతి పాత్ర. ఆమె ఎంతటి అదృష్టవంతురాలో అంతటి దురదృష్టవంతురాలు కూడా.

"షేక్స్పియర్ హాస్ ఓన్‌లీ హీరొయిన్స్ బట్ నో హీరోస్" అని షేక్స్పియర్ మహాకవి నాటకాలలో సృష్టించిన స్త్రీ పాత్రలను ప్రశంసిస్తూ, జాన్ రస్కిన్ మహాకవి అన్న మాటలను గురించి ఆలోచిస్తే, బహుశా షేక్స్పియర్ మహాకవి రామాయణ, భారతాలను చదివి ఉంటే తప్పక కుంతి పాత్రతో గొప్ప దృశ్య కావ్యాన్ని వెలయించేవాడేమో ననే అభిప్రాయం కలుగుతుంది.

కానీ – ఆ పని రామకృష్ణశాస్త్రిగారు చేయడం ఆశ్చర్యకరం!

'కుంతి' కావ్యకర్తలైన శ్రీ రామకృష్ణశాస్త్రిగారు తెలుగు నాట తగినంతటికీర్తి ప్రతిష్ఠలను పొందని ఒక విస్మృత కవి –

అయితేనేం–
నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు!

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తితేషాంయశః కాయే జరామరణజం భయమ్

శ్రీ ధూర్జటి వేంకట బాలాజి, కావలి.

ఆధునిక సాహిత్య ప్రతిబింబం – "కవనవిజయం"

(సాహితీ రూపకం)

భువనవిజయ ప్రదర్శన చాలమంది చూసేవుంటారు. అందులో శ్రీకృష్ణదేవారాయలతో పాటు అష్టదిగ్గజకవులు వుంటారు. ఇందులో రాయలు మీద పద్యాలు చెప్పటం, సమస్యల్ని పూరించటం మొదలైనవి కవులు చేస్తుంటారు. రాచరిక వ్యవస్థనశించినా ప్రజాస్వామ్యయుగం ఆవిర్భవించినా ఇంకా భువనవిజయప్రదర్శనలు జరుగుతున్నాయంటే మన బుద్ధులింకా రాచరికంలోని ప్రజల మనస్తత్వానికి దగ్గరగానే వున్నాయనుకోవచ్చు. ఇందులో పాల్గొనేవారు రాచరిక కాలంనాటి వేషాలు కూడా ధరించటం మరీంత విడ్డూరం. ఈప్రదర్శనలకు లక్ష్యం పాండిత్య ప్రదర్శనతో కూడిన ఆనందాను భూతిని కలిగించడం మాత్రమే.

ఆధునిక కాలానుగుణమైన ప్రజాస్వామ్యభావాలకు దగ్గరగా సాగిన సాహితీరూపకం కవనవిజయం. 'ఇది భువనవిజయానికి అనుకరణ కాని, అనుసరణ కాని కాదు, పేరడీ అసలే కాదు. ఈ కవనవిజయ ప్రదర్శనకు మూడు ముఖ్య లక్ష్యాలున్నాయి. ఒకటి నిర్మాణాత్మకమైన ఆనందాను భూతిని కలిగించటం. రెండవది వర్తమాన సమాజాన్ని విశ్లేషించుటం మూడవది ఆధునిక సాహితీ ప్రక్రియల్ని ఉద్యమాల్ని వాటి స్వరూప స్వభావాల్ని మేధావులతో పాటు సామాన్యులకు కూడా విశదమయ్యేటట్లు ఆకర్షణీయంగా వివరించటం.

"ఇప్పటికీ కొందరు పండితకవులూ, కవిపండితులూ అష్టదిగ్గజాల వేషాలువేసుకొని మోజుపడి, స్టేజెక్కి భువన విజయ వైభవాన్ని పునఃప్రచారం చేయాలని భావిస్తున్నారు. ఆధునికులు ఆ ప్రదర్శనలు ఆమోదించారు. అందుకే 'వెలుతురు స్నానం' చేసిన నాగభైరవ కోటేశ్వరరావు భువనవిజయం ప్రత్యామ్నాయంగా కవనవిజయాన్ని సంకల్పించాడు దాని ఒక ప్రదర్శనం ఇలాటి నాలుగు సమీక్షల పెట్టు..." అంటారు ఆరుద్ర కవనవిజయ ప్రాశస్త్యాన్ని శ్లాఘిస్తూ.

రాజులు అంతరించాక జమీందారులు సమసిపోయాక ఈనాటి సాహిత్యాన్ని ఆదరిస్తున్నవారు సామాన్యులు. అంటే ఎన్‌జీవోలు, టీచర్లు, సామాన్య కుటుంబీకులు వీళ్ళకు ప్రతినిధిగా క్లర్కు సూర్యారావును కవనవిజయానికి అధ్యక్షత వహించ వలసిందిగా ప్రయోక్త వేదికమీదికి ఆహ్వానిస్తాడు. భువనవిజయ ప్రదర్శనలో

శ్రీకృష్ణదేవరాయలు దర్శనమిస్తాడు కాని రాయలుకు ప్రత్యామ్నాయంగా సామాన్యుల ప్రతినిధి క్లర్కు అధ్యక్షస్థానం అలంకరిస్తాడు ఇది ఈ నూతన సాహితీ రూపకంలోని మొదటి విశేషం.

క్లర్కు వేదికమీదికి వస్తుండగా అతణ్ణి గురించి నేపథ్యంలో వైతాళిక గీతం ఆలపించటం జరుగుతుంది.

"జయ సమస్తాఫీసు
భార నిర్వహణాన
బుర్ర తిరిగిన వెర్రివాడా!

గాను గెద్దుగ బతికి
కంచరీ గాడిదై
వృద్ధుండవౌ యుపకమూర్తీ!"

ఇలా పాట అయిపోయాక "సగటు మనిషికీ - బహు పరాక్, సామాన్య మానవుడికీ - బహు పరాక్, ఎన్‌జీవో సూర్యుడికీ - బహు పరాక్" అంటూ స్లోగన్లు వినిపిస్తాయి. తరువాత ప్రయోక్త వరుసగా ప్రబంధ కవి పరమేశ్వర శాస్త్రిని, భావకవి భానుమూర్తిని, అభ్యుదయ కవి "ఆశ్లేష"ను, దిగంబరకవి "తిరగబడు"ను, సినీ కవి సింగినాథాన్ని హాస్యకవి ఆనందరావును, నవలా రచయిత్రి నాంచారీదేవిని ఒకరి తరువాత మరొకరిని వేదిక మీదికి ఆహ్వానిస్తాడు. ఒక్కొక్కరు వేదిక మీదికి వస్తూ తమ తమ సిద్ధాంతాల కనుగుణమైన పద్యాలు, కవితలూ చదివి కూర్చుంటారు. కవుల పేర్లు అక్షరమైత్రి కలిగి వుండేటట్లు కల్పించటంవలన మరింత ఆసక్తి పెంపొందుతుంది.

క్లర్కు సూర్యారావు మీద కవిత్వం చెప్పాలని ముందుగా కవుల్ని కోరటం జరుగుతుంది. ప్రబంధకవి పరమేశ్వరశాస్త్రి అర్థం కాని సమాసాలతో కూడిన వృత్తంలో ఎన్‌జీవోను దీవిస్తాడు. పద్యం అర్థం గాకపోయినా వింటానికి మాత్రం కమ్మగా వుందంటాడు సూర్యారావు. భావకవి భానుమూర్తి చెప్పిన పద్యంలో ఎన్‌జీవో పేరు వాడుకోటం తప్ప మిగతా పద్యమంతటా ఊహాలోకాల్లో విహరిస్తాడు. హాస్యకవి ఆనందరావు సామాన్యుడికి ప్రతీక అయిన సూర్యారావును పట్టుకొని ఉత్త చేతకాని వాడివని తీసి పారేస్తాడు. అభ్యుదయ కవి ఆశ్లేష "నీవు ఎక్కదలచుకొన్న రైలు / ఎప్పుడూ ఓ జీవిత కాలం లేటు" అంటాడు. దిగంబరకవి "తిరగబడు - నీవీ యుగంలో నికృష్టానివి / నీవీతరంలో ముదనష్టానివి / ఈతరం ఇడియట్‌వి / కొత్త తరం కోపతాపాలకు / నిరంతరం గురౌతూ/రేపటి కడ్డంగా వాడుస్తున్న స్టుపిడ్‌వి" అంటూ సూర్యారావును తిడతాడు. "కవిగారు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడితే ఇక నన్నేం మాట్లాడమంటా"రంటూ సూర్యారావు బాధపడుతుంటే వెంటనే విప్లవకవి విరూపాక్ష లేచి "నోరు మూసుకో/ గుండు చేసుకో / నిజంలాగా ధ్వజంలాగా / నిటారుగా లే / భయం వీడి నగ్నంగా బజారులోకి రా" అనగానే "తిడితే భరించానుగాని నగ్నంగా బజారులోకి ఎలా రమ్మంటా" రంటూ సూర్యారావు కంగారుపడి పోతాడు సూర్యారావుని ఆదుకోకపోతే ఇక లాభం లేదని సినీ కవి సింగినాథం ఇలా అందుకుంటాడు.

"అప్పుచేసి పప్పుకూడు తినరా ఎన్‌జీవో
గొప్పనీతి వాక్యమిదే వినరా ఎన్‌జీవో
దొంగతనం తప్పురా దోపిడీలు ముప్పురా
దొరికినంత అప్పుచేసి మీసం మెలిదిప్పురా!

కొట్టువాడు లెక్కడిగితె
గుట్టుగాను వుండరా
అద్దెవాడు అగపడితే
ఆవీధిని వదలరా!"

కాస్తగాలి పీల్చుకుంటున్న సూర్యారావును చూస్తూ నవలా రచయిత్రి నాంచారీదేవి సూర్యారావుకు ఆకుపచ్చని మేడ వున్నట్లు భార్యకు పుట్టినరోజు కానుకగా ఫారన్‌చీర తెచ్చినట్లు, మల్లెపూలు పెట్టుకొని లిప్‌స్టిక్ కొట్టుకొని ఎదురు చూస్తున్న భార్యను వైలెట్ చెవర్‌లెట్ కారులో హుందాగా కూర్చోబెట్టుకొని సాగిపోతునట్లు అలా అలా వర్ణించుకు పోతుంది. సూర్యారావుకు మతి పోతుంది. "బుద్ధి గడ్డితిని నామీద కవిత్వం చెప్పమని అడిగినందుకు నా పరువుకాస్తా తీసేస్తున్నా" రని సూర్యారావు ఇక తనను వదిలేసి మనదేశం మీద నాలుగు మంచి ముక్కలు చెప్పమని అడుగుతాడు.

భారతదేశ పురాతన వైభవాన్ని ప్రబంధకవి వర్ణిస్తే, భరతమాత ఘనతను ఆలంకారికంగా భావకవి వూహిస్తే, వర్తమాన సమాజంలోని దుస్థితుల్ని అభ్యుదయకవి కళ్ళకు కట్టిస్తే, దిగంబరకవి "దుండగుల్తో పక్కమీద కులుకుతున్న శీలం నీది! అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందం నీది" అంటూ భారతదేశాన్ని తిడతాడు." "స్వాతంత్ర్యం పూవోటలో అదుపుదప్పి ఎగబడ్డ పదవీ రాజకీయాల గొడ్లని తన్నితరిమేయా" లంటూ విప్లవకవి ప్రకటిస్తాడు. హాస్యకవి "అధికారంకోసం మా కారాటం అసల్లేదు / మాకోసం రాజ్యలక్ష్మి మరులు గొన్నదేంచేస్తాం" అంటాడు. "గాంధిపుట్టిన దేశమా యిది / నెహ్రు కోరిన సంఘమా ఇది" అంటూ బ్రాంది తాగుతూ సినీకవి దేశాన్ని గురించి పాడతాడు. నవలా రచయిత్రి నాంచారీదేవి లేచి భారతదేశం సస్యశ్యామల మైనదని, అందులో కాశ్మీరరాజ్యం మరీ అందమైనదని, అక్కడి సరస్సులో అందమైన జంట రాధ—గోపి ఊగుతూ తూగుతూ కైపులో మైమరచి పగటి కలలు కంటున్నారంటూ సాగిపోతూ వుంటుంది. దేశాన్ని "వర్ణించటానికి

కూడా శృంగారపర్వనే కావాలమ్మా" అంటూ విసిగిపోయిన సూర్యారావు "అసలు కవిత్వం ఏ ప్రేరణ వల్ల పుడుతుందో చెప్ప" మని కవుల్ని అడుగుతాడు.

వరసగా ఒక్కొక్క కవి ఒక్కొక్క రకంగా తమకు ప్రేరణ కలిగించే వాటిని గురించి చెప్తారు.

"నిరుపహతి స్థలంబు రమణీయ ప్రియ దూతిక తెచ్చి యిచ్చు కప్పుర విడెము" ఇత్యాదులు కావాలంటాడు ప్రబంధ కవి. "వియోగపు కైపు పులకింతలే కవితగా పొంగి పొర్లుతా"యని భావకవి చెపుతాడు. "రాబందుల రెక్కల చప్పుడు, పొగ గొట్టపు భూంకార ధ్వని" మొదలైనవి కావాలంటాడు అభ్యుదయ కవి. కాస్త అటూ ఇటూగా దిగంబర కవి, విప్లవ కవి ఇలాంటివే కావాలంటారు. "మాగాయి కంది పచ్చడీ అపరాయ పెసరప్పడము తెగి పోయిన చెప్పులు" తన కవిత్వానికి ప్రేరణ ఇస్తాయని హాస్య కవి అంటాడు. "ఆవేశం రావాలి ఆవేదన రావాలి" అంటూ "కనుల ముందు బీరుంటే కవిత పొంగి పొరదా" అనేసి బీరు సీసా నోట పట్టిస్తాడు సినీ కవి. ఇల్లు వూడ్చి వంట చేసి పిల్లల్ని ఎత్తుకునే శ్రీవారు కావాలని, పాత కథల్ని కొత్తగా రాయటానికి పాత పత్రికలు ముందుండాలని నవలా రచయిత్రి కోరుకుంటుంది.

చివరిగా ఒక సమస్య ఇచ్చి కవుల్ని పూరించమని అడగటం జరుగుతుంది. ఈ సమస్యతో ఇక్కడి నుండి అసలు సమస్య మొదలవుతుంది. ఈ అసలు సమస్యతో "డ్రమెటిక్ ట్విస్ట్" సాధించబడి రూపకం పతాక స్థాయిని చేరుకుంటుంది. దీని వలన రూపకం ప్రేక్షకుల హృదయాల మీద బలంగా ముద్ర వేయ గలుగుతుంది.

ప్రబంధ కవి. భావ కవి సమస్యల్ని పూరిస్తారు. కాని అభ్యుదయ కవి, విప్లవ కవి, దిగంబర కవి "ఈ సర్కస్ ఫీట్లు మేం గర్హిస్తాం, మా వచనాలనే చుట్టు కర్రల్తో మీ పద్యాల నడుములు విరగదంతాం, మీరు మీ పాండిత్యాన్ని విశ్వ విద్యాలయాల పురాతన గోరీల చాటున దాచుకోండి" అంటూ తిరగబడతారు. ప్రబంధ కవికి కోపం వచ్చి "కవితకు కట్టుబాటు కావలె, భాషకు నియతి కావలె" అంటూ వాదిస్తాడు. ఇంతలో నవలా రచయిత్రి నాంచారీదేవి కల్పించుకొని "మిమ్మల్ని, మీ కవిత్వాన్ని ఎవడైనా చదువుతున్నాడా? తిన్నది అరక్క అర్థం కాని కవిత్వం రాస్తాడొకాయన! సమాజ స్పృహ అంటూ పనికిమాలిన నీతులు చెపుతాడింకో ఆయన! బూతులు తిడతాడు మరో కవి!, రేక లేస్తాడింకో కవి! ఇదేనా మీ కవిత్వం" అంటూ దాదాపు కవులందర్నీ తీసి పారేసి మాట్లాడుతుంది. అపుడు దిగంబర కవి ఉగ్రుడై "నీ వంటి యింటి సాహిత్యంతో దేశ సంస్కారాన్ని రేప్ చేస్తున్నా" వంటాడు.

"మాటలు జాగ్రత్తగా రానీండి. అందరినీ ఆకర్షించని మీ కవిత్వం కాల్చనా" అంటుంది నవలా రచయిత్రి. "కాలుస్తాను, నిజంగానే కాలుస్తాను" అంటూ శృంగారపు పాటలతో తిమ్మిరెక్కించే సినీ కవిని పైపైల ఆకర్షణతో అల్లే నవలా రచయిత్రిని, అర్థం కాని కవిత్వం రాసే ప్రబంధ కవిని ఊహా లోకాల్లో ఎగిరే భావ కవిని కాల్చి పారెయ్యా లంటాడు దిగంబరకవి. అలాగే విప్లవకవి వెంటనే పిస్టలు తీసి వాళ్ళందరినీ కాల్చబోతాడు. క్లర్కు సూర్యారావు అధ్యక్షపీఠం నుండి జారిపడి అయ్యబాబోఅంటూ పారిపోబోతాడు. అంతలో ప్రయోక్త వేదిక మీదికి వచ్చి కవులను శాంతిలపజేసి ఇలా స్వస్తి వాక్యాలు పలుకుతాడు,

"మీ మీ సిద్ధాంతాల రాద్ధాంతాలతో మీ ఇజాలహజాలతో సామాన్యపాఠకుణ్ణి హడలెత్తించి పరుగెత్తిపోయేట్టుచేశారు. ఎవరైతే మీరనిజా సౌందర్యాన్ని ఆస్వాదించాలో ఆమెకరుడు గడిబిజిపడి మీకుంపే దూరమైపోతున్నాడు. ఎవరో అన్నట్టు మీరిలానే వ్రాస్తుంటే కవిత్వం చదువకుండా పోయేరోజు ఒకటి వచ్చితీరుతుంది. తస్మాత్ జాగ్రత్త! కవిత్వం ప్రయోజనం ఆనందం కావచ్చు. అంతేకాదు అంతకుమించి సామాజిక స్పృహకూడ కవితాప్రయోజనమే. సాహిత్యం సంఘానికి ఊపిరిపోసే శక్తి నివ్వాలి ఉత్సాహపరచాలి. చైతన్యమే నేటి "కవన విజయం" మీ కవితాకన్యలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు మాత్రమేకాదు. అవి కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు కావలి. ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు కావాలి? ఇలా కవన విజయ సాహితీరూపకం సమాప్తమవుతుంది.

ఈ రూపకంలో ఏ ఉద్యమాన్ని రచయిత బలపరిచాడో స్పష్టంగా చెప్పలేదంటూ కొందరు విమర్శించ బూనటం తొందరపాటు పడ్డ మాత్రమే అందరికీ అత్యల్పకాలంలో తెలుగులో ఉన్న ఆధునిక సాహిత్యప్రక్రియల్ని ఉద్యమాల్ని చక్కగా పరిచయం చెయ్యటమే దీని ముఖ్యాతి ముఖ్యలక్ష్యం. ఈ రూపకాన్ని కూర్చిన రచయిత శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు అభినందనీయులు. పోతన, చేమకూర వేంకటపల్లి, జాషువా, శ్రీ శ్రీ, ఆరుద్ర. ఐరుక్‌శాస్త్రి, నగ్నముని, జ్వాలాముఖి, దాశరథి, నారాయణరెడ్డి, మాధవపెద్ది, రిలక్, మల్లారెడ్డి కొండూరి, కస్తూరి మొదలైన కవుల కవితల్ని ఆయాకవుల పాత్రలను కూర్చి ఆనందింప జేశారు రచయిత ఈ కవన విజయం దాదాపు వంద ప్రదేశాల్లో ఆంధ్రదేశమంతటా ప్రదర్శింప బడటం వలన ఈసాహితీరూపకానికి లభించిన ప్రశస్తి ఎటువంటిదో సాహితీప్రియులు, పాఠకులు గ్రహించవచ్చు.

శ్రీ రావి రంగారావు

ప్రథమ తెలుగు కంద పద్యాలు - జిన వల్లభుని గంగాధర శాసనము

"ప్రథమ తెలుగు కంద పద్యాలు" అను శీర్షికతో, మార్చి 1984 భారతి కలగూరగంపలో శ్రీ బండ్లపల్లె ఓబుళరెడ్డిగారి వ్యాస మొకటి ప్రచురితమైనది, అందు వారు "శాసన సంపద" అనే శీర్షిక క్రింద కన్నడ అధ్యయన సంస్థ (కర్ణాటక విశ్వవిద్యాలయం, ధార్వాడ) వారు వెలువరించిన గ్రంథము నుండి ఈ వివరాలు సేకరింపబడినాయి దీనికి సంపాదకులు డా॥ హిరేమఠ, డా॥ ఎం. ఎం కల బుర్గి అని వ్రాసినారు. పై గ్రంథముయొక్క ప్రథమ ముద్రణ 1978 అనియు ద్వితీయ ముద్రణ 1974 అనియు తెలిపినారు. కాని ఈ శాసనముపై గ్రంథముయొక్క ప్రథమ ముద్రణకు పూర్వమే అనగా మార్చి నెల 1967లోనే భారతిలో ప్రకటింపబడినది. వెన్వెంటనే కర్ణాటక ప్రభుత్వ ఆర్కియాలజీ శాఖవారు గంగాధరకు వచ్చి ఈ శాసన ప్రతిబింబమును తీసుక వెళ్ళినారు. ఆ తరువాత 1968లో "శాసన సంపద" గ్రంథం ప్రకటింపబడినది. భారతిలో "జిన వల్లభుని గంగాధర శాసనం అను శీర్షికతో ప్రచురింపబడినదీ శాసనము.

ఈ శాసన ప్రతిబింబమును ఆంధ్ర ప్రదేశ్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ శాసన శాఖవారు దీయింపగా, అప్పటి ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ శ్రీ, వహీద్‌ఖాన్‌గారి అనుమతితో కీ॥ శే॥ డా॥ నేలటూరి వేంకట రమణయ్యగారు శాసన ప్రతిబింబను, శాసనముయొక్క పూర్తిపాఠము ప్రకటించడమే కాక, శాసనస్థవిషయములను వివరించుచు విపులమగు వ్యాసమును వ్రాసినారు. అయితే డా॥ నేలటూరివారిచ్చిన వివరములకు శ్రీ ఓబుళ రెడ్డిగారిచ్చిన వివరములకు పొంత లేకుండా ఉండడమేగాక, వాస్తవమునకు విరుద్ధములుగా నున్నవి. వాని నీక్రింద పొందు పరచుచున్నాను.

1. శాసనమున్న గ్రామము పేరు "గంగాధరం" అని వ్రాసినారు శ్రీ రెడ్డిగారు. అది సరిగాదు. ఈ గ్రామము పేరు "గంగాధర" మాత్రమే. ఈ గ్రామముయొక్క ఉనికి పట్టును జెప్పుటలో డా॥ వేంకట రమణయ్యగారు గూడ పొరపడి, కరీంనగరము నుండి కామారెడ్డికి వెళ్లె రోడ్డుపై గలదని వ్రాసినారు. కాని ఈ గ్రామము కరీంనగరం నుండి నిజామాబాదు రోడ్డుకు, మూడు నాలుగు మైళ్ల దూరమున గలదు అప్పట్లో ఈ గ్రామము కరీంనగరం జిల్లా కరీంనగరం తాలూకాకు చెంది యుండెను. ఇప్పుడిది జనవరి 1980 నుండి తాలూకా కేంద్రముగా నున్నది. ఈ గ్రామము ధర్మాపురికి దక్షిణ భాగమున నున్నదిగాని; శ్రీ రెడ్డిగారు వ్రాసినట్లు ఉత్తర భాగమునలేదు.

2. రెండవ పేరాలో శ్రీ రెడ్డిగారు శాసనము యొక్క ఉనికినిగురించి వృషభాద్రిశిఖరం మీద దానిప్రక్క (శిఖరం మీద దాని ప్రక్క అనుమాటలు కర్థము దురవగాహముగా నున్నది) ఆది అంత్య జైనతీర్థంకరుల ప్రతిమలు చక్రేశ్వరి ప్రతిమ ఇతర అనేక జినప్రతిమలు త్రిభువనతిలకం అనేవసది మదనవిలాసం అనేవనం, కవితాగుణార్ణవం అనే తటాకం నిర్మించినట్లు చెప్పబడింది. ఇప్పుడువనం వసదిలేవు. తటాకాన్ని పాతచెరువు అనిపిలుస్తారు. గుట్టకు దక్షిణాన ఉన్నట్లు జెప్పబడిన ధర్మపురి నేలమట్టం అయింది. అన్నారు ఇది శాసనస్థ విషయమునకు వాస్తవమునకు విరుద్ధము శాసనపాఠ మీక్రింద వ్రాయనైనది. శాసనములోని రెండవపంక్తి "......సబ్బినాడనట్లు నడువణ ధర్మపురదుత్తర దిగ్భాగద వృషభగిరి యెంబనాది సంసిద్ధ తీర్థద దక్షిణదిశాభాగద సిద్ధ శిలెయొళ్ ఋషభాదిసిద్ధ పూర్వమాద్యంతసిన బింబరగళుమం చక్రేశ్వరి విలుమం పెటుమంజిన ప్రతిమెగళ (ఇక్కడ నుండి మూడవ పంక్తియారంభము) మొగళు మట్రిభువన తిలక మేంబ కేబయపుం మదన విలాసమెంబ బనవ పంమాడ సిదం, దీనిని బట్టి వృషభగిరి ధర్మపురి కుత్తరభాగమున నున్నట్లు తెలియుచున్నవి.

ఇక గుట్టకు దక్షిణాన ఉన్న ధర్మపురి నేలమట్టం అయిందన్నారు. శ్రీ రెడ్డిగారు గుట్టకు దక్షిణాన అంటే ఏగుట్టకు వారి వ్రాతల ప్రకారము బొమ్మలగుట్ట వృషభాద్రి ఒక్కటే గనుక వారన్న గుట్ట బొమ్మలగుట్టయే కావలయును. ఈ గుట్టకు దక్షిణమున ధర్మపుర మను గ్రామము అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ లేదు. ఒక్కప్పుడున్న చిహ్నములూలేవు. కరీంనగరం జిల్లాలోనున్న ధర్మపురి యొక్కటియే. అది గోదావరీనదీ దక్షిణ తటమున నున్న శ్రీ లక్ష్మీనృసింహక్షేత్రము. ఈ ధర్మపురమును గురించి పైశాసనమున కలాపిగ్రామముతో సమానమైనదని చెప్పడము జరిగినది. ఇప్పటికి ఇదగొప్పయాత్ర స్థలముగా విరాజిల్లుతున్నది. డా॥ నేలటూరి వేంకటరమణయ్యగారు అరికేసరి మహారాజు పంపకవికి దానమిచ్చిన ధర్మపురి యిదియేయని నిర్ణయించి ఈ ధర్మపురము శాసనములో జెప్పినమాదిరిగా సబ్బినాటి నట్టునడుమ లేనందున సంశయాస్పదమని వ్రాసినారు. అంతేకాక సబ్బినాడు గోదావరి ఆవల తీరమున గూడ విస్తరించి యున్నట్లు స్పష్టమైన యాధారము లేనందున అనుమానపడుట కవకాశమున్న దని గూడ వ్రాసినారు. అయితే గోదావరి తీరస్థమగు సబ్బినాడు భాగమును పరిగణనలోకి తీసుకుంటే ఈ ధర్మపురము ఇప్పటికీ సబ్బినాటి నట్టనడుమనే యున్నది. ఈ విధముగా చూచినచో డా॥ వేంకట రమణయ్యగారి వాదము పరాస్తము కాగలదు.

ఇక డా॥ వేంకట రమణయ్యగారు వృషభగిరిని గూర్చి వ్రాసిన మాటలు — "వృషభాద్రి, వృషభాచలము, వృషభ పర్వతము,

వృషభ గిరి, వృషభ మహాద్రము దీని నామాంతరములు. ఈ వృషభాద్రి యెచ్చట నున్నదో చెప్పుటకు వలనుగాకున్నది. ఈ శాసన మందిది (భారత ఖండపు) దక్షిణార్ధమునందు, ప్రాచీన తీర్థ స్థాన మనియు సబ్బి నాటి నట్ట నడుమనుండు ధర్మపురమున కుత్తర భాగమున నున్నదనియు జెప్పి యున్నది.'' అని వ్రాసినారు. విషయ మిట్లుండగా ప్రస్తుత శాసనమున్న బొమ్మల గుట్టయే వృషభాచలమని వ్రాయుట యసంబద్ధము. పినవల్లభుడు పైన విగ్రహములను రాతి బొమ్మలను, ఈ కొండ శిఖరముపై కెక్కించుటవలననే ఈ కొండ, బొమ్మల గుట్టయని, బొమ్మలమ్మ గుట్టయని, ప్రజలచే వ్యవహరింప బడుతూ వచ్చినది.

3. గంగాధర ఒకప్పుడు బోధన చాళుక్యుల రాజధానిగా ఉండేదని వ్రాసినారు. శ్రీ రెడ్డిగారు చరిత్రకారులు వేంగిచాళుక్యులు, పశ్చిమచాళుక్యులు, బాదామిచాళుక్యులు, కళ్యాణిచాళుక్యులు, వేములవాడ చాళుక్యులను పేర్కొన్నారుగాని బోధచాళుక్యులను గురించి ఎక్కడా పేర్కొనినట్టులేదు. శ్రీ రెడ్డిగారుగూడా "బోధనచాళుక్యులన్నా రేగాని, గంగాధర రాజధానిగా ఈ ప్రాంతమును పాలించిన ఆవంశపురాజుల పేర్లేవీపేర్కొనలేదు. పేర్లుదెలిపినచో పరిశోధనకు కొంత అవకాశ ముండేది. అసలు గంగాధర గ్రామపొలి మేరలలోగాని, పరిసర ప్రాంతములందుగాని, ఒక కాలమున రాజధాని విలసిల్లినదని చేప్పుటకు తగినసాక్ష్యాధారములు కోటగోడలు భవనములు ఇతర కట్టడములుగాని వానిశిథిలముగాని దిబ్బలుగాని ప్రాచీనదేవాలయములుగాని లేకపోవడమే గాక అవి ఒక్కపుడచ్చుటనున్న చిహ్నములుగూడా ఏక్కడాలేవు ప్రసిద్ధపరిశోధకులగు కీ॥ శే శేషాద్రిరమణ కవులలో నొకరైన కీ॥ శే॥ దూపాటి వేంకటరమణాచార్యులుగారు చిరకాలము కరీం నగరములో ఉపాధ్యాయుడుగా పనిజేసిరి ఆకాలములో వారీ జిల్లాకు సంబంధించిన పలుశాసనములను పరిశోధించి ఎన్నియో చారిత్రక విషయములను వెలుగులోనికి దెచ్చినారు. వారు ప్రసంగవశాత్తు గంగాధరపండితున కగ్రహారముగా నీగ్రామమివ్వబడినందున ఈ గ్రామమునకు గంగాధరయను పేరుగలిగినది. చెప్పినారు కావున గంగాధర పరిసరములను పరిశీలించినచో ఈగ్రామ ప్రాంతమొకప్పుడు రాజధానిగా పరిఢవిల్లిన దనుట అసంబద్ధముగా దోచగలదు.

శ్రీరెడ్డిగారు కర్ణాటక ప్రభుత్వము ప్రకటించిన "శాసనసంపద" గ్రంథ మాధారముగా ఈవిషయములను వ్రాసినారేమొ. పైగ్రంథమును పరిశీలించినగాని, కర్ణాటక పురావస్తు శాఖవారు ఈ శాసనముపై శాసనస్థవిషయములపై ఏమి వ్యాఖ్య చేసినారో తెలియగలదు. పరిశోధకులీ విషయమును పరిశీలించి విషయ నిర్ధారణ చేయుదురుగాక.

ఇక ఈ శాసనములోని కంద పద్యముల గురించి శాసనము పరిశీలించిన డా॥ వేంకట రమణయ్యగారు, "ఈ శాసనమునకు ఆంధ్ర సారస్వత చరిత్రయందు ప్రత్యేక స్థానము గలదు. ఇది ప్రాచీన తమాంధ్ర పద్య శాసనములలో నొకటి. ఆంధ్ర భాష యందు కావ్య రచన క్రీ. శ. 11వ, శతాబ్ది మధ్య భాగమున నన్నయ భట్టార కృతాంధ్ర మహా భారతంతో ప్రారంభమైనను దత్పూర్వము రెండు శతాబ్దముల నుండియు ఆంధ్రులు కవిత చెప్ప నేర్చియుండిరని శాసనముల మూలమున దెలియుచున్నది. గుణగ విజయాదిత్యుని నాటి యద్దంకికందుకూరు శాసనములను మొదటి చాళుక్యభీముని కాలపుధర్మవరశాసనమును రెండువ యుద్ధమల్లుని బెజవాడ శాసనము బద్యాత్మకములు వీనిలో మొదటి ధానియందు తరువోజడు, రెండు మూడులందు సీసమును, కడపటిదాని యందు మధ్యాక్కరలును వాడబడినవి. ప్రస్తుత నాసనమందు మూడు కందపద్యములు గలవని మీదనే జెప్పియున్నాను. ఇవియే తెలుగుభాషలోని ప్రాచీనతమకంద పద్యములు;...... అని వ్రాసినారు డా॥ నేలటూరి వెంకటరమణయ్య గారికే వీనిని ప్రాచీన తమతెలుగు పద్యములుగా తెలుగు వారికెరుక పరచిన కీర్తిదక్కుతుంది. శ్రీ రెడ్డిగారి న్నేళ్ల తరువాత మరొకమారీ విషయముసు తెలుగువారి దృష్టికి తెచ్చినందులకు ధన్యవాదములు.

సారాంశమేమనగా, జినవల్లభుని శాసనమున్న గ్రామనామము "గంగాధర" మాత్రమే గంగాధరంగాదు శాసనమున్నది బొమ్మల గుట్టపైగాని, వృషభాద్రిపైగాదు, బొమ్మలగుట్ట, వృషభాద్రి, రెండు వేరు వేరు కొండలు అరికేసరి పంపకవికి దానమిచ్చిన ధర్మపురవ నేల మట్టముగా లేదు. ఇప్పటికి గొప్పయాత్రా స్థలముగాని రాజిల్లు తున్నది. గంగాధరగ్రామము రాజధానిగా విలసిల్లిన చిహ్నములేవి ఆపరిసరములందులేవు. పైశాసనములోని కంద పద్యములను ప్రాచీన తమ కంద పద్యములుగా తెలుగువారికి మొట్టమొదట ఎరుకపరచిన కీర్తి డా॥ నేలటూరి వేంకటరమణయ్యగారికి దక్కుతుంది. శ్రీ రెడ్డి గారి న్నేళ్ల తరువాత మరొకుమారీ విషయమును తెలుగువారి దృష్టి దెచ్చినందులకు ధన్యవాదములు.

శాసనము ప్రకటింపబడి. పదిహేడు సంపత్సరములు దాటినను ఇంతవరకు వృషభాద్రి యునికి పట్టుసుగాని, దానిపై అరికేసరి మహారాజు వేయించిన శాసనమునుగాని కనుగొనక పోవుట శోభనీయము. కరీంనగరంజిల్లాలో చారిత్రక పరిశోధకుల కొరత ప్రభుత్వపురావస్తు శాఖవారి ఉదాసీనత కారణముగా ఈ జిల్లాలోని అపారపురావస్తు సంపద శిథిలమై జీర్ణించి పోవుచున్నది. ఇప్పటికైన ఉత్సాహవంతులు శుపరిశోధకులు ముందుకువచ్చి ఈజిల్లాలోని పురావస్తు సంపదను వెలుగులోనికి దేగలరని ఆశిదాము.

"విశ్వామిత్ర"

కాకతీయ చరిత్ర- కొన్ని విశేషాంశములు

ఈమధ్య నొక విదుషీమణి, ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి "కాకతి రుద్రమ"ను గూర్చియు అమె పాలనా సామర్థ్యము, సాహసప్రవృత్తి, రాజనీతిజ్ఞత, శత్రునిబర్హణాశక్తి, శౌర్య ధైర్య ప్రభుమంత్ర శక్తుల గురించియు నొక ప్రసంగ వ్యాసమును ప్రసారము చేయుచు, కాకతి రుద్రమదేవి భర్త చాళుక్య వీరభద్రుడని వక్కాణించి, ఆతనికి ప్రథమ కళత్ర సంతానము "మురహరి, నరహరి" యనువారు కుమారులైనట్లు, రుద్రమ ద్వితీయ కళత్రమైనట్లు వక్కాణించి యున్నారు. ఇంతవరకు కాకతీయ చరిత్రను వ్రాసిన చారిత్రకు లెవ్వరును ఈ విషయమును గూర్చి వెల్లడించి యుండలేదు. ఈ విచిత్రాంశ మావిదుషీమణికెట్లు తెలిసినదో ! దురూహ్యముగా నున్నది. ఇందలి నిజానిజములు పరిశోధకులే నిర్ణయించగలరను నమ్మికతో నీ విషయము వారి ముందుంచుచున్నాను.

కాకతి గణపతికి పుత్ర సంతతిలేని కారణమున, రుద్రమ తండ్రి వెనుక రాజ్యమును పాలింప వారసుడులేని కారణమున నాతడు ఆమెను బాల్యమునుండి పురుషునిగా ప్రకటించి, ఈ రహస్య మొరులకు తెలియ నీయక రహస్యముగా నుంచి, ఆమెకు రాజ్యపాలనా రీతులనెల్ల బోధించి కత్తిసాము, గుర్రపు స్వారి, యుద్ధ కౌశలము మొదలగు విద్యల నేర్పించి, నిష్ణాతగా దీర్చి దిద్ది, తనతోబాటు అర్ధ సింహాసనమున పురుష వేష ధారిణిగ నధివసింప జేసి, రాజ్యము నప్పగించి, శత్రుకటికి ప్రక్కలో బల్లెముగ నుండు ప్రతిభా పాటవముల నలవడ జేసెను. ఆమె సంప్రాప్త యౌవ్వన అయిన వెంటనే, వివాహ ప్రయత్నముజేసి, నామెకొక కన్యను దెచ్చి పెండ్లి చేసిరనియు, ఆ కన్యక తన భర్త పురుషుడుగాక స్త్రీయని దెలిసికొని, అపార దుఃఖ సాగరమున మునిగి పోవ, రుద్రమ నామె నాశ్వాసించి, స్వస్థచిత్త నొనర్చి తనకు గూర్చు కుమారెగా ప్రకటించి, కాలక్రమమున నామెకు వివాహము జేసి సంసార సౌఖ్య మొనగూర్చెననియు నొక ఐతిహ్యము ప్రచారములో నున్నది. కాకతి సింహాసనమున రుద్రమ సుస్థితయై యున్న తరిని, తమ యేలిక స్త్రీ యని తెలిసికొన్నను ప్రజలంతకుమున్నే ఆమె శక్తి సామర్థ్యముల, బుద్ధి కుశలత, రాజ్య తంత్రజ్ఞత, రణ కౌశలము ఇత్యాది ప్రశస్త గుణముల ప్రభావము నవగతము చేసికొనియున్న కారణముగ నెట్టి యాందోళనను లేవదీయక నామె పాలన మంగీకరించి, ఆమె కన్ని విధముల సహాయసంపత్తులందించుచు ప్రభుభక్తియుక్తులై యుండిరి. గణపతి కాలమునను న్న జెబ్బది యిద్దరు దండనాయకు లహర్నిశము రుద్రమ యాజ్ఞా బద్ధులై వర్తించుచు రాజ్యమును వేయి కన్నులతో కాపాడుచుండిరి.

చాళుక్యవీరభద్రుడు రాణి రుద్రమ యందొక పుత్రికనుగనెను. ఆమెయే ముమ్మడమ్మ. రుద్రమ పెంపుడు కుమార్తె రుయ్యమ. ఈ రుయ్యమ రుద్రమ సేనాధిపతి, మంత్రియగు ఇందులూరి అన్నమదేవుని వివాహముమాడి గణుతికెక్కెను. కొందరీ రుయ్యాంబ, రుద్రమ ఔరస పుత్రికయని, ముమ్మిడమ్మియే పెంపుడు కూతురని చెప్పుచున్నారు. అందులకు వారు "శివయోగసారము" లోని

> అకుపిత రుద్రమాంబికకు "నాత్మజ"నాఁ బొగడొందు ముమ్మడ
> మ్మకు మహదేవరాజునకు నాత్మజుడైన ప్రతాపరుద్రుడు

అను పద్యమును దహరించుచున్నారు. ఈవిధముగ శివయోగ సారము ఔరస పుత్రికయైన ముమ్మిడమ్మను పెంపుడుకుమార్తెగ, పెంపుడుకుమార్తె అయిన రుయ్యమ నౌరసపుత్రికగా నభివర్ణించి గందరగోళ పరిస్థితినికల్పించి, వింత సిద్ధాంతములకు దారి తీయించినది ముమ్మిడమ్మ రుద్రమ గర్భవాసమున పుట్టిన కుమార్తె యనుటకు "దాయ గజకేసరి ఖండవల్లి శాసనము" లోని వక్కాణము పరమ ప్రమాణము.

కావున ముమ్మడమ్మయేకాక రుద్రమ ఔరసపుత్రికయైరుయ్యమ పెంపుడు కూతురైనట్లు స్పష్టము.

ఈముమ్మిడమ్మకు ... బహుకాలము సంతానయోగ ప్రాప్తి లేకుండుటచే రుద్రమ ఆందోళనముచెంది తన అనంతరము కాకతీయ రాజ్య సింహాసనమునకు వారసుడు లేకుండ పోవుచున్నదేయను జిజ్ఞాసచే "నిరవద్యపురము" రాజధానిగ రాజ్యమేలుతున్న భర్త చాళుక్య వీరభద్రుని పాలనములోని తణుకుగ్రామమున కనతిదూరమున నున్న "మండపాక" గ్రామములోని "ఏకవీరాదేవి" విగ్రహమును ఒరుగంటికి తరలించుకుపోయి ఆటతమకుల దేవతయగు "కాకతమ్మ" కు సైదోడుగనిల్పి ప్రతిష్ఠించి, ఆలయనిర్మాణము గావించెనని యొక ఐతిహ్యము ప్రచారమందున్నది. అప్పటినుండియే "కాకతమ్మకు సైదోడు యేకవీర యను వచనము ప్రసిద్ధికెక్కినది.

ఆ "ఏకవీర"ను గొల్చిన వారికి సంతాన ప్రాప్తి కల్గునన్న నమ్మిక ప్రాచుర్యమంది యున్నందున రాణి రుద్రమ తన కుమార్తె సంతానవతి గావలెనను తీవ్ర కాంక్షచేనా "ఏకవీరాదేవి" విగ్రహమును దీసికొని పోయిన దనియు, ఆ దేవి నారాధించి ముమ్మడమ్మ పుత్రవంతురాలగునని యెంచి అట్లు గావించెననియు విశ్వసింపబడుచున్నది. "ఏకవీరాదేవి" విగ్రహము తొలగింపబడిన పిదప కాలాన "మండపాక" లో నచ్చోట "ఎల్లారమ్మ" విగ్రహ ప్రతిష్ట జరిగి,

భక్తుల ఈప్సితార్థములు సమకూరుచున్నపని విషయజ్ఞులు చెప్పుచున్నారు. ముమ్మడమ్మ సంతానము కొరకు "ఏకవీరాదేవి" నర్చించెనని కాసె సర్వప్ప తన "సిద్ధేశ్వర చరిత్ర"లో జెప్పి, ఆ ఆరాధనా ఫలితముగనే ముమ్మడమ్మ "వీరరుద్రుని" కనెనని చెప్పియున్నాడు అతఃపూర్వమామె అనేక వ్రతములు, నోములు యొనర్చెననియు ఫలితము గానుపింపమి, "మండపాక" లోని "ఏకవీరాదేవి" నారాధించి సంతాన వతులగుచుండుట విని రుద్రమ ఈ కార్యము తలపెట్టి యుండునని యూహింపబడుచున్నది. ఏ చరిత్ర కారుడును దేనినెందును ప్రస్తావించి యుండలేదు ! ఇందలి నిజానిజములు భావి చరిత్రకారులేమేని నిర్ధారించగలరేమో వేచి చూడవలసి యున్నది.

కాకతీయ వంశమునకు మూల పురుషునిగా భావింపబడుచున్న "కాకర్త్య గుండ్యన తాత" గుండియ రాష్ట్రకూటుడు. "తండ్రి" ఎఱియరాష్ట్రకూటుడు. వీరలు రాష్ట్రకూటులుకాగా "కాకర్త్యగుండ్యన" కూడా రాష్ట్రకూటుడగుట సహజము ! కాన "గుండ్యన" కాకతివంశ మూల పురుషునిగ నెంచుట సమంజసము కాదని కొంతమంది చారిత్రికుల భావన. అయితే తాత, తండ్రులు తమ నామాంత్యమున నుపయోగించుకొన్న "రాష్ట్రకూట" శబ్దము "గుండ్యన" యేల నుపయోగించుకొనలేదు? సరిగదా తన పేరునకు ముందు "కాకర్త్య" పదము నుపయోగించుకొన్నాడు. దానిని బట్టి "గుండ్యన" రాజకీయ జీవితములో ప్రాముఖ్యమునకు వచ్చుటకు ముందు ఆతని వంశ పరిస్థితిలో, హోదాలో మార్పు వచ్చి యుండవలెనని సూచిత మగుచున్నది. అదియునుగాక నాతని శాసనములో "సామన్త వొడ్డి సంజ్ఞకుల" సంభవునిగా వర్ణింపబడినాడు. ఆ పద ప్రయోగములోని అర్థము గ్రహించితిమేని "గుండ్యన" "సామన్త ప్రభు కుటుంబము" (వొడ్డి = ఒడయడు = ప్రభువు) నకు చెందిన వాడని స్పష్టమగుచున్నది. గుండ్యన తాత, తండ్రులు కేవలము "రాష్ట్రకూటులు" (గ్రామాధికారులు) అనియే అభివర్ణించు కొన్నారు; కాని-సామన్త ప్రభు కుటుంబములోని వారుగా చెప్పుకొని యుండలేదు. "ఎఱియ" "గుండియ" ల కాలములో వారి కుటుంబ స్థితి సామంత ప్రభుల స్థాయికి యెదిగి యుండక, "గుండ్యన" కాలములో నాతని కా పదవి లభించి యుండుటచే నాతడు తాను మొదటి రాష్ట్రకూటుడైనను పిదప "సామన్త వొడ్డి సంజ్ఞకులుడై" నట్లు స్పష్టీకరించుకొనియున్నాడు. అనగా-కాకర్త్య గుండ్యన రాజకీయ జీవితములో మొదటి దశ "సామన్త ప్రభు పదవీ" స్వీకారముతో ప్రారంభించినదన్నమాట ! ఈ సామన్త ప్రభు పదవి యెవరివలన, యెపుడు వచ్చినదో, పరిశీలించితిమేని "సామన్త వొడ్డి సంజ్ఞకుల" ప్రయోగ వైశిష్ట్యము వెల్లడి కాగలదు, ముందుగా నా విషయమై చర్చించి, పిదప "గుండ్యన" యెక్కడి వాడో? యే కాలము వాడో? ఆతనికి "కాకర్త్య" లేక "కాకర్తి" లేక "కాకతి" లేక "కాకతీయ" వంశమునకు గల సంబంధమేమియో విచారింతము.

తూర్పు చాళుక్య ప్రభువు రెండవ అమ్మరాజ విష్ణువర్ధనుని పారద్రోలి వేంగీ సింహాసన మాక్రమించిన దానార్ణవుడు, కాకర్త్య గుండ్యన కోరికపై "దొమ్మశర్మ" యను కార్పటిక వ్రత మవలంబిన బ్రాహ్మణునకు "మాంగల్లు" గ్రామమును దానము చేసినట్లొక శాసనము వలన తెలియుచున్నది. అందుచే నాతడా కాలమున నున్నట్లును, అప్పటికే ఆతనికి వేంగీ రాజకీయములలో పలుకుబడి హెచ్చుగా నున్నట్లు తెల్లమగుచున్నది.

దానార్ణవుడు రెండు పర్యాయములు వేంగీ సింహాసన మధిష్ఠించినట్లు కన్పడును. మొదటిసారి రాష్ట్రకూట ప్రభువగు మూడవ కృష్ణునికి సామంతుడుగ నుండెను. రెండవసారి అమ్మరాజును యుద్ధములో నిర్జించి, స్వతంత్రుడుగ పరిపాలనము జేసెను. "మాంగల్లు" శాసనము ఆతని మొదటి పరిపాలనా కాలముననే అయి యుండినట్లు, ఆ దానమును అమ్మరాజు అంగీకరించి, దానార్ణవుని శాసనము ప్రకారము అమలు జరుగవలెనని తిరిగి శాసనము వ్రాయించినట్లు కన్పట్టును. ఇదియును గుండ్యన ప్రోద్బలము చేతనే యైయుండుటచే, అమ్మిరాజు రాజ్యావసాన కాలము వరకును గుండ్యన యున్నట్లు మనము గ్రహింపవచ్చును. అమ్మిరాజు క్రీ॥ శ॥ 945లో రాజ్యమునకు వచ్చి, మధ్య మధ్య బాదపాదులచే రాజ్య భ్రష్టత్వ మొందుచున్నను క్రీ॥ శ॥ 970 వరకు రాజ్యము చేసినట్లుండుటచే గుండ్యన ఆకాలములోని వాడుగా నిర్ణయించుకొనవచ్చును.

గుండ్యన తండ్రి, తాతలు రాష్ట్రకూటులని శాసనములలో నున్నను "రాష్ట్రకూట" అను మాట గ్రామాధికారికి గూడ నాకాలమున చెల్లుచుండుటచే నతడొక సామాన్య గ్రామాధికారి యనగ గ్రామ మునసబు వంటి వాడని ఆచార్య ఖండవల్లి లక్ష్మి రంజనం గారను చున్నారు. సామాన్య గ్రామాధికారికి తన యిష్టము వచ్చిన చోట, తనకిష్టుడైన వానికి ఇద్దగు ప్రభువులచే నగ్రహార మిప్పించుట, యిప్పింపగల సామర్థ్యముండుట సాధ్యమా? అన్నది ప్రశ్న. ఇట్టిశక్తి ఆతని కేవిధమున గల్గెనో మనము తెలిసికొన్న యెడల, ఆ కాలములో గుండ్యనకు గల విశిష్ట స్థాన మేట్టిదో మనము గ్రహింపవచ్చును. దీనికై రెండవ అమ్మిరాజు సింహాసనమునకు వచ్చు నాటికి యున్న తూర్పు చాళుక్య రాజ్య పరిస్థితుల పరిశీలన మత్యంతావశ్యకము.

ఈ అమ్మిరాజు రెండవ చాళుక్య భీమునకు ద్వితీయ భార్య అయిన "లోకాంబిక" వలన కల్గినవాడు. ఆతని ప్రథమ భార్య కళింగ దేశ రాజ పుత్రికయైన "ఊర్జపాయ" యను "అంకిదేవి" వలన కల్గినవాడు దానార్ణవుడు. భీముని సుతులలో దానార్ణవుడు

జ్యేష్ఠుడైనను, ఆతడు జైనుడుగాక పోయినను తన తండ్రి, తాతల కాలమునందు సంభవించిన రాజ్య విప్లవములలో జైనుల యందభిమానము గనబరచి, రాష్ట్రకూటులతో చెలిమి చేసియున్నాడను అనుమానముచే కాబోలు! అతనికి రాజ్యాధికారము లేకుండాజేసి, దేశ బహిష్కృతు నొనరించుట సంభవించినది. తన తండ్రి యున్నప్పుడు దానార్ణవుడు తన మాతామహుల యింట కళింగములో తలదాచుకొన్నట్లు కనబడును. ఆతని తల్లి "అంకిదేవి"యు నాతనితో పుట్టింటనే యుండియుండును! ఈ కారణముచే తూర్పు చాళుక్య సింహాసనము అమ్మిరాజునకు సంక్రమించుట సంభవించినది,

రాజ్యమునకు వచ్చునప్పటికి అమ్మిరాజు పన్నెండేళ్ల బాలుడు. అట్లగుటచే నాతని తండ్రినెదిరించి వేంగీ సింహాసనము నాక్రమింప ప్రయత్నముచేసి, చివరవరకును కృష్ణానదికి దక్షిణాననున్న దేశమును తన స్వాధీనములో నుంచుకొన్న రెండవ యుద్ధమల్లుడు వేంగిని గూడ స్వాధీనము చేసికొనుటకుగాను యెత్తివచ్చెను. కాని-ఆతడు యుద్ధములో చనిపోవుటచే అమ్మరాజు నిరాటంకముగ శా॥ శ॥ 867 మార్గశిర బహుళ త్రయోదశీ శుక్రవారంనాడు అనగ క్రీ॥ శ॥ 945 సం॥ము డిశంబరు నెల 5వ తేది శుక్రవారమునాడు పట్టాభిషిక్తుడయ్యెను.

కాని – కొద్దికాలములోనే యుద్ధమల్లుని కొడుకు బాదపుడు కుట్రపన్ని అమ్మరాజు అనుచరులలో కొందరిని, సేనాధ్యక్షుడు రెండవ పండరంగని, కొలను ప్రభువు గండ నారాయణుని చీలదీసి, వేంగిపై నెత్తివచ్చెను. ఆతనికి రాష్ట్రకూట ప్రభువు మూడవ కృష్ణుడు సహాయపడెను. ఈ పరిస్థితులలో చేయునది లేక అమ్మరాజు కళింగమునకు పారిపోయెను. అట తన అన్న దానార్ణవుని యొద్ద తలదాచుకొనెను. బాదపుడును సుమారు పది సంవత్సరముల కాలము రాజ్యముచేసి మరణించెను. ఆతని తమ్ముడు రెండవ తాళరాజు విష్ణువర్ధనుడు అను పేరుతో సింహాసన మధిష్ఠించెను. కాని-ఆతని ప్రభుత్వమెంతోకాలము నిలువలేదు. దీనికి కారణము కొలను రాజన్యుడగు నృపకాముడు తన కుమార్తెను అమ్మిరాజునకిచ్చి వివాహమొనర్చుటయే! ఈ విషయము అమ్మిరాజు 'గుండుగొలను' శాసనము వలన గ్రహింపనగుచున్నది.

ఈ వైవాహిక బంధమువలన కటకరాజగు పండరంగడును, ఆతని తమ్ముడు దుగ్గరాజుకూడ అమ్మరాజు పక్షమునజేరిరి. పండరంగడిదివరలో బాదపుని పక్షమునుండి ఆతని రాజ్యప్రాప్తికి దోహదమొసంగినట్లు "ఇంపేరు" శాసనము వలన ద్యోతకమగుచున్నది. బాదపుని పక్షమువిడనాడి, అమ్మిరాజు పక్షమువహించిన పండరంగడు ఆతని తమ్ముడు దుగ్గరాజు అమ్మిరాజుకడ అధికార ప్రాబల్యము గలవారై ఆతనిచే "ధర్మపురి" జినాలయమునకు "మలియంపూడి" గ్రామమును దానము చేయించి శాసనము వ్రాయించగల్గిరి.

ఇట్లు వేంగీరాజ్య సింహాసనము నాక్రమించగల్గిన బాదపాదులు రాష్ట్రకూట ప్రభువు మూడవకృష్ణుని సాహాయ్యముననే రాజరికమునకు రాగల్గిన వారగుటచే, నాతని సామంతులుగనేయుండిరి. బహుశఃవారు కప్పము కట్టనక్కరలేకుండ, వారి సార్వభౌమాధికారము నంగీకరించి సామంతులుగ వ్యవహరించుట కంగీకరించి ప్రవర్తించియుందురు.

బాదపాదుల నుండి రాజ్యము నొడిసిపుచ్చుకొన్న అమ్మిరాజు సర్వస్వతంత్ర ప్రభువుగ వ్యవహరింపు చుండుటచే నాతని పై ఖరినచ్చని రాష్ట్రకూట ప్రభువులు, పెద్దసైన్యముతో నాతనిపై దండెత్తివచ్చిరి. ఆఘాటికి తాళలేక అమ్మిరాజు తిరిగి కళింగమునకు పారిపోవలసివచ్చెను రాష్ట్రకూట కృష్ణుడును వేంగీరాజ్యమును దానార్ణవునకిచ్చి తాను నిజరాజధానికి మరలిపోయెను. ఈ విషయము దానార్ణవుని "మాంగల్లు" శాసనములో నుట్టంకింపబడినది. దానార్ణవుడు కప్పముగట్టుసామంతునిగ నుండనని డాక్టరు వేంకటరమణయ్యగారు అభిప్రాయపడిరి.

దానార్ణవుని రాజ్యపాలనమును పర్యవేక్షించుటకే కాక స్త్రీ గుండ్యనను కృష్ణుడు వేంగికి తన ప్రతినిధిగ బంపియుండును. గుండ్యన ఒక చిన్నగ్రామాధికారియైన రెడ్డియైయున్నచో రాష్ట్రకూట కృష్ణుడాతనినీ బాధ్యతాయుత పదవియందు నియోగించుట సంభవించియుండదు దానార్ణవుడు కొద్దికాలమే వేంగిలోనుండెను. ఆ స్వల్పవ్యవధిలోనే "దొమ్మశర్మ"కు ఆతనిచే గుండ్యన "మాంగల్లు"ను దానము చేయించుటజరిగెను. దానార్ణవుని స్థాన భ్రష్టునొనర్చి కొద్దికాలములోనే అమ్మిరాజు తిరిగి స్వదేశమునకరుదెంచి, సింహాసనమాక్రమించియుండెను. అట్టి సందర్భమున అమ్మిరాజు, దానార్ణవుని యొక్కయు నాతని మంత్రివర్గము యొక్కయు ముఖ్యముగ రాష్ట్రకూట ప్రభువునకు రాజప్రతినిధిగ వేంగీరాజ్యకార్యముల శాసించుచున్న గుండ్యన యొక్కయు సానుభూతిని సంపాదించుటకే అమ్మిరాజు గుండ్యన కధిక ప్రాధాన్యమిచ్చి, ఆతని మనసు చూరగొని, మైత్రీబంధమును పటిష్ఠమొనర్చుకొనియుండును. ఆ ప్రాబల్యమును పురస్కరించుకొనియే గుండ్యన అమ్మిరాజుచేగూడ "దొమ్మశర్మ" కు దానార్ణవుడొసంగిన "మాంగల్లు" గ్రామదానమును పునరుద్ధరింపగల్గెను. అమ్మిరాజు వేంగీ నాక్రమించిన వెంటనే దానార్ణవుడు కళింగమునకు పారిపోయెను.

దీనినిబట్టి గుండ్యన అధికార ప్రాబల్యమెట్టిదియో ఊహించుకొనవచ్చును. ఆతడిక్కడ రాజప్రతినిధిగ నున్నప్పుడే తనపూర్వులు నివసించిన కాకత్రిపురమున నివాసముండెను. గుండ్యనపూర్వులు వసించిన కాకత్రిపురము నేడు "కాకరపర్రు" యనుపేరబరగుచున్నది.

ఆవిధిని కాకరపర్రు (తణుకుతాలూకా) గ్రామవాసియైన గుండ్యన "కాకర్త్యగుండ్యన" అను పేరున ప్రసిద్ధికెక్కుట సంభవించెను.

గుండ్యన పూర్వులు వేగినాటి కాకర్తి పురమున (కరావర్తి పురమున) పూర్వ చాళుక్య రాజ పుత్రుడగు భీమసళుక్కి కాలమునకు ముందే దండనాధులై ప్రసిద్ధి నొంది, పూర్వ చాళుక్య రాజ కొలువులో నుండి యుందురు. నాల్గవ విష్ణువర్ధనుని కుమారులగు నరేంద్ర మృగ రాజ బిరుదాంకితుడు రెండవ విజయాదిత్యునకు నాతని సోదరుడు భీమ సళుక్కికి మధ్య రేగిన పోరాటములో గుండ్యన పూర్వులు భీమ సళుక్కి పక్షము జేరి పోరి యుందురు. భీమ సళుక్కి రాష్ట్రకూట ప్రభువును. తనకు మేనల్లుడునగు మూడవ గోవిందుని సాహాయ్యమున వేంగీ సింహాసన మాక్రమించి, కొంత కాలము రాజ్యము చేసిన పిదప, తన ప్రభుత్వమును నిలబెట్టుకొనలేక, నిండు పన్రెండు సంవత్సరములు వేంగీ భూమిపై విప్లవ జ్వాలల రేపి అశాంతిని ప్రబలజేసి, నరేంద్ర మృగరాజు ననేక సిలుగులపాల్జేసెను. ఈ విప్లవోద్యమములో గుండ్యన పూర్వులు భీమ సళుక్కికి బాసటగా నిల్చి పోరాడి యుందురు.

రాష్ట్రకూట గోవిందుడు చనిపోగానే ఆతని కుమారుడు "అమోఘవర్షుడు" రాజయ్యెను. ఈతడు పిన్న వయస్కుడగుటచే నాతని తరపున ఘూర్జర దేశాధిపతి "కక్కసువర్ణుడు" రాజ్యపాలనా వ్యవహారముల చక్క బెట్టుచు వచ్చెను, ఈ కక్కసువర్ణుడు తన సోదరి "శీలమహాదేవి"ని నరేంద్ర మృగరాజు కుమార్తు కలి విష్ణు వర్ధనునకిచ్చి వివాహముచేసి రాష్ట్రకూట. వేంగీ చాళుక్య ప్రభువుల మధ్య మైత్రిని పాదు కొల్పెను. ఆ కారణమున భీమ సళుక్కికి వేంగీ భూమిపై పట్టు తప్పి ప్రతిఘటన నెదుర్కొనవలసి వచ్చెను. ఆ విధిని ఉద్యమ వైఫల్యము చవి చూచి భీమ సళుక్కి రాష్ట్రకూట ప్రభువు అమోఘవర్షుని సామంతునిగ "అనుమకొండ విషయము"ను పాలించుచు తృప్తి చెందవలసిన వాడయ్యెను.

ఈ ప్రకారము గుండ్యన కుటుంబము భీమ సళుక్కితో గూడ "అనుమకొండ" జేరవలసివచ్చెను. నరేంద్ర మృగరాజు, భీమ సళుక్కితో సల్పిన 108 యుద్ధముల స్మృత్యర్థముగా 108 శివాలయ ముల నిర్మించి వానికి "నరేంద్రేశ్వరాలయము" లను పేరిడినట్లు చరిత్ర చెప్పుచున్నది. అట్టి "నరేంద్రేశ్వరాలయము" గుండ్యన కుటుంబమున కాదినివాసమైన "కాకరపర్రు"లో నొకటి యుండుటచే నచట గూడ నరేంద్ర మృగరాజునకు, భీమ సళుక్కికి యుద్ధము జరిగి యుండె ననియు. అందు గుండ్యన పూర్వులు భీమ సళుక్కి పక్షమున పోరి యుందురనియు నూహింప నగుచున్నది.

గుండ్యన పూర్వులు "అనుమకొండ" ప్రభువు భీమ సళుక్కి కడ నమాత్యులుగ, దండనాథులుగ నుండి ఆతని తర్వాత వీరలే పాలకులై, అధికారము నెరపినట్లు దృష్టాంతరములున్నవి. అట్లు గుండ్యన పూర్వ స్థానము "కాకర పర్రు" కాగా అధికార ప్రాప్తి స్థానము "అనుమకొండ" యై ఆతడు "అనుమకొండ" పాలక కుటుంబ ములోని వానిగా ప్రసిద్ధి కెక్కినాడు.

అనుకుకొండ విషయము రాష్ట్రకూటరాజ్యములోని భాగమై యున్నను లేములవాడ చాళుక్యులపాలనములో నున్నట్లు కనబడును వారు రాష్ట్రకూటరాజుల సామంతులుగ ఈ విషయమును, దీనినంటి యున్న "కొరవి" దేశమును తమపాలనలో నుంచుకొని యున్నట్లే కానుపించును. లేములవాడ చాళుక్యుల ప్రభువగు "అరికేసరి" పేర "హనుమకొండ"లో నొక చెరువు "అరికేసరి సముద్రము" త్రవ్వింప బడియున్నది. సిద్ధేశ్వరచరిత్రలో నిది ప్రోలరాజు త్రవ్వించెననియు అది "కన్నడసముద్రము" అనుపేర ఒరగినట్లును చెప్పబడినది లేములవాడ చాళుక్యులు కూడ కన్నడిగులే! కాన- అరికేసరిసముద్రము "కన్నడ సముద్రము" అనుపేరును సంతరించుకొనుట సాజమే!

దీనినిబట్టి గుండ్యన వంశీకులు లేములవాడ చాళుక్యుల యనుమతిని "హనుమకొండ" విషయమునకు పాలకులై యుండురని తెలుచున్నది. రాష్ట్రకూట ప్రభుత్వమంతరించి, కల్యాణి చాళుక్యులు స్వతంత్రులుగ నీ దేశములను పాలించుచున్నప్పుడు, మొదటిప్రోలరాజు కల్యాణి ప్రభువగు త్రైలోక్యమల్లదేవర శాసనము ప్రకారము హనుమకొండ రాజ్యమునకు పాలకుడై యున్నట్లు చెప్పికొనెను. వారట్లు రాష్ట్రకూట సామంతులైన లేములవాడ ప్రభువుల అనుమతిని హనుమకొండ పాలకులై యుండుటవలననే "ఖాజీపేటశాసనము" తో గుండ్యనయు ఆతని తండ్రి, తాతలును "సామంతవిష్టివంశ్యుల"ని పేర్కొనుట సంభవించినది.

ఈ పదమునకు సరియయిన అర్థమేమియో తెలియుటలేదు; గాని—ఒక సామంతునికి లోబడియున్న వంశమువారని చెప్పుట జరుగు చున్నది. చరిత్ర పరముగ నీవివరణ సమంజసమనియే తోచుచున్నది. ఏలనన—గుండ్యనపూర్వులు లేములవాడ చాళుక్యులకు సామంతులుగా హనుమకొండ పాలకులైరి. లేములవాడ చాళుక్యులు రాష్ట్రకూట ప్రభువులకు సామంతులుగానుండరి. అందువలన రాష్ట్రకూట సామంతులగు లేములవాడ చాళుక్యులకు లోబడిన సామంతవంశము, కాకర్త్యగుండ్యన వంశమని తెలుచున్నది. ఆ పదబంధములోనున్న "సామంతవిష్టివంశము" అనునది "సామంతపడ్డివంశమ" ని యుండ వలెనని ఇందు "పడ్డి" అనునది "వొడయడు" (ప్రభువు) అను పదమునకు పర్యాయపదమనియు వ్యాఖ్యానించి, కాకర్త్యగుండ్యన వంశము సామంత ప్రభువంశముగా నిర్ధరించుట జరిగినది.

ఈ పైచర్యవలన కాక ర్త్యగుండ్యన కుటుంబ పూర్వనివాసము తణుకు తాలూకాలోని ''కాకరపర్రు'' గ్రామమని, ఆ కుటుంబములోని వారు పూర్వచాళుక్యులకడ దండనాయకులై యుండిరనియు దాయాది కలహములతో వీరు ఒక పక్షమును జేరి ప్రముఖపాత్ర వహించుటలో నా పక్షము పరాజయము పొందినపుడు అన్యప్రదేశములకువలసబోయి అట తమ సామర్థ్యమువలన సామంత పాలకత్వము సంపాదించి ''సామన్తవొడ్డివంశము'' వారుగా ప్రసిద్ధికెక్కిరనియు రాష్ట్రకూట రాజ్యమంతరించిన పిదప కాక ర్త్యగుండ్యన ఇతః పూర్వమధికారము వహించిన హనుమకొండ విషయమున రథినాయకత్వము సంక్రమింప జేసికొన్న ప్రోలరాజు, కాక ర్త్యగుండ్యన పేరున తనవంశమును కాకతి వంశము, కాక ర్త్యవంశము కాకతీయవంశము అను వివిధనామముల ప్రసిద్ధికి దెచ్చెననియు తెలియనగుచున్నది.

ఈ కాక ర్త్యగుండ్యన వంశమువారు జైనులైయుండురు. గుండ్యన పూర్వులకాలమున వారి తొలి నివాసమైన ''కాకరపర్రు'' పరిసర ప్రాంత మంతయు (ప్రస్తుతము తణుకు తాలూకాయు దాని పరిసరప్రాంతమంతయు) జైనమత ప్రాబల్యమునే సంతరించుకొని ప్రసిద్ధికెక్కియుండటచే గూడ నీ యూహ సమంజసమనియే అనుకొన వలసి యున్నది.

కాక త్రివారు బహుశః జైనులైయుందురు. ''కాకతి'' అన్నది జైనదేవతగకన్పట్టును. వారాదేవతను ఆరాధించు వారగుటచే. ''కాక తీయులు'' కావచ్చును. కాని–కాక ర్త్యగుండ్యన రాష్ట్రకూట రాజ్యమంతరించిన తర్వాత స్వతంత్రుడుగ రాజ్యముచేయ నారంభించుటచే నాతని వంశము ''కాక త్రివంశము, కాక ర్త్యవంశము, కాకతివంశము'' అను పేరులతో వ్యవహారములోనికి వచ్చియుండును.

కాక ర్త్యగుండ్యన ఏకులమువాడో తెలియరాదు. జైనమతావలంబులైన వారల కుల గోత్రాదులు కాలక్రమేణ పరిగణమునకురాక, యేక కులమువారిగనే గుర్తింపబడుట జరిగినది. జైనమతమున అన్ని వర్ణముల వారభిమానించి. ఆవలబించి, తన్మతాచారముల నిష్ఠతో పాటించుచున్న కాలమునసీ పర్వవిపక్షతలు కులప్రసక్తులు పట్టింపులు లేక సడలిపోయినవి. అందుచేవారి కులగోత్రాదుల ప్రసక్తి ప్రాధాన్యత వహింపలేదు! కాకతీయవంశమునకు మూలపురుషునిగ నెంచబడుచున్న ''కాక ర్త్యగుండ్యన'' యేకులమువాడో తెలియరాదు. వాని వంశము మాత్రము ''సామన్తవడ్డివంశము'' దాని నుండియే ''కాకతి'' వంశ ముత్పన్నమైయుండ వచ్చునని తోచుచున్నది.

---

1. కాకతి రుద్రాంబ గాదిలి సుతయైన
రుయ్యాంబ బెండ్లాడి రూఢి కెక్కె॥

— శివయోగసారము

2, (27) తస్య మాఘా ద్వీరయ దేవపత్న్యాం
ముగ్ధాకృతి ర్మమ్మడి నామధేయా॥
పత్న్యా మహాదేవ నృపా సరాగా
సా రుద్రదేవం సుషువే కుమారం॥

— దాయగజకేసరి ఖండపల్లి శాసనము.

చాళుక్య వీర భద్రునకు ముమ్మడమ్మ అను పేరుగల కుమార్తె గలదని, ఆమె భర్త మహాదేవనృపుడని, వారి కుమారుడు రుద్ర దేవుడు (రెండవ ప్రతాప రుద్రుడు) అని శాసనపాఠ నిర్దిష్టార్థము.

శ్రీ తురగా కృష్ణమూర్తి,
పి ట్ట ల వే మ వ రం.

కథక చక్రవర్తి: ఆర్. కె. నారాయణ్

ఆంగ్ల భాషలో రచనలు చేస్తున్న భారతీయులెందరో వున్నా, అంతర్జాతీయంగా గుర్తింపు పొంది, మన దేశపు కీర్తి ప్రతిష్ఠల నినుమడింప జేస్తున్న అగ్రశ్రేణి రచయితలు బహు కొద్ది మంది మాత్రమే. వారితో ముఖ్యంగా పేర్కొన వలసినవారు ఆర్. కె. నారాయణ్. ఇంగ్లండు, అమెరికా మొదలగు దేశాలలో నారాయణ్ రచనలు బహుళ ప్రచారం పొందటమేగాక, సాహిత్యరంగంలో ఆయనకొక విశిష్ట స్థానాన్నీ ఎన్నో పురస్కారాలనూ సంపాదించి పెట్టినై. ''ది గైడ్'' ''బేచిలర్ ఆఫ్ ఆర్ట్స్'', ''ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్'' వంటి నవలలూ, అసంఖ్యాకమైన వ్యాసాలూ నారాయణ్ కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేశాయి. సర్వతోముఖమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న నారాయణ్. కథానికా రంగంలోకూడా విశేషంగా కృషిచేసి అత్యుత్తమమైన రచనల నెన్నిటినో వెలయించారు. ఈ రంగంలో ఆయన ప్రతిభనూ, కథా కథనంలో ఆయన ప్రదర్శించిన నైపుణినీ పరామర్శించటమే ఈవ్యాసం ముఖ్యోద్దేశం.

"సాహిత్యం సమాజానికి దర్పణం" అన్న విమర్శకుల అభిప్రాయాన్నంగీకరిస్తే నారాయణ్ భారతీయుల - విశేషించి దక్షిణ భారతంలోని సామాన్య ప్రజల కష్ట సుఖాలనూ, ఆశయాదర్శాలనూ, నిత్య జీవితంలో వారు ఎదుర్కొనే సమస్యలనూ, ఎంతో సహజ సుందరంగా, చమత్కారావహంగా తన కథలలో చొప్పించారు. మన దేశంతో ఆట్టే పరిచయంలేని విదేశీయులకు భారతీయ జీవన విధానాన్నీ ఇక్కడి ప్రజల ఆచారవ్యవహారాలనూ, వారి సంస్కృతినీ పరిచయం చేస్తాయి నారాయణ్ కథలు. ఇంక మన విషయానికివస్తే నారాయణ్ కథలు మన జనసామాన్యం జీవితంలోని విశ్వాసాలనూ, బలహీనతలనూ లోపాలనూ హాస్య ధోరణిలో ఎత్తి చూపటమేకాక "జీవిత విమర్శయే సాహిత్యం" అన్న మాథ్యూ ఆర్నాల్డ్ వాక్యానికి లక్ష్య భూతంగా నిలుస్తాయి.

సర్వ సామాన్యంగా, నారాయణ్ కథలలో చాలా వాటికి, ఆయన నవలలకు వలెనే, "మాల్గుడి" పట్టణం కేంద్రస్థానం. థామస్ హార్డీకి వెసెక్స్ ఎలాంటిదో శ్రీ నారాయణ్‌కి మాల్గుడి అలాంటిది. ఈ కథలలో మనకు ఎక్కువగా కనిపించేది మధ్య తరగతి ప్రజలే. మన దైనందిన జీవితంలో మనకు తటస్థపడే ఎన్నో సాధారణ సంఘటనలే శ్రీ నారాయణ్ కథలకు ఇతివృత్తాలు. ఐతే వాటిని కథలుగా మలచ వచ్చునని అనిపించటానికి ఆస్కారంలేని సంఘటనలే శ్రీ నారాయణ్ అసాధారణ ప్రతిభవల్ల కళాత్మకంగా రూపొందుతాయి.

సంఘటనలకి ఆలంబనగా వుండటానికి నారాయణ్ సృష్టించిన పాత్రలు సైతం రక్త మాంసాలతో నిండిన సజీవ వ్యక్తులుగా మన ముందు సాక్షాత్కరిస్తాయి. అందరికీ తలలో నాలుకలా మెలగే పోస్ట్ మేన్ తానప్ప, గేటేకెన్ గోవింద సింగూ, ఆర్. డి. వో. ఆఫీసు గుమస్తా రామానుజం పాడైపోయిన దేవదారు పెట్టె చెక్కని బ్యాట్‌గా చేసుకుని టెన్నిస్ బంతితో క్రికెట్ ఆట ఆత్యుత్సాహంతో ఆడే బాలుడు "దోడు" ఇలా ఎందరో మనకు పరిచయ మౌతారు. వాస్తవికతనీ కల్పననీ సమానమైన పాళ్ళలో మేళవించగలగటం రచయిత లందరికీ సాధ్యపడదనీ అనుభవజ్ఞులూ ప్రతిభావంతులూ ఐన మహారచయితలకే అది సాధ్య పడుతుందనీ ప్రముఖ సాహిత్యవేత్త జి. కె. ఛెస్టర్‌టన్ అభిప్రాయం. నారాయణ్ కథలను నిశితంగా పరిశీలించినవారికి ఆయన ఈ అసిధారా వ్రతంలో కృతకృత్యులైనట్లు స్పష్టపడుతుంది.

నారాయణ్ రచనలలో కొట్టవచ్చేటట్లు కనిపించే మరొక లక్షణం వ్యంగ్యమూ, సునిశితమైన హాస్యమూ. భారత దేశంలో పురపాలక సంఘాల పని తీరును విమర్శించటానికి మాల్గుడి మున్సిపాలిటీ కార్య కలాపాలను ఆయన హేళనాత్మకంగా చమత్కారావహంగా "లాలీరోడ్" అన్న కథలో ఇలా వర్ణిస్తారు.

"చాలా సంవత్సరాలు మాల్గుడిలో పురపాలక సంఘం ఒకటి ఉన్నదనే విషయమే ప్రజలకు తెలియదు. పట్టణంలో అంటువ్యాధులు ప్రబలి వాటి పని అవి నిర్వర్తించుకు పోయేవి. జబ్బులు కూడా ఎప్పుడో ఒకప్పుడు అంతమవాలి కదా! ఇంక చెత్తా, చెదారమూ, దుమ్మూ, మొదలైన వాటిని గాలే ఎగర గొట్టేసి అవి కనబడకుండా చేసేది. వూళ్ళో మురికి కాలవలున్నా, వర్షాలవల్ల వాటికి వరదలు వచ్చినా, అవి తమ పని తామే చూసుకొనేవి" (మ్యునిసిపాలిటీ మీద ఆధారపడేవి కావని ధ్వని)

"మ్యునిసిపల్ చైర్‌మన్‌గారు పూర్వాశ్రమంలో దుప్పట్ల వ్యాపారం చేసేవాడు యుద్ధకాలంలో మిలిటరీ వాళ్ళకి దుప్పట్లు సరఫరా చేసి బాగా ఆర్జించినా దాంట్లో చాలా భాగం చైర్‌మన్ అవటానికే ఖర్చు పెట్టేశాడు. నిజానికి ఆయన చైర్‌మన్ అవటానికి చేసిన ప్రయత్నాలు చెప్పాలంటే అదంతా ఓ పురాణం అవుతుంది"

విద్యాధికులు మ్యునిసిపల్ రాజకీయాలకు దూరంగా వుండడం వల్ల, ఉల్లిపాయల వ్యాపారస్థులూ, కిళ్ళీ కొట్ల యజమానులూ ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై వ్యవహరిస్తున్న తీరు అందరికీ తెలిసిందే. నిజానికి మ్యునిసిపాలిటీ అన్న పదమే అర్థ విపరిణామంచెంది న్యూనార్థంలో వాడబడుతూంది, లోప భూయిష్ఠమైన ఈ వ్యవస్థ స్వరూపాన్ని పై కథతో కళ్ళకు కట్టించారు నారాయణ్.

కథ మొదలు పెట్టటంలోనే ఒక ప్రత్యేకతను చూపిస్తారు నారాయణ్. చదువరులను ఆకర్షించి వారిలో ఉత్కంఠను లేకెత్తించే దిట్టుగా సాగుతుంది ప్రతి వాక్యమూ. ఉదాహరణకు "దోడు" అన్న కథ ఈ విధంగా మొదలౌతుంది.

"ఎనిమిదేళ్ళ దోడుకి అత్యవసరంగా డబ్బు కావలసి వచ్చింది. వాడికి ఎనిమిదేళ్ళే కావటంవల్ల వాడి ఆర్థిక సమస్యల్ని పెద్దవాళ్ళెవరూ అంతగా పట్టించుకోలేదు. దోడుకి డబ్బు అవసరం రావటానికి ఓ పంద కారణాలున్నాయి. రాబోయే దీపావళికి టపాకాయలు కొనటం దగ్గర్నుంచీ, స్కూల్లో మేష్టారి పేకబెత్తం బారిని పడకుండా తప్పించు కొనటానికి పెన్ను కొనటం వరకూ ఎన్నో కారణాలు. ఐతే పెద్దవాళ్ళ ఔదార్యాన్ని గురించి దోడుకి భ్రమలేవీ లేవు. నిత్యమూ డబ్బు గలగలల మధ్యే బతుకుతున్నా వాళ్ళు మహా పిసినారులు.... దోడుకి మూతలేని ఓ పాత దేవదారు పెట్టివుంది. అదే వాడి ఆఫీసు"

మానవ మనస్తత్వం చాలా చిత్రమైంది. ఏ ఇద్దరు వ్యక్తులూ, ఒకే పరిస్థితులలో వున్నా, ఒకే విధంగా ప్రవర్తించ రసుకోవటానికి వీలులేదు. పరిస్థితుల ప్రభావంవల్ల మనిషి ఆలోచనా ప్రవర్తనా కూడా మారిపోతాయి. ఈ విషయాన్ని బాగా ఆకళింపు చేసుకున్న నారాయణ్

తన కథలలో వివిధ సన్నివేశాలలో వివిధ స్వభావాలు కల వ్యక్తులు పరిస్థితుల నెలా ఎదుర్కొంటారో సహజత్వం ఉట్టి పడేలా చిత్రిస్తారు. కథ మొదలు పెడితే సాంతమయేవరకు విడిచిపెట్టకుండా చదివించే గుణంతోపాటు, పఠితల్ని తీవ్రంగా ఆలోచిలపజేసే లక్షణం కూడా నారాయణ్ కథలకి కలగటానికి ఈ మానసిక విశ్లేషణ ముఖ్యంగా తోడ్పడుతుంది.

"నాలుగు రూపాయలు" అన్న కథలో ఒక ఉన్నతోద్యోగి ఇంట్లో నూతిలో చేదపడి పోతుంది. అది తీయటానికి చేసే ప్రయత్నా లన్నీ విఫలం కాగా, నూతిలో దిగటానికి ఎవరూ ముందుకు రాని సమయంలో రంగడు రంగంలోకి దిగుతాడు. చేద తీసే వరకూ అతనికి బ్రహ్మరథం పట్టి మర్యాదలు చేసిన వారే, పని అయిపోయాక "ఆఁ, ఇదెంతపని ఈ పని ఎవరైనా చేస్తారు" అని తేలికగా తీసి పారేస్తారు.

సంఘానికి చీడపురుగులని మనం భావించే దొంగలలో కూడా జాలి, దయవంటి మంచి లక్షణాలుండవచ్చని చెప్పే కథ "ప్రైల్ ఆఫ్ ది గ్రీన్ బ్లేజర్" జేబుదొంగతనంలో సిద్ధ హస్తుడైన రాజు ఒక వ్యక్తి జేబులోంచి పర్సు కాజేసి ధనంతోపాటు ఆ వ్యక్తి ఇంటికి తీసుకు వెళుతున్న రబ్బరుబెలూను కూడా పర్సులో వుండటం గమనిస్తాడు, ఆ రబ్బరు బెలూను తల్లి లేని ఒక బాలుడికోసమని అంతకు పూర్వమే వినివున్న రాజుకి అమాయకుడైన ఆ పసివాడి మీద సానుభూతి కలుగుతుంది. ఆబాలుడి ఆనందం పాడుచెయ్యటం ఇష్టం లేని రాజుపర్సు ఆవ్యక్తిజేబులో పెడుతూ పట్టుబడటం జరుగుతుంది. తాను పర్సు దొంగిలించటంలేదనీ, దానిని ఆ వ్యక్తి జేబులోనే పెడు తున్నాననీ రాజు ఎంతమొత్తుకున్నా అక్కడివారు వినిపించుకోరు.

ఈ విధంగా వ్యంగ్యమూ, హాస్యమూ తగుపాళ్ళలోమేళవించి, కథాకథనంలో, సన్నివేశకల్పనలో తనకుతానేసాటి అనిపించుకున్నారు నారాయణ్ బర్మింగ్‌హామ్‌పోస్టు పత్రిక సమీక్షకులు అభిప్రాయపడ్డట్టు నారాయణ్ కథలు-దేనికదే శిల్పసమన్వితంగా, ఉత్తమోత్తమంగా వుండటమేగాక భారతీయుల జీవితాన్ని అనేక కోణాల నుంచి దర్శింప జేస్తాయి. నిస్సందేహంగా నారాయణ్ కథక చక్రవర్తి.

"జా న కీ జా ని"

గ్రంథ విమర్శలు

—ళిదాస కావ్య సౌరభమ్

[కర్త: విద్వాన్ శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రి. భారతీయ విద్యా ప్రచురణలు, ముంగండ, (వయా) అంబాజీపేట, తూ. గో. జిల్లా. క్రౌన్ సైజు 16 + 89 పేజీలు. వెల: రు. 3 లు.]

ఇది దేవనాగరి లిపిలో చక్కగా ముద్రించబడిన సంస్కృత పరిశీలన గ్రంథం. మహాకవి కాళిదాసు శ్రవ్య దృశ్య కావ్యాలలోని కవితా పుష్పాల సౌరభం సంగ్రహంగా ఇందు తెలుపబడింది.

మహాకవి కాళిదాసు కవితా వైభవాన్ని గురించి భారతీయులు, పాశ్చాత్యులు అయిన విమర్శకులు చాలా మంది యిదివరకే ఆంగ్లంలోను, సంస్కృతంలోను, అనేక దేశభాషల్లోనూ విమర్శనాత్మకములైన గ్రంథాలను వెలువరించారు. తెలుగులో కూడా చాలా పుస్తకాలు వచ్చాయి. వేదవిద్యా విశారదులు, ఆంధ్ర విద్వాంసులూ, సంస్కృతంలో ప్రగాఢాభిమానం ఉన్నవారూ అయిన సూర్యనారాయణ శాస్త్రిగారు తమ సంస్కృతభాషా వైదుష్యానికీ, కాళిదాసుపై గల ప్రగాఢ గౌరవానికీ దృష్టాంతంగా దీనిని రచించారు. ఈయన సరళ సంస్కృతంలో రచించిన పండితరాజు జగన్నాథ కవి జీవితం విద్వాంసుల ప్రశంసలను అందుకొన్నది. ఆ విధంగానే యీ గ్రంథం కూడా సరళ శైలిలో రచించబడింది.

ఇందులో "ఉపమా కాళిదాసస్య, కాళిదాస కవితాయాం వాల్మీకి కవితా ప్రభావః, కాళిదాసస్య ప్రకృతి సౌందర్య వర్ణనం, ప్రకృతి సహజీవన విధానం చ, కాళిదాసస్య కావ్యేషు విశ్వకల్యాణ భావనా, కాళిదాసకవేః తాత్త్వికీ ప్రతిభా, కాళిదాస కృతిషు భారతీయ సౌందర్యతత్త్వ వర్ణన ప్రాభవః, కాళిదాస కృతిషు సార్వకాలిక సందేశాః, కాళిదాస కృతిషు సూక్తిమౌక్తికాని, కాళిదాస కృతిషు శ్రౌత విజ్ఞాన వైభవమ్, కాళిదాస కృతిషు ధర్మశాస్త్ర ప్రబోధః" అనే శీర్షిక లున్నాయి. ఈ శీర్షికలను బట్టి ఏ యే దృక్కోణాలలో ఈకవితా పరిశీలన జరిగినదీ తెలుస్తున్నది.

"ఉపమా కాళిదాసస్య, భారవే రర్థగౌరవమ్" అని ఉపమాన నిబంధనలో కాళిదాసే సర్వాధికుడని ప్రసిద్ధి. ఆ విషయం ఇందులో బాగా వివరించబడింది. అతనికి "దీపశిఖా కాళిదాసు" అను ఖ్యాతికి మూలమైన "సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ..." ఇత్యాది శ్లోకం గూర్చి వివరించడం చక్కగా ఉన్నది. కాళిదాసు చేసిన ప్రకృతి వర్ణనలను గురించి కూడా ఇందులో వివరించబడింది.

రచయిత ఎంతో శ్రమపడి విషయాన్ని సేకరించి చాల సులభ శైలిలో దీనిని రచించారు. సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసు శృంగేరి శ్రీ శారదా పీఠ విద్వాంసులు శ్రీ కె. పద్మనాభ ఉపాధ్యాయులు ఉప్పులూరి గణపతిశాస్త్రిగారు, బొంబాయి ముంబాదేవీ సంస్కృత మహ విద్యాలయ ప్రధానాచార్యులు భాయీ శంకర్ పురోహితులు, డాక్ట మార్కండేయ శాస్త్రిగారు, సూరి రామకోటి శాస్త్రిగారు, కంచి కామకో పీఠాధిపతులు, కాశీ మహా విద్వాంసులు పట్టాభిరామ శాస్త్రిగారు, బులుస అప్పన్న శాస్త్రిగారు దీనిని ప్రశంసించారు.

మహాకవి కాళిదాసు కవితా పుష్ప సౌరభాన్ని ఆఘ్రాణిం డానికి విద్వాంసుల కిది చాలా ఉపయోగకరమైన గ్రంథం. వా సంస్కృతం తెలియనివారికి కూడా దీనివల్ల కాళిదాసు ప్రతిభను వ్యక్త చెయ్యగలరు, ఇది దేవ నాగరి లిపిలో ముద్రితమై ఉన్నందు భారతీయ విద్వాంసులకే కాక, విదేశీయ విద్వాంసులకు కూడ పఠించుటకు అనుకూలంగా ఉన్నది. శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగా కృషి ప్రశంసించ దగినది.

లక్షణ శిరోమణి

[పొత్తపి వేంకట రమణ కవి ప్రణీతము. సంపాదకులు విద్వాన్ శ్రీ రావూరి దొరసామి శర్మ, ఎం. ఏ., బి. ఓ. ఎల్. డెమ్మీ సైజు 8 + 24 + 166 + 476 పుటలు. వెల రూ. 18-50 ప్రకాశకులు: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్ సైఫాబాదు, హైదరాబాదు - 500 004.]

ఆంధ్రఛందోలక్షణ గ్రంథాల్లో ఈ లక్షణ శిరోమణి చాల విపులమయినది. ఇది యిటీవలి వరకూ అముద్రితంగానే ఉండడంవ చాలా మందికి ఇది ఉన్నదనే సంగతియే తెలియదు. ఛందోలక్ష పరిశీలనలో గొప్ప కృషి చేసిన సుప్రసిద్ధ విద్వాంసులు రావూ దొరసామి శర్మగారు దీనిని పరిష్కరించి దీని ప్రకటనకు గ ప్రయత్నంచేసి కృతార్థులయినారు. ఆయన మదరాసు ఓరియంట లైబ్రరీలోను, తిరుపతిలోని ప్రాచ్య గ్రంథాలయంలోను, హైదరాబా ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయంలోనుగల ప్రతులను సంప్రతిం శుద్ధ ప్రతిని తయారు చేశారు. వీరి పరిశ్రమను గమనించి దీని ప్రకటించారు. ముద్రణ దొరసామి శర్మగారి పర్యవేక్షణలోనే జరిగింది సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు. విద్వద్వరేణ్యులు అయిన వేద వేంకటరాయ శాస్త్రిగారు తమ ముద్రణాలయంతో చాలా చక్క

ముద్రించారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా వెల చాలా తక్కువగానే నిర్ణయించబడింది.

ఛందోగ్రంథాలలో కవిజనాశ్రయం, ఛందోదర్పణం, సులక్షణ సారం, రంగరాట్ఛందస్సు, అప్పకవీయం ప్రచారంలో ఉన్నవి. వీటిలో అప్పకవీయం ప్రామాణిక గ్రంథంగా స్వీకరించబడుతూ ఉన్నది. ఈ లక్షణశిరోమణి చాలా విపులమైనది. ఛందోవిషయాలు ఎన్నో ఇందు వివరించబడినవి. ఇది జిజ్ఞాసువులకు చాలా ఉపయుక్తమైనది.

పరిష్కర్త దీనికి వ్రాసిన విస్తృతమైన పీఠికలో ఛందశ్శాస్త్రానికి సంబంధించిన చాలా విషయాలున్నవి. అవి లక్షణ జిజ్ఞాసువులకు ఎంతో ఆసక్తిని కలిగిస్తాయి.

ఇందులో నాలుగు ఆశ్వాసాలున్నవి. ప్రథమాశ్వాసం వర్ణాధికారం. ఇందులో మాతృకాపూజ, కావ్యాదుల లక్షణాలు, వర్ణోత్పత్తి క్రమాదులు, అమృత-విషాక్షర వివరణ ఉన్నవి. రెండవ ఆశ్వాసం గణాధికారం. ఇందులో గణోద్భవక్రమం, సూర్యేంద్ర చంద్రగణాలు, జ్యోతిశ్శాస్త్రవిశేషాలు, గణముల పొందికలు గ్రహమైత్రి షడ్వర్గవిషయం మొదలైన విషయాలున్నవి. తృతీయాశ్వాసం వృత్తాధికారం ఇందులో సమవృత్తాలు, స్వస్థాన, పరస్థాన, స్వపరస్థాన, విషమవృత్తాలు, ఉపరి వృత్తాలు, షట్ప్రత్యయాలు వివిధ వృత్తసంఖ్యలు, కందములభేదములు సీసములు, గీతులు, షట్పద, త్రిపద, ద్విపదలక్షణాలు మంజరిభేదాలు రగడలు, ఆర్యాభేదాలు, అక్కరలు, తరువోజ, చూర్ణికాదులు విపరించ బడినవి. నాల్గవది విశ్రమాధికారం. ఇందులో యతుల పేర్లు, యతిభేదాలు ప్రాసము ప్రాసభేదాలు విపులంగా చూపబడినవి. ఛందోగ్రంథాలలో ఇతర లక్షణాలను కూడా చెప్పడం పరిపాటి అయినందున దీనిలో చివరి వ్యాకరణాంశాలు కూడా చేర్చబడినవి. అవి రేఫఱకారముల పద్ధతి విభక్తి, సంధులు, తత్పురుషాది సమాసాలు, కారకములు, క్రియలు, అవ్యయములు, క్రియావిశేషణములు కలవు. చివర చిత్రకవిత్వమును గూర్చి కలదు.

అనుబంధంలో బంధ కవిత్వమునకు సంబంధించిన చిత్రాలు ఉదాహృత లక్ష్య లక్షణ గ్రంథాలు-అందలి పద్యాలు తెలుపబడినవి.

ఈ గ్రంథాన్ని బాగుగా చదివినట్లయితే తెలుగులోని ఛందో విషయాలను గురించి సమగ్రంగా తెలుసుకోవచ్చును. విద్వాంసులవద్ద, గ్రంథాలయాలలోను తప్పక ఉండవలసిన గ్రంథం యిది. దీనిని సంపాదించి సంస్కరించిన శర్మగారు, ప్రకటించిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమివారు అభినందనీయులు.

సరస్వతీ కంఠాభరణము

[ప్రథమ సంపుటి, సంస్కృతమూలము: ధారేశ్వర శ్రీ భోజదేవుడు. ఆంధ్రీకర్త, వ్యాఖ్యాత: శ్రీ టి. భాస్కరరావు (శాస్త్రి) డెమ్మీసైజు 48 + 8 + 720 పేజీలు వెల రూ 16 లు ప్రకాశకులు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు-500 004.]

అక్షరలక్షలిచ్చి విద్వత్కవులను సమ్మానించినట్లు ప్రఖ్యాతి గాంచిన మహావిద్వాంసుడు ధారానగరాధిపతి భోజదేవుడు సకలశాస్త్రవేత్త. సంగీత సాహిత్యవేత్త. సాహిత్య, వ్యాకరణ, జ్యోతిష, వైద్య, యోగ, విజ్ఞాన, సంగీత శాస్త్రాలలో అమూల్యగ్రంథాలు రచించిన మహామనీషి. ఆయన రచించిన శృంగారప్రకాశ, సరస్వతీకంఠాభరణాలు అలంకార శాస్త్రంలో బృహద్గ్రంథాలు. వాటిలో సరస్వతీకంఠాభరణం వాగ్దేవికి నిజమైన కంఠాభరణమే! అందులో సాహిత్యశాస్త్రానికి సంబధించిన విషయాలన్నీ సమగ్రంగా వివరించబడినవి. సాహితీవేత్తలకు, సాహితీ పరిశోధకులకు అత్యంతోపయుక్తమైనది. ఇది సంస్కృతంలో ఉండుట వల్ల ఆభాషతో ఎక్కువ పరిచయంలేని సాహిత్య జిజ్ఞాసువులగు ఆంధ్రుల ఉపయోగార్థం శ్రీ శాస్త్రి దానిని ఆంధ్రీకరించి విపులమైన వ్యాఖ్యను కూడా రచించారు. ఉత్తమగ్రంథాలను ప్రకటించుటకు కంకణంకట్టి విద్వాంసులకు ప్రోత్సాహంయిస్తున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమివారు చక్కగా ముద్రింపజేసి ప్రకటించి మిక్కిలి తక్కువవెలకే అందిస్తున్నారు. ఆ మహాగ్రంథం మూడు సంపుటాలతో వెలువడుతున్నది. అందులో ఇది మొదటి సంపుటం. అయిదు అధ్యాయాల మూలగ్రంథంలో ఇందులో మొదటి రెండధ్యాయాలున్నవి రెండవ సంపుటిలో మూడవ, నాల్గవ అధ్యాయాలు; మూడవసంపుటిలో అయిదవ అధ్యాయం ఉంటాయి.

"నిర్దోషం గుణవత్కావ్య - మలంకారై రలంకృతమ్
రసాన్వితం కవిః కుర్వన్ - కీర్తిం ప్రీతిం చ విందతి"

అని భోజదేవుని కావ్యలక్షణం కావ్యం రసాన్వితమై ఉండాలి. రసవంతమైన కావ్యానికి గుణాలు, అలంకారాలు అవసరం, అన్నిటికంటె ముఖ్యంగా అది దోషరహితమై ఉండాలి అందువల్లనే ఇందులో మొదట, కావ్యంలో ఉండరాని పదదోషాలు వాక్యదోషాలు వాక్యార్థ దోషాలు వివరించబడినవి. తర్వాత బాహ్యగుణాలు అభ్యంతరగుణాలు వైశేషికగుణాలు శబ్దాలంకారాలు మిక్కిలి విపులంగా ఉన్నవి. వీటితో ఈ సంపుటం పూర్తిఅవుతున్నది. అర్థాలంకార రసాది చర్చ తక్కిన సంపుటాలలో ఉండగలదు.

ఆంధ్రీకర్త, వాఖ్యాత అయిన భాస్కరరావుగారు (శాస్త్రి) ప్రసిద్ధ విద్వాంసులు. కళాశాలాధ్యాపకులుగా ఎంతో అనుభవం ఉన్న

వారు ఇదివరకే ఛందోవ్యాకరణాది గ్రంథాలను రచించి పేరు గడించినవారు. ఆయన దీని ఆంధ్రీకరణకూ, వ్యాఖ్యా రచనకూ పూనుకోవడం ప్రశంసనీయం. తమకు సందేహాలు కలిగినప్పుడు శ్రీ మాధవ రామశర్మ, శ్రీ పాపయ్యశాస్త్రి, శ్రీ నీలకంఠశాస్త్రి, శ్రీ గురునాథశర్మ మున్నగు సుప్రసిద్ధ విద్వాంసులతో సంప్రతించి సందేహాలు తీర్చుకుంటూ, రచన సాగించడంవల్ల ఇది ఉత్తమ గ్రంథంగా తయారయింది.

స్వామి శాస్త్రిగారికి తెలుగుకవి నన్నయపైని, పారశీకకవి ఉమర్‌ఖయ్యాంపయినీ, సంస్కృత విద్వత్కవి భోజదేవుని పయి ప్రగాఢాభిమానమట! ఆ ముగ్గురూ పదకొండవ శతాబ్దానికి చెందినవారే కావడంకూడా విశేషమట ఈ విషయాన్ని చెపుతూ ఆయన 'స్వయం ప్రభ' అనే తమ విపులపీఠికలో చాలా విషయాలను వివరించారు. ఇవి సాహితీతత్త్వ జిజ్ఞాసువులకు ఎంతో ఉపయోగకరమైనవి. దీని తరువాతి సంపుటాలు కూడా శీఘ్రకాలంలోనే వస్తాయనుకుంటాను. ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమివారు ప్రచురించిన యీ ఉత్తమ గ్రంథం విద్వాంసులకు ఆమోదపాత్రం కాగలదని నా విశ్వాసం.

"ఆంగీరస"

ఇంత చక్కని పుస్తకమునకు కళంక మాపాదించు నొకే యొక యంశము. అచ్చుతప్పులుండుట వ్యాసములు వ్రాయుట యందేగాక వానిని నిర్దుష్టముగా నచ్చువేయించుట యందును రచయితలు శ్రద్ధ తీసికొనవలెను.

వీరి విమర్శన పద్ధతిని తెలుపుటకు మచ్చునకు కొన్ని వాక్యములు:-

"కళ కళకొఱకని వాదించిన రష్యను కళాకారుడు టాలుస్టాయి అన్నా కెరినాయను నవలలో నిజసిద్ధాంతములను మఱచిపోయెను"

"తల్లికోట యుద్ధానంతరము ఆంధ్రదేశములో రాజకీయ దౌర్బల్యమేర్పడెను. తురకల విజృంభణ మెక్కువాయెను. రెండవ వైపు పోర్చుగీసు డచ్చివారి పోరెక్కువాయెను. అట్టితరి ఆంధ్రదేశమును రక్షించినది రాజులుకాదు. తత్త్వబోధకులే! దేశమందు వేదాంతులు బయలుదేరిరి. వారు గేయాలతో మతావేశమును గల్గించుచు సంఘలోపములను సంస్కరించిరి. అట్టివారిలో ముఖ్యులు వేమనయోగి పోతులూరి వీరబ్రహ్మము."

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

వ్యాసమంజరి

[రచయిత . డా॥ కర్ణ రాజశేషగిరిరావు. ప్రతులకు : శ్రీమతి కర్ణశ్రీ శ్యామలాంబ, ఆంధ్రభారతీ ప్రకాశన మందిరము, తులసీ సదనము, ఎమ్. ఐ. జి. 1-బి/33, విశాఖపట్టణము-530 017. వెల : పదిరూపాయలు.]

భారతి సాహితి, సంస్కృతి, తరళ, తెలుగువిద్యార్థి మొదలగు పత్రికలలో ప్రచురింపబడిన వ్యాసముల సంకలన గ్రంథమిది. కామాయని, క్రోచే అభివ్యంజనవాదము, సూఫీవాదము, సత్యం-శివం సుందరమ్, హిందీ నిర్గుణభక్తి సంప్రదాయము, భాషాశాస్త్రము దాని తీరుతెన్నులు, రాసలీల, అస్తిత్వవాదము, జానపద సేకరణలో పాశ్చాత్యులు వహించినపాత్ర, మణిపురి నృత్యములు, ఆదివాసుల కళాసృష్టి-ఇవి శీర్షికలు.

ఇందలి వ్యాసములు రచయిత విపుల పరిశీలనాదృష్టికి, నిష్పాక్షిక బుద్ధికి, విమర్శనాశక్తికి నిదర్శనములు విషయ వివరణకు రచయిత యవలంబించిన మార్గము ప్రశంసావహము. సరళ సుందరమగు వీరి గ్రాంథికభాష ఆంధ్రవ్యాస రచయితల కాదర్శప్రాయము.

సాంఘిక విప్లవ రచయితలు

[రచన : కత్తి పద్మారావు. డెమ్మీసైజు 118 పుటలు. వెల : 8 రూపాయలు. ప్రతులకు : కె. చార్వాకుడు. లోకాయత ప్రచురణలు, విద్యానగర్, నిడుబ్రోలు-522 123.]

ఇందులో వేమన, కందుకూరి, గురజాడ, త్రిపురనేని, తాపీధర్మారావు, జాషువా, చలం, కొడవటిగంటి, చెరబండరాజులపై 'శాస్త్రీయవిశ్లేషణ' వుందని రచయిత ముందుగా పేర్కొన్నారు. "ఈ వ్యాసాలు పత్రికకోసం ఉద్దేశించడం వలన విహంగావలోకనంతో మాత్రమే వ్రాయబడ్డాయి" అని రచయిత 'ఒకమాట'లో చెప్పారు.

శాస్త్రీయ విశ్లేషణ అంటే రచయిత దృష్టిలో కొటేషన్లు గుప్పించడం, భారతీయ సంస్కృతిని దుమ్మెత్తి పోయడమని ఈ పుస్తకం వలన తెలుసుకోవచ్చు. ఇక ఏ వ్యాసమూ సమగ్రం కాదుగాబట్టి 'విహంగావలోకనం' అనేమాట సత్యం.

వేమనను గూర్చిన శాస్త్రీయ విశ్లేషణ జాషువాపద్యంతో ప్రారంభమవుతుంది. "పిడికెడన్నము పెట్టలేదెపుడు మా వేమన జీవించినప్పుడు" అనేది ఆపద్యం. వేమనకు ఎవరూ బిచ్చం వెయ్య

లేదని జాషువా పద్యంవ్రాయడం దాన్ని ఈ రచయిత పేర్కొనడం ఆంధ్రకవిలోకానికే సిగ్గుచేటు. ఆడుక్కు తినడం మార్క్సుగానీ, హేతువాదులుగానీ ఒప్పుకోరు 'తొలి తెలుగుకవి వేమన్న' అని 'శాస్త్రీయ పరిశోధన'తో పద్మారావుగారు నిరూపించారు అంతకు ముందున్న కవులు కేవలం అనువాదకులు కల్పిత కథలు వ్రాసిన వాళ్లుగూడా కవులుకారు ఎందుకంటే సామాజిక స్వరూపాన్ని కవిత్వంలో చూపలేదు గనుక ఇదీ రచయిత అభిప్రాయం.

ప్రాచీనకవులు తమ కాలానికి అనుకూలమైన కవిత్వంకాకుండా, 20 వ శతాబ్ది సంఘాన్ని దృష్టిలోపెట్టుకొని, శ్రీ కత్తి పద్మారావుగారి వంటి వారికి నచ్చేరీతిలో వ్రాసివుండ వలసిందన్నమాట!

మన అదృష్టవశాత్తు సమాజానికి సాహిత్యానికి సంబంధంలేని ఈ రోజుల్లో పద్మారావు గారుండబట్టి సరిపోయింది. లేకపోతే ప్రాచీన కాలంలోనే ఇటువంటి మహామేధావులున్నట్లయితే భారతాది గ్రంథాలు తెలుగులో వచ్చేవికావు. మన సాహిత్యం వేమననుదాటి ఒక్క మెట్టు గూడా పైకినడచి ఉండేదికాదు. "వేమన మన రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారన్నట్లు అద్వైతికాదు. బ్రౌనుగారు బండారు తమ్మయ్య గారన్నట్లు వీరశైవుడుగాదు. ఇటీవల విమర్శకులు లాగి ముడి వేసినట్లు నాగార్జునునివలె శూన్యవాదికాదు." అంటారు రచయిత వాళ్లంతా తప్పు మన రచయితే ఒప్పు! ఈ పుస్తకం ప్రకారం!

వేదములను కించపరుస్తూ రచయిత వేమన పద్యం ఉదహరించారు. "వేద విద్య లెల్ల వేశ్యల వంటివి
భ్రమలు బెట్టి తేటపడగనీవు
గుప్త విద్య యొకటి కులకాంత వంటిది !"

ఈ పద్యానికి వ్యాఖ్యానం రచయిత వ్రాయలేదు. గుప్తవిద్య అంటే ఏమిటో తెలియక పాఠకులు తికమకపడుతున్నారు. బహుశా వారి ఉద్దేశం ప్రకారం గుప్తవిద్య అంటే హేతువాదం, లేక సామాజిక ఆర్థిక సాంస్కృతిక రంగాలలో ఉన్న అసమానతలకు కారణాలను తెలిపే శాస్త్రం అయినా ఆశ్చర్యపడ నక్కరలేదు.

శూద్రత్వం - బ్రాహ్మణత్వం గూర్చివ్రాస్తూ "ఇప్పటికి డాక్టరేట్‌లు పట్టం పొందినవారు గూడా జంధ్యాలు వేసుకొని పిలకలు పెట్టుకొని తిరగడం శోచనీయం" అంటారు. భారతీయసంస్కృతిని అనుసరించే వారంటే రచయితకు ఉన్న ఈర్ష్యాద్వేషాలు ఈ వొక్క వాక్యాన్నిబట్టి తెలుసుకోవచ్చు.

పిలక పెట్టుకోక పోతే క్రాఫు పెట్టుకుంటాడు. తల వున్న వాడేదో వొకటి పెట్టుకుంటాడు. పాశ్చాత్యుల్నీ, వాళ్ల సిద్ధాంతాలనూ వెర్రిగా అనుకరించే బదులు, పద్మారావుగారి లాంటి భారతీయ ద్వేషుల అసహ్య విమర్శలను చూచి భయపడే బదులు ధైర్యంగా పిలక పెట్టుకోవడం ప్రశంసనీయం.

'మూర్ఖ రాముడికి తగలేసిన వెయ్యేళ్ల సాహిత్యం' అంటారు రచయిత. రాముడు మూర్ఖుడైతే, కోట్లాది మంది ఆరాధించే ఆదర్శ మూర్తిని మూర్ఖుడనే వాడింకెంత పెద్ద మూర్ఖుడో అని కొంతమందికైనా అనిపించవచ్చు. మన దేశంలో వ్యక్తి స్వేచ్ఛ పరిమితులు తప్పుతోంది. హిందువులకు ఓర్పు ఎక్కువ, అందువలన పద్మారావుగారి వంటి వాళ్ల 'మూర్ఖపు' వ్రాతలు క్షమించబడుతుంటాయి, రక్షింపబడుతుంటాయి.

ఏమైనా హిందువులు ఉదాశీనతను మానాలని పద్మారావుగారు పరోక్షంగా హెచ్చరిస్తున్నారను కోవాలి. వేమన మానవతా వాది అనీ సామ్యవాది అనీ హెడ్డింగుల్తో నిరూపించారు. వేమన 'ఆదికవి' అట! శ్రీ శ్రీ గారు తిక్కన, వేమన, గురజాడలు కవిత్రయంగా చెప్పగా, కాదు - వేమన్న, శ్రీశ్రీ, చెరబండ రాజులే కవిత్రయం అని ఈ రచయిత అభిప్రాయ పడుతున్నారు. అసలు కవిత్రయం అంటే అర్థం మరచిపోయినట్లున్నారు, భారత రచన చేసినవారు కవిత్రయం అని అందరికీ తెలుసు. ఇక ఏ గొప్ప చెప్పవలసి వచ్చినా ముగ్గుర్ని కలిపి చెప్పే బానిసత్వంలోకి శ్రీశ్రీగారు గానీ, ఈ రచయితగారు గానీ దిగడం సిగ్గుచేటు. ముగ్గుర్ని కలిపితే గాని గొప్పతనం రాదా? పోనీ కొద్దిగా ఊహ జోడించి, ఇంకొకళ్లని కలిపి చతుష్టయం అనవచ్చు గదా! ఆ స్వతంత్ర బుద్ధి ఉంటే ఇటువంటి రచయితల్లో అంధ విశ్వాసాలు పాదు కొనవు. ఈ గ్రుడ్డి నమ్మకాలలో ఒకటి వేమన కుల పోరాటం చేశాడను కోవటం. బ్రాహ్మల్ని తిడితే కుల పోరాటమా? అయితే మాలల్ని వేమన గౌరవించాడా? అదీ లేదు. అల్పజాతి వారిని అనేక పద్యాల్లో వేమన అధిక్షేపించాడు.

"ద్విజుల ఖేదపెట్టి తిట్ట దొడగువాడు
మృతిని పొంది తాన వెతల బడగ
గాలు దరిన చేరు గడ తేరలేడయా"

అని బ్రాహ్మల్ని తిట్టవద్దంటాడు. మాలలంటే వేమనకు గౌరవముందని చెప్పలేం. వేమన —

"మాల కన్నియలకు మంచిరూప మున్న
ముట్టెనే త్రిశంకుపట్టి నాడు
కానిపనులు చేయ ఘను లాసపడుదురా ?" అంటాడు.

పద్మారావుగారికి ఉండే రాగ ద్వేషాలన్నీ వేమనకు అంట గట్టడం అన్యాయం.

"మద్య మాంస రుచిని మాలగ దైవాల
ఎంగిలి తినగానె నింగి కలదె
భక్తిని హరు గొల్చి భవ్యులు కందయా" అని చెప్పిన

వేమన కుల పోరాటం జరిపిన వాడా? స్త్రీలంటే వేమనకు పరమాసహ్యం. ఈ విషయాన్ని పద్మారావుగారు ఒప్పుకున్నారు. ఇంకా కొన్ని పద్యాలు —

"విశ్వనాథు నందు విప్రుల యందున
విభుని యందు వేద విధుల యందు
భక్తి లేనివాడు పాపాత్ము డిలలోన"

"భక్తి యున్నచోట బరమేశ్వరుండుండు
భక్తిలేని చోట పాపముండు
భక్తి కలుగువాడు పరమాత్ము డగునయా"

"గుడులు దేవతలని గుర్తులు గావింత్రు
ముష్టి బాపలనుచు మూల్గనేల
మొప్పెలకును దారి మురియగ జూపిరి"

ఇటువంటి పద్యాలు పందల్లో ఉన్నాయి. ఇలాంటి భావాలతో పద్యాలు చెప్పడమే సామాజిక విప్లవం అని రచయిత ఉద్దేశమా? ఈ పద్యాలు వేమనవి కావు, ఎవరో చెప్పి వేమన పేరుతో చెలామణి చేశారేమో అని కొందరనవచ్చు. పద్మారావుగారు ఉటంకించిన పద్యాలు వేమనే చెప్పాడని దాఖలా ఏమిటి? చరిత్ర - రచన ఇదమిత్థంగా తెలియని కవి పద్యాలు కొన్ని పట్టుకు వచ్చి ఏదో సాంఘిక విప్లవ ముందని పాఠకులను భ్రమ పెట్ట చూడటం కంటే మహా పాపం ఇంకోటి లేదు.

ఈ మొదటి వ్యాసం పూర్తిగా అశాస్త్రీయ విశ్లేషణ. రెండో వ్యాసం 'కార్యవాది కందుకూరి' భౌతిక వాదులుగా ఉన్నవారిలో వీరేశలింగంలా సంఘ సంస్కరణ కోసం పోరాడి కృతకృత్యులైన వారి పేరులో గూడా రచయిత చెబితే బాగుండేది. వీరేశలింగంగారు మత ద్వేషికాడు. మత సంస్కర్త. "కందుకూరి మతాన్ని బ్రతికించడం కోసం సంస్కరణ వాదాన్ని చేపట్టలేదు. కాని ఆయన చేసిన సంస్కరణ వలన మతానికి కొంత వూపిరి కూడా రాక పోలేదు" అని రచయిత వ్రాస్తారు. ఇది కొంత వరకు వాస్తవం. ఈనాడు వేమన ఉన్నా, వీరేశలింగం ఉన్నా హేతువాదులతో పూర్తిగా ఏకీభవిస్తారని అనిపించదు. "భౌతిక వాదిగా ఆయన ఈ పోరాటం చేసివుంటే సమస్యా పరిష్కారానికి ఇంకా స్పష్టమైన నిర్ణయాలు తీసుకొని వుండే వారనుటలో సందేహంలేదు." అని రచయిత వీరేశలింగం గారిని గూర్చి వ్రాశారు.

ఈశ్వరుణ్ణి నమ్ముకొని ఈ వ్యాసం వ్రాసి వుంటే పద్మారావు గారు ఈ శీర్షికకు న్యాయం చేకూర్చేవారని అనిపిస్తుంది.

తాత్కాలిక ప్రయోజనం ఉన్న ఈ పుస్తకంగానీ, ఈ సమీక్షా వ్యాసంగానీ ఏ భాషలో ఉన్నా పరవాలేదు. మన ఇరుగు పొరుగున ఉన్న భాషలలో ఉన్న ప్రాచీన కావ్యాలను ఆయా భాషలవాళ్లు ఇప్పుడు అర్థం చేసుకోలేక పోతున్నారు. అనేక వందల సంవత్సరాల నాటి ప్రామాణి కాంధ్ర భాషను మనం చదివి అర్థం చేసుకోవడం చూచి కన్నడ భాషా వేత్తలు ఆశ్చర్య పోతున్నారు. ఇటువంటి విశిష్ట గుణ సంపన్నమైన ప్రామాణిక ఆంధ్ర భాషను తమ అతి తెలివితో ఒక ఉద్యమం చేపట్టి ధ్వంసం చేయ తలపెట్టారు కొందరు. ఇది నిజంగా మన జాతి సిగ్గుపడవలసిన విషయం. ఈ దుర్మార్గంలో గురజాడకి భాగ స్వామ్యం ఉంది. ఆయన సమకాలీనుల కోసమే కలం పట్టాడంటే అభ్యంతరంలేదు. అయితే ఇప్పుడిహ ఆయన రచనలు అనవసరం. ఏమైనా కన్యకా అమ్మవారిని గూర్చీ, దుర్గమ్మలో కలసిపోయిన పుణ్యవతి పూర్ణమ్మను గూర్చి గురజాడ వ్రాసిన కవిత్వం తప్పక నిలుస్తుంది. అందులో మహత్యాలున్నాయి. తోక చుక్కను శుభంగా భావించాడు గురజాడ. కానీ ఈ మధ్య సైంటిస్టులేమో తోకచుక్క ప్రభావం వలన లోగడ బొంబాయి వంటి నగరాల్లో భయంకర వ్యాధులు వచ్చి జనం చచ్చారనీ, మళ్ళీ రాబోయే తోక చుక్క వలన భయంకర వ్యాధులు వ్యాపించే ప్రమాదముందనీ హెచ్చరించినట్లు వార్తా పత్రికలు వ్రాశాయి. మిడిమిడి జ్ఞానంతో ఎవరో తోక చుక్క మంచిదని చెబితే నమ్మాలా, లేక శాస్త్రజ్ఞుల మాటలు నమ్మాలా? గురజాడ చెప్పినట్లుగా "అంధ విశ్వాసాలు ప్రమాదకరమైనవి." "గురజాడ గొప్ప దేశ భక్తుడు, సంఘ సంస్కర్త, హేతువాది" అనుకోవడం కేవలం అంధ విశ్వాసం. ఇటువంటి గ్రుడ్డి నమ్మకాలతో వ్రాసిన పద్మారావుగారి వ్యాసం పూర్తిగా అశాస్త్రీయం.

'త్రిపురనేని తిరుగుబాటు' వ్యాసంలో రచయిత ఒక మంచి పని చేశారు. "మలమల మాడు పొట్ట" అనే పద్యాన్ని ఉదహరించి దానికి వ్యాఖ్యానం వ్రాస్తూ ఏ క్షేత్రంలో ఏ దేవుడున్నాడో విపులంగా తెలియ చేశారు. అది అక్కడ అనవసరమైనా పాఠకులకు కొంత విజ్ఞానం అందుతుంది. ఇలాగే ఇంకోచోట వేంకటేశ్వరస్వామి వారి పూజలకు చెల్లించవలసిన రుసుముల జాబితా కూడా ఇచ్చారు. దేవస్థానంవారు పద్మారావుగారి ఈ సేవకు కొంత బహుమతి ఇవ్వడం సబబు.

"ఈ దేశం పరజాతి బానిసత్వంలో వేల సంవత్సరాలు ఉండటానికి కారణం ఈ అంతర్గత ఘర్షణలే" అని కులాల తగాదాలే విదేశీయుల పాలనకు కారణమంటారు రచయిత. చరిత్ర జ్ఞానం ఏ కొద్దిగా ఉన్నా ఎవరూ అంగీకరించరు ఈ విషయాన్ని. ప్రపంచంలో అన్ని దేశాలూ ఎంతో కొంత కాలం విదేశీయులచేత పాలింపబడినవే. అన్ని దేశాల్లోనూ కులాలే కారణమా? రచయిత యొక్క అశాస్త్రీయ దృష్టికి ఇదొక మచ్చుతునక.

సాంఘిక చైతన్యం కోసం తాపీవారి పోరాటం గూర్చి వ్రాస్తూ "వచ్చిన నియమాలతో పుచ్చిన సంప్రదాయాలతో దడబడ కవిత్వాగ వేలం వెర్రితో, బండిరాల అరసున్నల బిగింపులతో, కట్టెడు సూ[...] లతో, సంస్కృత కావ్యాల వెలిగింపు జాతరలతో, తెలుగు సాహిత్యం గాసట బీసటగా ఉన్ననాడు, దాని అంతరాలలోకి వెళ్లి పరిశీలించి, పిట్ట కలాలను పారద్రోలి, కొత్త కలాలకు, కొత్త సూత్రాలకు, కొత్త దారులు విమర్శకుడు తాతాజీ" అంటారు రచయిత.

ఇందులో పేర్కొన్న వాటిలో చాలా వరకు ఉన్న విజయ విలాసానికి తాపీవారు వ్యాఖ్య ఎందుకు వ్రాసినట్లు? చివరకు విజయ విలాసకర్త ఒకానొక కులం వాడని నిరూపించడానికి తాపీవారు ఎన్ని తిప్పలు పడ్డారు! ఇవేమీ పరిశీలించకుండా వ్రాసిన ఈ వ్యాసం "అశాస్త్రీయం".

మనలో ద్వేషభావమే ఉన్నట్లయితే జాషువా ఒక కవిగా గుర్తింపబడేవాడే కాడనేది స్పష్టం. జాషువా లెక్కేమిటి? సాక్షాత్తు బోయవాడు రచించిన గ్రంథమే హిందువులకు పరమ పవిత్రమైంది. జాషువాగారు హిందూ సంస్కృతిని దూషించే పద్యాలు కొన్ని వ్రాశారు. వాటి ఆధారంతో పద్మారావుగారు హిందువుల్ని మరింత తిట్టిపోశారు.

చలం గూర్చి కావాలసినంత దుమారం లేచింది. ఆ దుమారానికి మరి కొంత దుమ్ము చేర్చారు ఈ రచయిత.

ప్రతిదాన్నీ మార్క్సిజంతో ముడి పెట్టడం, హేతువాదమనే రంగుటద్దాలు అడ్డుపెట్టుకొని చూడటం కొందరి కలవాటు. వీళ్ళకు కొన్ని పడికట్టు పదాలుంటాయి. గతి తార్కిక భౌతిక దృక్పథం, సమ సమాజం, మధ్య తరగతి మేధావులు... ఇలా ఉంటాయి వాళ్ల నోటి వెంట వచ్చే మాటలు. తమ వాదాన్ని అంగీకరించని వాళ్ల వాదనలన్నీ అశాస్త్రీయం. ఇలాంటి భౌతిక హేతువాద రచయితల్లో అగ్రగణ్యులు కొడవటిగంటివారు. ఆయన చెప్పిన ప్రతిదాన్నీ వేద వాక్యంలా భావించడం కేవలం అశాస్త్రీయం.

"గుండె తెగి ప్రవహించిన ప్రజా కవి చెరబండ రాజు" అనే[...] చివరి వ్యాసం. ఈ వ్యాసానికి రచయిత పూర్తిగా అన్యాయం చేశారు[...] చెరబండ రాజు కవితా విశేషాలు తెలియచేసే బదులు కొన్ని కొటేషన్[...] ఇచ్చి కొందరిని తిట్టారు.

చెరబండ రాజుగారి గీతాలు నోటికి వచ్చిన రాళ్లగొట్టే కూలీ[...] గాని, కట్టెలు గొట్టే కష్టజీవులుగాని సామాన్యంగా కనిపించరు. చే[...] గారన్నట్లు "చెరబండ రాజు పాటల్లో ఏవో కొన్ని మినహాయిం[...] అన్ని రకాల మార్క్సిస్టులకు అంగీకారమైనవే ఎక్కువ" పే[...] లెక్కువగా ఉండే మన దేశంలో మార్క్సిస్టులు ప్రజలను కదిలించలే[...] పోతున్నారు. అంతే చెరబండ రాజుగారి కవిత్వం గూడా! పార్టీ[...] వచ్చితే ప్రజా కవిత్వం కాదు. పాత రాజకీయ వాదులుగాక ఉగ్ర[...] మార్క్సిస్టు, పేటకొక నాస్తికుడు, వీధికొక హేతువాది పెరిగిపో[...] ఈ దేశంలో ఒకళ్ల నొకళ్లు నరుక్కొని సుఖశాంతులు కరువై దేశ[...] "చిల్లులుపడి చీకి ముక్కిపోయిన గబ్బు లేచిన పాత చాప" అవడ[...] ఖాయం అని ఎక్కువ మంది భయపడుతున్నారు.

"... వేమన శ్రీశ్రీల తర్వాత చెరబండ రాజు యుగ కర్త[...] త్వానికి నాంది పలికినట్లు శాస్త్రీయ పరిశీలన రుజువు చేస్తుంది." అ[...] వ్రాశారు. అరె పాపం గురజాడ! రేపు ఇంకోరు వచ్చిపోతే వేమ[...] పని ఖాళీ. ఇంకోరు పోతే శ్రీశ్రీని వదిలేస్తారు. ఈ పరిస్థితిలో నిజమై[...] శాస్త్రీయ విశ్లేషణతో రచనలు రావడం మంచిది. శాస్త్రీయ విశ్లేష[...] ముసుగుతో ఇటువంటి అర్థరహిత గ్రంథాలు రావడం హేతువాదు[...] అప్రతిష్ఠ.

ఈ పుస్తకాన్ని అంతా చదవాలి. అశాస్త్రీయంగా [...] పుస్తకాన్ని ఎలా వ్రాయొచ్చో తెలుస్తుంది.

శ్రీ వరాలకొండయ[...]

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patr[...] Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 6124[...]